
ఆణిముత్యాలు 2001
కస్తూరి బెహెన్


ఆణిముత్యాలు 2001
కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

K. రామదాస్ - **9440652774**

K. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు
# 2001

## కస్తూరి బెహెన్

# విన్నపం

ఎందరెందరో సహజమార్గ సాధకులు ఈ క్రొత్త సహస్రాబ్ది మొదటి సంవత్సరంలో సిస్టర్ కస్తూరిజీని లక్నో పట్టణంలో దర్శించుకున్నప్పుడు – అభ్యాసీల సందేహాలకు కృపతో సమాధానాలు, అనుభూతులకు వివరణలను ఇచ్చి, గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్ కృపాధారను హృదయాలకు చేర్చిన సోదరికి హృదయాంజలి. హిందీ నుండి తెలుగులోకి ఆ దివ్యభావ జాలాన్ని భాషాంతరీకరంచిన తోటిసోదరులకు అభినందనాంజలి. 'వారే' ధ్యేయంగా ఆజన్మాంతం తపించే మా ఈ అభ్యాసు లందరం 'వారి' దివ్య కృపారసార్థులం.

మీ సేవలో

– అభ్యాసీ సోదరలు

# ఆణిముత్యాలు - 2001

**ప్రశ్న: ఈశ్వరునికి మనస్సు లేదు కదా! మరి మనం అడిగే ప్రశ్నలకు జవాబు ఏ విధంగా వస్తుంది?**

**జవాబు:** మానవునికి మనస్సు ఉంది; మనకు సబ్–కాన్షస్ మైండ్ కూడా ఉంది; ఈశ్వరునికి మనస్సు లేదు. కాని ఈశ్వరునికి సూపర్ –కాన్షస్ మైండ్ (అధిచేతన మనస్సు) ఉంది. ఒకసారి నేను, "బాబూజీ! ఎవరైనా నన్ను ఏదైనా ప్రశ్నను అడిగినప్పుడు, వెంటనే ఒక్కసారిగా ఆ ప్రశ్న పైకి వెళ్ళి మరల అక్కడ నుండే జవాబు దానంతట అదే వస్తుంది" అని 'వారి'తో అన్నాను. నా నోరు ఆ జవాబును చెప్తుతుంది. కాని అందులో మనస్సు ఆలోచించి చెప్పడం అనేది లేదు.

బాబూజీ ఎప్పుడూ సూపర్ కాన్షస్ మైండ్‌తో పనిచేసేవారని 'వారే' చెప్పేవారు; ఎందుకంటే బాబూజీయే మాస్టర్ కాబట్టి. కాని మనలో లయావస్థ అదే స్థాయిలో ఏర్పడినప్పుడు మనకు అటువంటి స్థితియే కలుగుతుంది. అప్పుడు మనం చెప్పే జవాబులకు మనస్సుతో కనెక్షన్ అనేది ఉండదు.

మనస్సు అనేది ఈ ప్రాపంచికమైన ప్రశ్నలకు జవాబు చెప్పడానికి మాత్రమే, కాని ఆధ్యాత్మికత, దివ్యత్వానికి సంబంధించిన ప్రశ్నల యొక్క జవాబులను మనస్సు చెప్పలేదు. అందువలన ఎవరైనా ప్రశ్నను అడిగినప్పుడు, ఆ ప్రశ్న సూపర్–కాన్షస్ మైండ్‌ను తాకి మరల అక్కడ నుండే దాని జవాబు వెలువడుతుంది. అందువలన గాడ్ (ఈశ్వరుని)కి మైండ్ (మనస్సు) అనేది లేదు; కాని సూపర్–కాన్షస్ మైండ్ అనేది ఉంది.

ఎంత అయితే 'లయావస్థ' అధికమవుతుందో, అదే విధంగా నా రచనలు, ఉపన్యాసాలు అన్నీ కూడా వాటంతట అవే వెలువడుతాయి. అంతేకాని మనస్సుతో ఆలోచించి వ్రాసేవి కాదు. ప్రశ్న దానంతట అదే ఉదయిస్తుంది. జవాబు కూడా దానంతట అదే వస్తుంది. ఈ పుస్తకాలు అన్నీ కూడా మనస్సుతో ఆలోచించి వ్రాసినవి కావు; ఈ పుస్తకాలు, ఆ స్థితిలో వ్రాయబడి ఆ తర్వాత పుస్తకానికి పేరు పెట్టడం జరుగుతుంది. దీనివలన ఏమి తెలుస్తుందంటే, వేటినైతే బాబూజీ వెల్లడి చేయాలని అనుకుంటారో, వాటిని 'వారే' స్వయంగా ఒక పుస్తకరూపంలో నాకు ఇస్తారు. అప్పుడు పుస్తకం వ్రాయడం మొదలవుతుంది.

'వహ్ దివ్య ఛవి' (ఆ దివ్య సౌందర్యం) అనే పుస్తకంలో వర్ణించిన 'ఆ దివ్య సౌందర్యం' అనేది ఈ ప్రపంచంలో ఎక్కడా లేదు; నా లోపల ఏదో దృష్టి, ఆ దైవీయదృష్టి అనేది ఎక్కడో చూస్తూ, అదే (దట్) ఆ దివ్య సౌందర్యం అని ఆ దైవీయ దృష్టి మనతో చెప్తున్నది. ఎందుకంటే, ఆ దైవీయ సౌందర్యాన్ని మీ ఈ భౌతిక దృష్టి దర్శించలేదు.

**ప్రశ్న: ధ్యానం చేస్తున్నప్పుడు, అప్పుడప్పుడు వెన్నెముక క్రిందిభాగంలో శక్తి ప్రవహిస్తున్నట్లుగా, స్పందనలు వచ్చినట్లుగా అనిపిస్తుంది. ఆ విధంగా ఎందుకు జరుగుతుంది?**

**జవాబు:** బాబూజీ చెప్పినట్లుగా మనం ఎంత సమయం అయితే ధ్యానం చేస్తామో అంత సమయం, మనకు ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) లభిస్తూ, దాని ద్వార దివ్య శక్తి మనలోకి ప్రవహిస్తుంది. ఏ దివ్య శక్తి అయితే మనలోకి ప్రవేశిస్తుందో, అది ఇప్పుడు తన పనిని తాను చేయడం ప్రారంభిస్తుంది. ఉదాహరణకు వెన్నెముక భాగంలో కొన్ని శక్తులు ఉన్నాయనుకోండి. ఆ ప్రదేశంలో ఎక్కువ పవిత్రత అవసరం కాబట్టి, అప్పుడు

ప్రాణాహుతి శక్తి, ఆ ప్రదేశాన్ని క్లీన్ (నిర్మలీకరణ) చేయడం ప్రారంభిస్తుంది. అప్పుడు మనకు అక్కడ ఏవో స్పందనలు వచ్చినట్లుగా, ఏదో కదులుతున్నట్లుగా, ఏదో అక్కడ నడుస్తున్నట్లుగా అనిపిస్తుంది.

బాబూజీ మొదటగా అభ్యాసీ యొక్క సిస్టమ్ (పూర్తి వ్యవస్థ)ను నిర్మలీకరణ చేయమని చెప్పేవారు. అభ్యాసీ ప్రోగ్రెస్ (పురోభివృద్ధి)తో పాటుగా, అతని సిస్టమ్ కూడా క్లీనింగ్ జరుగుతూ ఉంటుంది. ఎవరైనా ప్రోగ్రెస్ అయి ఉన్నత స్థితిని చేరుకొన్న తరువాత అతనిలో ఈ లోపం ఉంది అని ఎవరూ విమర్శించకుండా ఉండడానికీ, ఆ అభ్యాసీ పూర్తి సిస్టమ్ కూడా దివ్యత్వంతో ప్రకాశించే విధంగా, అభ్యాసీ సిస్టమ్‌ను క్లీన్ చేయాలని చెప్పేవారు. అందువలన ప్రాణాహుతి ద్వారా మనలోకి ప్రవేశించిన దివ్యశక్తి, అది మాలిన్యాదులలో, అపవిత్రతలో ఉండలేదు కాబట్టి, ఆ దివ్య శక్తి తనకు కావలసిన విధంగా తన పనిని తాను చేసుకుంటూ వెళ్తుంది.

ఇంకొక విషయం ఏమిటంటే, మన సిస్టమ్‌లో ఉన్నటువంటి శక్తి కేంద్రాలను అన్నింటిని కూడా బాబూజీ యొక్క దివ్యశక్తి మేల్కొలుపుతుంది. ఈ విధంగా ఉత్తేజింపబడిన శక్తి కేంద్రాలు మన సిస్టమ్‌ను క్లీన్ చేస్తాయి. లక్ష్యాన్ని త్వరగా చేరుకోవడానికై మనలో తీవ్రమైన కోరిక, తపన, భక్తి మొదలైనవాటిని మరింతగా పెంపొందింప చేస్తాయి.

**ప్రశ్న: ఒక్కో అభ్యాసీకి నాలోని ఏ బిందువు ద్వారా శక్తి ప్రవహిస్తుందో నాకు తెలియడం లేదు అని ఒక ప్రశిక్షకురాలు అడిగారు.**

**జవాబు:** మీరు కేవలం ఈ భావనతోనే పని చేయండి – బాబూజీ మహరాజ్ నా లోపల ఉన్నారు. బాబూజీగారి హృదయం నుండి దివ్య శక్తి అభ్యాసీ హృదయంలోకి ప్రవేశిస్తున్నది – అనే ఆలోచనతోనే పని చేయండి. అభ్యాసీని క్లీన్ చేయడం, అతనిని సాక్షాత్కారానికి యోగ్యునిగా తయారుచేయడం, ఒక మంచి మానవునిగా మారే విధంగా పని చేయడం మాత్రమే మీరు చేయవలసినది. కాని దివ్య శక్తి ఎంత, ఎక్కడ ప్రవహింపజేయాలనేది బాబూజీగారి పని.

ఎందుకంటే ఆ దివ్య శక్తి, ఆ స్పందనలు అవి అన్నీ కూడ ఏం పని చేస్తాయో, ఎక్కడ పని చేస్తాయో అనేది మనకు తెలియదు; అందువలన బాబూజీయే ఈ పనిని చేస్తున్నారు; అభ్యాసీని పూర్తిగా దివ్యత్వంవలె తయారుచేస్తున్నారు – అని ప్రశిక్షకులు భావించాలి.

**ప్రశ్న: ధ్యానంలో ఒక్కొక్కసారి భారంగా ఉన్నట్లుగా, ఆ తరువాత తేలికదనం ఫీలింగ్ కలుగుతుంది.**

**జవాబు:** భారంగా ఉండడం అనేది, అక్కడ అది అహం (ఇగో) యొక్క భారంవలన కలుగుతుంది. 'అహం' అనేది కరిగిపోయినకొద్దీ తేలికదనాన్ని ఫీల్ అవుతారు.

మైనస్ –ఏదైనా పనిని చేస్తున్నప్పుడు, ఈ శరీరం ఆ పనిని చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. నేను ఈ పనిని చేసాను, నేను ఆ పనిని చేసాను అని మనం అన్నప్పుడు మనలోని 'నేను' అనే దాని దృష్టి ఈ శరీరంవైపు ఉంటుంది. ఐ నెస్– మనం ఏదైనా పని చేసినపుడు, నేను ఈ పనిని చేసాను అనే ఈ స్వరం మనలోపలి నుండి వస్తుంది.

ధ్యానంలో మనం ఒక్కొక్కసారి చాలా ఆనందాన్ని, పవిత్రతను, తేలికదనాన్ని అనుభూతిని పొందుతూ దానిలో మనలను మనం కోల్పోతాము. ఇది 'ఐనెస్' అనే దాన్ని కోల్పోవడం. అహం చెడ్డది అని అంటారు. కాని అహం (ఇగో)కు ఒక దివ్య ఉద్దేశ్యం అనేది ఉన్నది. జంతువులకు అహం యొక్క ఫీలింగ్ అనేది లేదు. కాబట్టే అవి జంతువులు అని అనబడుతున్నాయి. కాని మానవుని దగ్గర అహం అనేది ఉంది. దేని కొరకు? మానవుడు ఒక మంచి మావవునిగా మారడానికి, దైవాన్ని చేరుకోవడానికి ఈ 'అహం' అనేది ఉపయోగపడుతుంది. ఏ రోజున అయితే ఈ విధంగా జరుగుతుందో, అనగా అహం (ఇగో) యొక్క దివ్య ఉద్దేశ్యం నెరవేరుతుందో, ఆ రోజున 'అహం' అనేది దేనితోనైతే ముడిపెట్టుకొని ఉన్నదో, ఆ దైవంలోనే లయమైపోతుంది. అప్పుడు బాబూజీ చెప్పినట్లుగా, మనం 'డివైన్' (దైవం) యొక్క చేతిలో ఒక ఆటవస్తువు లాగా ఉండి, దైవం ఏ విధంగా ఉంటే ఆ విధంగా మనం ప్రవర్తిస్తాము.

ఎప్పుడైతే ఒక మనిషిలోని అహం అనేది చాలా అధికమై, అది తన పరిమితిని కూడా దాటిపోతుందో, అపుడు ఆ మనిషి ఏ పనిని చేసినా, ఎవరినైనా కొట్టినా, హింసించినా, అతనికి ఏ ఫీలింగ్ కూడ కలగదు. అంటే అతనిలో 'అహం' అనేది ఎంత స్థూలంగా అయ్యిదంటే, ఆ మానవుణ్ణి రాక్షసుడు అవుతాడు.

**ప్రశ్న: నా హృదయం నుండి అప్పుడప్పుడు కొన్ని వాక్యాలు వినిపిస్తున్నాయి.**

**జవాబు:** అక్కడ ఏమీ లేనప్పుడు వాక్యాలు ఎక్కడ నుండి వస్తాయి. ఆ స్థితిలో అక్కడ 'ఏమీ' లేదు; ఎవరికైనా ఈ విధంగా వాక్యాలు వినిపిస్తున్నట్లుగా, శరీరం నుండి శక్తి వెలువడుతున్నట్లుగా అనిపిస్తే, వెంటనే ధ్యానం యొక్క మూడ్ (ధ్యాస)లోకి వెళ్ళి, ఇటువంటి భావాలు, ఫీలింగ్స్ అన్నీ కూడా బాబూజీ మహరాజ్‌లోకి ప్రవేశిస్తున్నట్లుగా భావించాలి.

**ప్రశ్న: ధ్యానంలో ఏ స్థితిని పొందాము, ఎంత దూరం ప్రయాణించాము అనేది మాకు తెలియడం లేదు. ఎలా?**

**జవాబు:** ఎప్పుడైతే మనం బాబూజీగారి చరణాలను పట్టుకున్నామో, 'వారు' మనలను ఎక్కడికి తీసుకొని వెళ్తున్నారు, ఏ విధంగా తీసుకొని వెళ్తున్నారు – వీటిని గురించి మనం ఆలోచించకూడదు. ఏ స్థితిని పొందాము, ఎంత దూరం పురోగమించాము అనే ఆలోచనలు వచ్చినప్పుడు వెంటనే – "బాబూజీ! నేను మీతోనే ఉన్నాను; మీ చరణాలనే ఆశ్రయించాను, మీ ఇష్టం వచ్చిన చోటికి తీసుకొని వెళ్ళండి" అని భావించాలి.

మనం డెన్మార్క్‌కు వెళ్ళాలని టికెట్ తీసుకొని విమానంలో కూర్చున్నప్పుడు, మనం డెన్మార్క్‌కు చేరుకుంటాం. మార్గ మధ్యంలోని ప్రదేశాలను గురించి ఆలోచించడం ఎందుకు? కాని ఒక విషయం ఏమిటంటే, నేను ఎక్కడ ఉన్నాను, ఏమిటి అని అలోచించడం కంటే ధ్యానంలో కలిగిన ఆ ఆనందం, సంతోషం యొక్క ఫీలింగ్‌ను గురించి ఆలోచించాలి. ఆంతరిక ఆనందం వలన హృదయం విశాల మవుతుంది, వ్యాప్తి చెందుతుంది. ఒక రోజున ఎటువంటి ఆనందం కలుగుతుందంటే, మొత్తం విశ్వం అంతా కూడా ఆ ఆనందంతోనే నిండి ఉన్నట్లుగా అనిపిస్తుంది. "నేను ఎక్కడ ఉన్నాను" అని ఆలోచన చేయడం వలన మనకు ఒక పరిమితి అనేది ఏర్పడుతుంది. కాని 'వారు' అపరిమితం (అనంతం). "నాకు ఏమీ తెలియదు. బాబూజీ! మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే నేను ఉన్నాను" అని భావించాలి. బాబూజీ మహరాజ్ కృప మన

అందరిమీద ఉందని చెప్తున్నాను. అటువంటప్పుడు నేను 10 సంవత్సరాల నుండి సాధన చేస్తున్నాను, 2 సంవత్సరాల నుండి సాధన చేస్తున్నాను అని ఎందుకు అనుకోవాలి? ఎప్పుడైనా బాబూజీ లేకుండా అసలు మనం ఉన్నామా? ఆ విధంగా, 'వారు' లేకుండా మనం ఉండటం అనేది ఎప్పుడు కూడా జరగదు. కాని మనం 'వారి'ని మరచిపోయాము. ఇప్పుడు మరల 'వారు' మనకు లభించారు. 'బాబూజీ'ని గురించి జ్ఞాపకం వచ్చింది. మనం 'వారి' వద్దనే ఉన్నాం. ఇప్పుడు ఎంతగానైతే 'వారి' దగ్గరకు వెళ్ళాలనే తపన ఉన్నదో, అదే ఇప్పుడు 'వారి'తో కనెక్ట్ అయ్యింది.

మనం ఎప్పటినుండో, ఈ సృష్టి ప్రారంభం నుండి కూడా 'వారి'తోనే ఉన్నాం, 'వారి'తోనే ఉంటున్నాం, 'వారి'తోనే ఉంటాము. మనం బాబూజీనే మరచిపోయాము. అందరికి జ్ఞాపకంచేసి, ఈశ్వరుని వద్దకు తీసుకొని వెళ్ళడానికే బాబూజీ ఇక్కడకు, మన దగ్గరకు వచ్చారు.

**ప్రశ్న: నేను ఆదివారం సత్సంగ్ తరువాత ఇంటికి వెళ్ళి టీవీ చూస్తున్నాను. అప్పుడు నాకు బాబూజీ కనపడ్డారు. వెంటనే టీవీ ఆపేసి 15 నిమిషాలు ధ్యానంలో కూర్చున్నాను. చాలా ఆనందం కలిగింది. ఎందువలన?**

**జవాబు:** మీరు బాబూజీని చూసారు. ఇది చాలా మంచి విషయం. బాబూజీవైపు నుండి కనెక్షన్ అనేది ఉంది. ఇంకొకవైపు నుండి అనగా అభ్యాసీ నుండి కూడా కనెక్షన్ అనేది ఉన్నప్పుడే ఆనందం కలుగుతుంది.

**ప్రశ్న: ధ్యానంలో ఒకసారి ఆత్మ నా శరీరం నుండి విడిపోయి ఎక్కడికో పైకి వెళ్ళిపోయి, పైనుండి శరీరాన్ని చూస్తూ - నేను నీకంటే చాలా శక్తివంతమైన దాన్ని. నేను లేకపోతే నీవు వృథా - అని అన్నట్లుగా అనిపించింది. ఈ అనుభవం ఏదైనా స్థితి (కండిషన్)ని సూచిస్తుందా? లేదా దీన్ని గురించి మరచిపోవాలని అంటారా?**

**జవాబు:** ఆత్మ మాట్లాడలేదు, నిద్రపోలేదు, ఏమి అనుభూతి చెందలేదు. ఆత్మ ఏమీ చేయలేదు– అని మీరు భగవత్ గీతలో చదివే ఉంటారు. కాని ఆత్మ ఎక్కడికో పైకి వెళ్ళి మీ శరీరంతో మాట్లాడినదని మీరు అంటున్నారు. మనం ప్రతిదీ ఈ విధంగానే తప్పుడు పద్ధతిలో ఆలోచిస్తాము. ఒకవేళ ఆత్మ పైకి వెళ్ళిపోయినట్లుగా ఫీలింగ్ కలిగితే దాని ప్రదేశం ఎక్కడ ఉంటుంది? ఆత్మ బాబూజీ మహరాజ్ చరణాల వద్ద విలీనమవుతుంది. ఆత్మ ఒకసారి పైకి వెళ్ళిందంటే మరల వెనుకకు రాదు. ఎందుకంటే, ఆత్మ పరమాత్మలో మిళితమైపోతుంది. మరల శరీరంలోకి, వెనకకు రాదు. అందువలన మీకు ఎప్పుడైనా ఈ విధంగా అనిపిస్తే, ఆత్మ మీతో మాట్లాడినట్లుగా అనిపిస్తే, వెంటనే –"బాబూజీ! ఈ ఆత్మ మీది, మీ చరణాలవద్దనే ఉన్నది. మీ చరణాల వద్దనే విలీనమైనది" అనే ఒక కనెక్షన్‌ను బాబూజీతో కలపాలి. అప్పుడు మీకు నిజమైన ఫీలింగ్ కలుగుతుంది.

ఎటువంటి కండీషన్స్ వచ్చినా, ఎటువంటి ఫీలింగ్స్ వచ్చినా అవి వాస్తవమైనవి అయినా లేదా తప్పు ఫీలింగ్స్ అయినా వెంటనే వాటి అన్నింటిని కూడా బాబూజీతో కనెక్ట్ చేయాలి. సముద్రంలో ఒక ఇటుకరాయిని వేస్తే, అది ఎక్కడికో వెళ్ళిపోతుంది. మరల కనపడదు. అదే ఆత్మ పైకి వెళ్ళిపోవడం అంటే. ఆత్మ అనేది నాలో లేకుండా, ఎక్కడో విలీనమైపోయినదని దాని అర్థం.

**ప్రశ్న: అభ్యాసీలకు సిట్టింగ్ ఇచ్చినప్పుడు ఒక్కొక్కసారి అనుభూతి నాకు తెలుస్తుంది. ఒక్కొక్కసారి ఏమీ తెలియదు. అభ్యాసీ, నేను ఇద్దరం కూడా ఊరకనే కూర్చొని లేచినట్లుగా అనిపిస్తుంది. ఇది కరక్టేనా?**

**జవాబు:** మేము ఏదో కూర్చున్నాము. మాకు ఏమీ తెలియడంలేదని అభ్యాసీ, ప్రశిక్షుడు ఇద్దరు కూడా బాధపడవలసిన అవసరం లేదు. వర్క్ (పని) చాలా సూక్ష్మంగా, లోతుగా జరిగినప్పుడు దానిని గురించి తక్కువగా తెలుస్తుంది. దీనిని గురించి ప్రిసెప్టర్ పట్టించుకోవద్దు, నాకు ఏమి తెలియలేదు సరే! నా పనిని నేను చేసాను, అది 'వారి' ఇష్టం, అని ప్రిసెప్టర్ అనుకోవాలి. ప్రిసెప్టర్ యొక్క అర్థం సేవకుడు అనగా సేవ చేయడం మాత్రమే.

**ప్రశ్న: "మాలిక్ నా వాడు, మాలిక్ నా వాడు" అనే ఒక ధ్వని నా హృదయంలో నుండి వచ్చినదని మీరు మీ అనుభవాన్ని పుస్తకాలలో వ్రాసారు. అదే విధంగా ఏమైనా మాటలు మా హృదయంలో నుండి వస్తే అవి నిజమేనా లేక అది భ్రమేనా?**

**జవాబు:** 'మాలిక్' నా వాడు –అనే ధ్వని హృదయంలో నుండి వచ్చినట్లయితే అది సరి అయినదే. కాని దాని తరువాత వేరే మాటలు ఏమైనా హృదయంలో నుండి వినపడితే అది కేవలం భ్రమ మాత్రమే. హృదయంలో బాబూజీ మహరాజ్ ఇమిడిపోయారు కాబట్టి – మాలిక్ నా వాడు, మాలిక్ నా వాడు –అనే ధ్వని లేదా వైబ్రేషన్స్ హృదయాంతరాళం నుండి వెలువడుతాయి. ఇది సరైనదే.

నిద్రలోను లేదా ధ్యానంలోను నా హృదయం నుండి ఏవో మాటలు వినబడ్డాయి. బాబూజీ నాకు ఈ మాటలు చెప్పారు, ఆ మాటలు చెప్పారు –అనేది అంతా కూడా భ్రమయే! ఎందుకంటే బాబూజీ యొక్క ఎరుక రాగానే, స్మరణ రాగానే మనస్సు 'వారి'నే చూస్తూ ఆ ఆనందంలో మునిగిపోతుంది. అప్పుడు మాటలు ఎక్కడ నుండి వస్తాయి!

మీరు ఒక ఆపిల్ పండును తింటూ, దానిమీద ధ్యాసను, దృష్టిని ఉంచినట్లయితే, అది తియ్యగా ఉంది, పుల్లగా ఉంది – అని చెప్పగలరు. కాని డివైన్ టేస్ట్ (దివ్య అనుభూతి)లో మనస్సు యొక్క ఇమేజినేషన్ (ఊహ, భ్రమ) అనేది ఉండదు. నిజమైన అనుభవం కలిగినపుడు మనకు ఆనందం కలుగుతుంది. మనస్సు ఆ ఆనందంలో మునిగిపోవడం ప్రారంభిస్తుంది. అప్పుడు భ్రమపడడానికి అవకాశం లేదు. ఏదో వాస్తవమైనది ఒకటి ఉన్నది, అని అనుభవం చెప్పుతుంది. ఆ అనుభవం వలన ఆనందాన్ని కూడా పొందుతాం. కాని ఇమేజినేషన్ (భ్రమ) అంటే లేని దానిని ఉన్నది అని ఊహించుకోవడం. ఇది చాలా తప్పు.

ఉదాహరణకు ఇక్కడ లక్నోలో 6, 7 మంది ప్రిసెప్టర్లు ఉన్నారు. అభ్యాసీలు ఇక్కడికి వచ్చినప్పుడు "బెహెన్‌జీ! ఆ ప్రిసెప్టర్ నాకు బ్రహ్మాండ మండలం నుండి సిట్టింగ్ ఇచ్చారు, ఇంకొక ప్రిసెప్టర్ పరబ్రహ్మాండ మండలం నుండి సిట్టింగ్ ఇచ్చారు" అని నాతో చెప్పేవారు. ఒకసారి నేను ఆ 6, 7 మంది ప్రిసెప్టర్లు అందరిని ఒక సమావేశంలో కలుసుకోవడం జరిగింది. అప్పుడు నేను వాళ్ళందరితో ఈ విధంగా అన్నాను: మీరందరు చాలా గొప్పగా పని చేస్తున్నారు. కాని ఒక్క మాట. మీ అందరిని ఒక ప్రశ్న అడుగుతున్నాను – బ్రహ్మాండ మండలం యొక్క స్థితి ఏమిటి? బ్రహ్మాండ మండలం యొక్క శక్తి ఏమిటి? ఆ శక్తి ఎక్కడ నుండి కంట్రోల్ చేయబడుతుంది? బ్రహ్మాండ మండలం యొక్క పరిధి ఎక్కడ వరకు వ్యాపించి ఉంది? ఎప్పటివరకైతే మీకు బ్రహ్మాండ మండలం, పరబ్రహ్మాండ మండలం వాటిని గురించి క్షుణ్ణంగా, పరిపూర్ణంగా తెలియదో,

అప్పుడు మీరు అక్కడ నుండి పని చేస్తున్నామని ఏ విధంగా చెప్పగలరు? మీరు లక్నో యొక్క సరిహద్దు లోపలికే రానంతవరకు, మేము లక్నోకు వచ్చాము, అని ఏ విధంగా చెప్పగలరు? దీనికి ఎవ్వరూ జవాబు చెప్పలేరు. ఏ ప్రిసెప్టర్‌లోనైతే "బాబూజీ మహరాజ్‌యే ట్రాన్స్‌మిషన్ ఇస్తున్నారు" అనే ఫీలింగ్ ఎప్పుడూ ఉంటుందో, ఆ ప్రిసెప్టరే అందరి కంటే ఎక్కువగా, చక్కగా పని చేస్తాడు. ఎవరైతే నేను బ్రహ్మాండ మండలం నుండి, పరబ్రహ్మాండ మండలం నుండి ప్రాణాహుతిని ఇస్తున్నాను అని అంటారో, ఆ ఇమాజినేషన్ (ఊహ) అంతా కూడా కేవలం అభ్యాసులను తన కంట్రోల్‌లో ఉంచుకోవడానికి మాత్రమే ఆ విధంగా చెప్తుతారు.

**ప్రశ్న: ధ్యానంలో ఒక ప్రక్కన ప్రాణాహుతి వస్తూ ఉంది. ఇంకొక ప్రక్క చాలా ఆలోచనలు కూడా వస్తున్నాయి!**

**జవాబు:** ఆ విధంగా ఎందుకు జరుగుతుంది? జరగదు. మీకు ప్రాణాహుతి తెలుస్తుంది. ఆలోచనలు కూడా తెలుస్తున్నాయి అంటే మీ దృష్టి రెండువైపులా ఉంది, అని దీని అర్థం. భక్తుడు ఒకేవైపు అనగా భగవంతునివైపు మాత్రమే చూస్తూ ఉండాలి. కాని మీరు ఆలోచనలవైపు ఎందుకు చూస్తున్నారు? ఆ ఆలోచనలవైపే చూడమని మీకు ఎవరైనా నేర్పించారా? నేను ఎన్నోసార్లు మీ అందరికీ చెప్పాను- ప్రాణాహుతి లభించినపుడు దానివైపే చూడాలని. ఆలోచనలను చూడటం ఎందుకు? ఆలోచనలు మనలను తప్పకుండా స్పర్శిస్తాయి. కాని మనకు మంచి వస్తువు (ట్రాన్స్‌మిషన్) దొరికినప్పుడు, చెడు వస్తువు (ఆలోచనలు)ను చూడడం ఎందుకు?

**ప్రశ్న: ధ్యానంలో ఆలోచనలను కంట్రోల్‌లోకి తీసుకొని రావడానికి ఏం చేయాలి?**

**జవాబు:** ధ్యానంలో ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి)ని ఫీల్ అయినపుడు, మీరు ఆ ట్రాన్స్‌మిషన్ నుండి పనిని తీసుకోవాలి అని బాబూజీగారు చెప్పేవారు. మనం ఒక సంకల్పాన్ని ఏర్పరచుకోవాలి. నా మొత్తం సిస్టమ్ అంతా కూడా ట్రాన్స్‌మిషన్‌లో మునిగిపోయింది. నా బాబూజీ మహరాజ్ నా ఎదుటనే ఉన్నారు. నాలోని అణువణువూ 'వారి' స్మరణలోనే మునిగిపోయింది, అని ఈ విధంగా ఆ ప్రాణాహుతి నుండి పని తీసుకోవాలి. ఎప్పుడైనా ఆలోచనలు వస్తున్నాయని, ధ్యానంలో అనిపిస్తే, వెంటనే ఒక్కసారిగా మన దృష్టిని ఆలోచనలవైపు నుండి మరల్చి, ట్రాన్స్‌మిషన్ నుండి ఈ విధంగా పనిని తీసుకోవాలి.

నా హృదయం అంతా కూడా పూర్తిగా, పవిత్రంగా ఉంది. ఇది -ఈ ట్రాన్స్‌మిషన్, బాబూజీ మహరాజ్ యొక్క ప్రేమను తీసుకొని వచ్చింది. ఈ ట్రాన్స్‌మిషన్ బాబూజీ యొక్క లయావస్థను తీసుకొని వచ్చింది. నాలోని ఒక్కొక్క కణమూ కూడా ఈ ట్రాన్స్‌మిషన్‌తోనే నిండిపోయి ఉన్నది- అని భావించాలి.

**ప్రశ్న: క్రేవింగ్ (తపన) అనేది ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** బాబూజీ అనేవారు – క్రేవింగ్, తపన అనే వస్తువు లేనేలేదు, తపన అంటే ఈశ్వరునితో, మరచిపోయిన మన కనెక్షన్ (సంబంధం) ను మరల జ్ఞాపకానికి తెచ్చుకోవడం. తపన అనే దానిని సృష్టించలేము. కాని మనం బాబూజీతో ఒక కనక్షన్‌ను ఏర్పరుచుకొన్నట్లయితే తపన అనేది మనలో దానంతట అదే ఏర్పడుతుంది. ఒక కనెక్షన్‌ను – బాబూజీ మహరాజ్ నేడు మనలనందరిని అక్కడకు తీసుకొని వెళ్ళడానికి వచ్చారు. ఆ అల్టిమేట్ పవర్ (అంతిమ శక్తి) మనలను తీసుకొని వెళ్ళడానికి, మన ఎదుటకు వచ్చింది. నేను బాబూజీతోనే ఉన్నాను, నేను 'వారి'కి చెందిన వానినే, 'వారి' ఇష్టప్రకారమే తీసుకొని వెళ్ళుతారు- అనే ఒక కనెక్షన్ ఏర్పరచుకోవాలి. దీని ఫలితంగా మనకు ఆలోచనలలో బాబూజీ యొక్క జ్ఞాపకం వస్తుంది. హృదయంలో

స్మరించే దానినే స్మరణ అని అంటారు. 'వారు' గుర్తుకురాగానే బాబూజీని కలుసుకోవాలనే తపన (క్రేవింగ్) హృదయంలో ఎక్కడో ఏర్పడుతుంది.

ఇప్పుడు ఇంతమంది అభ్యాసులు ఇక్కడ ఉన్నారు. కాని అందరిలోను క్రేవింగ్ (తపన) ఒకే విధంగా లేదు. అందరిలోను కోరిక ఒకే విధంగా లేదు. కాని ఎప్పుడైతే మీరు బాబూజీ మహరాజ్ యొక్క ద్వారం వద్దకు వచ్చారో, ఆ ద్వారం వద్ద కేవలం ఒకే భావం ఉంది – మన అందరిని కూడా అక్కడకు తీసుకొని వెళ్ళాలి – అని అంతే. ఒకరిలో ఎక్కువ తపన ఉంది; ఇంకొకరిలో తక్కువ తపన ఉంది అనే భేదభావాలు అక్కడ లేవు. మనందరిని తీసుకొని వెళ్ళాలి – అని ఒకే భావన ఉంది. ప్రిసెప్టర్లలో కూడా ఇదే విధంగా అందరిని తీసుకొని వెళ్ళాలి అనే భావన ఉండాలి. ఇప్పుడు గమనించండి, అభ్యాసులలో తపన ఏ విధంగా ఏర్పడుతుందో!

ఈ రోజు కాకపోతే, రేపైనా తపన అనేది అభ్యాసీలో ఏర్పడుతుంది. తపన అనేది దానంతట అదే ఏర్పడుతుంది. నేను "బాబూజీ మహరాజ్! నా దగ్గరకు ఎంత మంది వచ్చినా సరే, వాళ్ళందరిని కూడా అల్టిమేట్ (భూమా)కు తీసుకొని వెళ్ళాలి, అని నేను ప్రార్థిస్తాను" అని 'వారి'తో అనేదాన్ని.

తల్లి ప్రేమ అందరి మీద కూడా ఒకే విధంగా ఉంటుంది. ఒకరిని త్వరగా తీసుకొని వెళ్ళాలి, ఇంకొకరిని కొద్దిగా ఆలస్యంగా తీసుకొని వెళ్ళాలి, అనే ఆలోచన తల్లికి ఎప్పుడు కూడా ఉండదు. కాని ఎవరైతే తమ ఆలోచనలను మరియు హృదయాన్ని 'వారి'తో కనెక్ట్ చేయలేకపోతారో ఆ అభ్యాసీ యొక్క ఆలోచనలు వేరే విధంగా ఉంటాయి. కాని మీరు విమానంలో కూర్చొని ఆలోచిస్తూ ఉన్నా, లేదా ఇంటిలో కూర్చొని ఆలోచిస్తూ ఉన్నా కాని 'వారు' మిమ్మల్ని విమానంలోనే తీసుకొని వెళ్ళతారు. 'వారు' మాత్రం మిమ్మల్ని విడిచిపెట్టరు. అందరిని తీసుకొనివెళ్ళతారు.

మీకు బాబూజీ మీద విశ్వాసం ఉంది. సహజమార్గ్‌లో చేరామని మీకు తెలుసు. లక్ష్యానికి చేర్చేది బాబూజీ అని తెలుసు. మరల అనుమానం ఎందుకు? ఒకే ఆలోచన ఉండాలి –నేను సహజమార్గ్‌లో చేరాను. నేను 'వారి' చరణాల దగ్గరనే కూర్చొని ఉన్నాను, ఇంక వేరే ఆలోచన వస్తే దానిని త్రుంచి వేయండి, అని.

**ప్రశ్న: అనుమానం అనేది బాబూజీ మీద కాదు. నేను బాబూజీతో సరిగా సహకరించటంలేదనే సందేహం నామీద నాకే ఉన్నది.**

**జవాబు:** మీరు ఎంత అయితే సహకారాన్ని వారికి అందించాలో అంతగా అందించడంలేదని మీరు భావించడం తప్పు. బాబూజీ అనేవారు– ఒకవేళ మీరు దొంగతనం చేసాను అని అంగీకరిస్తే మీకు శిక్ష పడకుండా ఉంటుందా? (శిక్ష పడుతుంది) కాని ఇక్కడ మనం దొంగతనం ఏమీ చేయలేదు. బాబూజీ! నేను ఎలా ఉన్నప్పటికీ, ఏ విధంగా ఉన్నప్పటికీ నేను మీ ఎదుటనే ఉన్నాను. ప్రోగ్రెస్ లేకపోయినా మీ ఎదుటనే ఉన్నాను. ప్రోగ్రెస్ అయినా కూడా నేను మీ ఎదుటనే ఉన్నాను – అని భావించాలి.

బాబూజీ మహరాజ్ మనకు అత్యంత ప్రియమైనవారు; సర్వ శ్రేష్ఠమైనవారిగా భావించిన తరువాత మన మీద మనకు సందేహం రావడం అంటే 'వారి' మీద అనుమానం ఏర్పడిందని అర్థం. కాబట్టి, అనుమానం అనేది ఎందుకు? నేను అపవిత్రంగా ఉన్నాను, అని అలోచించినకొద్దీ క్లీనింగ్ చేసుకోవాలి –

క్లీనింగ్ చేసుకోవాలి అని అనుకుంటారు. అందువలన మీరు ప్రతిక్షణం కూడా 'వారి' స్మరణలోనే ఉండటానికి, 'వారి'తోనే కనెక్షన్ కలిగి ఉండటానికి ప్రయత్నించాలి. "బాబూజీ! నేను మురికిగా ఉన్నానో, అపవిత్రంగా ఉన్నానో నాకు ఏమీ తెలియదు. నేను మీ శరణులో ఉన్నాను. మీరు ఏ విధంగా అనుకుంటే ఆ విధంగా నన్ను తయారు చేయండి. నా హృదయం మీ ఎదుటనే ఉన్నది. మీ ఇష్టం" అని భావించాలి.

లాలాజీ సాహెబ్ సమస్త మావనాళి కొరకు బాబూజీని భూమి మీదకు తీసుకొని వచ్చారు. బాబూజీ ప్రాణాహుతి శక్తిని తీసుకొని వచ్చారు. 'వారి' దృష్టి మన అందరిమీద ఉంది. 'వారి' ప్రేమ-దృష్టి మన మీద లేదని మనం ఒక్క క్షణం కూడా భావించకూడదు. "నేను చాలా చెడ్డవాణ్ణి; నాలో ఈ బలహీనత ఉంది; ఈ లోపం ఉంది" అని మరల మరల అనుకొనే బదులుగా "బాబూజీ! నేను మీ శరణులో ఉన్నాను, వీటి అన్నింటిని కూడా మీరే దూరం చేయాలి" అని అనుకోవాలి.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మీరు మాకు క్లీనింగ్ గురించి నొక్కి ఎందుకు చెప్పరు? మాలో ఏ లోపాలు ఉన్నాయో మీరు చెప్పండి. మేం వాటిని క్లీనింగ్ ద్వారా తొలగించుకుంటాం. అందువలన మీకు కూడా కొద్దిగా శ్రమ తగ్గుతుంది కదా!" అని 'వారి'ని అడిగారు. అప్పుడు బాబూజీ "ఒకవేళ నీవు నీ పరిశ్రమ వలన నీలోని లోపాలను, బలహీనతలను దూరం చేసుకోగలిగితే అవి నీలో ఎందుకు ఏర్పడుతాయి? ఇప్పుడు నేను నీ ఎదుటకే వచ్చాను కదా! నీ లోపాల్ని బలహీనతల్ని అన్నింటినీ మరచిపో!" అని అన్నారు.

మరొకసారి ఈశ్వర్ సహాయ్‌జీ "బాబూజీ! డివైన్ పర్సనాలిటీ ఈ భూమి మీదకు రావలసిన అవసరం ఏముంది?" అని ప్రశ్నించారు. అప్పుడు బాబూజీ, "ఎప్పుడైతే మానవుడు తనను పతనం చేసుకొనే ప్రయత్నంలో పూర్తిగా మునిగిపోతాడో అనగా మానవుడు పూర్తిగా అధోపతనమైనపుడు డివైన్ పర్సనాలిటీ తన కృషితో, మానవుణ్ని మరల నిజమైన మానవునిగా తయారు చేయడానికై ఈ భూమి మీద అవతరిస్తాడు" అని జవాబిచ్చారు.

నేను, నాలుగు సంవత్సరాల వయస్సు నుండి బాబూజీ మహరాజ్ నాకు దొరికేవరకూ, అంటే 22 సంవత్సరాల వయస్సు వరకు, నేను రోజులోని 24 గంటలలో కేవలం 4 గంటలు మాత్రమే నిద్రపోయేదానిని. మిగిలిన 20 గంటలు మేల్కొనే ఉండేదానిని. (భగవంతుని ఆలోచనల్లో మునిగి ఉండేవారు) కాని ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ లభించారో, 'వారు' నాకు ఎంత విశ్రాంతిని ఇచ్చారంటే, ఎప్పుడైనా నిద్రపోతే మరల ఎప్పటివరకో లేచేదానినే కాదు. ఒకవేళ మేల్కొంటే 'వారి' చరణాల వద్దనే మేల్కొనే దానను.

ఒక విషయం ఏమిటంటే, నేను ఏదైతే ఆనందాన్ని పొందానో, ఆ ఆనందం మీ అందరికి కూడా లభించాలనే ఒక కోరిక, ఒక తపన నా ఈ పరిశ్రమలో ఉంది. మీరు అందరూ కూడా మన బాబూజీ మహరాజ్ యొక్క దర్శనాన్ని పొందే ఆ రోజు ఎప్పుడు వస్తుందో కదా!

డివైన్ పర్సనాలిటీ బాబూజీ అక్కడే కూర్చొని ఉండేవారు. కాని 'వారి' లోపల ఎటువంటి దివ్యత్వం ఉంది, అనే దానిని దర్శించడానికి, 'వారి'ని అర్థం చేసుకోవడానికీ, శ్రీ లాలాజీ సాహెబ్ ఒకవేళ మనకు అర్థం చేయించకపోతే, వెల్లడి చేయకపోతే, ఎవ్వరూ అర్థం చేసుకునేవారు కాదు.

**ప్రశ్న: మన సంస్థలో "ఓ మాస్టర్! నీవే మానవ జీవితానికి యథార్థ లక్ష్యం" అని ప్రార్థన చేస్తాము. ఇక్కడ మాస్టర్ అంటే భగవంతుడు అనుకోవాలా లేక గురువు అనుకోవాలా? గురువు, భగవంతుడు మన సంస్థలో ఒకటేనా?**

**జవాబు:** "గురువు" అంటే శిక్షణ ఇచ్చేవాడు; "సద్గురువు" అంటే చేయి పట్టుకొని ఈశ్వరునివైపు తీసుకొని వెళ్ళేవాడు; "డివైన్ పర్సనాలిటీ" (దివ్య పురుషుడు) అంటే నీవు ఏమిటో, ఏ విధంగా ఉన్నావో అని ఏమీ చూడకుండా నీ చేయి పట్టుకొని లాక్కొని వెళ్ళేవాడు. బాబూజీ ఒక విషయం చెప్పారు. దీనిని మీరందరు కూడా మీ దృష్టిలో ఉంచుకోవాలి. ఇది మీకు చాలా ఉపయోగపడుతుంది. ఒకసారి కొంతమంది అభ్యాసులు బాబూజీ వద్దకు వచ్చి, "బాబూజీ మహరాజ్! అందరూ ఒకే విధంగా ఎందుకు ప్రోగ్రెస్ కావడం లేదు?" అని అడిగారు. బాబూజీ దీనికి ఈ విధంగా అన్నారు: "తల్లి తనకు ఉన్నటువంటి ముగ్గురు, నలుగురు పిల్లలందర్ని చేయి పట్టుకొని ముందుకు లాక్కొని తీసుకు వెళ్ళుతుంది. కాని అందులో కొందరు పిల్లలు వెనుకకు తిరిగి చూస్తూ ఉంటారు. వాళ్ళను తీసుకొని రావడానికి ఆలస్యమవుతుంది."

ఎందుకు, ఎక్కడ, ఎవరు తీసుకొని వెళ్ళతారు? –ఇవన్నీ ఆలోచించాల్సిన అవసరం లేదు. బాబూజీ వచ్చారు; మనల్ని తీసుకొని వెళ్ళుతున్నారు; మనం వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాం. ఇంక మనం 'వారి'నే చూస్తూ ఉండాలి.

**ప్రశ్న: నిత్య జీవితంలో మనం ప్రయాణం చేస్తూన్నప్పుడు ఈ ప్రదేశం నుండి ఇక్కడకు చేరుకున్నాము అని తెలుస్తుంది. మరి ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో చిట్టచివరి స్టేజీ (స్థితి)కి చేరినపుడు ఏ విధంగా ఉంటుంది?**

**జవాబు:** చిట్టచివరి స్థితిని ఇంకా చేరుకోనివారికి, దానిని గురించి చెప్పితే ఏం అర్థమవుతుంది? ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నన్ను సెంట్రల్ రీజియన్‌లోకి తీసుకొని వెళ్ళండి" అని అడిగాడు. అప్పుడు వారు "భాయీ! ఇప్పుడు నీవు సెంట్రల్ రీజియన్‌లో ఉన్నావని నేను అంటే, నీవు దానిని గుర్తించగలవా?" అని అన్నారు. అన్నింటికంటే ఉత్తమమైనది ఏమిటంటే, 'వారు' ఇక్కడకు వచ్చారు, మనలో విశ్వాసం ఏర్పడింది, 'వారి' చేయి పట్టుకొని, 'వారి'నే చూస్తూ ప్రయాణించాలి. 'వారి'ని చూడటం అంటే 'వారి' ముఖాన్ని లేదా భౌతిక రూపాన్ని కాదు. దివ్యతామూర్తి బాబూజీ యొక్క ప్రజెన్స్‌ను, 'వారి' నియర్‌నెస్ (సామీప్యత)ను ఫీల్ అవుతూ ముందుకు వెళ్ళాలి.

ఒక రోజున బాబూజీ ఒక అభ్యాసీతో, "నాకు కూడా ఒక మాస్టర్ ఉన్నారు. వారే లాలాజీ సాహెబ్, నేనే నీ చేయి పట్టుకొని తీసుకొని వెళ్ళుతున్నానేకాని నీవేమో అటు, ఇటు చూస్తున్నావు. అప్పుడు లాలాజీ సాహెబ్ 'ఈ మూర్ఖుడ్ని నా దగ్గరకు ఎందుకు తీసుకొచ్చావు? ఇతనికి ఏమీ తెలియదు, ఎప్పుడూ వెనుకకే తిరిగి చూస్తున్నాడు' అని వారు అంటే నేను ఏమని జవాబు చెప్పాలి. అందువలన నీవు చక్కగా నడుస్తూ ఉండు" అని బాబూజీ అన్నారు.

ఒకసారి బాబూజీ నాతో, "నేను నీకు ఇవ్వవలసిన శిక్షణ పూర్తయింది"అని అన్నారు. నేను ఎక్కడ కూర్చున్నాగాని ఆ వాతావరణమంతా కూడా పవిత్రతతో నిండిపోయేది, వ్యాప్తి చెందేది. మనం ఎక్కడకు వెళ్ళినా మన ప్రోగ్రెస్‌నుబట్టి, పవిత్రతతో వ్యాపించిన ఆ వాతావరణం మనతోపాటుగా రావాలి.

కలలు (స్వప్నాలు) అనేవి మనస్సు యొక్క క్రియకు సంబంధించినవి, అవి ఊహించుకొన్నవి. కలలో బాబూజీని చూసినపుడు చాలా తృప్తి లభిస్తుంది అని ఒక సోదరి అనగానే కలలో బాబూజీ కనిపించినపుడు కలిగే తృప్తి కంటే మేల్కొన్న తరువాత మీరు 'వారి' ప్రజెన్స్‌ను, నియర్‌నెస్ (సామీప్యత) యొక్క ఫీలింగ్‌ను పొందితే ఇంకా చాలా ఆనందంగా ఉంటుంది.

**ప్రశ్న: నాకు బాబూజీ ఎవరో తెలియదు. సంస్థ గురించి తెలియదు. ఎక్కడకు చేర్చాలో నన్ను అక్కడకు చేర్చండి, అని గాయత్రి మంత్రాన్ని చదివినపుడు బాబూజీగారు కనిపిస్తారట! ఇది నిజమేనా?**

**జవాబు:** ఏ మంత్రమైనా సరే దానిని శక్తితో ఛార్జి చేస్తారు, అని బాబూజీ తెలిపారు. మనం ఎంత ప్రార్థించినా, దానిలో ఎంత శక్తి అయితే నింపబడి ఉన్నదో అంతే ఫలితం మనకు లభిస్తుంది. ఎవరైనా యోగి ఆ మంత్రాన్ని ఏ ఉద్దేశ్యంతో ఛార్జి చేసారో లేదా ఆధ్యాత్మికత కోసం ఆ మంత్రాన్ని ఛార్జి చేసినట్లయితే, అంతే ఆధ్యాత్మికత లభిస్తుంది. మనిషి జీవితంలోని కష్టాలు తగ్గిపోవాలనే ఉద్దేశ్యంతో ఒకవేళ ఆ మంత్రం శక్తితో ఛార్జ్ చేయబడినట్లయితే ఆ శక్తి మేరకే అతని కష్టాలు తగ్గిపోతాయి కాని అంతకంటే ఎక్కువ మాత్రం తగ్గవు.

బాబూజీ కుమార్తె మాయ యొక్క మామగారు గాయత్రీ మంత్రోపాసకులు. ఒకసారి నాకు 104 డిగ్రీల జ్వరం వచ్చింది. అప్పుడు నన్ను చూడడానికి మాయ యొక్క మామగారు, బాబూజీ, ఇద్దరూ మా ఇంటికి వచ్చారు. అతడు 2, 3 సార్లు గాయత్రీ మంత్రాన్ని చదివారు. జ్వరం ఏ మాత్రం తగ్గలేదు. అప్పుడు నేను దీనిలో ఇంతకంటే ఎక్కువ శక్తి లేదు, అని బాబూజీతో అన్నాను. మంత్రంలోని ఛార్జింగ్ (శక్తి) అనేది పరిమితమైనది. కాని ఏదైతే ట్రాన్స్‌మిషన్‌ను మనం పొందుతున్నామో అందులో అపరిమితమైన ఛార్జింగ్ (దివ్య శక్తి) ఉంది. అపరిమితమైన దివ్య శక్తితో ఉన్న ట్రాన్స్‌మిషన్‌ను మనం తీసుకోవడంలో పరిమితం చేస్తున్నాం. హృదయం అంటే ఇంత చిన్న ప్రదేశం కాదు. హృదయం అంటే మొత్తం సిస్టమ్-ఆపాదమస్తకం అన్నమాట. మన సిస్టమ్‌లోని ప్రతి అణువు కూడా 'వారి'ని పిలవాలి. సిస్టమ్‌లోని కణ కణం కూడా ప్రాణాహుతి శక్తితో నిండిపోవాలి.

**ప్రశ్న: అనుభవాలు, ప్రోగ్రెస్ గురించి ఏమైనా సూచనల్ని తెలుపుతాయా?**

**జవాబు:** మన కండిషన్ ఈ విధంగా ఉంది అని ఏదైనా సూచన లభిస్తే, మనకు ఏదైనా ఫీలింగ్ ధ్యానంలో కలిగితే కళ్ళు తెరచిన తర్వాత మనం ఆ ఫీలింగ్‌లోనే ఉండడానికి ప్రయత్నించాలి. మనకు బాబూజీ యొక్క నియర్‌నిస్ (సామీప్యత) ఫీలింగ్ కలిగింది అనుకోండి. ఇప్పుడు మనది ఈ భౌతిక శరీరం కాదు ఆ సాన్నిధ్యతా అనుభూతి లేదా ఆ స్థితియే మనం నివసించే శరీరంగా మారుతుంది. ఈ విధంగా స్థితులు మారుతూ ఉంటాయి. అప్పుడు దైవీయ శరీరం తయారవుతుంది. నేను కోరేది ఏమిటంటే, మానవుడు 'దైవం'వలె తయారుకావాలి అని బాబూజీ అనేవారు. ఈ విధంగా దివ్యత్వంతో నిండిన శరీరం తయారవుతుంది.

ఆధ్యాత్మిక అనుభవాలకు, ఊహాజనిత అనుభవాలకు చాలా తేడా ఉంది. చాలామంది -నేను ధ్యానంలో ఒక పర్వతాన్ని చూసాను, తరువాత ఒక గుహలోకి ప్రవేశించాను, మరల గుహ నుండి బయటకు వచ్చిన తరువాత ఒక పెద్ద రాయిని చూసాను, ఇలా ధ్యానంలో అక్కడకు వెళ్ళినట్లుగా, ఇక్కడుకు వెళ్ళినట్లుగా తమ

అనుభవాలను గురించి చెప్తుతారు. ఇది అంతా కూడా మనోనేత్రం ద్వారా చూసే చిత్రాలు మాత్రమే! ఊహించుకొన్న దృశ్యాలు మాత్రమే; నిజమైనవి కావు. ఎందుకంటే, అందులో ఫీలింగ్ అనేది ఎక్కడ ఉంది? లేదు. ఒకవేళ నీవు ధ్యానంలో గుహలోకి వెళ్ళినట్లుగా అనిపిస్తే, అక్కడ వాతావరణం ఏ విధంగా ఉంది? ఎటువంటి ఫీలింగ్ కలిగింది అనేది ముఖ్యమైన విషయం. మనం ధ్యానంలో కూర్చున్నప్పుడు కలిగే నియర్‌నెస్ (సామీప్యత), శాంతి, ప్రేమలతో ఉప్పొంగిపోవడం –ఇవన్నీ కూడా ఫీలింగ్స్.

**ప్రశ్న: ఒక్కొక్కసారి ఒక అనుభవం వచ్చినప్పుడు చాలా బాగుంటుంది, తన్మయత్వంలో మునిగిపోతాము. మరల – మరల అదే అనుభవం కావాలని కోరుకుంటాం. ఇది ఆ అనుభవం యొక్క ఫలితమా?**

**జవాబు:** మీకు ధ్యానం యొక్క ఫలితం లభించినది. దైవీయ అనుభవం అంటే మీరు ఆ అనుభవాన్ని దాటి వెళ్ళిన తరువాత, మరల వెనుకకు రాకూడదు. మరల–మరల అదే అనుభూతి కావాలని కోరుకోవడం అంటే సమయాన్ని వృథా చేయడమే. "అభ్యాసీని ఇంకా ముందుకు తీసుకొని వెళ్ళాలనే నేను కోరుకుంటాను, అభ్యాసీ వెనుకకు రావడం నాకు ఇష్టం ఉండదు"– అని బాబూజీ అనేవారు.

**ప్రశ్న: ధ్యానంలో దేనినో చూస్తున్నట్లుగా అనిపించింది. కాని మనస్సుతో మాత్రం చూడడం కాదు. ఏమిటది?**

**జవాబు:** దీని వలన ఏమి తెలుస్తుందంటే, ఇప్పుడు మన ధ్యానం అనేది స్థూల శరీరాన్ని దాటి సూక్ష్మ శరీరంలో ప్రవేశించినట్లుగా తెలుస్తుంది. ఎప్పుడైతే సూక్ష్మ శరీరంలోకి ప్రవేశిస్తామో అప్పుడు ఈ విధంగా ధ్యానంలో చూడటమనేది జరుగుతుంది.

బాబూజీ ప్రతిక్షణం కూడా మనతోనే ఉన్నారని, మొదటగా మనకు 'వారి' సామీప్యత యొక్క ఫీలింగ్ వలన తెలుస్తుంది. కాని ఈ నియర్‌నెస్ (సామీప్యత) ఫీలింగ్ అనేది సూక్ష్మంగా మారినప్పుడు మనం 'వారి'ని చూస్తున్నట్లుగా అనిపిస్తుంది. ఇప్పుడు నియర్‌నెస్ ఫీలింగ్‌కు బదులుగా 'వారి'ని చూస్తున్నట్లుగా ఉంటుంది. మొదటగా స్థూల శరీరం కరిగిపోతుంది. ఆ తరువాత సూక్ష్మ శరీరం కరిగిపోతుంది. చివరకు కారణ శరీరం దగ్ధమైపోతుంది. ఇవన్నీ కూడా సహజమార్గ్ సిస్టమ్‌లోని టెక్నిక్స్.

**ప్రశ్న: మనం ప్రతిరోజు చేసే ధ్యానం యొక్క విధానం ఒకే విధంగా ఉంటుంది. ధ్యానంలో ఏమైనా మార్పు ఉంటుందా?**

**జవాబు:** ధ్యానంలో మార్పు ఉండదు. మార్పు అనేది ధ్యానం వలన కలిగే ఫీలింగ్‌లో ఉంటుంది. ఒక్కొక్కసారి ధ్యానం చాలా లోతుగా ఉండి, అసలు ఏమి తెలియనే తెలియదు, అని ఒక సోదరి అనగానే "ధ్యానంలో మనం అలర్ట్‌గా (మెలకువగా) ఉండాలి" అని బాబూజీ తెలిపారు. ఎందుకు అక్కడ అలర్ట్‌గా లేరు. అక్కడ ఎటువంటి ఫీలింగ్ ఉంది, అని మీరు ఎందుకు గమనించలేదు? అక్కడ ఎటువంటి ఫీలింగ్ ఉంది అని గమనించడమే అలర్ట్‌నెస్ (మెలకువ). ఈ డివైన్ అలర్ట్‌నెస్‌యే మనలను ధ్యానంలో ఎక్కడో అక్కడికి తీసుకొని వెళ్ళుతుంది. మరల అక్కడ నుండి రాగానే ఆ ఫీలింగ్‌ను మన మొత్తం సిస్టమ్‌లో నింపివేయాలి. సెన్సిటివిటీ (సూక్ష్మగ్రాహ్యత) అంటే ఇన్నర్ అలర్ట్‌నెస్ (అంతరంగంలో పొందే సూక్ష్మతను గ్రహించే మెలకువ) అని అర్థం. మనం ధ్యానంలో కూర్చున్నాము. అలర్ట్‌గా ఉన్నాం. ఎటువంటి ఫీలింగ్, ఎటువంటి స్థితి ఏర్పడినదని గమనిస్తూ ఉన్నప్పుడు, ఆ ఫీలింగ్‌లో కొద్దిగా మార్పు వచ్చినప్పుడు, ఆ అలర్ట్‌నెస్ (మెలకువ) ఆ మార్పును, ఆ ఫీలింగ్‌ను గమనిస్తుంది.

**ప్రశ్న: డివైన్ అలర్ట్‌నెస్ (మెలకువ)ను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** ఈ డివైన్ అలర్ట్‌నెస్‌ను అభివృద్ధి చేసుకోలేము. ఏదైనా వస్తువును తయారుచేసినప్పుడు, దానిని ఇంకా అభివృద్ధి చేయవచ్చు. కాని ఈ డివైన్ అలర్ట్‌నెస్ (మెలకువ) అనేది సహంజగానే మనలో ఉన్నది. ధ్యానంలో ప్రేమ, భక్తి, తన్మయత్వం ఉన్నట్లయితే ఈ డివైన్ అలర్ట్‌నెస్ అనేది దానంతట అదే వస్తుంది. బాబూజీతో మన కనెక్షన్ అధికమైనప్పుడు ఈ ఇన్నర్ అలర్ట్‌నెస్ అనేది దానంతట అదే ఏర్పడుతుంది.

**ప్రశ్న: ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ మహరాజ్! మేము ఇంటి పనులు, ఆఫీస్ పనులు అన్నీ చేయాలి. నిరంతర స్మరణ ఏ విధంగా సాధ్యమవుతుంది?" అని అడిగాడు.**

**జవాబు:** అపుడు బాబూజీ, "అవును! నిరంతర స్మరణ చేయవచ్చు. ఈశ్వర్ సహాయ్‌జీ కొడుకు చాలా అనారోగ్యంతో ఉన్నాడు. డాక్టర్ వెంటనే ఒక ఇంజెక్షన్‌ను తీసుకొని రమ్మని చెప్పాడు. ఈశ్వర్ సహాయ్‌జీ శరీరం మాత్రం బజారులో ఇంజెక్షన్ కొరకు ఆ షాపులో, ఈ షాపులో వెదుకుతున్నది. కాని అతని మనస్సు మాత్రం ఇంటివద్దనే ఉన్నది- పిల్లవాడు ఎలా ఉన్నాడో, ఏమిటో అనే బెంగతోనే ఉన్నాడు- మరి ఆ కనెక్షన్ ఎటువంటిది? ఈశ్వర్ సహాయ్‌జీకి తన పిల్లవాని యొక్క నిరంతర స్మరణ ఏ విధంగా సాధ్యమయ్యింది?" అని ఆ అభ్యాసీతో అన్నారు.

**ప్రశ్న: దశ నియమాలను ఆచరించడానికి కావలసిన శక్తి ఎక్కడ నుండి వస్తుంది?**

**జవాబు:** దశ నియమాలను ఆచరించడానికిగాను శక్తి లభించదు. మనలో భక్తి ఉన్నట్లయితే ఈ దశ నియామలు వాటంతట అవే మనలోకి వస్తాయి. మనం సాధన చేసినకొద్దీ, మన పురోగతినిబట్టి ఇవి మనలోకి వస్తాయి. మనలను మనం పరీక్షించుకోవడానికి ఈ దశ నియామాలు ఒక కొలమానిక వంటిది. దశ నియమాలలో చెప్పిన విధంగా మనం తయారు కావాలని, మనం ప్రయత్నిస్తే ఆ విధంగా మనం తయారుకాలేము. మన ప్రవర్తన, సాధనల వలన మనలో ఏ విధంగానైతే కండిషన్, ఆ స్థితులు ఏర్పడతాయో, దానికి అనుగుణంగా ఈ దశ నియమాలు మనలో సిద్ధిస్తాయి.

మనమందరం సోదరులం అనీ, ప్రతి ఒక్కరిలోనూ ఈశ్వరుడు ఉన్నాడని, అందరూ అంటారు. కాని అటువంటి సోదరభావంతో కూడిన దృష్టి నిజానికి ఎవరిలోనూ లేదు. కాని ఎప్పుడైతే ఆ సోదర భావంతో కూడిన స్థితి మనలోపల ఏర్పడుతుందో, అప్పుడు అందరు నా వాళ్ళే అనే ఫీలింగ్ (అనుభూతి) ఏర్పడుతుంది. అప్పుడు ఎవరిపట్ల కూడా విరోధభావం అనేది ఉండదు.

అందరూ అభ్యాసీ సోదరులే అని నోటితో అంటాము. కాని ఎంత మందిలో ఆ నిజమైన ఫీలింగ్ (భావన) ఉంది? ఒకవేళ ఆ ఫీలింగ్ ఉంటే, అందరూ కూడా బాబూజీ మహరాజ్ పిల్లలే అని అనిపిస్తుంది. అప్పుడు ఎవరిమీద ద్వేషం ఉండదు. ఎవరిలోనూ చెడును చూడలేము. ఇదే మనలోకి ఈ దశనియమాలు ప్రవేశించాయని అనడానికి గుర్తు.

**ప్రశ్న: దశ నియమాలలో ఏదైనా ఒక నియమాన్ని పాటిస్తే మిగిలిన తొమ్మిది నియమాలు వాటంతట అవే వస్తాయి కదా! నా ఉద్దేశ్యంలో మొదటి నియమం పాటించినట్లయితే మిగిలిన నియమాలన్నీ వాటంతట అవే వస్తాయి కదా!**

**జవాబు:** ఒక్క నియమమూ రాదు. ఎందుకంటే, దీనిలో ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, కనెక్షన్ అనేది తక్కువగా ఉంది. ఓ మాస్టర్! నీవే మానవ జీవితానికి యధార్థ లక్ష్యం. దీనిలో ముఖ్యమైనది –మీరు బాబూజీనే చూస్తూ వెళ్ళండి, మీరు కేవలం ధ్యానం చేస్తూ వెళ్ళండి, అప్పుడు ఈ దశ నియమాలు మీలోనే వస్తున్నట్లుగా తెలుస్తుంది. మొదట నేను ఈ విధంగా లేను, ఇప్పుడు నాలో ఈ మార్పు వచ్చింది. ఈ విధంగా మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి! ఎందుకంటే, ఎప్పుడైతే డివైన్ (దైవం)తో మీకు కనెక్షన్ ఏర్పడుతుందో, అప్పుడే ఆ దైవీయ గుణాలు అన్నీ కూడా వాటంతట అవే మీలో ఏర్పడతాయి.

ఉదయాన్నే లేచి ప్రార్థనచేసి, ఒక గంట ధ్యానంచేసి, రోజంతా కూడా పనిలో ఉన్నప్పటికీ ట్రాన్స్‌మిషన్ వస్తూనే ఉంటుంది. దీనిలో 'లక్ష్యం' అనేది లేకపోతే అది మూర్తిపూజలాగ అవుతుంది. నేను కూడా ఉదయాన్నే 2 గంటలకు మేల్కొని భగవంతుని విగ్రహానికి స్నానం చేయించేదాన్ని. అదే విధంగా మీరు ఉదయాన్నే 2 గంటలకు లేచి ధ్యానం చేస్తారు. ఆ తరువాత మీ మనస్సుకు నిద్రపోవాలని అనిపిస్తుంది. మీరు నిద్రపోతారు. ఇప్పుడు మనస్సు నిర్మలంగా ఉంది. మనం 'వారి' స్మరణలో లీనమైపోవాలి– అనేది మాత్రం రాదు. ఈ విధంగా ఉదయాన్నే 2 గంటలకు లేచి ధ్యానం చేయడమనేది ఒక అలవాటుగా, యాంత్రికంగా మారుతుంది. "ఓ మాస్టర్! నీవే మానవ జీవనమునకు యదార్థ లక్ష్యం" అని లక్ష్యాన్ని నిర్ణయించుకొని, ధ్యానం చేస్తూ, దివ్యులు బాబూజీనే చూస్తున్నట్లయితే దశ నియమాలు అన్నీ మీలో ప్రవేశిస్తాయి. లక్ష్యం అనేది లేనప్పుడు క్రేవింగ్ (తపన) అనేది ఉండదు. అందువలన 'తపన' అనేది చాలా ముఖ్యమైన విషయం. బాబూజీ చెప్పిన విధంగా ఒకటో నియమం పాటించి నప్పుడు నెమ్మది నెమ్మదిగా 'లక్ష్యం' అనేది ఏర్పడుతుంది. కాని మొదటి నియమాన్ని మనస్సులో యాంత్రికంగా –అలవాటుగా చేస్తే, అది మూర్తిపూజ అవుతుంది. దశ నియమాల్లో మూడో నియమం ఈశ్వరప్రాప్తి అనే లక్ష్యాన్ని నిర్ణయించుకుని దాన్ని పొందేవరకు కూడా విశ్రమించకూడదు. మీరు మూడవ నియమంతో ప్రారంభించి నట్లయితే మిగిలినవి అన్నీ కూడా వాటంతట అవే వస్తాయి.

ప్రతి సంస్థలోను, ప్రతి పద్ధతిలోను నియమాలు అనేవి ఉంటాయి. ఎవ్వరైనా ఈ నియమాలను పాటించినంత మాత్రాన్నే, వాళ్ళు ఏ విధంగా తయారుకావాలో ఆ విధంగా తయారుకాలేరు. ఎందుకంటే, ఈశ్వర ప్రాప్తి అనే ముఖ్యమైన లక్ష్యం లేకుండా ఆ నియమాలు మనలో ఏర్పడవు.

ఒక అభ్యాసీ, "బాబూజీ! నేను ఉదయాన్నే 4 గంటలకు లేచి ధ్యానం చేస్తాను. ఆ తరువాత నిద్రపోయి, తెల్లవారి నిద్ర నుండి లేవగానే మరల ధ్యానం చేస్తాను. ఆ తరువాత వీలైతే కొంత సమయం తరువాత మరల ధ్యానం చేస్తాను, అని అనగానే వారు "అత్యాశ అనేది సిట్టింగ్ కొరకే ఉండకూడదు. అత్యాశ అనేది లక్ష్య ప్రాప్తి కొరకు ఉండాలి, ఈశ్వరుని పొందాలనే అత్యాశ ఉండాలి" అని అన్నారు.

ఒకసారి ఒకరు నన్ను గురువు లేకుండా ఏమైనా జరుగుతుందా? అని అడిగారు. అప్పుడు నేను "అవును! ఇక్కడ గురువు లేకుండానే అంతా జరుగుతోంది" అని చెప్పాను. సహజమార్గ్ పద్ధతి ఉన్నది. బాబూజీ మహరాజ్ డివైన్ ట్రాన్స్‌మిషన్ (దివ్య ప్రాణాహుతి శక్తిని) ఇచ్చారు. 'వారు' దేనినైతే జ్ఞాపకం ఉంచుకోమన్నారో, దానిని నిరంతర స్మరణలో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాం. గురువు అంటే ఆ టెక్నిక్

(నిపుణత)ను తెలిపేవాడు. 'వారు' మాకు శిక్షణ ఇచ్చారు. 'వారి' శిక్షణను ఎవరైతే అనుసరిస్తారో, వాళ్ళందరు కూడా అక్కడకు చేరుకుంటారు. దశ నియమాలు, క్లీనింగ్ మరియు ప్రార్థన ఇవి అన్నీ 'వారి' శిక్షణలోని అంశాలే. ధ్యానం అనేది ముఖ్యమైన విషయం. నిరంతర ధ్యానం మరీ ముఖ్యమైనది. ఎవరి ధ్యాస (స్మరణ) నయితే నీవు నిరంతరం కలిగి ఉంటావో, 'వారి'తో కనెక్షన్ అభివృద్ధి అవుతుంది. అప్పుడు ప్రేమ అనేది దానంతట అదే నీలో ఏర్పడుతుంది. ఈశ్వర ప్రాప్తియే మన లక్ష్యం అని బాబూజీ చెప్పారు. కాని ఇప్పటివరకు మనం ఈశ్వరుని తెలుసుకోలేకపోయాం. అందువలన మేము బాబూజీనే చూస్తున్నాము. మాకు ఏమీ తెలియదు. 'వారే' మాకు ఈశ్వర ప్రాప్తిని ప్రసాదిస్తారు. ఎందుకంటే, అది 'వారి'కి తెలుసు. 'వారు' ఇక్కడకు వచ్చారు. శిక్షణ ఇచ్చారు. లక్ష్యాన్ని ఇచ్చారు. ఈశ్వరుడు ఎలా ఉంటాడో మాకు తెలియదు. కాని మేము 'వారి'నే చూస్తున్నాము. 'వారి' ఇష్ట ప్రకారమే మాకు ఈశ్వర ప్రాప్తిని కలిగింపజేస్తారు.

ఈ విదేశీయులతో సహజమార్గ్ పద్ధతిని గురించి ఏ విధంగా చెప్పాలి? మనం ఈశ్వర సాక్షాత్కారం అని చెప్పితే విదేశీయులు –"నీవు భారతదేశం నుండి వచ్చావు. నీవు చెప్పేదంతా అబద్ధం" అని అంటారు. వాళ్ళు మన మాటలను వినరు.

ఒకసారి ఫ్రాన్స్ నుండి ఆండ్రీ పోరే అనే అతను బాబూజీ వద్దకు వచ్చి, "బాబూజీ! మీరు ఒకవేళ ఈశ్వర సాక్షాత్కారం గురించి చెప్పినట్లయితే నేను వెంటనే ఇక్కడ నుండి లేచి వెళ్ళిపోతాను. భారతదేశం నుండి వచ్చే గురువులు అందరు కూడా ఈశ్వర సాక్షాత్కారం అని చెప్పి అక్కడ ఫారిన్‌లో ధనాన్ని సంపాదించు కుంటున్నారు. ఈశ్వరుని గురించి మీరు ఏమైనా చెప్పితే, దానిని నేను అంగీకరించడానికి సిద్ధంగా లేను" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "లేదు! నేను ఆ విధంగా చెప్పను. భారతదేశం గొప్పదేశం అని నీవు అన్నావు కదా! మరి తొమ్మిదిసార్లు నీవు భారతదేశానికి ఎందుకు వచ్చినట్లు?" అని అడిగారు. అప్పుడు పోరే "శాంతి కొరకు, ఆంతరిక ఆనందం కొరకు ఇక్కడకు వచ్చాను. నా యొక్క శాంతి మరియు ఆంతరిక ఆనందం డిస్టర్బ్ కాకుండా ఉండే మార్గం నాకు కావాలి" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "అటువంటిదే ఈ సహజమార్గ్ సిస్టమ్. చేసి చూడు. శాంతి మరియు ఆనందం లభిస్తుంది. శాంతి అనేది శాశ్వతమైనది. ఎవరో, ఏదో చెప్పితే నీవు ఇక్కడికి రాలేదు! నీవు ధ్యానం చేసావు. అందులో నీకు అనుభూతి లభించింది. నీకు చెప్పబడినటువంటి ఈ నిరంతర ధ్యాసను (స్మరణ)ను చేయడానికి ప్రయత్నించు. నెమ్మది నెమ్మదిగా నీలో శాంతి, ప్రశాంతతలు అధికమవుతాయి. ఎప్పుడైతే ప్రశాంతతను అనుభవిస్తావో, ఆనందం అనేది కలుగుతుంది. ఎప్పుడైతే ఆనందాన్ని అనుభవిస్తావో అప్పుడు నీవు ఈ ధ్యానాన్ని ఈ సహజమార్గ్ సిస్టమ్‌ను విడిచిపెట్టవు" అని అన్నారు.

ఆ తరువాత పోరే అక్కడ నుండి వెళ్ళిపోగానే బాబూజీ "ఇతడు ఈసారి తిరిగి ఇక్కడకు వచ్చినప్పుడు నాకు ఈశ్వర్ సాక్షాత్కారం తప్పకుండా కావాలని అంటాడు" అని మాతో అన్నారు. ఆ తరువాత పోరే తిరిగి ఇండియాకు వచ్చినప్పుడు బాబూజీతో, "మాస్టర్! మీరు చెప్పినదంతా కరెక్టే. ఇప్పుడు నాకు ఈశ్వర్ సాక్షాత్కారం తప్పనిసరిగా కావాలి" అని అన్నారు.

**ప్రశ్న: ఒక్కొక్కసారి నాకు బాబూజీ కంటే కూడా లాలాజీతోనే ఎక్కువగా అటాచ్‌మెంట్ (అనుబంధం) ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఈ భావం నిజమేనా లేక తప్పా?**

**జవాబు:** తప్పు, ఒప్పు అనే ప్రశ్నయే రాకూడదు; నేను లాలాజీ సాహెబ్‌ను గురించి చాలా విన్నాను. బాబూజీ లాలాజీని తన ఎదుటనే ఉంచుకొని, వారి గురించి చాలా చెప్పేవారు. మీకు లాలాజీతో, ఆ తరువాత బాబూజీతో అటాచ్‌మెంట్ ఉంది, అని అంటే అక్కడ ఇద్దరు ఉన్నారని అర్థం; కాని లాలాజీ సాహెబ్ తనలో విలీనం అయ్యారని బాబూజీ తెలిపారు. కాబట్టి లాలాజీ వేరు, బాబూజీ వేరు అనే భేదభావం మీలోపల రాకూడదు. అందువలన ఒక్క బాబూజీనే మీ దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్ళండి. లాలాజీ, బాబూజీ, రాముడు మరియు కృష్ణుడు ఎవరైనా సరే వాళ్ళను గురించి ఎక్కువ, తక్కువ అనే భేదభావం మీ మనస్సులో రాకూడదు.

బాబూజీ ఎవరో ఒక వ్యక్తి కొరకు రాలేదు. కేవలం మన సంస్థ కొరకే రాలేదు. 'వారు' సమస్త మానవాళి కొరకు వచ్చారు. ఈశ్వరుడు మనలోనే ఉన్నాడు కాని అందరూ ఈశ్వరుని మరచిపోయారు. అందువలన 'వారు' మానవమాత్రులందరిలో ఈశ్వర ప్రాప్తి అనే తపనను మేల్కొలపాలనే సంకల్పంతో ఇక్కడకు వచ్చారు. శక్తినీ తీసుకువచ్చారు. ప్రేమను కూడా తీసుకొని వచ్చారు. తన ప్రేమదృష్టినీ తీసుకొని వచ్చారు. అందువలన 'వారి' సంబంధం కేవలం సహజమార్గ్ అభ్యాసులతోనే కాకుండా సమస్త మానవాళితోను 'వారు' కనెక్షన్ కలిగి ఉన్నారు. ఈశ్వరునికి, ఈ సృష్టికి మధ్య ఏ సంబంధమైతే ఉందో, బాబూజీ మరియు మన అందరి మధ్యన కూడా అదే సంబంధం ఉంది.

**ప్రశ్న: ఒక్కొక్కసారి ఇంటిలోని సమస్యల్లో మునిగిపోయి సరిగ్గా ధ్యానం చేయలేను. అప్పుడు టెన్షన్ (ఆందోళన) కూడా ఉంటుంది. ఏం చేయాలి?**

**జవాబు:** సమస్యలను మనమే సృష్టించుకుంటున్నాము. వేటివలన అయితే మనకు టెన్షన్ (ఆందోళన) కలుగుతుందో, వాటిని తొలగించివేయాలి. మన బలహీనతలను ఎప్పుడూ జ్ఞాపకం చేసుకోకూడదు. ధైర్యంగా ఉండాలి. కోపంగా మాట్లాడితే మన కండిషన్ డిస్టర్బ్ అవుతుంది. అనవసర విషయాల్లో జోక్యం కల్పించుకోవడం వలన మనస్సు చిక్కుల్లోపడి మన కండిషన్ డిస్టర్బ్ అవుతుంది. సాధ్యమైనంతవరకు బాబూజీ మనకు ప్రసాదించిన కండిషన్‌ను కాపాడుకోవడానికి ప్రయత్నించాలి.

**ప్రశ్న: టీ.వీ. చూడవచ్చునా? న్యూస్ పేపర్ (దినపత్రిక) చదవటం వలన ఏమీ కాదు కదా?**

**జవాబు:** బాబూజీ ఈ ప్రాపంచికమైన వాటిని, వేటినీ వద్దని చెప్పలేదు. న్యూస్ పేపర్ చదివి, మరచిపో! అంతేకాని అందులోని వార్తలను గురించి అందరికి చెప్తూతూ నీవే ఒక న్యూస్ (వార్త)గా మారకూడదు. అమెరికాలో ఆ విధంగా ఎందుకు జరిగింది? ఆ విధంగా జరగడానికి వీలులేదు? అని ప్రశ్నించే అధికారం నీకు లేదు. ఇది మన పని కాదు.

అమెరికా బాంబు దాడులను చేస్తుంది కదా, అందుకని కొద్దిగా భయంగా ఉంది అని ఒక సోదరి అనగానే –భయం ఎందుకు? అమెరికా వాళ్ళు బాంబు మనమీద వేసినా వేయకపోయినా, ఎప్పుడైనా మరణించవలసిందే కదా!

మనం చేసే పనిని గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. నేను ఈ పని చేయాలి, ఆ పని చేయాలి, అని మరల మరల ఆలోచిస్తూ ఉంటే, లోతుగా ఒక సంస్కారం అనేది ఏర్పడుతుంది. బాబూజీ మనల్ని పూర్తిగా సహజమైన జీవన విధానాన్ని అలవరచుకోమని చెప్పారు. టీవీ చూశాము అనుకోండి. అయ్యో! టీవీ ఎందుకు చూసాము, అయ్యో – చూశామే అని మరల మరల ఆలోచించడం తప్పు. టీవి చూశారు. ఇక దానిని గురించి మరిచిపోండి.

ఒక అభ్యాసీ, "బాబూజీ! నాకు కోపం బాగా వస్తుంది. కోపం ఇంకా పెరుగుతూనే ఉంది" అని అనగానే వారు, "నీకు ఒక్కసారే కదా కోపం వచ్చేది" అని అడగ్గానే, "లేదు! కోపం గంటల తరబడి ఉంటుంది" అని అభ్యాసీ జవాబిచ్చాడు. అప్పుడు బాబూజీ నీకు కోపం ఒక్కసారే వస్తుంది. కాని గంటల తరబడి ఉంటుంది – ఎప్పుడైతే కోపం ఒకసారి వచ్చిందో అప్పుడే దాన్ని ఖతం చేయవచ్చు కదా! దానిని ఎందుకు అంత సమయం ఉండనిచ్చావు. ఈ చెడు మనిషిని ఇంటిలో ఎందుకు ఉండనిచ్చావు? దొంగను నీ ఇంటిలో ఉండనిస్తే, అతను తప్పకుండా దొంగతనం చేస్తాడు కదా!" అని అన్నారు.

ఒకవేళ మనకు కోపం వచ్చిందే అనుకోండి. తరువాత దాన్ని గురించి మరచిపోండి. జరిగిపోయిన దానిని గురించి ఆలోచించకండి. జరిగిపోయిన దాన్ని గురించి ఆలోచిస్తే, మనస్సు ఆ సంస్కారాన్ని ఇంకా లోతుగా చేస్తుంది. మీరు "బాబూజీ! ఈ విధంగా జరగకుండా మీ శక్తిని ప్రసాదించండి, కృపను ప్రసాదించండి!" అని విన్నవించుకోవాలి.

**ప్రశ్న: సహజమార్గ్‌లోకి వచ్చిన తర్వాత అభ్యాసులు చాలామంది సెన్సిటివ్ (సున్నిత స్పందనా మనస్కులు)గా అవుతారు. సెన్సిటివ్‌గా అవ్వడంవలన ఇతరుల దుఃఖాలను తమ దుఃఖాలుగా భావిస్తారు!**

**జవాబు:** ఇది తప్పు. ఒకవేళ అభ్యాసీ సెన్సిటివ్ అయితే, నా కండిషన్ (స్థితి) ఏమిటి అని ఎందుకు అడుగడు? ఇది సెన్సిటివ్‌నెస్ (సూక్ష్మ స్పందన) కాదు. మనం మన జ్ఞానంలో, కంట్రోల్‌లో ఉండటమే సెన్సిటివ్‌నెస్. మీరు ఇతరుల బాధలను, దుఃఖాలను చూసినప్పుడు, మీకు ఎంత వీలైతే అంతగా వాళ్ళకు సహాయం చేయాలని బాబూజీ అన్నారు.

ఇంకొక విషయం ఏమిటంటే, మీరు ఇతరుల దుఃఖాలను గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. మొదట్లో నాకు కూడా ఇదే విధంగా ఉండేది. ఎవ్వరికైనా హాస్పిటల్‌లో ఆపరేషన్ అయినప్పుడు లేదా ఎవరైనా చిన్న పిల్లవాడు బాధతో బిగ్గరగా ఏడ్చినప్పుడు, నా అటెన్షన్ (దృష్టి) అంతా కూడా వాళ్ళవైపే ఉండేది. అప్పుడు నేను, "బాబూజీ మహరాజ్! వాళ్ళు చాలా దుఃఖంలో, బాధలో ఉన్నారు. నేను వాళ్ళకు ఏమీ చేయలేను; కాని ఆటెన్షన్ వాళ్ళవైపే ఉంటుంది. ఏం చేయాలి?" అని అడిగినప్పుడు, వారు "నీవు ఈ విధంగా ఆచరించు: "బాబూజీ! వాళ్ళ బాధను, దుఃఖాన్ని తగ్గించండి –అని ప్రార్థించు" అన్నారు. అప్పటి నుండి నా దృష్టి అటువైపు మరలటం లేదు. మన దృష్టిని వాళ్ళ (దుఃఖం) వైపు మరల్చడం వలన, మనకుగాని, వాళ్ళకుగాని ఎటువంటి ఉపయోగం లేదు. మన దృష్టిని వాళ్ళవైపు మరల్చడంకన్నా, "బాబూజీ! అతని బాధను తగ్గించండి" అని ప్రార్థిస్తే ఉపయోగం ఉంటుంది. ఈ విధంగా ప్రార్థన చేయడంవలన బాబూజీ సహాయం లభిస్తుంది. మన అటెన్షన్ (దృష్టి) కూడా వాటి (ఇతరుల బాధలు, దుఃఖాలు) మీద నుండి తొలగిపోతుంది.

ఈ విధంగా ప్రతి ఆలోచననూ, అనవసరమైన ఆలోచనలు వాటినీ కూడా బాబూజీతో కలపాలి. “నేను బాబూజీ మహరాజ్ ధ్యానంలో కూర్చున్నాను; హృదయం ‘వారి’ ధ్యానంలో మునిగి పోయింది; ‘వారు’ నా వారు; నా హృదయంలోనే కూర్చొని ఉన్నారు; ‘వారు’ లేకుండా నేను జీవించలేను” అని భావించాలి. మనం ‘వారి’ చరణాలను ఆశ్రయించాము, ఆ శరణాగతిని ఎప్పుడు కూడా మరచిపోకూడదు.

ఎవరైనా బాధలలో, దుఃఖంలో ఉన్నప్పుడు మన మనస్సు (దృష్టి) అటువైపు వెళ్ళడమనేది సహజమైన విషయం. దీనివలన సంస్కారం అనేది ఏర్పడదు. కాని అస్వాభావికమైన విషయం ఏమిటంటే, గడిచిపోయిన (జరిగిపోయిన) దాన్ని గురించి పదే పదే ఆలోచించడమనేది అసహజమైన విషయం. దీనివలన సంస్కారం ఏర్పడుతుంది. అసలు సంస్కారం ఏర్పరచుకోకుండా ఉండడమనేది గొప్ప విషయం.

“లాలాజీ సాహెబ్ కూడా ఇతరుల బాధలలో, దుఃఖాలలో పాలుపంచుకునేవారు కదా!” అని ఒక సోదరి అనగానే వెంటనే నేను ఆమెకు ఇలా చెప్పాను: మహాత్ముల గురించి ఇలాంటివి మనం మాట్లాడకూడదు. మనకు ఉన్నట్లుగా అటాచ్‌మెంట్ (అంటించు కోవడం – బంధం) అనేది ‘వారి’కి ఉండదు. ‘వారు’ చేసేది ప్రకృతి కార్యం.

మా ఇంటికి దగ్గరలో ఒక బాలిక ఉండేది. ఆమెకు చిన్నప్పుడు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. ఇప్పుడు ఎవ్వరైనా వెళ్ళి ఆమె దగ్గర కూర్చుంటే చాలు – ఆ చిన్నప్పటి జ్వరంతో ఆమె ఏ విధంగా బాధపడిందో ఆ కథ అంతా చెప్తుతుంది. ఆమె అనారోగ్యంతో బాధపడి 10 సంవత్సరాలు అయిపోయింది. కాని ఆ బాధను ఇప్పటివరకు కూడా జ్ఞాపకం పెట్టుకొన్నది. సంస్కారం అంటే ఇదే. ఏదైతే జరిగిపోయిందో దాన్ని గురించి మరచిపోవాలి.

**ప్రశ్న: మనం ఏదైనా పనిని చేసినప్పుడు కారణ శరీరం మీద గుర్తు (బీజం) ఏర్పడుతుంది కదా!**

**జవాబు:** ఏ రోజు నయితే ఆధ్యాత్మికత అనే బీజం మీలో నాటబడిందో, అప్పటినుండే, ప్రతి బీజం (సంస్కారం) కూడా దగ్ధం కావడం ప్రారంభమవుతుంది. ఏ రోజు నయితే దైవస్వరూపులు బాబూజీ మహరాజ్ యొక్క దర్శనం అవుతుందో, మన శ్రద్ధ ‘వారి’తో ముడిపడుతుందో, అప్పుడు అన్ని బీజాలు (సంస్కారాలు) కూడా భస్మమైపోతాయి.

ఒకసారి నాకు ఈ విధంగా అనిపించింది: ఎన్నో జన్మలు గడచిపోయాయి. ఈ జన్మలో కూడా 22 సంవత్సరాలు గడచిన తరువాతనే బాబూజీ లభించారు. మరి అంతకుపూర్వం గడచిన జన్మలలో ‘వారు’ ఎందుకు లభించలేదు, అని ఒకరోజు బాధపడుతుంటే, ఒక్కసారిగా నాకు ఈ విధంగా అనిపించినది: ఇది ఎంత తప్పు ఆలోచన! బాబూజీ మహరాజ్ అప్పుడూ ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు, ఎల్లప్పుడూ ఉంటారు. ‘వారు’ శాశ్వతం, అసలు మనం బాబూజీ నుండి విడిపోయి ఉండే ప్రశ్నేలేదు. అయ్యో! ఇన్ని సంవత్సరాల తరువాత బాబూజీ లభించారు అని ఆలోచించడం కంటే, సృష్టి ప్రారంభమైనప్పటి నుండి కూడా మనం బాబూజీతోనే ఉన్నాం. ‘వారి’తోనే ఉంటున్నాం. బాబూజీతోనే ఉంటాం– అని భావించాలి.

బాబూజీ మహరాజ్ దివ్యశక్తి వలన నాలోని అనవసరమైన విషయాలన్నీ తుడిచిపెట్టుకుపోతున్నాయని క్లీనింగ్ చేసుకున్న తరువాత నా హృదయం పూర్తిగా పవిత్రంగా అయింది. బాబూజీ గ్రేస్ (కృప)తో నా హృదయం పూర్తిగా నిండిపోయి ఉంది –అని కనీసం రెండు నిమిషాలు అనుకోవాలి. దీనివలన పవిత్రత

అనేది అధికమవుతుంది. అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఎప్పుడైతే బాబూజీ మాహరాజ్ మన హృదయంలో ఉంటారో, అప్పుడు మన హృదయం అపవిత్రమయ్యే ప్రశ్నేలేదు.

బసంత్ పంచమి ఉత్సవం అయిన తరువాత ఒక అభ్యాసీ, ''బాబూజీ! నేను మా ఊరికి వెళ్ళిపోతున్నాను. మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి" అని అనగానే వారు, "సరే, మంచిది! నీవు నీ జ్ఞాపకాన్ని (స్మరణను) ఇక్కడే విడిచిపెట్టి వెళ్ళు" అని అన్నారు. (మీరు బాబూజీ స్మరణ యొక్క ప్రగాఢమైన కనెక్షన్‌ను అక్కడే విడిచి వెళ్ళినప్పుడే, అది 'వారి'ని తాకుతుంది. తపన, భక్తి పెంపొందించుకోవడం మన కర్తవ్యం, మన స్మరణ 'వారి' వద్దకు చేరాలి) మళ్ళీ బాబూజీ, "ఒకవేళ సమయం దొరికితే" అని అన్నారు. 'వారు' మన కోసం, మన పని కొరకు అక్కడ నుండి ఇక్కడకు వచ్చారు. 'వారు' ఆ పనిలోనే లీనమై ఉన్నారు. అది ప్రకృతి కార్యం కానివ్వండి లేదా ఆధ్యాత్మిక కార్యం కానివ్వండి; ఆ పని అంతా కూడా 'వారు' మన కోసమే చేస్తున్నారు. అటువంటప్పుడు "నన్ను జ్ఞాపకం పెట్టుకోండి" అని 'వారి'ని అడగడం మర్యాద కాదు. పిల్లవాడు ఊరికి వెళ్ళేముందు తల్లి పాదాలను తాకి వెళ్ళతాడు. ఇది నా అలవాటు అని అనడు. ఒకవైపు నుండి చూస్తే, మీరు మమ్మల్ని జ్ఞాపకం పెట్టుకోండి – అని అడగడం మర్యాదకరమైనదే! కాని 'వారు' ఇక్కడకు వచ్చింది మనందరిని జ్ఞాపకం పెట్టుకోవడానికి. 'వారు' మనల్ని గుర్తు పెట్టుకోకపోతే, ఇక్కడకు ఎందుకు వస్తారు? 'వారు' తమ దైవీయ కార్యంలో పూర్తిగా లీనమై ఉండి కూడా, మనందరిని ఎల్లవేళలా జ్ఞాపకం పెట్టుకుంటున్నారు. అందువలన మనం కూడా 'వారి'ని అంత ప్రగాఢంగా స్మరించాలి. "బాబూజీ! మీరు నన్ను దయచేసి జ్ఞాపకం పెట్టుకోండి" అని మీరు 'వారి'ని యాచించకూడదు. "బాబూజీ! మేము ఎల్లప్పుడూ మిమ్మల్నే జ్ఞాపకం పెట్టుకుంటాం" అని మీరు అనాలి.

మనం గుర్తు పెట్టుకునేది కేవలం 'వారు' ఒక్కరినే. కాని 'వారు' మాత్రం మనలనందరిని గుర్తుపెట్టుకోవాలి. అందువలన ఎంత వీలైతే అంతగా మనం 'వారి' సంకల్పంతో సహకరించాలి. మనం మనవైపు నుండి 'వారి'ని ఎంత గాఢంగా స్మరించాలి, ఎంత ప్రగాఢంగా ప్రేమించాలంటే, 'వారి' అటెన్షన్ (దృష్టి) అనేది దానంతటఅదే మనవైపుకు మరలాలి. బాబూజీ! నన్ను జ్ఞాపకం పెట్టుకోండి – అని మనం వారిమీద భారాన్ని మోపకూడదు. ఎందుకంటే, మనల్ని అందరిని జ్ఞాపకం పెట్టుకోవాలనే సంకల్పంతోనే 'వారు' ఇక్కడకు వచ్చారు. ఆ సంకల్పానికి అనుగుణంగానే 'వారు' మన అందరిమీద పని చేస్తున్నారు. మనం చేసేది మన ఒక్కరి కోసమే! కాని 'వారు' చేసేది సమస్త మానవాళి మీద, సకల విశ్వ వాతావరణంలోను మరియు మానవుని యొక్క స్థితిలోను మార్పు తీసుకొని రావడానికి ఈశ్వరీయ శక్తితో పని చేస్తున్నారు. 'వారి'ది చాలా పెద్ద పని (ఊహకు అందనిది). ధ్యానం చేయడం, నిరంతర స్మరణ –ఇవన్నీ మనం చేయవలసినవి. 'వారు' చేయవలసినది 'వారు' చేస్తూనే ఉన్నారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు, "బాబూజీ మహరాజ్! ఇతర సంస్థలకు సంబంధించినవారు, సాధు–సమాజమునకు సంబంధించిన వారు ఇక్కడకు వచ్చినప్పుడు వాళ్ళు చెప్పే మాటలను అన్నింటిని నిశ్శబ్దంగా వింటారు. కాని సహజమార్గ్ గురించి మీరు వాళ్ళకు ఎందుకు చెప్పరు?" అని అడిగారు. అప్పుడు బాబూజీ, "నేను చూసేది ఏమిటంటే, తాము ఆచరించే విధానం మీద వాళ్ళకు కనీసం కొంత నమ్మకం, భక్తి అనేది ఉంది. ఒకవేళ నేను ఈ సహజమార్గ్ గురించి చెప్పి, వాళ్ళ నమ్మకాన్ని ఇటువైపు

మరల్చడానికి ప్రయత్నించినట్లయితే, అప్పుడు ఆ నమ్మకం, శ్రద్ధ అనేది అటూ ఇటూ కాకుండా అవుతుంది. ఎప్పుడైతే వాళ్ళలో ఈ సహజమార్గ్ మీద నిజమైన నమ్మకం, శ్రద్ధ ఏర్పడుతుందో అప్పుడు దీనిని గురించి తెలుసుకోవాలని తామంతట తామే ఇక్కడకు వస్తారు" అని అన్నారు.

బాబూజీ ఎప్పుడూ కూడా నన్ను (విగ్రహారాధన) మూర్తిపూజను విడిచిపెట్టమని అనలేదు. నీవు దీన్ని (సహజమార్గ్ ధ్యానం) పట్టుకో –అని అన్నారు. అప్పుడు మూర్తిపూజ, మిగిలినవి అన్నీ కూడా వాటంతట అవే తొలగిపోయాయి.

"అభ్యాసీ – యాచనచేసి అడగడం అనేది అలవాటుగా మారింది. కాని నేను కోరుకొనేది ఏమిటంటే, అభ్యాసీ నన్ను యాచించకుండా, తన అధికారంతో నా నుండి తీసుకోవాలి" అని బాబూజీ అనేవారు. మనం ప్రేమ మరియు భక్తిలో మునిగిపోయి, మనల్ని మనం మరచిపోయినప్పుడే మనం 'వారి'ని అధికారంతో అడుగగలం. కాని మనం ఎక్కువగా 'వారి'ని యాచిస్తూ ఉంటాము. ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ దయచేసి మీరు నన్ను ఒక్క క్షణంలో సెంట్రల్ రీజియన్‌కు చేర్చండి" అని కోరాడు. అప్పుడు వారు, "ఒక్క క్షణంలో ఎవరినైనా సరే, సెంట్రల్ రీజయన్‌కు చేర్చగల శక్తిని నా లాలాజీ సాహెబ్ నాకు ప్రసాదించారు. నా ఇచ్ఛాశక్తితో నేను నిన్ను ఒక్క క్షణంలో ఇక్కడ నుండి అక్కడకు చేర్చగలను. కాని నీవు అక్కడ ఆ సెంట్రల్ రీజియన్‌లో ఉండగలవా? నీవు అక్కడ స్థిరపడలేవు. ఎందుకంటే, నీకు అక్కడ ఉండే విధానం, మర్యాద, మన్నన ఏమీ కూడా తెలియదు. నిన్ను సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళినా, వెంటనే మరల నీవు క్రిందకు జారిపోతావు. అక్కడ నిలబడలేవు. మొదట నీవు అక్కడకు వెళ్ళటానికి కావలసిన ప్రేమ, భక్తి, తపన మొదలైనవి నీలో పెంపొందించుకో! ఏరోజు అయితే నీలో ఆ యోగ్యత ఏర్పడుతుందో, ఆ రోజున నేను ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయను" అని అన్నారు. "మేము ప్రేమను, భక్తిని పెంపొందించుకోవాలి అంటారు కదా! ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి?" అని నన్ను అభ్యాసులు అడుగుతారు. దానికి ఉదాహరణ శబరి, భరతుడు. "రాముడు ఇటువైపు వస్తాడు, అతని కోసం నిరీక్షించు" అని శబరికి ఆమె గురువు చెప్పాడు. శబరి రాముని కొరకు ఏ విధంగా నిరీక్షించిందో, ఎదురుచూసిందో, అదే విధంగా మీరూ 'వారి'కై ఎదురు చూడాలి. భరతుడు అందరికంటే గొప్ప భక్తుడు. ఎందుకంటే, అతడు ఎప్పుడూ 'ఎందుకు?' అనే శబ్దాన్ని ఉపయోగించలేదు. రాముడు ఏది చెప్పితే అది మారు మాట్లాడకుండా చేసేవాడు.

ఒకసారి నేను "బాబూజీ! మీరు లాలాజీ సాహెబ్ దగ్గరకు చాలా తక్కువసార్లు వెళ్ళారు; 'వారి'తో చాలా తక్కువ సమయం గడిపారు కదా! మరి మీరు ఇంత గొప్పగా ఎలా తయారైయ్యారు" అని అడిగాను. అప్పుడు బాబూజీ "తాబేలు నీళ్ళలోనే ఉండి, విల్ పవర్ (ఇచ్ఛాశక్తి)తో ఎక్కడో నదీ తీరాన ఉన్న గుడ్లను పొదుగుతుంది, అంతే. కాని అది మాటి మాటికి బయటకు రాదు, ఏవైనా జంతువులు తనను చూస్తాయని అది భయపడుతుంది" అన్నారు.

సద్గురువు అంటే అతడు భౌతికంగా మన చేయి పట్టుకొని తీసుకొని వెళ్ళడు. సద్గురువు తన 'సంకల్ప శక్తి'తో మన హృదయాల్ని పట్టుకొని, లక్ష్యం వద్దకు తీసుకొని వెళ్ళతారు. మరి మన హృదయాన్ని 'వారి'కి ఇవ్వకపోతే కనెక్షన్ ఏ విధంగా ఏర్పడుతుంది? సద్గురువు యొక్క ఆలోచనలు, భావనలు, అన్నీ కూడా మన ప్రోగ్రెస్ గురించే ఉంటాయి. అందుకనే బాబూజీ "అభ్యాసీలు ఎప్పుడూ కూడా నిరంతర

స్మరణలోనే ఉండాలి" అనేవారు. మనం ఈ సాధనను ఎందుకు ప్రారంభించాము? కేవలం 'ఈశ్వర ప్రాప్తి' అనే లక్ష్యాన్ని, బాబూజీ యొక్క ప్రేమను, కృపను పొందటానికి.

బసంత్ పంచమి (శ్రీ లాలాజీ సాహెబ్ పావన జన్మదినం) ఉత్సవం నుండి ఇంటికి వచ్చిన తరువాత కూడా ఉత్సవం యొక్క ప్రభావం కొన్ని నెలల వరకు ఉండేది. ఇంకా బసంత్ పంచమి ఉత్సవం పూర్తి కాలేదు అని అనిపించేది. మరల రాబోయే బసంత్ పంచమి ఉత్సవం కోసం ఎదురుచేసే వాళ్ళం. ఈ విధంగా మొత్తం సంవత్సరం అంతా కూడా బసంత్ పంచమి ఉత్సవంతోనే గడచిపోయేది. బసంత్ పంచమి ఉత్సవంలో గ్రేస్ (కృప) రోజంతా 24 గంటలూ వర్షించేది. విశ్వంలోని వాతారణం అంతా ఆ మూడు రోజులు బసంత్ పంచమి వాతావరణంతో నిండిపోయేది. ఎవరైనా బసంత్ పంచమి ఉత్సవానికి షాజహాన్‌పూర్ రాలేకపోయినప్పటికీ ఇంటివద్ద ధ్యానంలో కూర్చుంటే, వాళ్ళకూ అదే విధంగా అనిపించేది.

'ఆఫ్‌తాబే మారిఫత్' అనే ఈ పాట లాలాజీ సాహెబ్‌ను కీర్తిస్తూ వ్రాయబడింది. ఈ పాట అంటే బాబూజీకి చాలా ఇష్టం. మొదటిరోజు అనగా బసంత్ పంచమి ఉత్సవాన్ని ప్రారంభించే ముందు, మరల ఉత్సవం ముగించే ముందు బాబూజీ 'ఆఫ్‌తాబ్ మారిఫత్' అనే ఈ పాటను పాడించేవారు.

"సుడిగాలి వచ్చినప్పుడు అది ఏ విధంగానయితే భూమి మీద ఉన్న చెత్త చెదారాన్ని పైకి లేపుకొని వెళ్ళుతుందో, అదే విధంగా నాలో ప్రేమతుఫాన్ అనేది ఏర్పడినప్పుడు, అది నిన్ను పైపైకి తీసుకొని వెళ్ళి, ఈశ్వరునిలో లయం చేస్తుంది" అని కబీరు ఒక ద్విపద పద్యంలో చెప్పాడు.

**"బాబూజీని ఏ విధంగా ప్రేమించాలి?"** అనేది ఒక సమస్య, అని ఒక సోదరి అనగానే, "ఇది బాబూజీకే తెలుసు" అని నేను చెప్పాను. "బాబూజీ! మీ కృపను ఏ విధంగా పొందగలం?" అని అభ్యాసులు అడిగినప్పుడు, వారు "మీకు దాహంగా ఉంది అనుకోండి, ఈ బాటిల్ (సీసా) నిండా నీళ్ళు ఉన్నాయి; గ్లాస్ ఖాళీ అయినప్పుడు బాటిల్‌తో ఈ గ్లాస్‌ను నింపవచ్చు. కాబట్టి మీ హృదయాన్ని ఖాళీ చేసుకోండి" అని అనేవారు.

మీ అందరిలో ఇంత ప్రోగ్రెస్ ఉందంటే అది సెంటర్ ఇన్‌ఛార్జ్ గొప్పతనమే.

బాబూజీ మహరాజ్ కృపవలన అభ్యాసులందరికీ బాబూజీ ఆశీస్సులు మరియు నా ప్రేమానురాగాల్ని జోడించి పంపిస్తున్నాను.

నేను చాలా ఆనందంతో ఉన్నాను. మీ అందరి హృదయాలు కూడా పూర్తిగా విప్పార్చుకొని ఉన్నాయి. మీ అందరి హృదయాలు చాలా స్వచ్ఛంగా, పవిత్రంగా ఉన్నాయి. వచ్చే సంవత్సరం మీరు ఇంకా మంచి ప్రోగ్రెస్‌తో ఇక్కడకు రావాలి.

"ఇప్పుడు ఇంటికి వెళ్ళిన తర్వాత సిట్టింగ్‌లో కూర్చుంటే ఇంకా బాగా తెలుస్తుంది కదా!" అని ఒక సోదరి అనగానే నేను "ఇప్పుడు మీరు వేరే వాళ్ళ ఇంటిలో ఉంటున్నారు. కాని మన ఇల్లు అక్కడ 'బాబూజీ' దగ్గర ఉంది" అని చెప్పాను.

మరల వచ్చేటప్పుడు మీరందరు కూడా, ఎక్స్‌పాన్షన్ అంటే అపరిమితంగా వ్యాప్తి చెందిన హృదయాలతో ఇక్కడకు రావాలి. బాబూజీ మీకు ఎంత ప్రసాదించినా కూడా, అది ఇంకా తక్కువే అని 'వారి'కి అనిపించాలి.

మనం బాబూజీ మహరాజ్‌ను అనుసరిస్తున్నామనీ, అంటే సహజమార్గ్ పద్ధతిని అనుసరిస్తున్నామని మనం అంటాం. ఈ రెండూ కూడా మన ఆధ్యాత్మిక జీవితానికి అవసరమే. బాబూజీ మనల్ని ఎలా ఉండాలని కోరుకుంటారో, ఆ విధంగా మనం మొదటగా తయారుకావాలి.

బాబూజీ అభ్యాసులను ఎంతో ఆప్యాయతతో చూసేవారు, 'వారి' చూపులు ఎంతో ప్రేమతో ఉంటాయి, 'వారి' మాటలలో ఎంతో తీయదనం ఉంటుంది. మనలను ఈశ్వరప్రాప్తి కొరకు తయారు చేయటానికి 'వారు' ప్రతిసారి మనలను ఎంతో ప్రేమదృష్టితో చూసేవారు. మనం కూడా అదే విధంగా తయారుకావాలి.

మీరు ఇతరులను చూసినప్పుడు అదే ప్రేమదృష్టితో చూడాలి. అణుకువగా, మర్యాదగా సంభాషణ చేయాలి. మీ మాటలలో తియ్యదనం ఉండాలి. అలా ఉంటేనే, మీరు బాబూజీ మహరాజ్‌ను అనుసరిస్తున్నారని అర్థం.

మనం సహజమార్గ్ సిస్టమ్‌లో చేరాం, అని అంటాం. మొదటగా మనం గుర్తుంచుకొనవలసినది ఏమిటంటే, భగవంతుడు నీలోనే ఉన్నాడు అని జ్ఞాపకం పెట్టుకోవాలి. బాబూజీయే మీ హృదయంలో ఉన్నారని మీరు అనుకోవచ్చు. కాని బాబూజీ యొక్క ముఖాన్ని కాని, లేదా 'వారి' భౌతిక రూపాన్ని కాని మీ హృదయంలో చూడటానికి ప్రయత్నించకూడదు. (ఆ విధంగా చేస్తే అది విగ్రహారాధన అవుతుంది.) ఎందుకంటే, నేను విగ్రహారాధన (మూర్తిపూజ)ను తొలగించడానికే ఇక్కడకు వచ్చాను –అని బాబూజీ అన్నారు. బాబూజీ (ప్రత్యక్షత) ప్రజెన్స్, నియర్‌నెస్ (సామీప్యత) అనేది మీలోపల ఎప్పుడూ ఉంటుంది. దానిని మీరు అనుభూతి చెందాలి. బాబూజీ నుండి ట్రాన్స్‌మిషన్ మీలోకి ప్రవహించడంవలన పవిత్రత అనేది మీ మొత్తం సిస్టమ్‌లో అంటే మీలో అంతటా ప్రవహిస్తున్నట్లుగా మీరు అనుభూతిని చెందుతారు. ఈ విధంగా అయినప్పుడే మీరు సహజమార్గ్ సిస్టమ్ అనుసరిస్తున్నారని అర్థం.

బాబూజీ చెప్పిన విధంగా ప్రతిరోజూ ఉదయాన్నే ధ్యానంలో కూర్చోండి. మొదట మీరు 20 నిమిషాలే ధ్యానంలో కూర్చుంటారు. కాని ఎప్పుడైతే మీరు ధ్యానంలో సంతోషాన్ని, ఆనందాన్ని అనుభూతి చెందుతారో, అప్పుడు ధ్యాన సమయం పెరుగుతుంది. కాని ఆడవారికి, కొంతమంది మగవారికి ఇంటి పనులు ఉండటం వలన, ఉదయాన్నే ధ్యానం చేసుకోవడానికి వీలులేకపోతే బాధపడవలసిన అవసరం లేదు. మెడిటేషన్ మూడ్‌లో అనగా ఆ ధ్యానం యొక్క ధ్యాసలోనే ఇంటి పనుల్ని చేసుకోవాలి, అని బాబూజీ చెప్పారు. ఎందుకంటే, మనం సహజమార్గ్ సాధనను ఒక బాండేజ్ బంధంగా తీసుకోకూడదు అని కోరారు. సహజమార్గం ఒక గృహస్థ సంస్థ; మనం ఇంటి పనులు చేసుకొంటూ, ధ్యానం కూడా చేయాలి. మన మాటలలోను, ప్రవర్తనలోను మంచిగా ఉండటానికి ప్రయత్నించాలి. ఇదే మనం బాబూజీకి అందించే సహకారం. ఇతరులను ప్రేమించడానికి ప్రయత్నించాలి.

నేను అభ్యాసుల నుండి కోరేది కేవలం సహకారం (కో–ఆపరేషన్) మాత్రమే –అని బాబూజీ ఎన్నోసార్లు అనేవారు.

ఎప్పుడైతే మనం ప్రతిచోట, ప్రతినిమిషం, ప్రతిశ్వాసలో కూడా 'వారి' నియర్‌నెస్ (సామీప్యత)ను ఫీల్ అవుతామో అప్పుడే మనం బాబూజీతో కనెక్ట్ అయినట్లుగా, ఎల్లప్పుడూ కూడా మనం 'వారి'తోనే

ఉంటున్నామని చెప్పవచ్చు. ఇదే సహజమార్గ జీవన విధానం. మనం ఏదైనా తప్పు చేసినప్పుడు, మరల ఆ తప్పును చేయకుండా ఉండటానికి ప్రయత్నించాలి. బాబూజీ! నేను ఆ తప్పు మరల చేయకూడదు –అని 'వారి'ని ప్రార్థించాలి. ఇదియే నిజమైన ప్రార్థన. "నీవు నీ ఇంటిపనులు, గృహస్థ కర్తవ్యాలు అన్నీ నెరవేర్చుకో. వాటితో నీకు సంబంధం ఉన్నాకానీ, నీ కనెక్షన్ (లింక్) మాత్రం నాతోనే ఉండాలి" అని బాబూజీ అనేవారు. ఈ కనెక్షన్ ద్వారానే బాబూజీ నుండి మీకు నిరంతరం ట్రాన్స్‌మిషన్ లభిస్తుంది; ప్రాపంచిక జీవనంలో అటాచ్‌మెంట్ (సంబంధం) అనేది ఉంటుంది; ఆధ్యాత్మిక జీవనం నందు బాబూజీతోనే కనెక్షన్ ఉంటుంది. అప్పుడే ప్రాపంచిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం ఈ రెండూ కూడా ప్రక్క ప్రక్కనే నడుస్తాయి.

ఇండియా భవిష్యత్తు ఎలా ఉంటుంది? అని ఒక డెన్మార్క్ సోదరుడు అడిగినప్పుడు, "అది ప్రకృతి యొక్క పని. ఎవరికైనా ప్రకృతి కార్యం అప్పగించబడినప్పుడు, దాన్ని గురించి వారే స్పష్టంగా చెప్పగలరు. కాని నేను ప్రకృతి కార్యాన్ని చేయడంలేదు. నేను మన అభ్యాసులమీద పని చేస్తున్నాను, అంటే ఆధ్యాత్మిక కార్యం చేస్తున్నాను. ఈ ప్రశ్న బాబూజీ మహరాజ్‌కు సంబంధించినది; నాకు సంబంధించినది కాదు. ఇండియా భవిష్యత్తు చాలా బాగుంటుందని బాబూజీ తమ పుస్తకంలో వ్రాశారు.

ఈ ఆధ్యాత్మికతయందు, ఎప్పుడైనా బాబూజీ నన్ను ప్రకృతి కార్యం చేయమని ఆదేశించినప్పుడు ఆ సమయమందు మాత్రమే నేను దాన్ని గురించి పూర్తిగా చెప్పగలను; కాని నాకు అప్పగించబడిన ఆ ప్రకృతి కార్యం పూర్తికాగానే వెంటనే నా దృష్టి మరల అభ్యాసీలవైపు అనగా ఆధ్యాత్మిక కార్యంవైపు మరలుతుంది.

ఒక అభ్యాసీ, "బెహెన్‌జీ! నాకు మాద్రాస్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది; అందరూ త్వరలోనే ప్రళయం వస్తుందని అంటున్నారు. నన్ను ఏం చేయమంటారు?" అని అడిగాడు. అప్పుడు నేను "6 సంవత్సరాలలో ప్రళయం వస్తుందని చెప్పితే నీవు మద్రాస్‌కు వెళ్ళవు. ఒకవేళ 2,3 సం॥లలో వస్తుందని చెప్పినా వెళ్ళవు. ఒకవేళ ప్రళయం 6 సంవత్సరాలలో రాలేదనుకో, ఈ లోపల నీవు రిటైర్ అయిపోతే ఏం చేస్తావు?" అని అతనితో అన్నాను. అనవసరమైన వాటిని, మనకు సంబంధంలేని విషయాలను గురించి మనం ఆలోచించకూడదు. మన పనిని మనం చేయాలి. భగవంతుని పని మనం చేయలేము. చేయలేని పనిని గూర్చి మనం ఆలోచించటం దేనికి? ఒకసారి బాబూజీ –"నేను భగవంతుణ్ని కాదు. ఒకవేళ నేను భగవంతుని పని (డ్యూటీ) చేసినట్లయితే ఆ భగవంతుడు ఏం చేయాలి" అని అన్నారు.

**ప్రశ్న: ఒక్కొక్కసారి ప్రార్థన చేయకముందే ధ్యానంలోకి వెళ్ళిపోతున్నాను. కాని కొన్నిసార్లు ప్రార్థన చేసినా కూడా ధ్యానంలోకి వెళ్ళలేక పోతున్నాను. ఎందుకని?**

**జవాబు:** ప్రతిరోజు ధ్యానానికి ముందు ప్రార్థన చేయవలసిన అవసరం లేదు. ఆ రోజు స్థితినిబట్టి, మీ హృదయానికి ఏది తోచితే అది చేయండి. ప్రార్థన చేయాలని అనిపించకపోతే, ప్రార్థన అవసరం లేదు. ధ్యానం చేయండి; క్లీనింగ్ సమయంలో ఒక్కొక్కసారి మీకు ధ్యానం చేయాలని అనిపిస్తే, క్లీనింగ్ ఆపివేసి, ధ్యానంలో కూర్చోండి. బాబూజీ "నిరంతర స్మరణ ఒక్కటే ముఖ్యమైనది" అని అన్నారు. ఎందుకంటే, నిరంతర స్మరణ ఉంటే అక్కడ నిరంతర ధ్యానం ఉంటుంది. నిరంతర ధ్యానం ఉంటే అక్కడ 'వారి' నిరంతర ప్రత్యక్షత, సామీప్యత ఉంటుంది. నిరంతర ప్రత్యక్ష్యత ఉంటే, 'వారి'తో నిరంతరం కనెక్షన్

ఉంటుంది. అందుకనే "అభ్యాసీలు ఎప్పుడూ కూడా నిరంతర స్మరణలోనే ఉండాలి" అని బాబూజీ చాలాసార్లు అనేవారు. స్మరణ అనేది నిరంతరంగా ఎలా ఉంచుకోవాలి? ఎప్పుడూ నీవు స్మరణ అనే గొలుసు యొక్క లింక్‌ను తెగిపోకుండా ప్రయత్నించుకోవాలి. మీరు ఆఫీస్‌కు వెళ్ళుతూ ఉంటే, నేను ఆఫీస్‌కు వెళ్ళుతున్నాను– నేను ఆఫీస్‌కు వెళ్ళుతున్నాను –అని మీరు పదే పదే అనుకోవడం వలన 'వారి' స్మరణ అనే గొలుసు యొక్క లింక్ తెగిపోతుంది. దీనికి బదులుగా మీరు బాబూజీని గురించి ఆలోచించినట్లయితే, ఆ స్మరణ అనే గొలుసు యొక్క లింక్ తెగిపోకుండా ఉంటుంది. అంటే మీరు 'వారి' నిరంతర స్మరణలోనే ఉంటారు. మరల ఆఫీస్‌కు కూడా వెళ్ళతారు. ఏదైనా పని చేసేప్పుడు నేను చేస్తున్నాను, నేను చేస్తున్నాను అని అనుకుంటే నిరంతర స్మరణ అనేది బ్రేక్ అవుతుంది, తెగిపోతుంది. ఏదైనా పని చేసేప్పుడు బాబూజీని గురించే ఆలోచించాలి. 'వారి' స్మరణలోనే ఉన్నట్లయితే సంస్కారాలు అనేవి ఏర్పడవు. అనవసరమైన ఆలోచనలు రావు కాబట్టి, మీ ఆలోచనలను 'బాబూజీ'తో కనెక్ట్ చేయండి. అప్పుడు స్మరణ అనేది నిరంతర స్మరణగా మారుతుంది. చేయవలసిన పనిని గురించి మీరు ఎక్కువగా ఆలోచించకూడదు. ఉదాహరణకు మీరు వంట చేయడానికి వెళ్ళుతున్నారు. దానిని గురించి ఎక్కువగా ఆలోచించకండి. వంట చేయాలి; బాబూజీ మహరాజ్ నా ఎదుటనే కూర్చొని ఉన్నారు; 'వారి' సంతోషం కొరకు వంట చేస్తున్నాను – అని 'వారి' ప్రజెన్స్‌ను, సామీప్యతను ఫీల్ అవుతూ వంట చేసినట్లయితే, అది 'వారి' ప్రసాదంగా మారుతుంది. కాని 'వారి' భౌతిక రూపాన్ని మాత్రం చూడటానికి ప్రయత్నించ కూడదు. నిరంతర స్మరణ ఉంటే మనం 'వారి'తో నిరంతరం 'కనెక్షన్'ను కలిగి ఉన్నట్లే. నిరంతర స్మరణ వలన మనకు రాత్రి, పగలు నిరంతరం 'వారి' ప్రాణాహుతి లభిస్తుంది. అభ్యాసీలు హృదయంతో స్మరించినట్లయితే, ఆ స్మరణ ఒక్కసారిగా మార్పుచెంది, నిరంతర కనెక్షన్‌గా, నిరంతర ధారగా మారుతుంది అని బాబూజీ అన్నారు. అప్పుడు మీకు 'బాబూజీ' పేరు వినిపించగానే మీ హృదయంలో ఏదో జరుగుతున్నట్లుగా, మీ హృదయంలోకి ఏదో ప్రవహిస్తున్నట్లుగా ఫీలింగ్ కలుగుతుంది. అంటే ఇప్పుడు మీకు బాబూజీతో నిజమైన కనెక్షన్ ఏర్పడిందని అర్థం. నిరంతర స్మరణ గురించి బాబూజీ చాలా చక్కటి ఉదాహరణ ఇచ్చారు.

ఒక చిన్న పిల్లవాడు చాలా అనారోగ్యంగా ఉన్నాడు. అర్జంట్‌గా ఈ ఇంజెక్షన్ కావాలి అని డాక్టర్ చెప్పినప్పుడు, వెంటనే మీరు బజారుకు వెళ్ళి, ఆ ఇంజెక్షన్ కొరకు ఒక్కో షాపులో అడుగుతూ ఉన్నప్పటికీ మీ హృదయం మాత్రం ఆ పిల్లవాని దగ్గరే ఉంటుంది. పిల్లవానికి ఎలా ఉంది? ఏమిటి? అని ఆందోళన చెందుతుంది. మీరు చేసే స్మరణ అనేది ఈ విధంగా ఉన్నట్లయితే, ప్రతి పనీ చేస్తారు కాని మీ హృదయం మాత్రం 'వారి' స్మరణలోనే ఉంటుంది. మీ మనస్సు మాత్రమే ప్రాపంచికమైన పనులకు కనెక్ట్ అయి ఉంటుంది. మీ హృదయం బాబూజీతో కనెక్ట్ అయి ఉంటుంది. అంటే మీ హృదయం ప్రాపంచికమైన పనులకు కనెక్ట్ కాకుండా ఉంటుంది.

"ఈశ్వరప్రాప్తి కొరకు సంపూర్ణమైన ఈ సహజమార్గ సిస్టమ్‌ను బాబూజీ ఏ విధంగా కనగొన్నారు?" అనే ఆలోచన నాకు ఒకసారి కలిగినది. అప్పుడు నాకు చాలా మంచి ఊహ తట్టింది. సమస్త మానవాళికి నిజమైన సంతోషాన్ని, నిజమైన శాంతిని, 'ఈశ్వరప్రాప్తి' అనే అత్యున్నతమైన లక్ష్యాన్ని ప్రసాదించాలనే సంకల్పంతోనే బాబూజీ అవతరించారని అనిపించింది. లక్ష్యసాధనకు మార్గం సంపూర్ణమైనదిగా ఉండాలి.

మార్గం అగమ్యం అయితే అత్యున్నత లక్ష్యాన్ని చేరుకోలేము. అందువల్లనే బాబూజీ మనకు ఈ సహజమార్గ్ అనే సంపూర్ణ విధానాన్ని ప్రసాదించారు. ఇది 'వారి' రీసెర్చ్ (పరిశోధన) ఫలితం; సహజమార్గ్ ఆధ్యాత్మికత యొక్క సంపూర్ణమైన విధానం.

నేచురల్ లివింగ్ అంటే సహజ జీవనం. ఇందులోని ప్రతి చర్య కూడా సహజంగానే, దానంతట అదే జరుగుతుంది. కాని ఆ చర్య వెనక వేరే కారణమనేది ఉండదు. బాబూజీ పసిపిల్లవానివలె, ప్రకృతి సహజంగా నవ్వేవారు. అంతేకాని 'వారు' ఏదో ఆలోచించి నవ్వేవారు కాదు. పసిపిల్లవాడు మీ మాటలను అర్థం చేసుకోక పోయినప్పటికీ (హృదయం నుంచి హృదయంలోకి మాటల భావం ప్రవహిస్తుంది.) అప్రయత్నంగానే వాటిని ఫీల్ అవుతాడు. బాబూజీ మన మాటలవలనగాని, లేదా మనలను నవ్వించాలనిగాని, వారు నవ్వేవారు కాదు; చిరునవ్వు అనేది 'వారి'లోని సహజస్వభావం; వారి ముఖారవిందంపై ప్రకాశిస్తున్న ఆ దివ్య హాసాన్ని – దివ్యమైన నవ్వును చూడగానే 'వారు' ఎంతో సంతోషంతో, ఎంతో ఆనందంతో ఉన్నారని మనకు తెలిసేది.

బాబూజీ దశనియమాలలో, మనల్ని సాధారణమైన, సహజమైన జీవితాన్ని గడపమని అన్నారు. "మన సహజమార్గ్ గృహస్థ సంస్థ" –అని బాబూజీ అనేవారు. ఒకవైపు గృహస్థ జీవితం; ఇంకొకవైపు నిరంతర స్మరణ, నిరంతరం కనెక్షన్; ఈ రెండూ కూడా అనగా ప్రాపంచిక జీవితం మరియు ఆధ్యాత్మిక జీవితం, ప్రక్క ప్రక్కనే నడచినప్పుడు మన జీవితం అర్థవంతమైనదిగా అవుతుంది. ఇది ఏ విధంగా సాధ్యం అని నేను ఆలోచించినప్పుడు మనస్సు అనేది ప్రాపంచికమైన పనుల కొరకు, హృదయం అనేది ఆధ్యాత్మికత (ఈశ్వరుని) కొరకు, అవి సహజంగానే మనకు ఇవ్వబడినవి. ఈ రెండూ కూడా సహజరీతిలో, ప్రక్క ప్రక్కనే వెళ్ళినప్పుడు మానవుడు సెయింట్‌వలె మారగలడని అనిపించింది. బాబూజీ –"ఇది ఒక వాస్తవం; మనకు మనస్సు, హృదయం ఎందుకు ఇవ్వబడినవో, వాటి నుండి ఆ విధమైన పనినే తీసుకోవాలి. సహజ జీవనం అంటే ఇదే" అని అన్నారు.

బాబూజీ హిందూ, ముస్లిం, దక్షిణాదివారు, ఉత్తరాదివారు, విదేశీయుడు అనే భేదభావాలు అన్నింటినీ సమాప్తం చేశారు. విదేశాల నుండి వచ్చే అభ్యాసులను అతడు విదేశీ అభ్యాసీ అనే భావన మనస్సులో రాకూడదని 'వారు' అనేవారు. అభ్యాసీ అంటే అభ్యాసీయే. అతడు ఎక్కడి నుండి వచ్చినా సరే! మనం అందరం కూడా 'బాబూజీ' గారి నీడలో ఉండటానికి ఇక్కడ సమావేశమయ్యాము; అంతేకాని అతడు ఆ సెంటర్ అభ్యాసీ, ఇతడు ఈ సెంటర్ అభ్యాసీ, ఫారిన్ అభ్యాసీ అనే భేదభావాలు ఉండరాదు.

ఒక అభ్యాసీ ఎప్పుడూ "బాబూజీ! నాకు సిట్టింగ్ కావాలి. నాకు సిట్టింగ్ కావాలి. నాకు సిట్టింగ్ ఇవ్వండి" అని పదేపదే అడిగేవాడు. అప్పుడు బాబూజీ "భాయీ! ఇది తప్పు. ఈశ్వరుడు నీలోనే ఉన్నాడు. నేను నీ ఎదుటనే ఉన్నాను. నీవు ప్రాణాహుతి ప్రవాహం అనుభూతి చెందుతున్నావు. అయినప్పటికీ ఇంకా సిట్టింగ్ కావాలి, సిట్టింగ్ కావాలి అని అడుగుతున్నావు. నీకు సిట్టింగ్ కొరకు గ్రీడీనెస్ (అత్యాశ) ఉండకూడదు. నీకు ఈశ్వర ప్రాప్తి కోసమై అత్యాశ, తపన ఉండాలి" అని అన్నారు. బాబూజీ మహరాజ్ యొక్క డివైన్ బ్యూటీ (దివ్య సౌందర్యం) ఏ విధంగా ఉంటుంది? ఎప్పుడు 'వారి'ని కలుసుకుంటాం? ఎప్పుడు 'వారి' సాక్షాత్కారం కలుగుతుంది? అనే గ్రీడీనెస్ (అత్యాశ) తపన, మనలో ఉండాలి.

ప్రారంభంలో నా నిరంతర స్మరణ ఏ విధంగా ఉండేది అంటే, నా బాబూజీ షాజహాన్‌పూర్‌లో ఉన్నాడనీ, నా ఆలోచనలు, షాజహాన్‌పూర్‌లో కూర్చొని ఉన్న బాబూజీని తాకుతున్నాయనీ భావించి 'వారి'ని స్మరించేదాన్ని. ఒకసారి నేను "బాబూజీ! నాకు షాజహాన్‌పూర్ అంటే చాలా ఇష్టం. ఎందుకంటే, 'మీరు' అక్కడ నివసిస్తున్నారు కదా! నాకు షాజహాన్‌పూర్‌కు రావాలని ఉంది" అని 'వారి'కి ఉత్తరం వ్రాశాను. అప్పుడు వారు "బిటియా! నేను నీతోనే ఉన్నాను. నీలోనే ఉన్నాను. షాజహాన్‌పూర్ అనే ఆలోచన విడిచిపెట్టు" అని వ్రాశారు. అప్పటినుండి షాజహాన్‌పూర్, లక్నో, ఏ పట్టణమైన సరే వేరు వేరు అనే భావన నాలో ఎప్పుడూ కలగలేదు. అప్పటినుండి షాజహాన్‌పూర్, లక్నో ఏ పట్టణమైన కూడా నాకు ఒక్కటే, బాబూజీనే అని అనిపించేది.

సాధకుడు మరియు సాధన, ధనికుడు మరియు పేదవాడు వీటి మధ్యగల భేదభావాన్ని పూర్తిగా తుడిచివేయడం అనేది బాబూజీ చేసే పనులలో ఒక పని. సహజమార్గ్ సాధనలో నాకు కలిగిన మొదటి అనుభవం ఏమిటంటే, ఒక సేవకుడికి మరియు నాకు, నాకు మరియు ఇతరులకు మధ్యన ఎటువంటి తేడా, హెచ్చుతగ్గులు కనిపించలేదు. మన హృదయాల్లోని ద్వంద్వ భావాలను, భేదభావాలను తొలగించటమే 'వారు' చేసే మొదటి పని అని నాకు ఇప్పుడు అర్థమైంది. మన హృదయంలో భేదభావాలు లేనప్పుడు అక్కడ బాబూజీయే ఉంటారు. ఒకవేళ నీవు హృదయాన్ని కూడా ఫీల్ కావటం లేదు అంటే ఇప్పుడు బాబూజీయే సర్వత్రా ఉన్నారని అర్థం.

"నీవు భగవంతుని గురించి తలచుకుంటే భగవంతుడు నీ ఎదుటనే ఉంటాడు" అని బాబూజీ అనేవారు. 'నేను' చేస్తున్నాను, 'నేను' చేస్తున్నాను అనే ఫీలింగ్ నీలో ఉంటే అక్కడ 'నీవే' ఉంటావు. భగవంతుడు ఉండడు.

నేను 'అనుభవసరిత' అనే పుస్తకంలో ఒకచోట ఈ విధంగా వ్రాశాను. అందులో బాబూజీ అంటారు– "బిటియా! హృదయంలో బాధను ఏర్పరచుకో!" అని. అపుడు నేను "బాబూజీ! గాయం లేకుండా బాధ ఏ విధంగా కలుగుతుంది?" అని అన్నాను. దానికి సమాధానంగా, "బిటియా! గాయంతోనే పూర్తిగా నీ హృదయం నిండిపోయింది. (ఇక్కడ గాయం అంటే సంస్కారం అని అర్థం.) కాని నీవు దానివైపు చూడటంలేదు; ఆ గాయం (సంస్కారాల) వల్లనే నీవు దివ్యత్వం నుండి విడిపోయి ఇక్కడకు వచ్చావు. కాని నీవు ఆ గాయం యొక్క బాధను ఫీల్ కావటంలేదు సరికదా, ఇంకా పెద్ద గాయం (సంస్కారం) ఏర్పరచుకొంటున్నావు" అన్నారు బాబూజీ.

**ప్రశ్న: క్రేవింగ్ (తపన) అనేదానిని ఏవిధంగా ఏర్పరచుకోవాలి?**

**జవాబు:** "బాబూజీ మన హృదయంలో ఉన్నారు" అనే ఫీలింగ్ మనలో ఉంది. అంటే బాబూజీ ప్రజెన్స్ (ప్రత్యక్షత) యొక్క ఫీలింగ్ మనలో ఉంది. 'వారి'ని కలవాలనే వాంఛ (ఫీలింగ్) కూడా మనలో ఉంది. కాని ఎప్పుడైతే సెపరేషన్ (వియోగం లేదా ఎడబాటు) అనే అనుభూతి, బాధ మనలో ఏర్పడుతుందో, అప్పుడే మనలో క్రేవింగ్ (ఎప్పుడు మనం 'వారి'ని కలుసుకుంటామా! అనే తపన) ఏర్పడుతుంది. ఆ వియోగం (సెపరేషన్) వలన హృదయంలో బాధ కలుగుతుంది. వియోగం యొక్క ఆ బాధవల్లనే తపన అనేది ఏర్పడుతుంది.

క్లీనింగ్ వలన సంస్కారాలు తొలగిపోతాయి అనే ఒక భావన అభ్యాసులందరిలో ఉంది. కాని మీరు బాబూజీ మహారాజ్ యొక్క స్మరణ (రిమెంబరెన్స్)లో ఉన్నప్పుడే సంస్కారాలు తొలగిపోతాయి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! 'తపన'ను ఏవిధంగా పెంపొందించుకోవాలి?" అని అడిగినప్పుడు, బాబూజీ కబీరుని గురించి ఒక కథను చెప్పారు. కబీర్ కొడుకు జమాల్. "అందరిలోను క్రేవింగ్ (తపన) ఉంది; నాలో తపన లేదు. ఏ విధంగా క్రేవింగ్‌ను ఏర్పరచుకోవాలి" అని జమాల్ కూడా తన తండ్రి కబీర్‌ను అడిగేవాడు. ఒకరోజున తండ్రీ కొడుకులు ఇద్దరు ప్రక్కప్రక్కనే నదిలో స్నానం చేస్తున్నారు. అప్పుడు కబీర్ ఒక కర్రను నీళ్ళలో నానబెట్టి, ఆ కర్రతో జమాల్ వీపుమీద కొట్టగానే జమాల్, 'హాయ్ రామ్! హాయ్ రామ్!" అని బిగ్గరగా అరచాడు. ఎందుకంటే నీళ్ళలో నానిన కర్రతో కొట్టితే బాగా దెబ్బ తగులుతుంది. అప్పుడు కబీర్ "క్రేవింగ్ (తపన) అంటే ఇదే, ఈ బాధే" అని అన్నాడు.

ఎప్పుడైతే జమాల్‌కు దెబ్బ తగిలిందో, అప్పుడు అతడు బాధతో అరచాడు. అదే విధంగా మనకు సెపరేషన్ (వియోగం) యొక్క బాధ, ఆ ఫీలింగ్ కలగ్గానే, బాబూజీని కలుసుకోవాలి, 'వారి'లో త్వరగా లయం కావాలి, అనే అవేదన చెందుతాం. ఇదే తపన.

ఒకసారి ఒకరు, "బాబూజీ! భగవంతుని యొక్క నిర్వచనం ఏమిటి? అతడు ఎవరు? ఏమిటి?" అని అడిగినప్పుడు బాబూజీ "భగవంతుని యొక్క నిజమైన నిర్వచనం ఏమిటంటే, భగవంతుడు ఏదైతే అయి ఉన్నాడో అదే" అని అన్నారు; మరల అభ్యాసీ, "భగవంతుడు ఎలా ఉంటాడు?" అని అడగ్గానే, 'వారు' "భగవంతుడు ఎలా ఉండాలో అలాగే ఉన్నాడు" అని అన్నారు.

తపన (క్రేవింగ్) యొక్క నిర్వచనం ఏమిటంటే, బాబూజీ నుండి విడిపోయి ఉన్నామనే, ఆ వియోగం (సెపరేషన్) యొక్క బాధయే తపన. అనగా వియేగం (సెపరేషన్) అనే ఫీలింగ్ ఉంటే అది తపన (క్రేవింగ్) అవుతుంది. కాని తపన (క్రేవింగ్) యొక్క ఇంకొక నిర్వచనం ఏమిటంటే, బాబూజీని త్వరగా కలుసుకోవాలి (వారిలో త్వరగా లయం కావాలని) ఆరాటపడటం. కాబట్టి క్రేవింగ్‌కు రెండు నిర్వచనాలు ఉన్నాయి. 1) క్రేవింగ్ (తపన) అంటే వియోగం (సెపరేషన్) వలన కలిగే వ్యథ, బాధ. 2) బాబూజీని త్వరగా కలుసుకోవాలనే తీవ్రమైన కాంక్ష, ఆరాటం.

"నీలో క్రేవింగ్ (ఆవేదనతో కూడిన తపన) ఉన్నట్లయితే అక్కడ భగవంతుడు ఉంటాడు" అని బాబూజీ అనేవారు. క్రేవింగ్ వలన మనం బాబూజీని తప్పకుండా కలుసుకుంటాం. 'వారి' దర్శనం అయిన తరువాత, ఆ తపన (క్రేవింగ్) అదృశ్యమవుతుంది. అది 'వారి'లోనే కలిసిపోతుంది.

"భూల్ గయీమై అప్‌నా ఘర్" (భూమాను చేరుకున్న తరువాత నేను ఎదుటనే ఉన్న నా ఇంటిని అంటే అంతిమ సత్యం కూడా మరచిపోయాను.) అనే ఈ పాటలోని చివరి చరణాలను ఇలా వివరించాను: బాబూజీ నన్ను 'అంతిమ సత్యం' వద్దకు చేర్చి, అక్కడ స్థిరపరచిన తరువాత, "సంధ్యా! ఇప్పుడు వీడ్కోలుకు సమయం అయింది!" అని 'వారు' అనగానే, ఇప్పుడే కదా 'వారి'ని కలుసుకున్నాను. ఎవరికి వీడ్కోలు అని నేను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. ఇప్పుడు ఉలిక్కిపడటం అనేది 'వారి' దివ్య సంకల్పం వంతు అయింది. ఎందుకంటే, నన్ను లక్ష్యం వద్దకు చేర్చగానే, ఆ దివ్య సంకల్పం యొక్క పని పూర్తి అయింది. ఇప్పుడు ఆ దివ్య సంకల్పం, ఇతరులను ఇక్కడకు తీసుకొనిరావడానికి మరల భూమి మీదకు వెళ్ళాలి. లక్ష్యప్రాప్తితో

అభ్యాసీ యొక్క అన్వేషణ (తపన) కూడా పూర్తి అయింది. ఇప్పుడు ఆ తపన కూడా మరల వెనుకకు వెళ్ళిపోవలసిందే. అందువలన ఇప్పుడు బాబూజీ దివ్య సంకల్పం, అభ్యాసీ క్రేవింగ్ (తపన) – ఈ రెండూ కూడా, అయ్యో! బాబూజీ నుండి విడిపోతున్నామే, అనే బాధతో, వెక్కిళ్ళతో ఏడుస్తూ – "బాబూజీ! మీరు అందరికోసం 'అంతిమ సాక్షాత్కారం' అనే ఈ శుభ సమయాన్ని మరల తీసుకొనిరండి. అందువలన మరల మీ దివ్య చరణాలను దర్శించే సౌభాగ్యం మాకు కలుగుతుంది" అని ప్రార్థిస్తున్నాయి.

ఒక అభ్యాసీ "బాబూజీ! కష్టాలతో, సమస్యలతో ఉన్న ఈ పరిస్థితులను ఏ విధంగా ఎదుర్కోవాలి?" అని అడిగినప్పుడు, వారు "నీవు వీటిని గురించి ఆలోచించవద్దు. సమస్యలతో, కష్టాలతో ఉన్న ఈ పరిస్థితుల్ని ఎవరైతే దూరంచేసి దరిచేర్చుకుంటారో ఆ భగవంతుని గుర్తు పెట్టుకో" అని అన్నారు. బాబూజీ యొక్క ఈ మాటలను నేను ఒకసారి పరీక్షించి చూసాను. చాలా సంవత్సరాల క్రితం మా పెద్దక్క మరణించింది. ఆమెకు చిన్న చిన్న పిల్లలు ముగ్గురు ఉన్నారు. ఆ చిన్న పిల్లల్ని ఎలా పెంచాలి? ఎలా పెద్ద చేయాలి అని మేం చాలా దుఃఖంలో ఉన్నాం. ఎందుకంటే, అప్పుడు మాకు ధనం కొఱత కూడా ఉండేది. చాలా కష్టమైన పరిస్థితుల్లో ఉన్నాం. అప్పుడు మా అమ్మ ఒకసారి నాతో – ఈ పరిస్థితుల్ని మనం ఏమీ చేయలేం, అని అనగానే, నాకు అప్రయత్నంగానే, ఒక్కసారిగా బాబూజీ గుర్తుకు వచ్చారు. అప్పుడు మండే గాయం మీద ఒక చల్లటి మందును రాసినట్లుగా అనిపించింది. ఒక్కసారిగా ఆ బాధా, పరిస్థితుల్ని అన్నింటినీ వెంటనే మరచిపోయాను. కేవలం ప్రశాంతత మాత్రమే నాలో ఉంది. ఈ సమస్యలకు, పరిస్థితులకు అన్నింటికీ ఒక సరియైన సమాధానం లభించిందని అప్పుడు అనిపించింది. ఈ పరిస్థితుల్ని, కష్టాలను గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ఏం ప్రయోజనం? ఏమిలేదు; బాబూజీని గుర్తుపెట్టుకోండి. మార్గమధ్యంలో స్కూటర్ ఆగిపోతే నీవు ఏం చేయగలవు? ఏమీ చేయలేవు. మెకానిక్‌ను పిలిస్తే అతడు ఆ స్కూటర్‌ను సరిచేస్తాడు.

**ప్రశ్న: ధ్యానం చేస్తున్నప్పుడు నా నుండి ఏదో వెనుకకు వెళ్ళిపోతూ ఉన్నట్లుగా కనిపిస్తుంది. ఇది సరియైనదా?**

**జవాబు:** ఏదో కనిపిస్తుంది అంటే అది మనస్సు యొక్క క్రియ మాత్రమే. కాని నీవు ధ్యానం చేస్తున్నావు; కేవలం ఒకే ఒక ఆలోచన తీసుకోండి. బాబూజీ మహరాజ్ ఆశీస్సులతో, 'వారి' ప్రాణాహుతితో నా హృదయం పూర్తిగా నిండిపోయి తడిసిపోయింది – అని అనుకోండి. ఏదో కనబడుతుంది అంటే అది బాహ్యామైన విషయం. దాన్ని చూడకండి. ఆ ప్రాణాహుతి యొక్క అనుభూతిలో (ఫీలింగ్‌లో) మునిగిపోండి.

**ప్రశ్న: క్లీనింగ్ చేస్తున్నప్పుడు వెనుక నుండి వెళ్ళిపోయేవాటిని చూడవచ్చునా?**

**జవాబు:** మీ చేతిలో చీపిరి ఉంది. దానితో గదిని శుభ్రం చేస్తారు; అంతేకాని అక్కడ ఏ మురికిపోతోంది? ఎటువంటి చెత్త, చెదారం పోతుంది, అని వాటిని చూడరు. క్లీనింగ్ చేసుకొనేప్పుడు మనలో నుండి బయటకు వెళ్ళిపోయేవాటిని గురించి చూడటానికి ప్రయత్నించరాదు. అలా చూడటాన్ని మానుకోండి. క్లీనింగ్ వలన కలిగే ఫలితాన్ని ఫీల్ కావాలి. అది ముఖ్యం. "అభ్యాసీలు ఏ విధంగా క్లీనింగ్ చేస్తారంటే– క్లీనింగ్ చేసి ఆ చెత్త, చెదారాన్ని అంతా ఒక ప్రక్కన పెడతారు. ఏమాత్రం కొద్దిగా గాలి వచ్చినా మరల ఆ చెత్త చెదారం అంతా లోపలికి వస్తుంది" అని బాబూజీ అనేవారు. అందువలన మనం క్లీనింగ్ కాగానే ఒక్క సెకండ్

అయినాసరే – "నా హృదయం పూర్తిగా స్వచ్ఛంగా, పవిత్రతతో ఉన్నది. 'వారే' నా హృదయంలో పూర్తిగా నిండిపోయి ఉన్నారు" –అని భావించాలి.

**ప్రశ్న: బాబూజీ క్లీనింగ్‌ను విల్ పవర్ (ఇచ్ఛాశక్తి) ఉపయోగించి చేయమన్నారు కదా?**

**జవాబు:** బాబూజీ చెప్పిన మాటలను ఎవరుకూడా అర్థం చేసుకోలేకపోయారు. విల్‌పవర్ (ఇచ్ఛాశక్తి)తో మీరు ఏం చేయగలరు? ఈ ఇల్లు శుభ్రం కావాలని, మీరు విల్‌పవర్‌తో అంటే, ఇది శుభ్రం అవుతుందా? కాదు.

మీ చేతిలో చీపిరి ఉంటేనే ఇంటిని శుభ్రం చేయగలరు. ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ హృదయం నుండి ఈశ్వరీయ ధార లేదా దివ్య శక్తి ప్రవాహం మనలోకి ప్రవహిస్తుందో అప్పుడే మనలోని అనవసరమైన విషయాలు మొత్తం పూర్తిగా తుడిచిపెట్టుకొనిపోతాయి. క్లీనింగ్‌లో వెనుకభాగం నుండి పొగరూపంలో అది పోతుంది, ఇది పోతుంది అని మీరు అనుకొనేకొద్దీ, మీ మనస్సు ఈ ఆలోచనలతోనే బిజీగా ఉంటుంది. కాని క్లీనింగ్ ఫలితాన్ని గ్రహించలేరు.

మనం చేసేసాధన యొక్క ఫలితం ఏమిటి? అనేది ముఖ్యమైన విషయం. **ధ్యానం యొక్క ఫలితం – ఫీలింగ్ (ప్రత్యక్షత మరియు సామీప్యత). క్లీనింగ్ యొక్క ఫలితం – స్వచ్ఛత, పవిత్రత. ప్రార్థన యొక్క ఫలితం – ఆత్మ నివేదన,** కాబట్టి ఫీలింగ్ అనేది ముఖ్యమైనది.

సహజమార్గ సిస్టమ్‌లోని ఒక రమణీయత ఏమిటంటే, దీనిలో నెమ్మది నెమ్మదిగా ఈ చేయటమనేది దానంతట అదే సమాప్తమై పోతుంది. మీరు సహజమార్గ్‌లో చేరతారు; అభ్యాసం చేస్తారు. కాని కొంతకాలం తరువాత మీరు ధ్యానం చేయలేరు; ఎందుకంటే, ఎప్పుడైతే మీరు మీలోపలికి చూస్తారో అప్పుడు అక్కడ మీకు బాబూజీ మహరాజ్ యొక్క ప్రజెన్స్ కనబడుతుంది. మీరు క్లీనింగ్ చేసుకోలేరు; ఎందుకంటే మీలోపల నుండే (ప్యూరిటీ) పవిత్రత బయటకు వ్యాపిస్తున్నట్లుగా మీకే స్వయంగా అనిపిస్తుంది. మీరు ప్రార్థన చేయలేరు; ఎందుకంటే, మిమ్మల్ని మీరు చూసుకున్నట్లయితే, మీ మొత్తం సిస్టమ్ అంతా కూడా సమర్పణా భావంలోనే ఉన్నట్లుగా, ఆత్మ నివేదన ఎప్పుడో జరిగిపోయినట్లుగా తెలుస్తుంది. ఇప్పటివరకు మీరు చేసినటువంటి ధ్యానం, క్లీనింగ్, ప్రార్థనల యొక్క ఫలితానికి ప్రతిరూపంగా మీరు తయారవుతారు.

షాజహాన్‌పూర్‌లో, బాబూజీ ఇంటిలో, ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మీరు ఎప్పుడూ మాతోనే ఉంటారు. మాతోనే మాట్లాడుతూ ఉంటారు; కాని అప్పుడప్పుడు మీరు మధ్య మధ్యన మాయమైపోతుంటారు!" అని అడగగానే వారు, "భాయీ! నేను సాధారణ గృహస్థుడను, అప్పుడప్పుడు కాయగూరలు, సామానులు తీసుకొని రావడానికి బజారుకు వెళ్ళవలసి ఉంటుంది. అందువలన నేను ప్రతిక్షణం నీ ఎదుట ఎలా ఉండగలను? నేను బజారుకు వెళ్ళినప్పుడు నీవు కూడా నాతోపాటుగా వస్తే, అప్పుడు నీలో ఈ ఫీలింగ్ అనేది ఉండదు" అని అతనితో అన్నారు.

బాబూజీని భౌతికంగా అంటిపెట్టుకొని ఉండటంలోనే అతడు ఒక సంతోషాన్ని పొందుతూ ఉండటంతో ఆ బంధం తొలగిపోవటానికిగాను అతన్ని బజారుకు రమ్మన్నారు. అలాగే తనతో 'అసలు' (రియాలిటీ)కూ ప్రయాణం కమ్మన్నారన్న మాట.

భవిష్యత్తులో జరిగే చాలా విషయాలను బాబూజీ చెప్పారు కదా! ఇక్కడ ఇండియాలో ఏం జరుగుతుంది, అని ఒక డెన్మార్క్ సోదరుడు అడిగాడు.

భవిష్యత్తులో జరిగే విషయాలను గురించి బాబూజీ చెప్పారు కాబట్టి ఈ ప్రశ్నకు బాబూజీయే జవాబు చెప్తారు. ఎందుకంటే, ఇది బాబూజీ పని; నా పని కాదు. 'వారి'కి సర్వం తెలుసు. మన అభ్యాసీ సోదర, సోదరీల గురించితప్ప, నాకు ఏమీ తెలియదు. ఈ ప్రపంచంలో ఏవేవో సంఘటనలు జరుగుతున్నాయి. దానికి మీరు ఏం చేయగలరు? అందరి శ్రేయస్సు కొరకు ప్రార్థన చేయటం మాత్రమే మీరు చేయాల్సిన పని. అక్కడ మంచి, చెడు అన్న ప్రశ్నేలేదు. బాబూజీ ఈ ప్రకృతికి మాస్టర్! బాబూజీ ఆ దివ్యశక్తికీ మాస్టర్! ప్రకృతికి ఏది అవసరమో ఆ విధంగా 'వారు' పని చేస్తున్నారు. 'వారి' దివ్య కార్యం మన ఊహకు అందనిది. ఈ సంఘటన ఎందుకు జరిగింది? ఆ విధంగా ఎందుకు జరుగుతూ ఉంది? అని మనం ఎప్పుడు కూడా ఆలోచించకూడదు. ఎందుకంటే, ప్రతీ సంఘటన కూడా ప్రకృతి ఆజ్ఞ ప్రకారమే సంభవిస్తూ ఉంది. ఈ ప్రపంచంలోని వాతావరణ మంతటిని పవిత్రం చేయటానికై మానవునిలో వాస్తవిక సౌందర్యాన్ని, ప్రకృతిలో దివ్య సౌందర్యాన్ని పెంపొందింపజేయటానికై 'వారి' యొక్క ప్రకృతి కార్యం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది.

ఒక చెంపమీద కొట్టితే ఇంకొక చెంపను చూపించమని గాంధీజీ అన్నారు కదా! దీన్ని గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని ఒక అభ్యాసీ బాబూజీని అడిగినప్పుడు వారు, "నేను ఏమైనా పిచ్చివాడినా రెండో చెంప కూడా చూపించటానికి. అసలు ఒక చెంప మీద కొట్టే అవకాశమే ఇవ్వను" అని అన్నారు బాబూజీ.

ప్రేమ – నాపై నీకూ, నీపై నాకూ ఉండాలి; అది పెరగాలి కూడా. కోపం– నాపై నీకూ, నీపై నాకూ ఉండరాదు. అసలు అది పుట్టనేరాదు.

ఒక అభ్యాసీ "బాబూజీ మహరాజ్! నా హృదయం పూర్తిగా ప్రేమతో నిండిపోయింది" అని అనగానే వారు, "బహుశా అందుకే కాబోలు నాకు అక్కడ ఉండటానికి చోటులేదు" అని అన్నారు. "నా హృదయం పూర్తిగా మీ ప్రేమతోనే నిండిపోయింది" అని ఆ అభ్యాసీ అనవల్సింది. ప్రేమ ఉంటే, ఆ ప్రేమను పొందటానికి ప్రియతముడు (బాబూజీ) కూడా అక్కడే ఉంటారన్న విషయాన్ని ఆ అభ్యాసీ మరచిపోయాడు.

ఒక అభ్యాసీ "ప్రపంచంలో అన్ని సంఘటనలు అతివేగంగా జరిగిపోతున్నాయి. అందుకే నేను డెన్మార్క్ నుండి ఇక్కడకు వచ్చాను. నేను అక్కడ నుండి వచ్చేటప్పుడు నా మనస్సులో వేరే ప్రశ్నలు ఏమీ లేవు" అని అనగానే "మీరు బాబూజీ కోసమే ఇక్కడకు వచ్చారు; బాబూజీ మహరాజ్ గురించి వినటానికే నావద్దకు వచ్చారు" అని అన్నాను అతనితో.

బాబూజీ గురించి, సాధన గురించి ఏమైనా అడగండి. నేను ఎందుకు ఈ విధంగా ప్రశ్నలు అడగమని మిమ్మల్ని కోరుతున్నానంటే, బాబూజీ గురించి నేను చెప్పినదంతా మీరు విని, ఎవరైనా మిమ్మల్ని ఏదైనా ప్రశ్న లేదా ఏదైనా సమస్య గురించి అడిగినా, వాటికి జవాబు చెప్పటానికి మీరు సిద్ధంగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. ఎవరైనా బాబూజీని గురించి అడిగితే, వెంటనే మీరు ముందుకు వెళ్ళి కూర్చొని జవాబు చెప్పాలి.

ఒక సోదరుడు – "చాలా మంది అభ్యాసులు బాబూజీని చూసి ఉండరు; అప్పుడు ఈ సంస్థలో చేరి కూడా ఉండరు. రాబోయే తరాల వారికి బాబూజీని గురించి తెలియాలంటే, కేవలం బాబూజీ పుస్తకాలు, బెహెన్‌జీ వ్రాసిన పుస్తకాలు, ఆమె సంభాషణల వలన మాత్రమే తెలుస్తుంది. కాబట్టి మనమందరం ఇప్పుడు ఇక్కడ సమావేశమయ్యాము కనుక, బెహెన్‌జీని ప్రశ్నలు అడిగి తెలుసుకోవాలి" అని అంటూ ఉండగా, వెంటనే నేను ఇలా చెప్పాను: "నేను గమనించింది ఏమిటంటే, బాబూజీ యొక్క ప్రకృతి కార్యం ఏ విధంగా ఉన్నదంటే బాబూజీ అంటే ఎవరు? ఏ విధంగా ఉంటారు? అనే దాన్ని స్వయంగా రాబోయే కాలమే చెప్తుతుంది. బాబూజీ చేసే వర్క్ (పని), వారు నిర్వహించే కార్యం కేవలం మన అభ్యాసీలకు మాత్రమే కాదు. 'వారి' దివ్య కార్యం సమస్త మానవాళిమీద, సమస్త విశ్వపు వాతావరణం మీద కూడా ఉంది – మానవుని దివ్యునివలె మార్చాలని, వాతావరణం అంతా కూడా ఎంతటి దివ్యత్వంతో నిండిపోవాలంటే, శ్వాస పీల్చుకుంటే, దివ్యత్వమే శ్వాసగా రావాలి అని. కాబట్టి రాబోయే కాలం, 'వారి' దివ్యప్రేమతో ఎంతగా నిండిపోతుందంటే, బాబూజీ అంటే ఎవరో 'వారి' గురించి, స్వయంగా ఆ కాలమే చెప్తుతుంది. ఎందుకంటే, 'వారి'ని గురించి మానవుడు ఎప్పటిదాకా చెప్పగలడు – కేవలం అతడు జీవించి ఉన్నంతవరకు మాత్రమే కదా! ఈ వాతావరణంలోని చెడు, అపవిత్రత అనేది తుడిచివేయబడుతుంది; కాని బాబూజీ మహరాజ్ వాణి నుండి వెలువడిన దివ్యవాక్కులు మాత్రం ఈ వాతావరణంలో శాశ్వతంగా ఉంటాయి. అందువల్లనే మనం బాబూజీని గురించి మాట్లాడుకుంటే చాలు, అక్కడ ఈ ఈశ్వరీయ ధార వ్యాపిస్తుంది. కాబట్టి రాబోయే తరాలవారు, సహజమార్గ్ గురించి స్వయంగా వాళ్ళే తెలుసుకుంటారు. దానికి ప్రచారం చేయవలసిన అవసరంలేదు" అని.

ఒకసారి ఒక విదేశీయుడు (అభ్యాసీకాదు) "బాబూజీ! మనిషి నవ్వినప్పుడు ఎదుటివారిని ఆకర్షిస్తాడు. మనిషి కోపంగా మాట్లాడితే ఎదుటివారు దూరంగా పోతారు, ఎందుకని?" అని అడిగాడు. అప్పుడు బాబూజీ, "ఎవరైనా మనిషి ప్రేమతో నవ్వినప్పుడు అతని వ్యక్తిత్వం వికసిస్తుంది, వ్యాప్తి చెందుతుంది. అంటే అతడు బాండేజ్ (బంధనాల) నుండి విడిపోయి బయటకు వస్తాడు. పవిత్రతతో ఉంటాడు. అందువలన ఇతరులు ఆకర్షింపబడతారు. కాని ఎవరైనా కోపంగా ఉన్నప్పుడు, అతడు బంధనాలకు పరిమితమైపోతాడు. పవిత్రతా వెలుగు ఉండదు. అందువలన ఇతరులను ఆకర్షింపలేడు" అని అన్నారు. మరల –"ఇప్పుడు చూడండి. బాంబులు తయారుచేసే వారినే సైంటిస్ట్ అంటారా? నేను సైంటిస్ట్‌ను కాదా?" అని అన్నారు. ఆధ్యాత్మికత సైన్స్‌కు తల్లి వంటిది అని 'వారు' అనేవారు.

"బాబూజీ మహరాజ్ అందరికొరకు షాజహాన్‌పూర్‌లో ఆశ్రమం నిర్మించారు. మీరుగాని, మేముగాని, పోని మన అందరం కలిసిగాని ఇప్పుడు ఆశ్రమానికి వెళ్ళగలమా? బాబూజీ ఉన్నప్పుడు అది ఏ విధంగా కళకళలాడుతూ ఉండేదో ఆ సమయం మరలా వస్తుందా?" అని ఒక అభ్యాసీ వ్యథతో అన్నాడు. అప్పుడు నేను ఇలా అన్నాను: "తప్పక వస్తుంది; మనందరం కలసి షాజహాన్‌పూర్ లోని ఆశ్రమానికి తప్పకుండా వెళ్ళతాము. బాబూజీ మహరాజ్ అక్కడ కుర్చీలో కూర్చొని ఉంటారు. 'వారి' చుట్టూ మనందరం కూర్చోనే రోజు తప్పక వస్తుంది. ఆశ్రమం మనదే" అని.

ఒకరోజు బాబూజీ నాకు ఒక మంచి మాట గురించి చెప్పి, దానిని నీవు అభ్యాసులకు చెప్పాలి అని అన్నారు. ఒకసారి దక్షిణ భారతదేశానికి చెందిన 8 మంది అభ్యాసులు, రైలు ఆలస్యం కావటంవలన సరిగ్గా రాత్రి 11 గంటలకు షాజహాన్‌పూర్ ఆశ్రమానికి చేరుకున్నారు. "రాత్రి 10 గంటలు దాటిన తరువాత ఎవరు కూడా లోపలికి రావటానికి అనుమతి లేదు. అందువలన గేటు తీయటానికి అనుమతించరు" అని గేట్‌కీపర్ ఆ వచ్చిన వాళ్ళతో అన్నాడు. అప్పుడు ఆ 8 మంది అభ్యాసులు చేసేది ఏమీలేక బాబూజీ ఇంటికి వెళ్ళి, ఆ రాత్రి అక్కడే ఉన్నారు. ఉదయాన్నే బాబూజీ ఆ అభ్యాసుల నందరినీ తీసుకొని ఆశ్రమానికి వచ్చి, ఆ గేట్ కీపర్‌ను పిలిపించి, అతనితో "భాయీ! ఒకవేళ నీవు గేటు తీయకుండా, నన్ను ఆశ్రమం లోపలికి ఆ రాత్రి ఆ సమయంలో రానివ్వకుండా చేస్తే, నీవు చేసిన పనిని కరక్టే అని అంటాం. ఎందుకంటే ఈ ఆశ్రమం అభ్యాసులు, వారి ధనంతో, వారి శ్రమతో నిర్మించుకున్నారు. ఇందులో నా ధనం ఏమీ లేదు. నా పరిశ్రమ కూడా ఏదీ లేదు. ధనం, శ్రమ అంతా అభ్యాసులదే. మరి ఎందుకని నీవు ఈ అభ్యాసుల్ని ఆశ్రమంలోనికి రానివ్వలేదు? ఈ ఆశ్రమం ఈ అభ్యాసులది. ఇలాంటి అభ్యాసుల కొరకే ఈ ఆశ్రమం ఉంది" –అని అన్నారు.

కాబట్టి ఆ షాజహాన్‌పూర్ ఆశ్రమం మనది. మనమందరం అక్కడకు వెళ్ళతాము. 'వారు' కుర్చీలో కూర్చోగా, 'వారి' చుట్టూ మనం కూర్చొని, 'వారి' మాటల్ని వింటాము.

మానవుడు ఈ భౌతిక ప్రపంచంవైపు మరలినప్పుడు అతడు 'పరిమితం' అవుతాడు. కాని మానవుడు ఆధ్యాత్మికతవైపు మరలినప్పుడు 'అపరిమితం' అవుతాడు. ఎందుకంటే, ఆధ్యాత్మికత అనేది అపరిమితమైనది. అది అనంతం కాబట్టి దానికి పరిమితులు లేవు.

బాబూజీ ఇంటిలో క్రొత్తగా ఒక ఫోన్ పెట్టినప్పుడు, 'వారు' "బిటియా! ఇది చూడటానికి చాలా బాగుంది. మొదటి ఫోన్‌ను నేను చేస్తాను" అని అన్నారు. ఆ తరువాత బాబూజీ ఆశ్రమానికి ఫోన్‌చేసి – "భాయీ! అభ్యాసులకు రేపు ఉదయానికి సరిపోయే పాలు ఉన్నాయా? లేకపోతే నేను ఇక్కడ నుండి పంపిస్తాను" అని ఫోన్‌లో మాట్లాడారు.

"మేమందరం ఏవో కొన్ని ప్రశ్నలు అడగాలని ఇక్కడకు వస్తాం. కాని మీ ఎదుటకు రాగానే ప్రశ్నలన్నింటికి దానికి అవే సమాధానాలు లభించాయి" అని ఒక సోదరి అనగానే, "మీరు బాబూజీ ఎదుటకు వచ్చారు. నా ఎదుటకు కాదు" అని అన్నాను. వెంటనే ఆ సోదరి, "మీలో బాబూజీ ఉన్నారు కదా!" అని అన్నది. నేను అపుడు, "నేను నాలోని బాబూజీని బయటకు చూపిస్తున్నాను. మీరు చూపించటం లేదు. మీరు బాబూజీని మీలోపల దాచుకొని మిమ్మల్ని మీరు బయటకు చూపించుకొంటున్నారు. మీరు మీలోపలే దాక్కొని, బాబూజీని బయటకు చూపించండి" అని అన్నాను.

**ప్రశ్న: లాలాజీ సాహెబ్ బాబూజీలో మెర్జ్ (విలీనం) అయ్యారని అంటారు. మరల విడిగా బాబూజీ లాలాజీని పిలిచి ఏదో అడుగుతారు. ఆ తేడా ఏమిటి?**

**జవాబు:** బ్రైటర్‌వరల్డ్ (తేజో మండలం)లో లిబరేటడ్ సోల్స్ (విముక్తి ఆత్మలు) ఉంటాయి. వారికి ఏ పనిని అయినా చేయగల స్వాతంత్ర్యం ఉంటుంది. ఎవరైనా డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) భూమిమీద

అవతరించినప్పుడు, లిబరేటెడ్ సోల్స్ వారిని గుర్తించి, ఆ దివ్య పురుషునితో కలిసి వర్క్ (పని) చేయడానికి ఇష్టపడతాయి.

లాలాజీ సాహెబ్ ప్రార్థనచేసి 'బాబూజీ'ని 'అంతిమం' నుండి అవతరింపజేసారు. మెర్జింగ్ (విలీనం) అనేది శరీరానికి సంబంధించినది కాదు. శక్తికి సంబంధించినది. బాబూజీ ఆరు రోజుల పసిపిల్లవానిగా ఉన్నప్పుడు, ఒకవేళ 'అంతిమం' నుండి ఆ శక్తి సంపూర్ణంగా ఆ దివ్య బాలకునిలో ప్రవేశించితే, ఆ శరీరం నిర్జీవం అవుతుంది. అందువల్లనే లాలాజీ సాహెబ్ శక్తియుతంగా ఆ దివ్య బాలకునిలో ప్రవేశించి, బాబూజీ శరీరాన్ని కాపాడారు. బాబూజీలోని శక్తులన్నీ పూర్ణరూపంలో వికసించగానే బ్రైటర్ వరల్డ్‌లో ఉన్న లాలాజీ సాహెబ్, డివైన్ పర్సనాలిటీ (బాబూజీ)తో కలిసి పని చేయటానికి, బాబూజీని అన్నివిధాల కాపాడటం కొరకు– "నీవు ఈ ప్రదేశానికి వెళ్ళు, ఈ సత్రం విడిచిపెట్టు, ఇక్కడ దొంగలు ఉన్నారు" అంటూ చెప్పేవారు. లాలాజీకి బాబూజీపట్లగల దివ్యప్రేమ వలన, 'వారి'కి క్షణక్షణం అవసరమైన సలహాలను ఇచ్చి, 'వారి'ని అనుక్షణం కాపాడేవారు. ఒక విధంగా చెప్పాలంటే, ఆ డివైన్ పర్సనాలిటీ (బాబూజీ) లాలాజీ యొక్క సేవను స్వీకరించారు. "మేము కూడా నీకు సేవ చేస్తాము" అని స్వామి వివేకానంద కూడా అనేవారు. బ్రైటర్‌వరల్డ్‌లో ఉన్న ఈ లిబరేటెడ్ సోల్స్‌కు (లాలాజీ సాహెబ్, స్వామి వివేకానంద వంటి మహాత్ములకు) డివైన్ పర్సనాలిటీ (బాబూజీ)కి సేవ చేసేటటువంటి స్వాతంత్ర్యం, అధికారం ఉంటాయి.

బాబూజీలో నాకు సంపూర్ణ లయావస్థ ఏర్పడినది అని 'వారు' నాతో అన్నారు. అంటే బాబూజీ నాలో సంపూర్ణంగా ఉన్నారని అర్థం. బాబూజీతో నాకు సంపూర్ణ లయావస్థ ఉన్నప్పుడు, బాబూజీ మహరాజ్ వేరుగా, నా ఎదుట కూర్చొని ఉన్నారని, నేను ఎందుకు భావిస్తున్నాను? ఎందుకంటే, 'వారు' నాకు గైడెన్స్ (మార్గదర్శకత్వం) ఇవ్వటానికి అని. నేను బాబూజీలో సంపూర్ణంగా లయమయ్యాను కదా! అని ఆలోచిస్తూ, ఈ భావంలోనే ఉంటే మేము వర్క్ (పని) చేయలేము. అందువలన వర్క్ (పని) చేయటానికి బాబూజీ మహరాజ్‌ను నా ఎదుట కూర్చోబెట్టుకోవాల్సినదే! అనగా ఇక్కడ ఏకత్వం మరియు వేర్పాటు రెండూ ఉన్నాయి. బాబూజీ ఒక దాన్ని (అంటే బాబూజీలో కలిసిపోయి ఉన్న కస్తూరీ అనే ఒకదాన్ని) రెండుగా (బాబూజీ మరియు కస్తూరీగా) చేస్తారు. అప్పుడే మేము పని చేయగలుగుతాం. ఇది దివ్య ప్రేమ, మానవ ప్రేమ కాదు. దీనిలోని ప్రత్యేకత ఏమిటంటే, 'వారి' సేవ చేయటానికి, 'వారే' నన్ను 'వారి' నుండి వేరుచేసి 'వారి' వర్క్‌ను చేయించుకుంటారు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మీరు మాటి మాటికి లాలాజీ సాహెబ్‌ను ఎందుకు పిలుస్తారు?" అని అడిగాడు. అప్పుడు బాబూజీ –"నేను చాలా చిన్నవాడిని. నేను 'వారి'ని పిలవగలనా? నాకు ఎప్పుడు, ఏం చెప్పాలో అని, వారే (లాలాజీ సాహెబ్‌యే) స్వయంగా నా ఎదుట ఎప్పుడూ ప్రత్యక్షమై ఉంటారు" అని అన్నారు.

నేను నా అభ్యాస సమయంలో బాబూజీ మహరాజ్ ద్వారా విన్నటువంటి మాటలు, విషయాలు ఏవైతే నేర్చుకున్నానో వాటిని మీ అందరికి చెప్పాలని అనుకుంటున్నాను. ఇవి మీకు సాధనలో చాలా ఉపయోగపడతాయి.

బాబూజీ ఎక్స్‌పాన్షన్ (వ్యాప్తి, వ్యాపనం) అనే ఒక పదాన్ని వాడేవారు. రబ్బర్ బెలూన్‌లాగా సాగతీయవచ్చు. భౌతిక హృదయం అనేది ఒక పరిమితికిలోనై ఉంది. కాని ఆధ్యాత్మిక హృదయం అనేది విరాట్ హృదయం. అది అపరిమితంగా, అనంతంగా ఎక్స్‌పాన్షన్ (వ్యాపనం) చెంది ఉంటే, ఆ విరాట్ హృదయంతో కనెక్షన్‌ను కలిగి ఉన్నది. కాని మనం మన హృదయాన్ని, ఆ విరాట్ హృదయంతో ఎందుకు కలపలేకపోతున్నాం? ఎక్కువ లాభాన్ని పొందేచోట మనం తక్కువ లాభాన్నే ఎందుకు పొందుతున్నాం? దీనికి కారణం ఏమిటంటే, మనం ధ్యానంలో కూర్చున్నప్పుడు లేదా నిరంతర స్మరణలో ఉన్నప్పుడు, బాబూజీ మహరాజ్ యొక్క ట్రాన్స్‌మిషన్ మన హృదయంలోకి వస్తుందని, మనం అనుకుంటాం. కాని ఇక్కడ, మనం హృదయం అంటే భౌతిక హృదయం అనీ, అది చాలా చిన్నదీ, అనే భావన మనలో ఉన్నది. అందువలన మనకు తక్కువ లాభం కలుగుతోంది. కాని నిజానికి ట్రాన్స్‌మిషన్ ఆధ్యాత్మిక హృదయంలోకి ప్రవేశిస్తుంది.

ఇప్పుడు మనం మన హృదయాన్ని ఏ విధంగా ఎక్స్‌పాన్షన్ (వ్యాప్తి) అయ్యేట్లుగా చేయాలి? మనం ధ్యానంలో కూర్చున్నప్పుడు, బాబూజీ మహరాజ్ హృదయం నుండి ఈశ్వరీయ ప్రవాహం మన హృదయంలోకి ప్రవేశిస్తుంది అని మనం భావిస్తాం. ఇప్పుడు చేయవలసినది ఏమిటంటే, మనం మన హృదయాన్ని ఒక బిందువుగా  లేదా ఒక లిమిటెడ్ (పరిమితమైనది)గా చిన్న ఆకారంతో ఉన్న భౌతిక హృదయంగా భావించకుండా, ఈ 'మొత్తం సిస్టమ్'ను హృదయంగా భావించాలి. కళ్ళు మూసుకొని ఈ సంపూర్ణ హృదయం (అనగా మొత్తం సిస్టమ్) అంతా కూడా 'వారి' ట్రాన్స్‌మిషన్‌లోనే మునిగిపోయి ఉన్నదని భావించాలి. ఎక్స్‌పాన్షన్ (వ్యాప్తి) అంటే ఇదే.

ప్రతి మానవునికి ఒక మానవీయ హృదయం అనేది ఇవ్వబడినది. కాని ఆ మానవీయ హృదయం అనేది ఈశ్వరీయ హృదయంతోనే కనెక్షన్ కలిగి ఉంది.

ఎప్పుడైతే మీరు ధ్యానంలో, ఈ హృదయం (మొత్తం సిస్టమ్) ఆ ఈశ్వరీయ హృదయంతో కనెక్షన్ కలిగి ఉన్నదని అనుకుంటారో, అప్పుడు మీకు ట్రాన్స్‌మిషన్, అనంతంగా వ్యాపించి ఉన్న బాబూజీ విరాట్ హృదయం నుండే లభిస్తుంది. అప్పుడు మీకు ఎక్కువ లాభం కలుగుతుంది. అందువలన మనం ఈ విధంగా ధ్యానం చేయటానికి ప్రయత్నం చేయాలి. కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చోగానే, హృదయం అంటే ఒక బిందువు అని భావించకుండా, ఈ 'మొత్తం హృదయం' అనగా ఈ 'మొత్తం సిస్టమ్' అంతా కూడా పూర్తిగా బాబూజీ యొక్క ట్రాన్స్‌మిషన్‌తో, బాబూజీ యొక్క గ్రేస్ (కృప)తో నిండిపోయినదని భావించాలి. దీనివలన మీకు ఎక్కువ ఉపయోగం కలుగుతుంది. అంటే 100 రెట్లు మీకు ఎక్కువగా ఉపయోగం కలుగుతుంది. ఈ విధంగా హృదయం అంటే చిన్న కొలత కలది కాదు, హృదయం అంటే మొత్తం సిస్టమ్ అని అర్థం. మన హృదయం బాబూజీ విరాట్ హృదయంతో కనెక్షన్‌ను కలిగి ఉన్నదనే భావన కలిగి ఉన్నప్పుడు, ఆ ఫీలింగ్ మీలో అభివృద్ధి చెందుతుంది. ఫీలింగ్‌వలన కనెక్షన్ అభివృద్ధి చెందుతుంది. అప్పుడు ఎక్కువ లాభం కలుగుతుంది. "ఎప్పుడైతే అభ్యాసీ హృదయంలో ఈ ఎక్స్‌పాన్షన్ (వ్యాప్తి) ఉంటుందో అప్పుడు అతనిమీద వర్క్ (పని) చేయటానికి నాకు చాలా ఆనందంగా, సులభంగా ఉంటుంది. ఎందుకంటే, అభ్యాసీ యొక్క దృష్టి, అభ్యాసీ యొక్క హృదయం ఒక పరిమితమైన బిందువును విడిచిపెట్టి, అపరిమితమైన

ఆ విరాట్‌లో ప్రవేశిస్తుంది కాబట్టి. అతని ప్రోగ్రెస్ నేను ఏ విధంగా కోరుకుంటానో అదే విధంగా ఉంటుంది. అందువలన నాకు చాలా సంతోషంగా ఉంటుంది" అని బాబూజీ అనేవారు.

ఇప్పటివరకు మనం మన సంతోషాన్ని గురించి ఆలోచిస్తున్నాం. ధ్యానంలో చాలా బాగుంది, చాలా ఆనందంగా ఉంది -అని మనం అంటాం కాని బాబూజీ ఎప్పుడు ఆనందిస్తారు? ఎప్పుడైతే మీ పూర్తి హృదయం (మొత్తం సిస్టమ్) 'బాబూజీ' చరణాలకు సమర్పించి, మీరు మీ హృదయాన్ని కూడా మరచిపోయి, ఈ హృదయం (మొత్తం సిస్టమ్) బాబూజీది అని అనుకున్నప్పుడు, వారు ఎంతగా అనుకుంటే అంతగా దానిని ట్రాన్స్‌మిషన్‌తో నింపుతారు.

సహజమార్గ్‌ను గురించి ఎవరైనా తెలుసుకోవాలంటే కేవలం అనుభవం ద్వారానే తెలుసుకోగలరు. అనుభవం ద్వారానే ఈశ్వరుని తెలుసుకోగలం, ఈశ్వరుని పొందగలం, అని మహాత్ములు అంటారు. అదే విధంగా సహజమార్గ్ అనే ఈ డివైన్ సిస్టమ్ (దివ్య పద్ధతి)ని కేవలం అనుభవం ద్వారానే తెలుసుకోగలం. ఈ సహజమార్గ్‌లో ఎటువంటి బ్యూటీ (సౌందర్యం) ఉన్నది; బాబూజీ మహరాజ్ ఈ డివైన్ సిస్టమ్ ద్వారా ఎటువంటి దివ్య స్థితులను ప్రసాదిస్తున్నారు; ఎటువంటి లాభాన్ని చేకూర్చుతున్నారనేది మీరు కేవలం మీ అనుభవం ద్వారానే తెలుసుకోగలరు.

ఎప్పుడైతే నేను నా హృదయాన్ని పూర్తిగా మరచిపోయి, ఈ హృదయం 'వారి'ది, ఈ హృదయం (మొత్తం సిస్టమ్) 'వారి' చరణాలకే సమర్పించబడినది అనే అనుభవం నాలో కలిగిందో, అప్పుడు బాబూజీ- "బిటియా! ఈ రోజు నేను చాలా ఆనందంగా ఉన్నాను. ఎందుకుంటే, నా హృదయం ఏ విధంగా కోరుకొంటున్నదో ఆ విధంగా నీవు ప్రోగ్రెస్‌ను పొందుతున్నావు" అని నాతో అన్నారు. కాబట్టి మీరు కూడా మీ హృదయాన్ని వారికి సమర్పించి, ఇంక దానిని మరచిపోయి, "బాబూజీ! ఈ హృదయం (మొత్తం సిస్టమ్) మీది; మీరు ఎంత కోరుకుంటే అంతగా ట్రాన్స్‌మిషన్‌తో నింపండి. ఈ హృదయం (మొత్తం సిస్టమ్) మీ చరణాలవద్దనే ఉన్నది" - అని ఈ భావంలో మునిగిపోయి మీరు ధ్యానం చేసినట్లయితే, మీకు చాలా లాభం ఉంటుంది.

డాక్టర్ పార్థసారథిగారు నాకు ఒక ఉత్తరంలో "ఇన్ని సంవత్సరాల తరువాత నాకు, అభ్యాసుల హృదయాలలో 'ఎక్స్‌పాన్షన్' (వ్యాప్తి చెందటం) కనిపించింది. నాకు చాలా సంతోషంగా ఉంది" అని వ్రాశారు. ఇది వారు చేసిన పరిశ్రమకు ఫలితం కాబట్టి మీరు కూడా ఈ విషయాన్ని అర్థం చేసుకొని, ధ్యానంలో లీనమైతే ఎక్కువ లాభం కలుగుతుంది అని గ్రహించాలి. తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాన్ని పొందే విధంగా మీరు ధ్యానం చేయాలి.

ఇప్పుడు ఇంకొక విషయం ఏమిటంటే, ఎప్పుడు మనం ధ్యానంలో ఎక్కువ ఫలితాన్ని పొందగలం? సాధారణంగా మన ధ్యానంలో ఎటువంటి ఆలోచనలు వచ్చాయి? ఎంత సంతోషంగా ఉంది. ఎంత తేలికదనంగా ఉంది - అని మనం ఆలోచనలనే గమనిస్తూ ఉంటాం. కాని అనుభవం ఏమని చెప్తుతుందంటే, నీవు ధ్యానంలో కూర్చున్నప్పుడు నీకు ఎటువంటి ఫీలింగ్ కలిగిందో, దానిని గమనించు, ఆలోచనలను కాదు అని చెప్తుతుంది. ధ్యానంలో మాకు లైట్‌నెస్ (తేలికదనం)గా ఉందని అభ్యాసులు చెప్తుతారు. కాని దాని అర్థం ఏమిటో కూడా వాళ్ళకు తెలియదు.

లక్ష్యాన్ని పొందటానికై ఎవరైతే సిన్సియర్‌గా, వాస్తవంగా ధ్యానం చేస్తారో, ఆ అభ్యాసీకి, ధ్యానం ఎక్కడ నుండి ప్రారంభం అయింది, ఎక్కడ ప్రవేశించింది, ఎంత లోతుగా ఉంది, ఎంత సూక్ష్మంగా ఉంది, ఎటువంటి ఫీలింగ్ కలిగింది అనే విషయాలన్నీ తెలుస్తాయి. మనం ఈ విషయాలను గమనించక, మనకు వచ్చే ఆలోచనలనుబట్టి ధ్యానం ఏ విధంగా ఉంది అని నిర్ణయిస్తాం. ఆలోచనలు వస్తే ధ్యానం సరిగా కాలేదు అని అంటాము. ఆలోచనలు రాకపోతే ఈ రోజు ధ్యానం చాలా బాగుంది అని అంటాము. ఎప్పుడైతే ధ్యానంలో, ఎక్కడో ఒకచోట, మిమ్మల్ని మీరు మరచిపోయినట్లుగా అనిపించినట్లయితే అనగా ధ్యానంలో మీకు ఆనందం అనే ఫీలింగ్ కలిగితే, ఆ ఆనందంలో మునిగిపోయినట్లుగా, ఆ ఫీలింగ్‌లో మిమ్మల్ని మీరు కోల్పోయినట్లుగా, మరచిపోయినట్లుగా మీకు అనుభవం కలిగితే, ఇప్పుడు మీ ధ్యానం అనేది సరియైన మార్గంలో ప్రవేశించినదని అర్థం. అక్కడ నుండి అది పురోగమించటమే ఉంటుంది కాని, మరల ఎప్పుడు కూడా వెనుకకు రావడం అనేది ఉండదు. దీనినే బాబూజీ 'ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్' (మరపుస్థితి) అని అన్నారు. ధ్యానంలో మనం 'నేను' అనే దానిని మరచిపోవాలి. ఈ మరచిపోవటం అనేది ధ్యానంలో సహజంగానే రావాలి. దానికోసం మనం ప్రయత్నించకూడదు.

1. ఎక్స్‌పాన్షన్ (హృదయం అపరిమితంగా వ్యాపించటం) 2. ఫర్‌గెట్‌ఫుల్‌నెస్ (తనను తాను మరచిపోవటం). ఎప్పుడైతే ఈ రెండిటి యొక్క అనుభవం మనకు కలుగుతుందో అప్పుడే మన అనుభవాలను ఆధ్యాత్మిక అనుభవాలుగా భావించాలి. నాకు ధ్యానంలో చాలా సంతోషంగా ఉంది; ఆలోచనలు వచ్చాయి అని అభ్యాసీ చెప్పితే, బాబూజీ వీటిని పెద్దగా అంగీకరించరు. కాని ఎప్పుడైతే మీకు ధ్యానంలో 'ఫర్‌గెట్‌ఫుల్‌నెస్' యొక్క అనుభవం కలుగుతుందో, ఎలా అంటే మనం ఎక్కడికో వెళ్ళినట్లుగా ఉంటుంది. బాబూజీ జ్ఞాపకం రాగానే మనలను మనం ఎక్కడో కోల్పోయినట్లుగా ఉంటుంది. మరల – నేను ఉన్నాను – అనే జ్ఞాపకం రాగానే, మరల మనకు బాహ్యస్మృతి రాగానే, ఇప్పటివరకు నేను ఎక్కడికో వెళ్ళిపోయాను, నన్ను నేను మరచిపోయాను అనే విషయం మీకు అప్పుడు తెలుస్తుంది. 'ఫర్‌గెట్‌ఫుల్‌నెస్' అంటే ఇదే. "ఇదే సరియైన ధ్యానం. ధ్యానంలోకి లోతుగా (డీప్‌గా) వెళ్ళండి" అని బాబూజీ అనేవారు.

**ప్రశ్న: ధ్యానంలో ఈ ఫర్‌గెట్‌ఫుల్‌నెస్ రావటానికి ఎంత సమయం పడుతుంది?**

**జవాబు:** అభ్యాసీ అనేవాడు సమయాన్ని చూడడు. ఎప్పుడైతే ఒక లక్ష్యం పొందాలని మనం బాబూజీ దగ్గర చేరామో, సహజమార్గ్ సిస్టమ్‌ను అనుసరిస్తున్నామో, బాబూజీ చరణాలను శరణు కోరామో అప్పుడు మనకు సమయంతో పనిలేదు. కేవలం – బాబూజీని త్వరగా పొందాలనే ఒకే ఒక తపన మాత్రమే మీలో ఉండాలి. "సహజమార్గ్ సిస్టమ్‌ను అనుసరించటం వలన మీకు ఈశ్వరుడు తప్పక లభిస్తాడు" అని బాబూజీ చెప్పారు. 'అక్కడ'కు తీసుకొని వెళ్ళటానికి 'వారు' మనకోసం వేచి ఉన్నారు. ఎంత సమయం, ఏమిటి అనేది మనకు అవసరం లేదు. నిరంతర స్మరణలో సమయం యొక్క అర్థం ఏమిటంటే, సమయం అనేది నిరంతరం కూడా 'వారి' స్మరణతోనే ముడిపడి ఉండాలి. మనం ఏ పనిని చేసినా 'వారి' నిరంతర స్మరణలోనే 'వారి' సంతోషం కొరకే చేయాలి. ప్రారంభంలో మనం 'వారి' సంతోషం కొరకే పని చేస్తున్నామని అనుకుంటాము. కాని పనిచేస్తూ, ఎప్పుడైతే మనల్ని మనం మరచిపోతామో, ఆ పని తరువాత, మన జ్ఞాపకం రాగానే ఇప్పుడు 'వారు' ఆనందంగా ఉన్నారని – మనకు అనిపిస్తుంది.

**ప్రశ్న: మీరు బాబూజీతో చాలా సంవత్సరాలుగా ఉన్నారు కదా! బహుశా మీ జీవితమంతా పూర్తిగా 'వారి'తోనే ఉన్నారు కదా!**

**జవాబు:** ఎప్పుడైతే సృష్టి ప్రారంభమైనదో అప్పటినుండి కూడా నేను 'వారి'తోనే ఉన్నాను. అప్పటినుండి ఎప్పుడూ కూడ విడిపోలేదు. "మీరు ఎన్ని సంవత్సరాలు బాబూజీతో ఉన్నారు" అని ఒక సోదరి నన్ను అడగ్గా నేను ఇలా చెప్పాను: "ఈ జన్మలోనైతే 22 సం॥ల వయస్సు నుండి నేను బాబూజీతో ఉన్నాను. 'వారి'తో కలిసి లేకుండా నేను ఏ జన్మలో కూడా లేను. ప్రతిజన్మలోను నేను 'వారి'తోనే ఉన్నాను. ఈ జన్మలో ఇప్పుడు 'వారి'ని పొందాను. మీరు కూడా ఆలోచించండి. మీకు కూడా ఇప్పుడు బాబూజీ లభించారు. దీని అర్థం ఏమిటంటే, మీరందరూ 'వారి'కి చెందినవారే! కాబట్టి త్వరగా 'వారి'ని తక్కువ సమయంలో చేరుకోండి. బాబూజీ ముందుగానే నాకు లభించి ఉంటే, ఈ జీవితంలోని, ఈ 22 సం॥లు కూడా ధన్యమయ్యేవి కదా! అని నేను మొదట్లో అప్పుడప్పుడు బాధపడేదాన్ని. బాబూజీ మహరాజ్ లేకుండా నేను ఎప్పుడైనా నా జీవితాన్ని గడిపానా! అనే ఆలోచన ఒకరోజున వచ్చింది. వెంటనే నాకు– "ఎప్పటి నుండి అయితే సృష్టి మొదలైనదో అప్పటి నుండి కూడా నాలోని ప్రతిశ్వాస కూడా 'వారి'తోనే ఉన్నది. నా ప్రతిశ్వాస 'వారి'దే. ఈరోజు నాలోని ప్రతిశ్వాస 'వారి' కోసమే అని అనిపించగానే, అప్పటినుండి నేను బాబూజీతోలేని జన్మ అంటూలేదు. 'వారు' లేకుండా అసలు నేను ఎప్పుడూ కూడా జన్మించలేదు అని అర్థమయింది. కాబట్టి మీరందరూ కూడా మీ సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. సృష్టి ప్రారంభం నుండి ఇప్పటికి లెక్కలేనన్ని జన్మలను ఎత్తాము. బాబూజీతో ఈ జన్మలో, ఇప్పుడు కనెక్ట్ అయ్యాము. 'వారి'తో ఎంత తొందరగా కనెక్షన్‌ను ఏర్పరచుకుంటే అంత సమయమూ వృధాకాక ఆదా అవుతుంది. కాబట్టి ప్రతి ఆలోచనను, ప్రతి పనినీ, ప్రతి భావనా మరియు హృదయం– ఇవి అన్నీ కూడా 'వారి'వే, అని 'వారి'తో కనెక్ట్ చేయటానికి కృషి చేయాలి. భగవంతుడు మనకు భక్తి వలన లభిస్తాడు. –నీవు లేకుండా ఏ ఆలోచన కూడాలేదు. నీవు లేకుండా ధ్యానమే లేదు. నేను నీ దానినే– అని 'భక్తి' భగవంతునితో అంటుంది.

ఒకసారి ఈశ్వర్‌సహాయ్‌జీ, "బాబూజీ మహరాజ్! మీరు ఇంత గొప్ప డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) కదా! మరి మేం చిన్న పిల్లలం. మేం చేసే ఈ కొద్దిపాటి ధ్యానానికి మీరు సంతోషపడతారే, ఎందుకని?" అని అడగ్గానే, వారు "కాదు; నీవు చేసే ధ్యానానికి సంతోపడటం లేదు. నేను నా యొక్క పనితో సంతోషపడుతున్నాను. ఎందుకంటే, సమస్త మానవాళిని 'అంతిమం' వద్దకు చేర్చాలని, ఏ కార్య భారాన్ని అయితే నామీద వేసుకున్నానో, ఆ ప్రకృతి కార్యంలో నేను విజయాన్ని సాధించాను కాబట్టి, నేను సంతోషపడుతున్నాను. నీవు ఏమి చేస్తున్నావు, ఏమిటి అని నేను ఆలోచించను" అని అన్నారు. ఇది 'వారి' నిపుణతకు, వినమ్రతకు చెందిన మాట. మనం మనవైపు నుండి చూసినప్పుడు, ఎప్పుడైన 'వారి' జ్ఞాపకంవస్తే సరే! 'వారి' జ్ఞాపకం రాకపోతే, దానికి నిరాశపడకూడదు. నా పనిని నేను చేస్తున్నాను, అని మీరు భావించాలి. ఇది ఒక రకమైన శిక్షణ. బాబూజీ మన అందరి కొరకు, 'వారు' చేయవలసిన పనిని వారే చేస్తున్నారు. మనం మన శ్రద్ధ, మన ప్రేమ, మన విశ్వాసం, మన భక్తి వీటినన్నింటిని కూడా 'వారి'తో కనెక్ట్ చేయాలి. ఇది మనం చేయవలసిన పని.

**ప్రశ్న: లక్నో వచ్చేముందు, ఎన్నో ప్రశ్నలు అడగాలని అనుకుంటాము. కాని ఇక్కడకు వచ్చిన తరువాత ధ్యానంలోను, మీ (కస్తూరి బెహెన్‌జీ) సమక్షంలో కూర్చున్నప్పుడు, అన్నింటికి సమాధానాలు వాటంతట అవే లభిస్తున్నాయి. అడగటానికి ప్రశ్నలు ఏమీలేవు!**

**జవాబు:** ప్రశ్నలు ఏమీ ఉండవు. కాని అప్పుడప్పుడు ఈ విధంగా ప్రశ్నలు అడగడంవలన ఇతరులకూ అది ఉపయోగపడుతుంది. సహజమార్గ్ సిస్టమ్ ఎటువంటి సంపూర్ణమైన సిస్టమ్ అంటే, ఈ సహజమార్గ్‌తో కనెక్షన్‌ను ఏర్పరచుకొన్న తరువాత ప్రశ్నలు అన్నీ కూడా వాటంతట అవే సమాప్తమవుతాయి. ఎందుకు? ఎందుకంటే, బాబూజీ మనకు 'ఈశ్వర ప్రాప్తి' అనే లక్ష్యాన్ని ఇచ్చారు. ఎవరైతే మనకు లక్ష్యాన్ని ఇచ్చారో స్వయంగా 'వారే' ట్రాన్స్‌మిషన్ పవర్ (ప్రాణాహుతి శక్తి)ని కూడా ఇస్తున్నారు. 'వారు' మన హృదయంలో 'ఈశ్వర ప్రాప్తి' అనే ఒక విత్తనం నాటారు. 'వారి' ప్రాణాహుతి శక్తి ప్రసారం వలన అది మొలకెత్తుతుంది. 'వారి' ప్రేమ దృష్టి సర్వమానవాళి మీద ఉంది. అందువలన ఇప్పుడు ఆ మొక్క పెరిగి, పెద్దగా అవుతుంది. ప్రతి ఒక్క మానవుడు కూడా నిజమైన మానవునివలె మారాలని, ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని చేరుకోవాలని, 'వారి' దృష్టి ఎల్లప్పుడు కూడా మనందరి మీద తప్పనిసరిగా ఉంటుంది. ఇది 'వారి' పని.

ఈ సంపూర్ణమైన సహజమార్గ్ విధానంలో మీకు ఎటువంటి ప్రశ్నలు కూడా దొరకవు. కేవలం అనుభవానికి సంబంధించిన ప్రశ్నలు మాత్రమే మీలో ఏర్పడతాయి. ఎందుకంటే, ఈ సంపూర్ణమైన విధానంలో ఈశ్వరీయశక్తిని ప్రసాదించేది 'వారే'. మనం ఈశ్వర ప్రాప్తి అనే లక్ష్యాన్ని స్వీకరించగానే, ఇంక మనం గమనించవలసినది ఏమిటంటే, మనకు ఒక లక్ష్యం ఉంది, లక్ష్యానికి తీసుకొని వెళ్ళడానికి మన ఎదుట 'బాబూజీ' ఉన్నారు, 'వారు' మనవారు, 'వారు' మనకోసం వచ్చారు – అనే విషయం మాత్రమే. అందువలన మనం 'నేను', 'నా' అనే శబ్దాలు 'వారి'తో ఏ విధంగా కలుపుకోవాలంటే, వాస్తవానికి మనం ఏ పని చేస్తున్నా 'వారు' నావారు –అనే ఫీలింగ్ (అనుభూతి) మనలో రావాలి. 'వారి' యొక్క ఫీలింగ్ (అనుభూతి) మనలో ఎంత అధికంగా అవ్వాలంటే 'బాబూజీ' అని పేరు వినబడితేచాలు, 'వారు' మనకు చాలా ఇష్టమైనవారు, మన ప్రాణం కంటే కూడా ఇష్టమైనవారు, మన ప్రాణమే లేచి వచ్చిందా –అని అనిపించాలి.

**ప్రశ్న: సాయంత్రం క్లీనింగ్ (నిర్మలీకరణ) తప్పనిసరిగా చేయాలా? ఎంతకాలం చేయాలి?**

**జవాబు:** ఎప్పటివరకైతే మన ఇల్లు అంటే మన హృదయం మురికిగా ఉంటుందో, అప్పటివరకు క్లీనింగ్ తప్పనిసరిగా చేయవలసినదే. ఇల్లు (హృదయం) మరికిగా ఉందని ఎలా తెలుస్తుంది? అని ఒక సోదరి నన్ను అడిగింది. అప్పుడు నేను ఇలా చెప్పాను: నీవు కళ్ళు మూసుకొని నీ హృదయంలోకి చూసుకొన్నప్పుడు, అక్కడ నీకు కేవలం బాబూజీ మహరాజ్ తప్ప వేరే ఏమి కనబడకూడదు. ఎటువంటి చెడు ఆలోచన కూడా రాకుండా ఉండి, ప్రతి ఆలోచన బాబూజీ స్మరణతోనే మిళితమై ఉండాలి. ఇలా మీరు ఏ పని చేసినప్పటికీ బాబూజీ మీ ఎదురుగానే ఉన్నట్లుగా బాబూజీ ప్రజెన్స్ యొక్క ఫీలింగ్ ఎప్పుడూ మీతోనే ఉంటుంది. ఇంటిని (హృదయాన్ని) అపవిత్రం చేసేది మన ఆలోచనలు, భావనలు, నడవడిక. వీటిని సరిచేసేది బాబూజీయే. ఇప్పుడు మనకు బాబూజీ వలన ఒక విధమైన ఆధారం, ఆశ్రయం లభించాయి, కాబట్టి మనం ఎవరిమీద, వేటిమీద అంటే కీర్తన, కథాశ్రవణాల మీదకాని ఆధారపడవలసిన అవసరంలేదు. మనం చేయవలసింది ఒక్కటే– వారి సామీప్యతానుభూతిని పొందటం మాత్రమే.

ఎవరైనా మిమ్మల్ని దూషించినా, మీతో కోపంగా మాట్లాడినా మీ హృదయం గాయపడుతుంది. అప్పుడు మీరు క్లీనింగ్ చేసుకోవలసిందే. ఎందుకంటే, ఆ మాటలు మీ హృదయంలోకి లోతుగా చొచ్చుకొనిపోయి, మిమ్మల్ని గాయపరిచాయి కదా! క్లీనింగ్ చేసుకోవడంతో అవి తొలగించబడతాయి. ఎప్పుడైతే మీ హృదయం, వేటివలన కూడా ఈ విధంగా ప్రభావితం కాకుండా ఉంటుందో, ఆరోజు నుండి మీరు క్లీనింగ్ చేసకోవలసిన అవసరం లేదు.

మీ బాబూజీ అంటే ఎవరు? ఏమిటి? అనే ప్రశ్నలకు జవాబుగా నేను ఇలా చెప్పాను: నేను బాబూజీ మహరాజ్‌ను భౌతికంగా చూసాను. 'వారి'తో ఎన్నో సంవత్సరాలు గడిపాను. బాబూజీ ఏఏ అనుభవాలను, దివ్య స్థితులను నాకు ప్రసాదించారో వాటిని ఒక పాట రూపంలో వ్రాశాను. ఒకవేళ 'వారు' నాకు తమ దివ్య సాక్షాత్కారాన్ని ప్రసాదించకపోతే, నాకు బాబూజీ గురించి కొంచెమైనా తెలిసేది కాదు. ఆరోజున బాబూజీ నాకు 'వారి' దివ్య దర్శనాన్ని ప్రసాదించారు కాబట్టి ఇప్పుడు ఎవరైనా నన్ను బాబూజీ గురించి అడిగితే, వాళ్ళకు ఏ కొద్దిగానైనా చెప్పగలను. ఇదే విధంగా మీకు బాబూజీ దివ్య దర్శనం కలిగినప్పుడు మీరూ 'వారి'ని గురించి చెప్పగలరు. కాని ఎవరైతే 'వారి' ఫోటోలను తయారుచేసినవారుగాని 'వారి' చిత్రాన్ని గీచినవారుగాని, వీరెవరూ నిజానికి 'వారి'ని చూడనే చూడలేదు.

ఎవరికైతే బాబూజీ మహరాజ్ తమ దివ్య సాక్షాత్కారాన్ని ప్రసాదించారో, ఎవరి ఎదుటనైతే బాబూజీ 'వారి' డివైన్ బ్యూటీ (దివ్య సౌందర్యం)ను వ్యాపింపజేసి ఉన్నారో, కేవలం అతడు మాత్రమే బాబూజీ గురించి ఏ కొంచెమైనా తెలుసుకోగలడు. అతడు మాత్రమే బాబూజీ గురించి కొద్దిగా అర్థం చేసుకోగలడు. నిజానికి అతడు మాత్రమే బాబూజీ గురించి ఇతరులకు ఏ కొద్దిగానైనా చెప్పగలడు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీతో "మేము పనులు చేసుకునేప్పుడు – ఒక పనిచేసి మరో పనిని మరచిపోతాం. బాబూజీ! మీరు మాత్రం అన్ని పనులు సక్రమంగా ఎలా చేయగలుగుతున్నారు" అని అడిగారు. బాబూజీ అన్నారు కదా! "నా కళ్ళ ఎదుట ఒకదాని తర్వాత ఒక పని కనపడుతుంది. ఇంక వాటికవే పనులు పూర్తయి పోతాయి" అన్నారు. దివ్యపురుషుల కార్యాలు అలా జరుగుతాయి.

బాబూజీయే సర్వం అయి ఉన్నారు అంటే అన్నిచోట్ల, అన్నిటా వారే ఉన్నారన్నమాట. నీ కంటిదోషం వలన నీవు చూడలేక పోతున్నావు.

టిక్కెట్ లేనిదే ఏ విధంగా నీవు ప్రయాణం చేయలేవో అదే విధంగా సమర్థుడైన గురువులేనిదే ఆధ్యాత్మిక యాత్ర చేయలేం.

ప్రిసెప్టర్ అయిన తర్వాత ధ్యానం చేయడం మానివేస్తారు చాలామంది. అది చాలా తప్పు. మనకు ఏమి కావాలో 'అసలు' ఏమిటో వెదుక్కోవడానికే దీవ్యదీపం –దివ్యజ్యోతి.

నేను ఇక్కడ ఉన్నా, షాజహాన్‌పూర్‌లో ఉన్నా బాబూజీతో మాట్లాడతాను. ప్రిసెప్టర్లే తమ ధ్యానాన్ని మరచిపోతే, ఇతరుల ధ్యానాన్ని ఎలా మేల్కొల్పుతారు?

అన్నింటిలోకి మనంచేసే పెద్ద తప్పు లేదా పెద్దపాపం ఇతరుల మనస్సును వాష్ చేయడం –అంటే రుద్దడం. ఒక్కొక్కరికి ఒక్కోటి ఇష్టంగా ఉంటుంది. నాకు ఒకటి ఇష్టమైతే మీకు మరొకటి. మీవాళ్ళకు మీరంటే ఇష్టంగా ఉండవచ్చు. వేరేవారికి వాళ్ళవారంటేనే ఇష్టం కావచ్చు. కాని బాబూజీ అందరికీ ప్రీతిపాత్రులే.

బాబూజీని మనం మర్చిపోలేము. 'వారు' మనల్ని మర్చిపోరు. ఇతరుల మనస్సును కలుషితం చేయకుండా ఉండటమే మనం చేసే మంచి పని.

బాబూజీ మనలో ఆధ్యాత్మికత అనే బీజం నాటడానికి వచ్చారు. దానిని ప్రేమతో తడిపి అంకురింపజేసి భక్తితో పెంచి పెద్దది చేసుకోవాలి. ఎవరి అభిరుచులు వారికి ఉంటాయి. కొందరు కథలు చెపుతారు. మరికొందరు రామాయణం వినిపించటానికి వస్తారు. కొందరు వినటానికి శ్రద్ధ చూపుతారు. కనీసం దానిమీదైనా వారికి భక్తి ఉంది. కొందరు విగ్రహారాధన చేస్తారు. వారికి అది నచ్చుతుంది. కాని దేనినీ మనం బలవంతంగా మార్చటానికి ప్రయత్నించకూడదు. "నేను విగ్రహారాధన చేయవద్దని చెప్పలేదు. అలా ప్రబోధం చేయమని చెప్పలేదు. సహజమార్గాన్ని అనుసరించమని మాత్రమే చెప్పాను" అన్నారు బాబూజీ. మనం వాటిని వదలిపెట్టమని చెప్పితే వారికి మనమీద విశ్వాసం సడలుతుంది. మనిషికి పరిపక్వత వచ్చి, స్వయంగా –తగదు అనుకున్నదానిని త్యజించేటట్లుగా చూడాలి.

చారీజీని గురించి ఎవరో బాబూజీకి ఫిర్యాదు చేశారు. అప్పుడు బాబూజీ "ముందు మీ మనస్సును పవిత్రంగా ఉంచుకోండి" అని అన్నారు. వారు అది ఇస్తారు, ఇది ఇస్తారు అని కొందరు చెప్పటం విన్నాను. అలా మనస్సు మార్చటానికి ప్రయత్నిస్తారు. అందరి మనస్సు మార్చటమనేది బాబూజీవల్లనే కాని పని! మరెవ్వరి వలన అవుతుంది? అభ్యాసీకి ప్రేమ ఇచ్చారు, శక్తి నిచ్చారు. తమ సర్వస్వమూ ఇచ్చినప్పటికీ, కాని పని మరెవ్వరివలన అవుతుంది. పాపులు, పుణ్యాత్ములు అనే భేదం లేకుండా మానవమాత్రులందరికీ సాక్షాత్కారం కలిగించాలనే సంకల్పంతో వచ్చారు బాబూజీ. ఏదో ఒకరోజున ఎవ్వరైనా సరే సహజమార్గంలోకి రాకతప్పదు. దానికి కొంత సమయం పట్టవచ్చు, అంతే.

సహజమార్గాన్ని వదలివెళ్ళిన అభ్యాసులు కొంతమంది ఏదైనా నష్టమో, కష్టమో కలిగినప్పుడు, బాబూజీని వదిలిపెట్టాము కనుక అలా జరిగిందని వాపోతారు. అది నిజంకాదు. అది వాళ్ళ మానవ స్వభావం. బాబూజీవంటి దివ్యపురుషునికి మానవ స్వభావాన్ని అంటగట్టటం తగదు. మానవులకు నష్టం కలిగించటం బాబూజీ స్వభావం కాదు. నష్టానికి కారణం మానవుల స్వభావాలు, వారి ఆలోచనలు, ఆచరణలు మాత్రమే. ఎవరూ ఎవరికీ కూడా కీడు కలిగించలేరు. వారి స్వభావమే వారిని కష్టనష్టాలకు గురిచేస్తుంది.

ఒకసారి హనుమాన్ భక్తుడు ఒకరు బాబూజీవద్ద మొదటి సిట్టింగ్ తీసుకున్నాడు. రెండవ సిట్టింగ్‌కు కొన్ని రోజుల తర్వాత వచ్చినప్పుడు బాబూజీ ఎందుకు రాలేదని అడిగారు. అందుకు జవాబుగా, తాను ఇక్కడ సిట్టింగ్ తీసుకొని ఇంటికి వెళ్ళేసరికి తన కుమారునికి జ్వరం వచ్చింది. అందుకు హనుమంతుని ఆగ్రహం కారణం అయి ఉండవచ్చునని అన్నాడు. ఆ విధంగా మానవ స్వభావాన్ని మహాత్ములకు అంటగట్టడం తగనిపని. మానవుడు ఎంతగా పతనమైపోయాడో, ఎలా దూరమైపోయాడో చూడండి. ఈశ్వరప్రాప్తి కొరకు వెళ్ళిన వారిని హనుమంతుడు దండిస్తాడా! అదంతా బుద్ధిహీనత.

**ప్రశ్న: "లివింగ్ మాస్టర్" అంటే ఏమిటి?**

**జవాబు:** దైవం అందరిలోనూ ఉన్నాడు. దైవం అందరివాడూ కూడా బాబూజీ తన ప్రతిమాటకు అర్థం ఉంటుందని అన్నారు. దైవం నీలోపల ఉన్నాడు. లోన ఉన్న దైవంతోనే ఉండు. అనగా "లివ్ ఇన్ మాస్టర్" అని చెప్పారు (మాస్టర్ అనగా దైవమే). అనగా హృదయంలో ఉన్న దైవంతో లయమై ఉండటమనేది ఒక

స్థితి. మొదట దైవం మనలో ఉన్నాడు అనుకుంటాం. భక్తి, ప్రేమ పెరిగినకొద్దీ అది తిరగబడి దైవంలోనే మనం ఉన్నామనిపిస్తుంది. లాలాజీ బాబూజీలో ఉన్నారు. వివేకానందుడు బాబూజీలో ఉన్నారు. వారందరికీ శరీరం ఉందా? బాబూజీ ప్రతిసారీ "లాలాజీ ఇలా చెపుతున్నారు, అలా చెపుతున్నారు" అని అంటూ ఉంటారు. మనం విశ్వసిస్తున్నాం కదా! శరీరం అనేది ఆత్మకు ఒక మూత, ఒక రూపం. శరీరం నశిస్తుంది, మనం చనిపోతాం. శరీరాన్ని వదలిపెట్టాము. పునర్జన్మ కలగ్గానే మళ్ళీ శరీరం దాల్చుతాం. అందుచేత అది ఒక ఆచ్ఛాదన (కవరింగ్) మాత్రమే. మనలో దైవాంశ ఉంది. అందులో జీవించటమే "లివ్ ఇన్ మాస్టర్" అవుతుంది. నిజమైన మాస్టర్ దైవమే.

**ప్రశ్న: సహజమార్గం స్థాపించబడకముందు ఇటువంటి శక్తి యొక్క అనుభవం ఎప్పుడైనా వచ్చిందా?**

**జవాబు:** దానికి జవాబు 'వారే' స్వయంగా చెప్పారు. సంకల్పం ఉన్నంతవరకు జీవించియే ఉండటం జరుగుతుంది. ఆ సంకల్పానికి శక్తి ఉంటుంది. బాబూజీ మహరాజ్ సంకల్పంతో వచ్చారు. దానిని అంటిపెట్టుకుని శక్తి ఉంది. 'వారి' సంకల్పం నెరవేరేంతవరకు ఆ శక్తి పనిచేస్తూనే ఉంటుంది. మానవమాత్రులందరినీ ఉద్ధరించటానికే వచ్చారు. వారి సంకల్పం పూర్తయ్యేవరకు ఆ శక్తి వాతావరణంలో నిలిచి ఉంటుంది. మానవుడు దానవుడయ్యాడు. తిరిగి ఆ మానవుడు మానవుడై –దివ్యత్వాన్ని అలవరుచుకుంటే దైవంగా మారతాడు. దైవం గురించి చెప్పేవారు చాలామంది ఉన్నారు కాని దైవంవద్దకు చేర్చేవారు అరుదు. మానవమాత్రులను ఈశ్వరప్రాప్తి పొందటానికి మేల్కొల్పే నిమిత్తం దివ్యశక్తి అనంతం నుంచి దిగివచ్చింది. అలా దిగివచ్చిన శక్తి చాలా శక్తివంతమైనది. శక్తి అనేది సంకల్పంవలన వస్తుంది. ఆ శక్తితోనే అన్నీ జరుగుతాయి. మనం ఉన్నతినందుతాము. అభ్యాసీలో ఈశ్వరప్రాప్తి (సాక్షత్కారం) పొందాలనే తపన ఎంత గాఢంగా ఉంటే అంతగా శక్తి లభిస్తుంది. బాబూజీ సంకల్పానికి తగినట్లుగా మన సంకల్పం కూడా ఉంటే చాల సామీప్యం కలుగుతుంది. వారిచ్చే శక్తిని స్వీకరించటానికి మనం ఉద్యమిస్తే మనం వారి దరిజేరతాము. వారు మన కొరకు నిరీక్షిస్తూ ఉంటారు. లయావస్థ కలగాలంటే సంకల్పం లేకుండా జరగదు. బాబూజీ ఇచ్చిన లక్ష్యాన్ని చేరాలన్న సంకల్పంతో, ప్రేమ, భక్తితో వారితో సహకరించి నట్లయితే, మనకు ఉన్నతి కలిగించాలనే సంకల్పం వారిలో కలుగుతుంది. ఆ సంకల్పం ద్వారా మనకు శక్తి లభించి ఈశ్వరప్రాప్తికై మనకు ప్రోగ్రెస్ కలుగుతుంది. దానికి వారే బాధ్యత వహిస్తారు. మీరు ఇక్కడ ఉన్నా, ఎక్కడ ఉన్నా ఆ శక్తిని 'వారు' ఇస్తూనే ఉంటారు. శక్తి అనేది సంకల్ప మాత్రంగా వచ్చేదేకాని దానికి భౌతిక శరీరం యొక్క అవసరం లేదు. వారు మన నుంచీ ఏమీ కోరటంలేదు. మానవమాత్రులను ఉద్ధరించాలన్న వారి సంకల్పానికి సహకారం మాత్రమే కోరారు. వారి సంకల్పశక్తి ప్రపంచమంతటా వాతావరణంలో వ్యాపించి ఉంది.

**ప్రశ్న: సహజమార్గంలో ప్రతినిధి (రిప్రెజెంటేటివ్) ఎలా వ్యవహరించాలి?**

**జవాబు:** దివ్య శక్తి బాబూజీదేకాని మనదికాని, మరెవ్వరిదికాని కాదు. మనం వారి సేవకులం. ఎవరైనా బాబూజీ సేవలందుకోవాలంటే వారితో సంయోగం చెందాలి. వారు అప్పుడు బాధ్యత వహిస్తారు. విముఖులైతే చెప్పనక్కర్లేదు. బాబూజీ అందరితోనూ సంయోగం చెందుతారు, సహకరిస్తారు.

"సిస్టర్! మీరు మాత్రమే బాబూజీకి సరియైన రిప్రెజెంటేటివ్" అని ఒక అభ్యాసీ అన్నాడు. వెంటనే నేను ఇలా అన్నాను: అలా మాట్లాడకూడదు. బాబూజీ చారీజీని తన ప్రతినిధిగా నియమించారు. మనం

అంగీకరించాల్సిందే. కాని వారు దానికి తగినట్లుగా వ్యవహరించడం లేదు. శక్తి బాబూజీ ఇచ్చేదికాని మరెవ్వరిదీ కాదు. బాబూజీతో సహయోగం, సంయోగం చెందితే శక్తి వస్తుంది. విముఖులైతే ఇంక చెప్పాల్సింది ఏమి ఉంది, ఏమీలేదు. గురుడమ్ అనేదాన్ని బాబూజీ ఖండించి –సోదరత్వం అనే దానినే నెలకొల్పారు. అహంవలన అక్కడ శూన్యత మాత్రమే మిగిలి ఉంది.

మన మందరమూ బాబూజీ మహరాజ్ ప్రతినిధులమే. మనం ఎక్కడకు వెళ్ళినా సహజమార్గ విధానం యొక్క విశిష్టత వెల్లడికావాలి. మేము బాబూజీ మహరాజ్ యొక్క సహజమార్గ అభ్యాసులము –అని మాటల్తో చెప్పటం కాదు. దాని పవిత్రత ఇతరులు గ్రహించేట్లు చేయాలి. వారి ఆశయాలు, లక్ష్యం, వాటి విలువను ఇతరులు అనుభూతి చెందేటట్లు చేయగలిగినప్పుడే వారికి సరియైన ప్రాతినిధ్యం వహించినట్లవుతుంది. మనం ఒకచోటుకు వెళ్తున్నామంటే అక్కడ పవిత్రత, ప్రశాంతత నెలకొనాలి, అక్కడ ఉన్న వాతావరణమంతా దివ్య శక్తి (ట్రాన్స్‌మిషన్) ప్రవహించాలి. సహజమార్గం యొక్క గొప్పదనం చూసి దానిని విమర్శించేవారి నోళ్ళు మూతపడాలి. ఆ మార్పు చూసినవారు, వీరు బాబూజీ మహరాజ్ అభ్యాసులు అని నివ్వెరపోవాలి. బాబూజీ యొక్క సహజమార్గ విధానానికి మనం సరియైన బాధ్యత వహించాలి. ఎవ్వరైనా బాబూజీని అమర్యాదగా మాట్లాడుతుంటే అటువంటివారి సాంగత్యం విడిచిపెట్టండి. బాబూజీ ఒకిరిని ప్రతినిధిగా నియమించారేగాని, ఎవరినీ గురువు (మాస్టర్)గా నియమించలేదు. గురుడమ్ (గురుత్వం) అనే దానిని ఖండించారు. దాని స్థానంలో సోదరత్వాన్ని మాత్రమే ప్రవేశపెట్టారు. కనుక అందరూ, అందరినీ సోదరులుగానే భావించాలి.

బాబూజీ ఎక్కడ లేకుండా ఉన్నారు. మనస్సనే మందిరంలో చూడండి. బాహ్యాడంబరమనే మందిరంలో కాదు. బాబూజీ మహరాజ్ సర్వదా మన ఎదుటే ఉన్నారు. వారి ఉనికి లేకుండా ఏదీలేదు. వారి ప్రేమానురాగాలు మనకు ఎల్లప్పుడూ లభిస్తూనే ఉన్నాయి. మనకు ఈశ్వరప్రాప్తి అనే లక్ష్యం ఇచ్చారు. ఈశ్వరుడు ఉన్నాడు, ఈశ్వరుడు మనవాడేనన్న దృఢ సంకల్పంతో మనం ఉంటే ఆ సంకల్పం ద్వారా, ఈశ్వరప్రాప్తి కలిగించటానికే అవతరించినటువంటి బాబూజీ యొక్క సంకల్పశక్తి మనకు లభిస్తూ ఉంటుంది. దైవం మనలోనే ఉన్నాడు – అనే ప్రతిపాదనతోనే సహజమార్గ విధానం ఏర్పడింది. ధ్యానంలో మన ధ్యాస మన లక్ష్యంవైపు, బాబూజీవైపు ఉండాలేగాని ఇతర ఆలోచనలవైపు మరలగూడదు. మనం లక్ష్యసిద్ధి కోరటమా, ప్రాపంచిక సుఖాలు కోరటమా అనేది మనం నిర్ణయించుకోవాలి. ఏది కోరుకుంటే అదే ఇస్తారు బాబూజీ. అందుకు ఒక ఉదాహరణ చెబుతాను. బాబూజీ వద్దకు మీరట్ నుంచి ఒకామె సిట్టింగ్‌కు వచ్చేవారు. ఆమె ధ్యాసంతా ఆహారం గురించే ఉండేది. అందుచేత బాబూజీ ఆమెకు వేడివేడి రొట్టెలు, వేడిపాలు ఆమె అభిరుచులకు తగినట్లుగా తమకొరకు ఏర్పాటుచేసినవాటిని కూడా ఆమెకే ఆరగింపజేసేవారు. వారు అంత శ్రద్ధగా అలా ఎందుకు చేస్తున్నారో అర్థంకాక ఈశ్వర్‌సహాయ్‌గారు బాబూజీని ప్రశ్నించారు. బాబూజీ అందుకు సమాధానంగా "ఆమె ఇటువంటి కోరికలతోనే ఉంది కనుక, ఆమెకు అవి ఏర్పాటు చేస్తున్నాను. ఆమెకు ఆధ్యాత్మికతపై మోజులేదు కనుక, నాకు ఆ బాధ్యత తప్పింది" అని అన్నారు. అలా కోరికల వెంటపడటం మానవ స్వభావం. దానిని చూస్తున్నవారు మానవ స్వభావరీత్యా, బాబూజీ కొందరిని ప్రత్యేకంగా ప్రేమిస్తున్నారు అనుకుంటారు. అది సరికాదు. బాబూజీ మనవారు, అందరివారు. ఎదుట ఉన్నా, ఎక్కడ

ఉన్నా, దగ్గరగా ఉన్నా, దూరంగా ఉన్నా అందరికీ శక్తి ప్రసారమవుతూనే ఉంటుంది. బాబూజీ మహరాజ్ సహజమార్గ విధానం ప్రవేశపెట్టి మానవాళికి తమ సంకల్పశక్తి ద్వారా ఈశ్వరప్రాప్తిని కలిగించటానికి ఎనలేని కృషికి పూనుకున్నారంటే అది సామాన్యమైన విషయం కాదు. దివ్య సుందరమూర్తి బాబూజీ మహరాజ్‌ను హృదయ మందిరంలో చూడటానికి ప్రయత్నించాలి.

బాబూజీ మనకు ఏం చెప్పారో, ఏం నేర్పారో గుర్తుంచు కోవాలి. ఎంత గొప్పవారైనా, సామాన్యులైనా బాబూజీ దృష్టిలో అందరూ సమానమే. బాబూజీ నిత్యజీవనసరళిని చూడండి. అందరినీ ఎలా చూస్తున్నారో, ఎంత ప్రేమగా చూస్తున్నారో, ఎలా మాట్లాడు తున్నారో, ఎంత మధురంగా మాట్లాడుతున్నారో, అది అవగాహన చేసుకొని అలా అలవర్చుకోవటం మన బాధ్యత.

ఒక అభ్యాసీ, సిట్టింగ్‌లో కూర్చున్నానుకాని, ఏమీ రావటంలేదని అంటాడు. అంటే అతనికి సిట్టింగ్ తీసుకోవాలనే ఆలోచన ఒక వ్యామోహమేకాని, దానిలో అతడు లగ్నం కావటం లేదన్నమాట.

బాబూజీ మనకు నేర్పటంకోసం ఏ విషయాన్నయితే ఉద్దేశించి చెపుతారో అదే మన ముందుకు వస్తుంది. మన అనుభూతి విషయమై బాబూజీ ఆ స్థితి ఏమిటో నేను వినాలి అని అంటే దాని వెనుక ఏదో ఉపయోగం ఉంటుంది. ఆ విధంగా వారు తెలియజేసిన వాటి జ్ఞానాన్ని నేను వ్రాయగలుగుతున్నాను. బాబూజీ ప్రేమకు సాటియైనది ఏదీలేదు. నేను వారి చరణాలకు అర్పితమైపోయాను.

మనలో 'నేను' (అహం) అనేది కరిగిపోతే వారితో సంబంధం – కనెక్షన్ ఏర్పడుతుంది. 'నేను' అనేది తలెత్తినప్పుడు వారితో కనక్షన్ తెగిపోతుంది. వారికే అర్పితమైపోతే వారే బాధ్యత వహిస్తారు.

ఈ సహజమార్గ సిస్టమ్ అనేది బాబూజీ యొక్క కృప, వారి కృపాదృష్టి. మన ఎదుట ఎవ్వరైనా ప్రగల్భాలు పలకవచ్చు, మాటలు చెప్పవచ్చు. 'వారు' చెప్పేవాటిని గురించి వారెప్పుడూ విని ఉండకపో వచ్చు, అర్థం చేసుకొనీ ఉండకపోవచ్చు. కాని నా విషయంలో వాస్తవం చెప్పాలంటే, బాబూజీ నాకు ఏ కండిషన్ (స్థితి) ఇచ్చారో దానిని ప్రాక్టికల్‌గా ప్రత్యక్షంగా చూడగలిగాను. సురేష్ ఒకసారి "నేను ఏది చేయదలచుకుంటే దానిని చేయగలను. ప్రపంచంలో ఇటువంటివారు లేరని అనిపించగలను" అని భీకరంగా పలికినప్పుడు, బాబూజీ ఏమన్నారంటే– మనం సహజమార్గ విధానం గురించి చెప్పాలి, దాని నుంచి ఏం పొందామో చెప్పాలి. అంతేకాని మరి దేనిని గురించికాని, ఇతరత్రా మాటలుగాని మాట్లాడకూడదని అన్నారు.

మనం ఈ ప్రపంచంలో జీవిస్తున్నాం. ప్రాపంచిక విషయాల్లో నిమగ్నం కాకుండా ఉండలేము. కాని బాబూజీ మహరాజ్ హృదయంలో ధ్యాన మగ్నమై ఉంటే దైవాన్ని దర్శించగలమని నిరూపించారు. మనస్సుతో ప్రాపంచిక విషయాలు పరిశీలించ గలుగుతాం. కాని దైవాన్ని మాత్రం హృదయంలోనే చూడగలుగుతాం. అనగా భౌతిక విషయాలు మానసికమైనవికాగా, దివ్యత్వానికి చెందినది హృదయపరంగా ఉంటుంది. హృదయంలో వారిని (దైవాన్ని) మాత్రమే చూడగల్గుతాం. శాంతి, ప్రేమలను అనుభూతి పొందగల్గుతాం. ఎంతగానైతే మనం ప్రేమ, భక్తి కలిగి దైవదృష్టితోనే ఉంటామో అప్పుడు బాబూజీ మహరాజ్ మన హృదయంలో పూర్తిగా వ్యాపించి ఉంటారు.

**ప్రశ్న: రియలైజేషన్ (సాక్షాత్కారం) కలిగినట్లు ఎలా గ్రహించగలం?**

**జవాబు:** 1) మీకు మీ శరీరం యొక్క స్పృహ ఉండదు. మీ వంక చూసుకొన్నప్పుడు ఏదో తేజస్సు మాత్రం కనిపిస్తుంది. అది ఎలాంటిదంటే, రాముడు కృష్ణుడులకు కాంతి మండలం ఉన్నట్లు. స్వరూపం కనిపించదు. కేవలం దైవమే ఉన్నట్లనిపిస్తుంది.

2) మీరు ఎక్కడికి వెళ్ళినా పవర్ అంతటా ఉన్నట్లనిపిస్తుంది. ఎవ్వరైనా ఈశ్వరుడు ఇలా ఉంటాడు, అలా ఉంటాడు అని అంటూ ఉంటే, అదంతా తననే అంటున్నట్లుగా ఉంటుంది. భగవంతునికి చెందినది ఏదైనా అది తనదే అన్నట్లుగా ఉంటుంది. అది ఇంకా ఎలా ఉంటుంది అంటే– మీరు ఎవరి పేరైనా చెప్పండి – వారికి పని అప్పగిస్తే అది పూర్తి చేస్తారు. అందులో మినహాయింపుగాని, మిగిలిపోవటంగాని ఉండదు.

**ప్రశ్న: సాక్షాత్కారం తర్వాత ఎటువంటి స్థితి ఉంటుంది?**

**జవాబు:** అది బాబూజీ మహరాజ్ యొక్క సాటిలేని పని. మనిషికి జన్మనిచ్చి అతడిని పెంచి ఆ శరీరాన్ని పోషించటానికి ఇంత శ్రమపడుతూ ఉంటే అభ్యాసీని తయారుచేయటంలో (ఉద్ధరించటంలో) ఎంత శ్రమపడాల్సి ఉంటుంది? బాధ ఉంటుంది. కొంచెం బాధ ఉన్నట్లుగా నాకు తెలుస్తుంది. కొద్దిసేపట్లో అది తొలగిపోతుంది. కాని ఎవరో నన్ను లాక్కుని తీసుకువచ్చినట్లు అనిపిస్తుంది. వైద్యం చేసిన తర్వాత తగ్గినట్లు ఆ బాధ తగ్గిపోతుంది. ఆ విధంగా అభ్యాసీ ఉన్నత స్థాయికి వెళ్ళుతూ ఉన్నప్పుడు, దానిలోని ఆనందాన్ని అనుభూతి చేసుకుంటే క్రిందకు దిగిరాడు. అది ఎలా ఉంటుందంటే, ఉత్తమజాతికి చెందిన చాతకపక్షి మేఘుడు వర్షించిన నీరు త్రాగటానికే ఇష్టపడుతుంది కాని క్రిందకు దిగి భూమిమీద నీరు త్రాగటానికి ఇష్టపడనట్లుగా అభ్యాసీ ఉన్నతకోవకి చెందిన తర్వాత అధోముఖమై క్రిందకు దిగిరాడు.

**ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్ (విస్మృతావస్థ లేదా మరపుస్థితి):**

నేను ఒకసారి రాజమండ్రి నుంచి విజయవాడ వస్తూ మరపుస్థితిలోకి వెళ్ళిపోయాను. నేను ఎక్కడ ఉన్నానో నాకు తెలియదు. నా ప్రక్కన జనం ఉన్నట్లే తెలియదు. విజయవాడ వచ్చేసరికి, విజయవాడ – విజయవాడ అనే మాటలు వినిపించేసరికి, నాకు స్పృహ వచ్చి విజయవాడు వచ్చానా అనుకున్నాను. ఆ సమయంలో నాకు శ్వాస కూడా లేనట్లు గ్రహించాను. అంతకుముందు నాకు ఏమీ తెలియలేదు. అప్పుడు మళ్ళీ మామూలు స్థితికి వచ్చాను.

**ప్రశ్న: ప్రస్తుతకాలంలో బాబూజీ, లాలాజీ, వివేకానంద, శ్రీకృష్ణుడు వంటి వారితో ఇంటర్ కమ్యూనికేషన్ ద్వారా మాట్లాడగలిగినవారు ఎవ్వరైనా ఉన్నారా?**

**జవాబు:** సెంట్రల్ రీజియన్‌లో ఉన్నవారు మాట్లాడగలరు. కాని దానికి బాబూజీ సంకల్పం ఉండాలి. "సెంట్రల్ రీజియన్‌కు చేరుకున్నామంటే మళ్ళీ వెనక్కు తిరిగిరాలేమని భయపడతారు కొందరు" అని బాబూజీ చెప్పారు. ఎలా అంటే నేడు నా కుమారుని కోసం మంచి ఇల్లు కొన్నాను. పాత ఇల్లు చాలా మురికిగా ఉంటుంది. అయినా, అతను దాన్ని వదిలిపెట్టి క్రొత్త ఇంటికి వెళ్ళటం లేదు. అతనికి దానిమీద మమకారం ఉంది. దానితో కనెక్షన్ ఉంది. అందుచేత దానిని వదలివెళ్ళలేదు. ఇలాంటి అటాచ్‌మెంట్ ఉండటంవల్లనే సెంట్రల్ రీజియన్ గురించిన భావంతో తగ్గి క్రిందే ఉండి పోతారు. ఉన్నత స్థాయికి వెళ్ళే

అవకాశం దక్కినా ఆ మమకారం అనే బంధం మూలంగా పైకి పోలేదు. ఈ (అటాచ్‌మెంట్) వ్యామోహం కారణంగా అతను మళ్ళీ జన్మ తీసుకోవాల్సి ఉంది. ఆ విధంగా ఇంటిమీద అతిగా మక్కువ ఉన్నట్లయితే మూడు జన్మలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుచేత మన ఫీలింగ్‌ను, వాతావరణాన్ని మంచిగా తయారుచేసుకోవాలి. సెంట్రల్ రీజయన్ పవర్, భూమిని తాకునట్లుగా చేయాలి. అనగా సెంట్రల్ రీజియన్ చేరి, ఆ శక్తితో విస్తరించి, వ్యాప్తి చెంది, భూమండలాన్ని దివ్యత్వం తాకేట్లుగా చేయాలి. నేను నా పనిని, కనీసం దాని పవర్ మానవమాత్రులకు అందాలని త్వరితంగా చేస్తున్నాను. అందరూ ఈ లాభం పొందాలి కదా! మురికికూపం మీద మక్కువ ఉన్నవానికి సందర మందిరం మనస్కరించకపోవటం నిజమే కదా!

**ప్రశ్న: కొంతమంది బాబూజీ తమను సెంట్రల్ రీజియన్‌కు తీసుకు వెళ్ళారని చెప్తారు?**

**జవాబు:** ఆ విధంగా ఎవరూ భావించకూడదు. అది 'అహం'కు కారణమవుతుంది. ప్రిసెప్టర్ ఒకరు, తాను ప్రిసెప్టర్ అని చెప్పుకుంటూ ఎప్పుడూ ఖాళీగా కూర్చుంటూ ఉంటాడని బాబూజీతో ఎవరో ఆరోపణ చేసినప్పుడు, ప్రిసెప్టర్ ఎల్లప్పుడూ ప్రిసెప్టర్ కాదు. పైనుంచి దివ్య ప్రవాహం వచ్చినంతసేపు మాత్రమే; మిగిలిన సమయంలో అతడూ అభ్యాసీయే అని బాబూజీ అన్నారు.

సహజమార్గ్ సిస్టమ్ అనేది ఒక రకమైన జీవన విధానం. ఇందులో ప్రార్థన అనేది భగవంతునికి నివేదించుకోవటం. ఆధ్యాత్మికతను అలవర్చుకోవటానికి, సాక్షాత్కారం పొందటానికి స్మరణ, తపన మరియు ప్రేమ ఉండాలి. ప్రార్థనలో చెప్పినట్లు, నీ సహాయంలేక నేను ఆత్మోన్నత స్థితికి చేరలేను, అని మనస్ఫూర్తిగా నివేదించుకోవాలి. బాబూజీ మన ఎదుట ఉన్నారనుకోవాలి. దైవం మనలోనే ఉన్నాడు, సంకల్పం నెరవేరాలంటే ప్రేమ, భక్తితో సాధన చేయాలి.

దైవం సర్వత్రా ఉన్నాడు, ప్రేమ ఉంది. కాని మనం దైవంతో సంబంధం లేనివారమవుతున్నాం. మనం వారి ఎదుట ఉంటాం కాని సంబంధంపోయి ఎక్కడికోపోతాం. కనుక మనం దైవంతో సంబంధం కలుపుకోవాలంటే, అనుసంధానం చేసుకోవాలనుకుంటే, 'ఐనెస్' అనగా 'నేను' అనే అహంను తొలగించుకొని – నేను మీవాడిని, మీరు నావారు, అని హృదయపూర్వకంగా భావించినట్లయితే మళ్ళీ వారితో కనెక్షన్ ఏర్పడుతుంది. మనం వారివైపు కాకుండా వ్యతిరేక దిశలో ప్రయాణించటంవల్లనే మన కనెక్షన్ తెగిపోతుంది. మనం 'వారి'కి కనుమరుగైపోతాం, కాని మళ్ళీ గుర్తుచేసుకొని స్మరించి నట్లయితే 'వారి' ఎదుట ప్రత్యక్షం కాగలుగుతామని బాబూజీ చెప్పారు. దైవం అంతటా ఉన్నాడు, వారి ప్రేమ ఉంది, వారి అంశ (దైవాంశ) మనలోనూ ఉంది కనుక సంబంధం లేకపోవటం ఏమిటని ఒక అభ్యాసీ ప్రశ్నించినప్పుడు, బాబూజీ సమాధానం ఇస్తూ అన్నీ ఉన్నాయి, కాని మనమే 'అహం' కారణంగా వారి ఎదుట లేకుండా మాయమైపోతున్నాం –అని వివరించారు.

**ప్రశ్న: మేము ఈశ్వరుని చూడలేదు కనుక వారిని మాస్టర్ అని ఎలా అనుకోగలం. కనుక ఎవరిమీద ధ్యానం చేయాలి? ఎలా ధ్యానం చేయాలి?**

**జవాబు:** ఈ విధంగానే బాబూజీని ప్రశ్నించినప్పుడు మీరు రాముడిని, శ్రీకృష్ణుడ్ని చూశారా? మీరు వారిని దైవంగానే భావిస్తున్నారు, పూజ చేస్తున్నారు కదా! నిజం చెప్పాలంటే, అందరూ నోటితో ఉచ్చరిస్తున్నారు.

ఈశ్వరుడు హృదయ మందిరంలో ఉంటాడు. బాహ్యనేత్రాలకు కనిపంచడు. కాని కంటితో చూడాలని వెదుకుతారు. హృదయంలో అంతః చక్షువులతో చూడాలి అని అన్నారు.

ఒక అభ్యాసీ బాబూజీ –"మీరు మా ఎదుటనే కూర్చుని ఉన్నారు. మిమ్మల్ని చూస్తూనే ఉన్నాం. మా అంతరంగంలోకి వచ్చేవారే –సర్వత్రా ఉన్నారని అనిపిస్తుంది. మళ్ళీ మా ఎదుట మీరే కనిపిస్తున్నారు" అని వ్రాశాడు. బాబూజీ అందుకు సమాధానంగా, "దివ్యసౌందర్యం దానికి అదిగానే ఉంటుంది. దానిని తిలకించాలంటే ప్రేమ, భక్తి, సాధన ద్వారా సాధ్యమవుతుంది" అని వ్రాశారు. అందుచేత నేను మీవాడిని, మీరు మావారు అని అనుకోవటం ద్వారా దైవంతో సంబంధం ఏర్పడుతుంది. అప్పుడు అలా కనిపించేది వారి ప్రతిబింబం.

**ప్రశ్న: సాక్షాత్కారం కలిగినట్లు తెలుసుకోవటం ఎలా?**

**జవాబు:** సాక్షాత్కార స్థితి లభించినవారికి బాహ్య ప్రపంచంలో ఎవరిని దర్శించినా భగవంతుని దర్శించినట్లు, అందరూ తనవారేనని  అనిపించటమేగాక అహం యొక్క ఉనికి తెలియకుండా పోతుంది. తానేది చేస్తున్నా దైవమే చేయిస్తున్నట్లుగా ఉంటుంది. దివ్యశక్తిని తీసుకుంటూ ఉన్నట్లుగా అనిపిస్తుంది.

లాలాజీ పేరుకు ముందు మనం చెప్పుకునే ఆదిగురువు, సమర్థ సద్గురు అనే మాటలు వారు పెట్టుకున్నవికావు. ఏడు మాసాల ప్రార్థన ద్వారా ఆదిశక్తిని తమ టెక్నిక్ (నేర్పు)తో దివినుంచి భువికి దిగివచ్చేలా చేసి లక్ష్యం సాధించినట్టివారు కనుక ఆదిగురువు అని అనబడ్డారు. దైవానికి అతిదూరంగా జరిగిపోయిన మానవమాత్రులకు అందుబాటులో లేని ఆ దివ్యసౌందర్యాన్ని మళ్ళీ వారు పొందేట్లు చేయగలగటంలో సఫలీకృతులయ్యారు కనుక సమర్థులయ్యారు. అనగా తమ ప్రార్థనతో ఆదిశక్తిని స్పర్శించగల్గినట్లుగా చేసి భువికి దిగిరాక తప్పనట్లుగా చేశారు కనుక 'సమర్థ్' అయ్యారు. ఆ విధంగా రప్పించిన ఆ దివ్య సౌందర్యాన్ని మనకు దర్శింపజేశారు కనుక 'సద్గురు'వు అయ్యారు. తమ ప్రార్థనా ఫలితంగా ఈ ప్రకృతి వాతావరణంలోకి ఆ ఆదిశక్తి బాబూజీ రూపంలో ప్రవేశించినట్లు గ్రహించి పరీక్షించుకునే నిమిత్తం ప్రాణాహుతిని ప్రసారం చేశారు. దానిని దివ్యశక్తి స్వరూపుడైన బాబూజీ గ్రహించి జీర్ణించుకోవటం మూలంగా తమ సంకల్పం సిద్ధించినట్లు వారు ధృవపరచుకున్నారు. అందుకే బాబూజీ, స్పిరిట్యుయల్ జైంట్ అన్నారు లాలాజీని. పసి బాలుని శరీరంతో బాబూజీ ఆ మహత్తర దివ్యశక్తిని భరించటం కష్టం కనుక, ఆ శరీరాన్ని కాపాడటం వారి బాధ్యత కనుక రక్షణ కవచంగా లాలాజీ బాబూజీలో ప్రవేశించారు. దీనినే జనులు మెర్జింగ్ (లయకావటం, లయం కావటం) అని అంటారు. సర్వశక్తి స్వరూపుడు బాబూజీ! ఏ రకంగా తిరిగినా నదులు సాగరంలో లీనమవుతాయేకాని నదిలో సాగరం వచ్చి లీనం కాదు. అదే విధంగా ఎవ్వరైనా ఆ సర్వశక్తి స్వరూపుడు బాబూజీలో లయం కావలసిందే.

**ప్రశ్న: ప్రార్థన ఎవరు తయారు చేశారు? 'ఓ మాస్టర్!' అనగా ఎవరు?**

**జవాబు:** ప్రతి సంస్థకు ఒక ప్రార్థన ఉంటుంది. ఇది పై (అనంతం) నుండి వచ్చిందని బాబూజీ చెప్పారు. 'ఓ మాస్టర్!' అనేది దైవాన్నే సంబోధించినట్లవుతుంది. ప్రార్థన బాబూజీ వ్రాయలేదు. ఆదిశక్తి నుండి వెలువడిన నాదం ప్రార్థన రూపంలో వచ్చింది. ఈ ప్రార్థన దివ్యశక్తితో కూడి ఉంది. భక్తిభావంతో ఈ ప్రార్థన చేస్తే

దాని నుంచి శక్తి వస్తుంది. దానిని స్మరించగానే దైవంతో సంబంధం ఏర్పడుతుంది. దానితోపాటే శక్తి కూడా ఆకర్షించబడుతూ ఉంటుంది.

బాబూజీ ఒక డివైన్ పర్సనాలిటీ. మానవమాత్రులకు ఈశ్వర ప్రాప్తి సమకూర్చటానికే వారు దివి నుంచి దిగి వచ్చారు. వారి సంకల్పానికి సహకరించమని, వారిలోనే ఐక్యం చెందమని సృష్టి, అందరికీ సంకేతం ఇస్తోంది. నీవే మా లక్ష్యం అనీ, నీ సహాయంలేక మేము దానిని చేరలేమని ప్రార్థనలోని శబ్దాలు తెలియజేస్తున్నాయి. ప్రార్థన, క్లీనింగ్ కూడా మన దృష్టిని దైవంవైపు మరల్చటానికే. దివ్యశక్తితో కనెక్షన్ ఏర్పడిన తర్వాత క్లీనింగ్ యొక్క అవసరం ఉండదు. ధ్యానంలో దైవాన్ని తలచుకొని వారిపైనే దృష్టి ఉంచితే – ఉదయం లేచినంతనే మన దినసరి కార్యక్రమాలు వాటంతట అవి జరిగిపోవడానికి శక్తి లభిస్తున్నట్లుగానే, దివ్యశక్తి కూడా లభిస్తూ ఉంటుంది. వారికి మనం అర్పణ చేసుకుని వారిని ఆశ్రయించామంటే మన ఆలనా – పాలనా బాధ్యత అంతా వారే వహిస్తారు. నిరంతర స్మరణ అందుకు ముఖ్యావసరం. దైవంతో అనగా దివ్యశక్తితో లింక్ (సంబంధం) ఏర్పడిన తర్వాత మన దైనందిన కార్యకలాపాలన్నీ ఆ శక్తి తోడ్పాటుతో వాటంతట అవే జరిగిపోతూ ఉంటాయి.

**ప్రశ్న: క్రొత్త అభ్యాసులు వస్తున్నారు. ధ్యానం ఎలా చేయాలి, ఎంతసేపు చేయాలి? అని అడుగుతున్నారు.**

**జవాబు:** ఇది పాత ప్రశ్న. మళ్ళీ అడుగుతున్నారు.

బాబూజీ ట్రాన్స్‌మిషన్ ఇచ్చాక ఒక అభ్యాసీని నీ కండిషన్ ఎలా ఉంది అని అడిగారు. అందుకు అతడు ఆలోచనలు వచ్చాయి అని చెప్పాడు. ఆలోచనల గురించి కాదు, నీలో కలిగిన దివ్యస్థితి ఏమిటి అని ప్రశ్నిస్తున్నాను అన్నారు. అతడు మళ్ళీ, ఆలోచనలు వచ్చినట్లే చెప్పాడు. అందుకు బాబూజీ నీవు దైవ స్మరణలో మునిగి ఉంటే ఆలోచనల సంగతి ఎలా తెలిసింది అన్నారు.

ఒకసారి నలుగురు స్త్రీలు సిట్టింగ్ తీసుకున్నారు. తర్వాత మీకు ఏమనిపించింది అని అడిగితే, చాలా బాగుంది. మాకు ఏమీ తెలియలేదని అన్నారు. వాస్తవానికి వారికి అలా అనిపించినది వారికి దివ్యస్థితి కలగటం వలన కాదు. పూసలు గుచ్చినట్లుగా ఒకదాన్ని అంటి మరొకటిగా వచ్చిన ఆలోచనలకు, సమస్యలకు వాటికి సమాధానలు, పరిష్కారాలు యోచిస్తూ (అల్లుకోవటం ద్వారా), వాటి ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉండటంవలన వారికి ప్రాణాహుతిగాని, వారి కండిషన్‌గాని తెలుసుకొనే అవకాశం లేకుండా పోయింది. బాహ్య ప్రపంచ ఆలోచనలతోనే వారికి ఆనందం అనుభవమైంది. బాహ్యంతో మన సంబంధం ఎంతగా కూరుకుపోయి (ముడిపడి) ఉంటే ధ్యానంలో అంత ఎక్కువగా ఆలోచనలు వస్తూ ఉంటాయి. అటువంటప్పుడు వాటి నుంచి తప్పుకోవాలంటే మన దృష్టిని మార్చుకొని మనలోనే ఉన్న దైవాన్ని –వారు మనవారు, మనలోనే ఉన్నారు అని మనస్ఫూర్తిగా భావించటం ద్వారా ఆలోచనలు దరిజేరవు. ఈ సందర్భాన్ని గురించి బాబూజీ చెప్పారు –నీవు హాజరై ఉంటే అనగా, సావధానంగా ఉంటే నేను ట్రాన్స్‌మిషన్ ఇవ్వగలుగుతాను, అని. అందుచేత ధ్యాన సమయంలో ప్రాపంచిక విషయాల మీదకుగాని, కుటుంబ వ్యవహారాల మీదకుగాని మనస్సు మళ్ళకుండా ధ్యానంలోనే ఉండే విధంగా చూసుకోవాలి.

బాబూజీ మనకు ట్రాన్స్‌మిషన్ ఇవ్వకపోవటమంటూ ఉండదు. వారు మనలో ఆధ్యాత్మికతను మేల్కొల్పి, సాక్షాత్కారం కలిగించటానికే వచ్చారు. మనం సావధానంగా ఉన్నా, లేకపోయినా శక్తి ప్రవాహం వస్తూనే

ఉంటుంది. వారి ఆశీస్సులు, ప్రేమ వర్షిస్తూనే ఉంటాయి. మనలో వారి ఉనికిని గుర్తుంచుకోవాలి, రూపాన్ని కాదు. కళాకారుడు తన మనస్సుకు నచ్చినట్లుగా దేవతామూర్తుల్ని చిత్రీకరిస్తాడు. శిల్పంగా మలుస్తాడు. అందుకని మూర్తిపూజ చేసేవారికి అది నచ్చుతుంది. రూపంమీదే దృష్టి గలిగినవారు లివింగ్ మాస్టర్ ఉండాలి అని భ్రమపడతారు. భక్త మీరా, శబరి వంటివారు సాక్షాత్కారం పొందగల్గారంటే వారు ఏ లివింగ్ మాస్టర్ ద్వారా పొందారు అన్నది నా ప్రశ్న. సాక్షాత్కారం పొందినవారందరికీ లివింగ్ మాస్టర్ ఉన్నారా? బాబూజీ మనకు సహజమార్గ శిక్షణ ఇచ్చారు. మనం దానిని అనుసరిస్తున్నాం. శిక్షకుడు బాబూజీ ఉన్నారు, వారు ఇచ్చిన శిక్షణ ఉంది. మానవమాత్రులను ఉద్ధరించే సంకల్పం ఉంది. వారి సంకల్పంతో శక్తి వస్తోంది. ఇంకా లేనిది ఏముంది? సంకల్పానికి దూరంగాని, ఆలస్యంగాని ఉండవు. వారిని భక్తి, ప్రేమలతోనే పొందవచ్చు.

ఒకరు మద్రాస్ నుంచి లాలాజీ విగ్రహం షాజహాన్‌పూర్ ఆశ్రమంలో ప్రతిష్ఠించటానికని తీసుకువచ్చారు. బాబూజీకి చూపించారు. వారు బాగుంది అని అన్నారు. వారిని స్వీకరించమని కోరగా "దానిని మీరే ఉంచుకోండి, లాలాజీ నాలోనే ఉన్నారు" అన్నారు. కనుక మనం అభ్యసించినది ఏమిటో, ఆచరిస్తున్నది ఏమిటో ఆలోచించుకోవాలి. ఈశ్వరుని పొందటమే మన లక్ష్యం. అందుకు బాబూజీ శరణు పొందాలి. వారిని స్మరించాలి. జ్ఞాపకం అనేది మనస్సుకు చెందినది. స్మరణ అనేది హృదయానికి చెందినది. మనస్సుకు చెందినది నిలకడలేనిది. హృదయానికి చెందినట్టిది స్థిరమైనది.

**ప్రశ్న: నిరంతర స్మరణకు సులభోపాయం ఏది?**

**జవాబు:** 'వారి'ని చేరటానికి హృదయంలో తపన, వేదన అనుభూతి చెందాలని బాబూజీ చెప్పారు.

శక్తి ఉన్నది. దానిని మీరు నిర్దేశించండి, పని కల్పించండి. నిరంతర స్మరణ ఉంటే అనవసరమైన ఆలోచనలు పారిపోతాయి –అని బాబూజీ మహరాజ్ చెప్పారు.

ఒక విషయం ఏమిటంటే, ఎవరైనా నిన్ను బ్రహ్మాండ మండలం చేర్చుతాను అని అనవచ్చు. దాని అడ్రస్సు వారికి తెలియాలి కదా! కాని మీరు ప్రేమ, భక్తి కలిగి, తపన చెందితే అదే చేర్చుతుంది. మీరు మీ అస్థిత్వాన్ని (ఉనికి) మరచిపోయినట్లయితే వారి (బాబూజీ) ఉనికి తెలుస్తుంది. అనగా మన ఎదుట వారు ఉంటారు.

**ప్రశ్న: ధ్యానం చేస్తున్నప్పుడు, అభ్యాసీ తాను ఏ రీజియన్‌లో ఉన్నాడో తెలుసుకోవటం ఎలా?**

**జవాబు:** సామీప్యత యొక్క అనుభవం చెందాలనీ, అభ్యాసీకి ఆ సందర్భంలో తాను ఎక్కడ ఉన్నదీ గ్రహించే అవకాశం ఉండదని బాబూజీ చెప్పారు. కొంతమంది సెంట్రల్ రీజియన్‌లో ఉన్నామని అనుకోవచ్చు. బాబూజీ అది సెంట్రల్ రీజియన్ అని చెప్పకుండా ఉంటే దాని సంగతి ఎవరికి తెలుస్తుంది? అందుచేత మనం ఎక్కడ ఉన్నామన్న జిజ్ఞాసకు బదులు దైవానికి సామీప్యతానుభవం పొందటం ముఖ్యం. అంతేకాని మైండ్ రీజియన్, హార్ట్ రీజయన్, హిరణ్యగర్భ మండలాల్లో ఎక్కడ ఉన్నామో అనే ధ్యాస పెట్టుకోవటం అనవసరం. భక్తుడు అనుభవం పొందుతున్న సమయంలో అతనికి ఆ పనిలో తీరికేలేదు. తాను ఎక్కడ ఉన్నదీ తెలియదు.

**ప్రశ్న: ధ్యానంలో ఫీలింగ్ ఎలా ఉండాలి?**

**జవాబు:** కరిగిపోవటం అనగా అహం (నేను) కరిగిపోవటం అనేది ధ్యానం కాదు. అది క్లీనింగ్. నేను చేశాను అనుదానిలో కర్తగా భావించటం ఉంటుంది. అందువలన ఐనెస్ అనగా నేను తత్త్వం తగ్గిపోవాలి. క్లీనింగ్‌లో అనవరసరమైనవి తొలగిపోతాయి. ఏదైతే మీకు అనవసరమో అది తొలగిపోతుంది. క్లీనింగ్, మెడిటేషన్ రెండూ ఒకేసారి జరగవు. అవి రెండూ వేరుగా ఉంటాయి. ప్రేమ కలిగినప్పుడు మీకు ధ్యానం చేయాలనిపిస్తుంది. అపుడు క్లీనింగ్ అవసరంలేదు. బాబూజీ మహరాజ్ సిట్టింగ్‌లో బంధనాలను తొలగిస్తారు. ప్రార్థన ద్వారా మనం పూర్తిగా సావధానం చెందుతామని, మనలోనే ఉన్నాడనుకొన్న దైవంతో కలిసి ఉండే ప్రయత్నం చేయమని బాబూజీ మహరాజ్ మనకు చెప్పారు. మెల్టింగ్ అనగా కరిగిపోవటమనేది ఒక కండిషన్ రావటానికి జరుగుతుంది. బాబూజీ మహరాజ్ మన కోసం వచ్చారన్న భావం ద్వారా మనకు వారితో కనక్షన్ (సంబంధం) కలిగి వారి ఎదుట మనం ఉన్నట్లు, వారి ప్రతిబింబం కనిపిస్తుంది. దీనిని పొందటానికి తపన చెందాలి.

నేను బాబూజీకి 'ధ్యానం' అనుదానికి అర్థం ఏమిటి అని లేఖ వ్రాసినప్పుడు వారు – నీకు ఎప్పుడు నన్ను చూడాలని ఉంటే అప్పుడు  నీకు ప్రాణాహుతి వస్తుంది. నన్ను చూడటమేకాదు నాచేత పని చేయించు, అన్నారు. అపుడు నేను ధ్యానంలో మిమ్మల్ని చూశాక ఇంక ధ్యానంతో పనేముంది అన్నాను. అపుడు బాబూజీ, "నేను కనిపించినంతనే నీవు సరిపెట్టుకోకుండా నాకు పని కల్పించి దివ్యశక్తిని గుంజుకో" అని అన్నారు.

లయావస్థ అనేది నదివెళ్ళి సముద్రంలో కలసిపోవటం వంటిది. బాబూజీ రూపంలో మన అస్తిత్వం కలిసి లీనమైపోతుంది. మన అహం కరిగి వారిలో ఐక్యమైపోతుంది. వారి పరిశోధన అంతా మానవమాత్రుల ఉద్ధరణకే. అహంను తొలగించుకుంటే ఆత్మోన్నతి పొందటానికి, బంధనాలు మళ్ళీ పునరావృతం కాకుండా ఉండటానికి మార్గం సులభమవుతుంది. 'నేను' అనుదానిని వదిలివేస్తే అంతా 'నీవే' అనుకోవటంతోనే అది సంభవమవుతుంది. బంధనాలు మన ఆధ్యాత్మిక పురోగతికి అవరోధాలవుతాయి.

**ప్రశ్న: బాబూజీ పరిశోధన యొక్క ఉద్దేశ్యం ఏమిటి?**

**జవాబు:** బాబూజీ పరిశోధన యొక్క సారాంశం ఏమిటంటే, మానవ మాత్రులందరూ అంతిమం చేరాలన్న సంకల్పమే. బంధనాలన్నీ (బాండేజస్) తొలగించబడితే పురోగతి సాధించటం సులభమవుతుంది. భగవంతుడు మానవులను అంతిమానికి చేర్చాలన్న సంకల్పానికి తోడుగా వారి ప్రేమనూ పంచుతున్నారు. ప్రతిబంధకాలు అన్నింటినీ తొలగిస్తున్నారు. నేను నా మనస్సులో హృదయ మండలం ఎలా దాటాలి అని తలచినపుడు, ఏ ప్రతిబంధకాలుగాని, హద్దులుగాని లేనట్లుగా నేను గమనించాను. కనుక అంతిమానికి యాత్ర సులభతరమైంది. బాబూజీ ఎ,బి,సి,డి అనే పాయింట్లు గుర్తించారు. వీటిని ఒకదాని తరువాత మరొకటి దాటుకుంటూ పోవలసి ఉంటుందని తమ పరిశోధన ద్వారా నిర్ధారించారు. వారి చేయూత, ప్రేమవలన ఆ పాయింట్ల మధ్యదూరం చాలా స్వల్పంగా ఉండి, ఆ దూరం అధిగమించబడి వాటి ఉనికే తెలియకుండా పోయింది. వారి మీద పూర్తిగా ఆధారపడి వారినే ఆరాధించినట్లయితే, వారిపైనే ప్రేమ, భక్తి పెంచుకున్నట్లయితే అవరోధాలన్నీ తొలగిపోయి లక్ష్యప్రాప్తి సులభమౌతుంది. ప్రతిపాయింట్ వద్ద వారు ఉన్నట్లు కనిపిస్తారు.

వారే మాస్టర్ అనిపిస్తుంది. కనుక ఏంచేయాలో మీరే నిర్ణయించు కోవాలి. వారికి పూర్తిగా సమర్పితమైపోతే వాతావరణమంతటా బాబూజీ దర్శనమే కలుగుతుంది. బాబూజీ నన్ను అంతిమం యొక్క ప్రాంతానికి తీసుకు వెళ్ళినప్పుడు వారి దృష్టి, ప్రేమ నాపై ఉన్నాయి కాని నేను నా ఉనికిని గుర్తించలేకపోయాను. అదంతా బాబూజీ కృపయే. బాబూజీ కృప, ప్రేమ లేకుండా సహజమార్గం లేదు. ఇటువంటి ప్రేమమూర్తి భూమి మీద అవతరించటం ఇదే మొదలు, చివర అనదగి ఉంటుంది. గాడ్లీ రీజియన్ నుంచి కాకుండా ఇంకా పైన అంతిమం నుంచి డివైన్ పర్సనాలిటీ అవనిపై అవతరించిన ఈ శకం అన్నింటికంటే ఘనమైనది. ఇది సత్యయుగం కంటే కూడా గొప్పది – అని వారు వ్రాశారు. అంతిమంకు చేరటం మానవ మాత్రులకు మాత్రమే సాధ్యం. అక్కడకు చేర్చగలవారు బాబూజీ ఒక్కరు మాత్రమే. ఎందుకంటే, వారు ఉన్నతమైన ఆ అంతిమం నుంచి వచ్చారు.

ఏ ఒక్కరివో బంధనాలను తొలగించటం సులభసాధ్యమేమో కాని సమస్త మానవాళి యొక్క బంధనాలను, హద్దులను తొలగించి ముక్తికి అర్హులుగా చేయటమనేది అసాధ్యం. ఆసాధ్యమైనదానిని తమ ప్రేమతో, దివ్యశక్తితో సుసాధ్యం చేయటమే వారి పరిశోధనా ఫలితం. అందుకొరకు ఈ ప్రకృతిలో వారు ప్రవహింపజేస్తున్న దివ్యశక్తి వారి సంకల్పం నెరవేరేంతవరకు నిలిచి ఉంటందేకాని వారు తిరిగి తీసుకోరు. ఈ పరిశోధన (అన్వేషణ) మానవ మాత్రులందరి ప్రయోజనం కోసం నామీద కొనసాగించినట్లు బాబూజీ చెప్పారు. పరిశోధన అనేది బంధనాలను (అడ్డంకులు) తొలగించటమన్న మాట. ఒకసారి ఆ బంధనాలు తొలగించబడిన తరువాత మళ్ళీ ఏర్పడవు. అపుడు లయావస్థ కలుగుతుంది.

ఆలోచనలు మన కోరికలు, పనులనుబట్టి వస్తూ ఉంటాయి. కోరికలనేవి బంధనంగా పరిణమిస్తాయి. బాబూజీ తమ కుమారునికి మంచి ఇల్లు ఇచ్చి అందులో ఉండమన్నారు. పాత ఇల్లు బాగుండకపోయినా అతను దానిని విడిచి క్రొత్త ఇంటికి వెళ్ళలేదు. ఆ విధంగా ఇంటితో అనుబంధం ఏర్పరచుకుంటే మానవుడు మూడు జన్మలు ఎత్తవలసి వస్తుంది అని బాబూజీ చెప్పారు.

'P' చెప్పినట్లుగా, తాను ప్రిసెప్టర్స్ యొక్క పవర్‌ను (శక్తిని) లాగివేస్తాననటం (పెరికివేస్తాననటం) సంభవం కాదు. ఒకసారి ఇచ్చిన పవర్ (శక్తి)ని తీసుకోవటమనేది జరగదు. బాబూజీ ఆ మాట చెబుతూ నాకు తిరిగి పవర్ ఇవ్వమని భిక్ష అడగటానికి – నేను భిక్షకుణ్ణికాను అన్నారు. శిక్షకుడు (నేర్పేవాడు) నిర్వర్తించాల్సిన ధర్మం ఏమిటంటే, ఒకర్ని పైకి తీసుకు వెళ్ళటమేకాని క్రిందకు లాగకూడదు. ఆ పని చేయబూనితే అతని శక్తి విజయం సాధించలేదు. అలా తీసివేయాలంటే ఆ శక్తిని ఇచ్చినవారి శక్తి కంటే ఇంకా గొప్పశక్తి కలవారై ఉండాలి. అది అసంభవం కూడా.

ఒకరు, సహజమార్గం చాలా గొప్పదే కాని – విగ్రహారాధన అవసరంలేదనటం నాకు నచ్చటంలేదు అన్నారు. అందుచేత, మీరు చేసేదానిని సక్రమమైన మార్గంలో చేయండి. దాని విశిష్టతను చాటి చెప్పండి. అంతేకాని విగ్రహారాధన మంచిది కాదనిగాని, దానిని చేయవద్దనిగాని నచ్చచెప్పటానికి ప్రయత్నించకండి (లేదా వాటిని ఖండించటానికి ప్రయత్నించకండి) విగ్రహాలను ఎవరు చేశారు? కళాకారులు తమ మనస్సుకు తోచినట్లు రూపం దిద్దారు. రంగులు వేశారు. అది వారి కళాదృష్టి మాత్రమే, దైవాన్ని చూసి తయారు చేయలేదు. వారు సృష్టించిన విగ్రహాలను ఆరాధన చేయటంవలన ఫలితం ఏముంటుంది! అందులో

ఉన్నది మానవుని ఊహాశక్తి. శిల్పి లేదా కళాకారుడు వాటిని తయారుచేయటంలో అతని శక్తి అందులో కూర్చబడుతుంది. అనగా అతని శక్తి తరిగిపోతుంది. అందుచేత ఒక విగ్రహం ఏ భగవంతుడి రూపంగా చెప్పబడుతుందో ఆ భగవంతుని మీద దృష్టి నిలపాలిగాని విగ్రహాన్ని పూజించటంమీద కాదు.

విగ్రహపూజ చేసేవారిని పూజారి అంటారు. అంతేకాని అతడు ఆరాధకుడు కాదు. అతడు దినమంతా విగ్రహం వద్ద ఉన్నంతమాత్రాన అతడు ఋషికాలేడు; అలానే భక్తుడుగా గాని, సెయింట్‌గా గాని కాలేడు. అందుచేత అతడు పూజారి మాత్రమే. భక్తమీరా వంటివారు విగ్రహాన్ని కాకుండా హృదయంతో, భక్తితో దైవాన్ని పూజించారు. అందుచేత వారిని భక్తులు అన్నారు. ఈ విగ్రహాలు మనుషులు చేసినవాటిని ఈశ్వరుడే చేశాడనే భావంతో పూజచేస్తే ఈశ్వరుడు దొరుకుతాడు. మీరా వంటి గొప్పభక్తులు విగ్రహాలను కాకుండా రియాలిటీని (సత్యత్వాన్నే) ఆశ్రయించారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఫుల్ ప్రిసెప్టర్ (పరిపూర్ణ ప్రిసెప్టర్) అనగా ఏమిటి?**

**జవాబు:** ఫుల్ ప్రిసెప్టర్ అనగా పని యొక్క ఆవరణ (Work of Sphere) విశాలమవుతుంది. అనగా అది పవర్‌లో పవర్ (శక్తిలో శక్తి). ఆ శక్తిని తగ్గించటంగాని, దానిని కదలించటంగాని జరగదు. దివ్యశక్తి యొక్క పరిధి విస్తరించి ఉంటుంది. దానివలన ప్రిసెప్టర్, విదేశాలలో ఉన్న అభ్యాసీలకు కూడా దివ్యశక్తిని ప్రసారం చేయగలడు. ఆ విధంగా ప్రిసెప్టర్ చేయగలిగినట్లయితే ఈ ప్రపంచాన్ని వీడివెళ్ళాక బంధనం (బాండేజ్) ఉండదు. దీనిని 'నేను' చేస్తున్నాను అనుకుంటే అక్కడ అహం ప్రవేశిస్తుంది. మళ్ళీ బంధనం ఏర్పడుతుంది. అందుచేత బాబూజీ అలా భావించరాదని అన్నారు.

ఫుల్ ప్రిసెప్టర్ కావాలి అంటే ఎటువంటి స్థితిని పొందాలి అనే ప్రశ్న వస్తుంది. నేను గ్రహించిన వాస్తవం ఏమిటంటే – ప్రిసెప్టర్ యొక్క ఉనికి బాబూజీలో లయమైపోతున్నప్పుడు, దివ్యశక్తి అంతా అతనిలో లీనమైపోవటం ప్రారంభమవుతుంది. ప్రిసెప్టర్‌కు ట్రాన్స్‌మిషన్ ఇచ్చే పని పురమాయించినపుడు అతనికి మాస్టర్ ఇచ్చే శక్తిని పూర్తిగా విలీనం చేసుకునే సత్తా ఉండదు. అతను – ఈ పనిని నేను ఎలా చేయగలను, ఎలా చేయగలను అనుకుంటూ కొంత కష్టంగా అనుభూతి చెందుతాడు. వాస్తవానికి అది అతనికి ఇబ్బందికరం కాదు. అలా వచ్చిన దివ్యశక్తి అతను జీర్ణించుకోగా మిగిలినది ఆవరణగా ఏర్పడుతుంది. ప్రిసెప్టర్ మంచి వర్కర్ అయినప్పుడు, అలా బాబూజీ నుంచి వచ్చిన దివ్యశక్తి అంతా అతనిచేత సంగ్రహించబడుతుంది. నేను గ్రహించిన వాస్తవం ఏమిటంటే, ప్రిసెప్టర్ యొక్క అస్తిత్వం (ఐడెంటిటి) బాబూజీ మహరాజ్‌లో లయం కావటం ప్రారంభమైనప్పుడు, ఆ శక్తిని సంగ్రహించుకోగలిగిన సత్తా వస్తుంది. ఫుల్‌ప్రిసెప్టర్ అయినవారు ఆ శక్తిని పూర్తిగా గ్రహించి ఆ శక్తిమీద ఆధిపత్యం పొందుతారు. ఆ శక్తికి అతను మాస్టర్ అవుతాడు. కనుక సాధారణ ప్రిసెప్టర్‌కు, ఫుల్ (సంపూర్ణుడైన) ప్రిసెప్టర్‌కు ఈ వ్యత్యాసం ఉంటుంది. ఒకవేళ ఆ విధంగా వచ్చిన శక్తిని గ్రహించలేకపోయిన కారణంగా అభ్యాసులకు అందించలేకపోయినట్లయితే ఆ శక్తి నేరుగా బాబూజీ నుంచియే అభ్యాసులకు ట్రాన్స్‌మిట్ అవుతూ ఉంటుంది. అనగా ప్రిసెప్టర్ దివ్యశక్తిని గ్రహించటానికి సిద్ధంగా లేనట్లయితే ఆ శక్తి అతనికే పరిమితమైపోకుండా హద్దును అధిగమించి నేరుగా అభ్యాసులకు ప్రసారమవుతుంది. ఫుల్‌ప్రిసెప్టర్ అయినవారు ఆ దివ్యశక్తిని పూర్తిగా జీర్ణించుకోగలిగినపుడు, ఆ శక్తిమీద

ఆధిపత్యం కలిగి శక్తియొక్క ఆవరణ విశాలమవుతుంది. దానివలన విదేశాలలో ఉన్న అభ్యాసులకు కూడా ట్రాన్స్‌మిషన్ ఇవ్వగలిగిన సత్తా వస్తుంది.

నేను ఈ విధంగా బాబూజీ ఇచ్చిన ఆధ్యాత్మిక కార్యాన్ని నిర్వహించటం చూసి డాక్టర్ వరదాచారిగారు –నీవు పరిపూర్ణమైన (ఫుల్) ప్రిసెప్టరువు, అని అన్నారు. అలా అనటంవలన అహం జనిస్తుందని, కనుక అలా అనవద్దని బాబూజీ వారిని వారించారు.

ఢిల్లీకి చెందిన ఒక ప్రిసెప్టర్‌కు, చారీజీ పనిచేయటానికై అనుజ్ఞనిచ్చారు. ఒకసారి అతడు లక్నో వచ్చాడు. అపుడు అతను ఆ దివ్యశక్తిని పూర్తిగా జీర్ణించుకుంటున్నట్లు నేను గమనించాను. అతని ద్వారా ఆ శక్తి జారీ అవుతున్నట్లు, బాబూజీ మహరాజ్ ఇస్తున్నట్లుగా, నేను చూసాను. అపుడు నేను అతనితో నీవు పరిపూర్ణ ప్రిసెప్టరువు అని చెప్పగా తాను కూడా అలాగే అనుభూతి చెందుతున్నట్లుగాను, తాను విదేశాలలోని అభ్యాసులకు కూడా ట్రాన్స్‌మిషన్ ఇవ్వగలననీ చెప్పాడు. అతడు శక్తిని తనదిగా చేసుకుని, దానిమీద ఆధిపత్యం సంపాదించాడు కనుక అతడు ఆ పని నిర్వహించగలుగుతున్నాడు.

ఒకసారి అలహాబాద్‌లో ఒక ప్రిసెప్టర్, అభ్యాసుల మధ్య కూర్చుని – నేను పరిపూర్ణ ప్రిసెప్టరును, అని దాంబికంగా చెప్తుతున్నాడు. వాస్తవానికి అతనిలో ఆ శక్తిలేదు, అహంభావం తప్ప. ఇది చాలా హానికరమైన విషయం. నేను అపుడు అతనితో – నీవుగాని, నేనుగాని ప్రిసెప్టర్లము కాము. దివ్యశక్తియే ప్రిసెప్టరు. నీవు శక్తి యొక్క కేంద్రంతో అనుసంధానం కాబడినపుడు, నీవు దానిని (ట్రాన్స్‌మిట్) ప్రసారం చేయటానికి నియోగించబడినట్లుగా అనుభూతి చెందినపుడు ఆ శక్తి నీ ద్వారా ప్రసారమవుతుంది. అలాకాక పోయినట్లయితే అది నేరుగా ప్రసారమవుతుంది – అని అన్నాను.

ఒకసారి ఆశ్రమం నిర్వాహకుడు ఉమాశంకర్ అభ్యాసుల మధ్య కుర్చీలో కూర్చుని –నేను ప్రిసెప్టరుని, నేను ప్రిసెప్టరుని అని పలుమార్లు హెచ్చరిస్తున్నాడు. ఆ తర్వాత అతడు బాబూజీవద్దకు వచ్చినప్పుడు వారు – నీకు అప్పగించిన పని చేయటానికే నిన్ను ప్రిసెప్టరుగా చేశాను. ఆ సమయం వరకే నీవు ప్రిసెప్టరువు కాని రోజంతా కాదు. అలాగే ఇతర సమయంలో నీవు కూడా అభ్యాసీవే –అన్నారు. బాబూజీ చెప్పిన మాటల యొక్క అంతర్యం నాకప్పుడు అర్థమయ్యింది. బాబూజీ మాటలు చాలా అర్థవంతమైనవిగా ఉంటాయి. మీరు ఆ స్థాయికి చేరినపుడు వారి మాటలు మీకు అర్థమవుతాయి.

**ప్రశ్న: డిసెప్టరు అంటే ఏమిటి?**

**జవాబు:** దానికి అర్థం లేదు. అయితే బాబూజీ చెప్పినట్లు డిసెప్టరు ఎనిమిదో తరగతి టీచరైతే, ప్రిసెప్టరు డిగ్రీ క్లాసు టీచర్ అవుతారు. ప్రిసెప్టరును అన్న భావన అహంకు, బంధనానికి దారితీసి, అభ్యాసీ అంశ అధికంగాను, ప్రిసెప్టర్ అంశ స్వల్పంగాను ఉంటుంది.

**ప్రశ్న: పరిపూర్ణ (ఫుల్) ప్రిసెప్టర్ ఎలా అవుతారు?**

**జవాబు:** ఎప్పుడైతే 'అహం' అనగా 'నేను' పూర్తిగా కరిగిపోతుందో అపుడు బాబూజీలో లయావస్థ ప్రారంభమవుతుంది. అపుడు శక్తి మండలం లేదా ఆవరణ వ్యాపిస్తూ అధికమవుతుంది. ప్రథమ సిట్టింగునుంచే, నీవు వారి (పవర్) శక్తితో పనిచేస్తున్నాను అనే భావం కలిగి ఉన్నట్లయితే, వారి శక్తి తరంగాలు వస్తూ ఉంటాయి. వారితో బాగా సహకరించినట్లయితే ప్రతిదీ వారిచే నిర్వహించ బడుతుంది. అపుడు బాబూజీ యొక్క శక్తి ప్రవాహంలో నీవు ప్రవహిస్తున్నట్లుగా అనుభూతి కలుగుతుంది. బాబూజీయే నీయొక్క బాధ్యత వహిస్తారు.

బాబూజీని ఒక వ్యక్తియొక్క శక్తిని వెనక్కు తీసుకోమని అడిగినప్పుడు అది తమవంతు పనికాదని అన్నారు. ఇంకా ఇలా చెప్పారు– ప్రకృతి సృష్టించిన దానిని వెనక్కి తీసుకోవటం జరగదు. ఆ శక్తి నిచ్చిన సమయంలో అతడు మంచివాడుగానే ఉన్నాడు. దీనిని ఆలోచించినట్లయితే అనర్హుడైన వారికి శక్తిని ఇచ్చినట్లు అనుకోవాల్సి వస్తుంది. సృష్టి నిర్మాణం వినాశనం కొరకు జరగలేదు. వినాశనమనేది మన స్వయంకృతం.

సృష్టికర్త యొక్క సృష్టి వ్యాప్తి చెందటానికే! ఆ విధంగా అది విస్తరించి పరిమితిని దాటినపుడు దానంతట అదే తిరుగుముఖం పట్టుంది.

బాబూజీ అభ్యాసీకి ఇచ్చిన దివ్యశక్తి అతని అభ్యున్నతికే. దానిని అతడు ఈ జన్మలోనే పొందలేకపోయినా మూడు జన్మలవరకు  అందుబాటులోనే ఉంటుంది. అది వ్యాప్తి చెందుతూనే ఉంటుంది.

అభ్యాసీకి మూడు సిట్టింగ్‌లతో ప్రారంభించి శక్తిని ఇవ్వటం జరుగుతుంది. అలా ఇచ్చిన శక్తిని అతడు ఉపయోగించుకో లేకపోయినట్లయితే అది వాతావరణంలో అలాగే స్థిరంగా ఉండి, అతనిలో దానిని పొందాలనే తపనను పురికొల్పి, అతడు ఆ విషయాన్ని గ్రహించగానే దానిని వినియోగించుకోవటం జరుగుతుంది. అంతేకాని ఇచ్చినటువంటి శక్తి వృధాకాదు.

**ప్రశ్న: అభ్యాసీ సిట్టింగ్‌లో కూర్చున్న వెంటనే ట్రాన్స్‌మిషన్ యొక్క అనుభూతిని పొందలేడు. కొంతసేపటికి పొందటం లేదా అప్పుడప్పుడు  పొందటం జరుగుతుంది. ఎందుచేత?**

**జవాబు:** ట్రాన్స్‌మిషన్ పొందటానికి సిద్ధంగానే ఉంటారు కాని, వారు ఆలోచనలో నిమగ్నమై ఉంటారు. అందుచేత ట్రాన్స్‌మిషన్ రావటం లేదనుకుంటారు. కాని అది నిరాఘటంగా వస్తూనే ఉంటుంది. అభ్యాసీ యొక్క దృష్టి అనవసరపు ఆలోచనలవైపు మళ్ళటమే అందుకు కారణం. ట్రాన్స్‌మిషన్ ఉన్నప్పటికి అభ్యాసీ నిమగ్నం కానందున జరగాల్సిన పని జరగదు. అప్పుడు ప్రిసెప్టర్ సరిచేయలేకపోతే ట్రాన్స్‌మిషన్ ఫలించదు. ఉదాహరణకు – ఒక గదిని శుభ్రం చేసినప్పటికి ఇంకా అపరిశుభ్రంగా ఉన్న భాగంమీదనే దృష్టి ఉన్నట్లయితే అశుభ్రంగా    ఉన్నట్లే అనిపిస్తుంది. ధ్యానానికి కూర్చునీ అనవసరపు ఆలోచనలమీద దృష్టి పెట్టటం కూడా అటువంటిదే. ట్రాన్స్‌మిషన్ యొక్క ఫలితం దక్కాలంటే అభ్యాసీ, ప్రిసెప్టర్ కూడా మనస్ఫూర్తితో వ్యవహరించాలి.

అభ్యాసీ రాత్రి నిద్రకు ఉపక్రమించేముందు ప్రార్థన చేసుకొని ఇతర ఆలోచనలు లేకుండా దైవానికి సమర్పణ భావంతో పండు కొన్నట్లయితే నిరంతర స్మరణ కొనసాగుతూనే ఉంటుంది. అలాగే ట్రాన్స్‌మిషన్ కూడా కొనసాగుతూ అతని పురోగతి కూడా జరుగుతూ ఉంటుంది. దైవంతో కనక్షన్ తెగిపోకుండా ఉంటుంది. శరీరం నిద్రపోతుందేకాని ఆత్మ నిద్రించదు. దైవానికి నిద్ర అంటూలేదు.

**ప్రశ్న: సహజమార్గం ప్రపంచమంతటా విస్తరిస్తోంది. కాని కొంతమంది ప్రిసెప్టర్స్ బాగా తర్ఫీదు కాకుండానే అభ్యాసులకు ట్రాన్స్‌మిషన్ ఇస్తున్నారు. వారు ఎలా ట్రాన్స్‌మిషన్ ఇవ్వగలరు?**

**జవాబు:** అది అభ్యాసీమీద, అతని విశ్వాసంమీద అధారపడి ఉంటుంది. సహజమార్గ విధానం అనేది మూలశక్తితో సంధానం చేయబడి ఉంది. సంకల్పం ఉన్నప్పుడు శక్తి వస్తుంది. మానవాళికి సాక్షాత్కారం కలిగించాలన్నది బాబూజీ సంకల్పం. ఆ సంకల్పానికి శక్తితోడై ఉంది. అభ్యాసీ కూడా ఆ సంకల్పం కలిగి ఉంటే ప్రిసెప్టర్ ఎటువంటివాడైనా (సమర్థుడైనా, కాకపోయినా) ఆ శక్తి నేరుగా అభ్యాసీకి లభిస్తుంది. దైవం

మనలోనే ఉన్నాడని, మనం దైవంతో సంబంధం కలిగి ఉన్నామని భావన చేసుకోవాలి. దివ్యశక్తి (ప్రాణాహుతి) మనకు లభిస్తూ ఉంటుంది.

పాప, పుణ్యాలు అనేవి మన మనస్సుకు చెందినవిగాను, ఆలోచనలకు తగినవిగాను ఉంటాయి. మన ఆలోచనలు దివ్యంవైపు మరల్చితే మంచి పనులేగాని చెడు పనులు చేయం. గంగా స్నానం చేస్తే పాపాలు హరించిపోతాయని అనుకుంటారు. స్నానం శరీరానికిగాని మనస్సుకు కాదు. కనుక మంచిని స్వీకరించి చెడును విడిస్తే ఆధ్యాత్మిక పురోగతి ఉంటుంది.

సహజమార్గ విధానం బాబూజీచేత ప్రవేశపెట్టబడింది. అది వారితో అనుసంధానమై ఉంది. దీనిని స్థాపించిన వారి సంకల్పంతో పెనవేసుకుని ఉంది. కనుక వారి సంకల్పశక్తి కూడా దానికి తోడై ఉంటుంది.

మావన మాత్రులకు సాక్షాత్కారం కలిగించాలనే బాబూజీ సంకల్పంతో, సాక్షాత్కారం పొందాలనే మన సంకల్పాన్ని కూడా జతచేయాలి. మానవుడు తప్పు చేయటం సహజమే కావచ్చు. కాని దివ్యాలోచనలతో సరిదిద్దుకొని దివ్యత్వాన్ని పొందాలి. సర్వమానవాళి సాక్షాత్కారం పొందాలనేదే దైవ సంకల్పం. ఆ సంకల్పానికి శక్తితోడై ఉంది. ప్రతిఒక్కరూ సహజమార్గాన్ని అనుసరించి సాక్షాత్కారం పొందాల్సి ఉంది. ఆ విధంగా మార్పు రావాలి. అలాంటి మార్పుతో నూతన శకం ప్రారంభమవుతుంది.

సెంటర్ ఇన్‌ఛార్జ్ సింహద్వారం వంటివారు. ముఖ్యమైన లింక్ వారే. అందరిని ఇక్కడకు పంపేదీ వారే. ఇక్కడకు వచ్చిన అభ్యాసులు ఆధ్యాత్మికంగా ఎంతో లాభపడతారు. ఏదైనా కారణంవలన రాలేనివారు ఎలర్ట్‌గా – ఆధ్యాత్మికతా దృష్టితో, సావధానంగా ఉండి, బాబూజీని మనస్సులో వేడుకుంటే వారందరూ నా (కస్తూరి బెహెన్) దృష్టికి వస్తారు. అప్పుడు నేను వారందరికీ మీ కృపాధారను వర్షింప జేయమని బాబూజీని వేడుకుంటాను. ఇలా ఆధ్యాత్మిక అభిలాషలు వచ్చినప్పుడు, ఆ వచ్చిన అభ్యాసులేకాక మొత్తం సెంటరూ –ఆ సెంటర్‌లోని అభ్యాసులందరూ కూడా నా దృష్టికి వస్తారు. ఈ వచ్చేవారికి సహాయం చేసినవారు, లిస్టులు తయారుచేసినవారు, టిక్కెట్లు రిజర్వు చేసినవారు అందరూ కూడా ఆ యొక్క రోజు నుండీ నా దృష్టిలో ఉంటారు.

బాబూజీ మహరాజ్ చెప్పినది ఏమిటంటే, ప్రిసెప్టర్ ఎప్పటికీ రిటైర్ అవ్వరు. రిటైర్ అయితే అనారోగ్యం పాలవుతారు. కనుక ఎప్పటికీ రిటైర్ కారు. బాబూజీ మహరాజ్‌కు రిటైర్‌మెంట్ లేదు. అందువలన ప్రిసెప్టర్స్‌కు కూడా రిటైర్‌మెంట్ లేదు. వారు నిరంతరం తమ పనిలో నిమగ్నమై ఉంటారు.

అభ్యాసీలు ప్రాపంచిక విషయాలకు ఎక్కువగా శ్రమ చేస్తారు. అందోళన పడతారు. కాని నిరాశపడరాదు. ఎంత కష్టపడాలో అంతా కష్టపడవలసిందే. శ్రీ బాబూజీ అంటారు – మెదడులో నిరాశ వచ్చిందంటే, అది బలహీనపరుస్తుంది. ఆధ్యాత్మికతలో కూడా అంతే. కాని అందరూ సాక్షాత్కారం పొందాలనేదే బాబూజీ సంకల్పం. మనం కూడా ఆ 'అందరి'లో ఉన్నాం. మనకూ సాక్షాత్కారం పొందడానికి సమయం తప్పక వస్తుంది అనే ఆశతో ఉండాలి. ఎవ్వరిలోను, ఏ విధంగాను 'నిరాశ' మాట రాకూడదు. నిరాశ విషం వంటిది. అది బలహీనతను తెస్తుంది. కనుక నిరాశను దరిచేరనీయకూడదు. ఎందుకంటే, ప్రపంచంలో

అవకాశాలు సమాప్తి కాలేదు. మార్గాలు మూసుకుపోలేదు. ఆధ్యాత్మిక మార్గం కూడా మూసుకుపోలేదు. నిరాశ శబ్దం మనలోనికి రాకూడదు.

శ్రీ సర్వేష్ తల్లి (శ్రీ బాబూజీగారి ధర్మపత్ని) అనారోగ్యం పాలైయ్యారు. డాక్టర్ ఆమె బ్రతికే ఆశలేదని చెప్పారు. అప్పుడు శ్రీ బాబూజీగారి గురుభాయి ఒకరు ఇలా అన్నారు –"భాయీ! నాకు చాలా బాధగా ఉన్నది. పిల్లలేమో చాలా చిన్నవాళ్ళు. మీరేమో సహజమార్గాన్ని చూసుకోవాలి. ఎంతోమంది వస్తుంటారు కదా! నాకు చాలా నిరాశగా ఉంది" అని అన్నారు. అప్పుడు శ్రీ బాబూజీ,– "మీకు నిరాశగా ఉంది. నాకు అలా లేనేలేదు. పిల్లలకు తక్కువైన తల్లిప్రేమ తండ్రి నుండి పొందుతారు. పిల్లలకు తక్కువైన తల్లిశక్తిని నాలోనికి వచ్చేలా నాకు లాలాజీ చేస్తారు. పిల్లలు నా నుండి అది పొందుతారు" అని అన్నారు. మనం నేర్చుకోవడానికి ఇది ఒక శిక్షణ. ఏ సందర్భంలోను నిరాశ చెందరాదు. మనం ప్రాపంచిక, ఆధ్యాత్మిక పనుల్లో ఏ విధమైన నిరాశ చెందరాదు. కొందరు ప్రిసెప్టర్లు అభ్యాసీలతో అంటూ ఉంటారు– "నీలో ఇది లేదు, అది లేదు, అభివృద్ధి లేదు, కాలేవు" అని. ఆ మాటల్లోని 'లేదు' అనే మాటను తొలగించాలి. అభివృద్ధి లేదు అన్నపదంలో 'లేదు' అన్నది తీసివేస్తే, ఉన్నది అభివృద్ధి మాత్రమే. ఆలోచనలలో 'నిరాశ' అనే భావాన్ని లేకుండా చేస్తే మెదడులో వత్తిడిపోయి, తేలికగా, కాంతివంతంగా ఉంటుంది. నిరాశ శబ్దాన్ని గ్రహిస్తే అంతా అంధకారమే. అంధకారంలో స్వతంత్ర ఊహలు, ఆలోచనలు రావు. ఎందుకంటే, చీకటిలో ఏమీ కనిపించదు, ఏమీ దొరకదు. లక్ష్యం ప్రాపంచికం అయినా, ఈశ్వరప్రాప్తి అయినా వెదుక్కోవాల్సిందే! అనగా అది వెలుగులోనే దొరుకుతుంది. చీకటిలో దొరకదు. ఆశ ఉంటే కాంతి ఉంటుంది. ఆశ లేకపోతే అంతా చీకటే. శ్రీ బాబూజీ అన్నారు – ఆధ్యాత్మికత కోసం అంధకారాన్ని లేకుండా చేసాను, అని. దివ్యకాంతి అక్కడ ఉన్నది, చీకటి లేదు. సహజమార్గంలో కాని, ధ్యానంలో కాని అవరోధం లేనేలేదు. శ్రీ బాబూజీ మనల్ని ఆశీర్వదిస్తారు. మన అభివృద్ధికి వారు హామీ ఇస్తారు. దివ్యజ్యోతి ఉన్నది. ఆశ ఉన్నది. అభివృద్ధి తప్పక జరుగుతుంది. నిరాశతో ఏమీ సాధించలేము. అన్నింటికంటే గొప్ప విషయం, 'వారు' అక్కడ అంటే అంతరంగంలో ఉన్నారు.

మనం నిరంతర స్మరణ కొరకు చాలా ప్రయత్నం చేస్తాం. ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీతో – బాబూజీ మేము నిరంతర స్మరణలో ఉన్నామన్న విశ్వాసం ఎలా కలుగుతుంది? అది తెలుసుకునేది ఎలా? అన్నాడు. అప్పుడు శ్రీ బాబూజీ – "నీవు నిరంతర స్మరణ కొరకు ప్రయత్నం చేస్తున్నానని చెప్పావు. అంటే అది పూర్తికాలేదని అంగీకరిస్తున్నావు. ఏరోజైతే నీవు నీలో నిరంతర స్మరణ ఉన్నదని భావిస్తావో ఆరోజే అది నిరంతర స్మరణ అయిపోయింది. దాని ద్వారా 'మీతో లింక్ ఏర్పడినది' అని చెబుతావు" అని అన్నారు. కనుక దాని కొరకు ప్రయత్నం చేస్తున్నకొద్దీ అది అవనట్లే. మనలో ఉన్న లోపం మన అంతరంగం దానంతట అదే బయటపెడుతుంది. శ్రీ బాబూజీతో ఉన్న (ఏర్పడిన) లింక్ ఎప్పటికీ తెగిపోదు. ఎప్పుడు వారు మనకు గుర్తుకు వస్తారో అప్పుడే మన హృదయం వారితో కలిసి ఉన్నదని తెలుస్తుంది. వారితో మన అనుబంధం ఎప్పటికీ సడలిపోదని వ్రాస్తాం. మనం ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్న ఫలితాన్ని చూడాలి. బాబూజీ గుర్తుకురాగానే మన అంతరంగం వారితో అనుబంధం ఏర్పరచుకొని ఉన్నదని భావించాలి. అప్పుడు నిరంతర స్మరణ కొరకు ప్రయత్నంకాక, ఆ అనుబంధంపై ధ్యాస ఉంచాలి. ఈ హృదయం వారితో అనుబంధం

కలిగి ఉన్నదని తెలుసుకోవాలి. వారి కొరకే సమర్పితం చేయబడినదని భావించాలి. 'అలర్ట్'గా ఉండాలి – అంటే మెలకువగా ఉండాలి.

ఒకసారి శ్రీ బాబూజీగారికి ఇలా వ్రాసాను – "బాబూజీ! మీరు బాగా గుర్తుకు వస్తున్నారు. గుర్తుకు వచ్చినప్పుడు ప్రతిసారి షాజహాన్‌పూర్ రావాలనిపిస్తుంది" అని. దానికి బాబూజీ, "గుర్తుకు రావడమనేది ఉంటే, మరచిపోవడమనేది కూడా ఉంటుంది. ఏదైనా వస్తే, పోవడం కూడా జరుగుతుంది. గుర్తుకురావడంగాని, పోవడంగాని లేదని నీవు వ్రాసే రోజు కొరకు ఎదురుచూస్తాను" అని అన్నారు. బాబూజీ ప్రతి అక్షరానికి, శబ్దానికి ఏదో ఒక అర్థం ఉంటుంది. మన ఆలోచనల లంకె తెగిపోతే జ్ఞాపకం లేదని అనిపిస్తుంది. కాని మన ఆలోచనలు వారి భావనలో లయమైతే జ్ఞాపకం రావటంలేదని ఎప్పుడూ అనం. ఎప్పుడు ఆలోచనల్లో వారు వస్తారో అప్పుడు మనకు జ్ఞాపకం ఉందనిపిస్తుంది. కాకపోతే మన అలోచనలో ఎప్పుడూ వారు ఉండేలా చూసుకోవాలి. కాని మనం ఇంటి పనిలో, ఆఫీస్ పనిలో నిమగ్నమై వారిని మరచిపోయాం అని భావిస్తాం. మరల జ్ఞాపకం వచ్చినప్పుడు వారిని ఇంతవరకు, మరచిపోయామని అనుకోకుండా, మనం 'వారి' దగ్గరే ఉన్నాం, మన ఆలోచన, ధ్యాస వారిపైనే ఉన్నాయని అనుకోవాలి. పని శరీరానిది. మనం ఆలోచనల జ్ఞాపకాల దారాన్ని తెంపడం లేదు. నెమ్మది నెమ్మదిగా, సహజంగా మన ఆలోచన శాశ్వతమవుతుంది. అనగా నిరంతర స్మరణగా మారుతుంది. నిన్ను వారితో కలుపు కుంటావు. ఇది నిరంతరం జరుగుతుంది. జ్ఞాపకం శాశ్వతమవు తుంది. ఆలోచనాధార తెగవచ్చు, ఎందుకంటే కొత్త ఆలోచన వస్తే పాత ఆలోచన ప్రక్కకు పోతుంది. కాని జ్ఞాపకం తెగిపోదు. శ్వాశతంగా ఉంటుంది. ఇది తెగిపోదు. ఇంటిపనైనా, బయటిపనైనా 'వారి' జ్ఞాపకంలో మునిగి పూర్తిచేయాలి. 'వారి' జ్ఞాపకంలో లేకుండా జరగదు అనే భావన రావాలి. ఎప్పుడైనా మరచిపోతే మనం మరచిపోయామని తలంపక మన ఆలోచన వారితోనేనని, అనుకోవాలి. మన యోగం 'వారి' చరణాలు పట్టుకొని ఉన్నది. ఇప్పుడు ఆలోచన తెగిపోవడం లేదా మరచిపోవటం జరుగదు. మనం ఎన్నో పనులు చేస్తూ ఉంటాం, భోజనం చేయటం, నిద్రపోవటం వగైరా. ఒకవేళ పడుకుందామన్న భావనతో పడుకుంటే జ్ఞాపకం రాదు. కాని 'వారి' భావనతో నిద్రిస్తున్నామని అనుకోవాలి. మనం వారి పాదాల వద్దనే నిద్రిస్తున్నామని తలంచాలి. వారి శరణులో ఉన్నామనుకోవాలి. అలాంటప్పుడు మనం ఎలాంటి ఆలోచనతో ఉన్నా మనం వారితోనే, వారి దగ్గరే ఉన్నామన్న భావన నిరంతరమౌతుంది. ప్రతి విషయానికి ఒక విధానం ఉంటుంది, ఉండాలి. కాని మన ఆలోచన ఎలా ఉండాలంటే, ఏపని చేసినా 'వారి' జ్ఞాపకంతోను, 'వారు' మన ఎదురుగా ఉన్నారన్న భావన ఉంటే నెమ్మది నెమ్మదిగా మన ఆలోచన శాశ్వతమవుతుంది. ఆలోచన తెగిపోదు.

మనం మాటలతో చెబుతున్నాం – శ్రీ బాబూజీ గారిని మరచిపోయామని; కాని నెమ్మది నెమ్మదిగా మనం వారి జ్ఞాపకంలో ఉన్నామన్న భావన బలపరచుకోవాలి. శ్రీ బాబూజీ ఇలా అంటారు– పనిలో నువ్వు ఏమి చేసావన్నది మరచిపో, మనం వారి దగ్గరే ఉన్నామన్నది గుర్తుంచుకో. మీరు నావారు, నా హృదయం మీ దగ్గరే ఉన్నది; మన జ్ఞాపకం వారి కొరకేనని తలంచాలి. పని మరచిపో, వారిని గుర్తుంచుకో, అదే నిరంతరణ స్మరణ అవుతుంది. కాని మనం పనిని గుర్తుంచుకుంటాం. అదే మన లోపం. పనిని గూర్చి మరచిపో, ఇంక మిగిలేది వారి జ్ఞాపకమే.

ఒకసారి నేను, శ్రీ బాబూజీ, రాఘవేంద్రరావుగారు మొత్తం ఐదారుగురం కారులో వెళ్ళుతున్నాం. రామచంద్రారెడ్డిగారు కారు నడుపుతున్నారు. కొంతసేపటికి వారు నిద్రమత్తుతో జోగుతూ కారు నడుపుతున్నారు. రామచంద్రారెడ్డిగారిని "నువ్వు కారు నడుపుతున్నావా, నిద్రపోతున్నావా!" అని బాబూజీ అడిగారు. దానికి ఆయన "నాకు నిద్ర వస్తూంది. ఆ నిద్ర మత్తులోనే కారు నడుపుతున్నాను" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "నీవు నిద్రమత్తులో కారు ఎలా నడుపుతున్నావో అలానే నిజమైన అభ్యాసీ మనస్సులో ఆ భగవంతుడ్ని గుర్తు చేసుకుంటూ ఉన్నట్లయితే ఆ వ్యక్తి ప్రాపంచిక విషయాల్లోనూ, ఆధ్యాత్మికంగానూ కూడా తేలికగా గమ్యం చేరతాడు" అని చెప్పారు.

ప్రాపంచికమైన పనులను బాబూజీ ధ్యానంతో అంటే దివ్యధ్యానంలో చేస్తూ ఉంటే 'వారి'తో అనుబంధం అయి ఉంటాం. ఆ పనితోపాటు అదే స్మరణలో ఉండాలి. అప్పుడు బాబూజీ మనలో ఉన్నట్లే.

మనం రెండు విధాలుగా మన లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ఒకటి తల్లీ బిడ్డలాగ. తల్లి ఎక్కడకి వెళ్ళినా, బిడ్డను తనతో తీసుకు వెళ్ళుతుంది. ఆమె ఎక్కడికి వెళ్ళేది బిడ్డకు తెలియదు. కాని తల్లితోపాటు బిడ్డ కూడా గమ్యాన్ని చేరుతుంది. తల్లి ఏ దారిగుండా ఎలా వచ్చిందీ, ఏమీ బిడ్డకు తెలియదు. ఆ బిడ్డను ఏ ఏ కష్టాలుపడి వృద్ధిలోకి తెచ్చిందీ, ఆ బిడ్డకు తెలియదు. ఇక్కడ బిడ్డ తల్లికి పూర్తిగా ఆధీనమైపోయి ఆమాయకంగా ఉంటాడు.

అలాగే అభ్యాసీ పూర్తిగా బాబూజీకి ఆధీనమై – అంకితమై పోతాడు. లక్ష్యం గురించి, తన ప్రోగ్రెస్ గురించి ఎరుకే ఉండదు. అభ్యాసీకి ఉన్నదల్లా బాబూజీతో అనుబంధం మాత్రమే. అదే ప్రేమబంధం.

ఇంక రెండవది, దీనిలో మనకు మన లక్ష్యం ఈశ్వరప్రాప్తి అని తెలుసు. సహజమార్గ విధానాన్ని బాబూజీ తీసుకొని వచ్చారని, దీనిలో వారి సంకల్పం ఉన్నదని తెలుసు. సంకల్పశక్తి – ప్రాణశక్తి ఉన్నాయి. కనుక నేను చెబుతున్నది ఏమిటంటే, వారివద్ద మనం పసివాళ్ళలాగా మారిపోవాలి అని. 'వారి' సంకల్పాన్ని గ్రహించి దానిని సాధన చేయాలి. దానిలోనే మన సమర్థత తెలుస్తుంది. భూమా నుండి అవతరించిన శ్రీ బాబూజీ సంకల్పం సమస్త మానవాళి ఈశ్వరప్రాప్తి పొందటం. అది మనం గ్రహించాము. సహజమార్గంలో చేరాం. శ్రీ బాబూజీగారి చరణాలవద్ద ఉన్నాం. సంకల్పం మనదై ఉంది. దాన్ని పూర్తిగా సాధిద్దాం. మన సంకల్పం 'వారి' సంకల్పంతో జోడిస్తే అభివృద్ధి ఉంటుంది. గెలుపు దొరుకుతుంది. కాని ఆనందం పొందటానికి అర్థం చేసుకోవడానికి మనం ధ్యానాన్ని ఏకత్రితం చేయాలి. బాబూజీ సంకల్పం ఏమిటి? మనం లక్ష్యం సాధించటం! ఎంతకాలం పట్టినా లక్ష్యం పొందటం ఖాయం. ఎందుకంటే, వారి సంకల్పం అదే కనుక. లక్ష్యం సాధించాలంటే మనస్సు లగ్నం చేయాలి. దాని కొరకు అంతరంగంపై దృష్టి నిలిపి 'వారి' సంకల్పంతో జోడించాలి. 'వారి' ప్రాణాహుతిలో మునిగిపోవాలి. ఈ విధంగా సాధన చేస్తుంటే ఆనందం లభ్యమవుతుంది. ఆనందం ఉన్నచోట వ్యాప్తి ఉంటుంది. ఆనందం లేకపోతే వ్యాప్తి ఉండదు.

ఈ పైన చెప్పిన పద్ధతులకు రెండు ఉదాహరణలు ఉన్నాయి. ఒకటి– మార్జాలన్యాయం. మార్జాలం – పిల్లి తన పిల్లల్ని నోటితో కరచుకుకొని ఒకచోటు నుండి ఇంకొకచోటుకు మారుస్తూ శత్రువుల నుండి కాపాడుకుంటూ ఆ పిల్లల్ని పెద్ద చేస్తుంది. ఆ పిల్లలకు తల్లి ఎక్కడకు తీసుకు వెళ్ళుతుందో, ఏ కష్టాలు

పడుతోందో తెలియదు. కాని తల్లితోపాటు గమ్యాన్ని చేరుతుంది. ఇక్కడ పిల్లను గమ్యాన్ని చేర్చడంలో తల్లిదే పూర్తి బాధ్యత.

ఇంక రెండవ దానికి ఉదాహరణ – మర్కటన్యాయం. మర్కటం అంటే కోతి. కోతిపిల్ల తల్లికోతి పొట్టనో, వీపునో గట్టిగా పట్టుకొని అంటిపెట్టుకొనే ఉంటుంది. తల్లి ఎటవైపు వెళ్ళితే తానూ తల్లితోపాటే ఈ చెట్టుకొమ్మ ఆ చెట్టు కొమ్మలపైకి చేరుతుంది. తల్లికోతి కొమ్మలపైకి దూకుతుంటే పడిపోకుండా గట్టిగా పట్టుకోవడం పిల్లకోతి బాధ్యతే. లేకపోతే జారి పడిపోతుంది. గమ్యాన్ని చేరలేదు. కాబట్టి తల్లి సహాయంతో గమ్యాన్ని చేరుకోవడం ఆ పిల్ల బాధ్యతే. ఈ యాత్రలో కష్టం, సుఖం తెలుస్తూ ఆనందం పొందుతుంది. అనుభవం చేకూరుతుంది.

ఈ రెండు రకాల (సాధన)ల్లో గమ్యం చేరడానికి తల్లి ఉంది. అలాగే గురువు శిష్యుల్ని ఈ రెండు రకాలుగా లక్ష్యం చేరుస్తాడు. మొదటి మార్గంలో బిడ్డ అమాయకపు స్థితిలో పూర్తిగా ఆధారపడిన స్థితిలో ఉండి ఏ ఆనందం అనుభవం పొందదు. రెండవ మార్గంలో కోతిపిల్ల తల్లిని గట్టిగా పట్టుకొన్నట్లు– అభ్యాసీ సంకల్పంతో గురువునే వదలక ధ్యాన సాధన చేస్తూ ఆయా దశల అనుభవాన్ని పొందుతూ గురుదేవులకు సమర్పణ చేసుకుని లక్ష్యం చేరడం.

అంతా బాబూజీకి వదిలేసి సాధన చెయ్యటమే చెప్పబడినది. “ఈ హృదయం మీది బాబూజీ! ఆలోచన మీది, మనస్సు మీది, ఎలా కావాలంటే అలా తయారు చేయండి” –అనే విధంగా సంకల్పం ఉండాలి. సహజమార్గంలో చేరి సాధన చేయటానికి బాబూజీ మనకు సంకల్పం ఇచ్చారు. దానిని పట్టుకొని సాగిపోవాలి. ఏ ఆలోచనతో ఉన్నా ఆ సంకల్పం నుంచి విడిపోరాదు. ఈ విధానంలో ఆనందం ఉంటుంది.

మనం మిషన్‌కు ఎలా సేవ చేయగలం? ప్రిసెప్టర్ అయినా సేవ చేయవచ్చు. ఈ సందర్భంలో ఒకసారి శ్రీ బాబూజీ – “మన మందరం శ్రేష్ఠమైన రీతిలో తయారుకావటానికి, మంచి మానవులుగా తయారుకావటానికి ప్రయత్నిస్తే చాలు. మిషన్‌కుగాని, నాకుగాని ఇంతకంటే మీరు చేయగలిగిన సేవలేదు” అని అన్నారు. మనం ఎంత మంచిగా తయారైతే, ఎంతగా ధ్యానంలో లోతుగా మునిగిపోతే, ఎంత సమయం నిరంతర స్మరణలో ఉండగలిగితే, అంతగా శ్రీ బాబూజీ సహకారం లభిస్తుంది. మనం మన పనిలో ఎంతో సుందరంగా అభివృద్ధి చెందుతాం. కనుక ఈ విధంగా వారికి సేవ చేస్తున్నాము. అభ్యాసీ అనే మాటకు అర్థం ఏమిటంటే – మనం శ్రీ రామచంద్ర మిషన్‌కు సేవకులం అంటే శ్రీ బాబూజీకి సేవకులం. ఎందుకంటే, శ్రీరామచంద్ర మిషన్ శ్రీ బాబూజీకి చెందినది కనుక. మనం మిషన్‌కు మరియు శ్రీ బాబూజీకి సేవ చేస్తున్నాం. అంటే మనం బాబూజీకి శరణాగతమైపోవటం. అంటే బాబూజీ మనలను కోరిన విధంగా మనలను మనం అర్పించుకోవటం. రోజంతా ‘వారి’ పాదాల చెంత ఉన్నట్లు భావించటమే. శ్రీ బాబూజీ అన్నారు – “మీరు శరణాగతమైతే, నాకు చాలా దగ్గరగా వచ్చినట్లయితే నేను మిమ్మల్ని చూడగలను. నాకు నచ్చిన విధంగా తయారు చేయగలను” అని.

‘వారు’గాని, ‘వారి’ కుటుంబంగాని ఎవరినుండి భౌతికమైన సేవ గ్రహించలేదు. ‘వారి’ కోరిక ఏమిటంటే –వారి అభ్యాసీలు కూడా ఇది చూసి సంతోషిస్తారని. ‘వారి’ కన్నులు ఎప్పుడు అభ్యాసీని చూసినా,

వారి హృదయానికి “ఈ అభ్యాసీ నావాడే” అన్న అనుభూతి కలుగుతుంది. మనం మన అంతరంగాన్ని వారితో కలిపి ఉంచితే మనకు కావలసింది వారే ప్రసాదిస్తారు.

శ్రీ బాబూజీ ఒకసారి ఇలా అన్నారు–“మీరు ఎప్పుడూ సిట్టింగ్ తీసుకోవాలని కోరుకుంటారు. ఎప్పుడైనా, ఎక్కడైనా మీరు కావాలనుకొంటే తప్పక అది లభ్యమవుతుంది. మన అంతరంగం వారికి శరణాగతమైతే ‘వారి’ పని ప్రారంభమవుతుంది. అప్పుడు మనం వారి మార్గదర్శకత్వంలో ఉంటాము. ఇప్పుడు మనం సహజమార్గ విధానంలో ఉన్నాం. ముఖ్యంగా మార్గదర్శకత్వం ఎప్పుడు వస్తుందంటే, శ్రీ బాబూజీగారికి శరణాగతమైనప్పుడే! మనం శ్రీ బాబూజీ సామీప్యాన్ని అనుభూతి చెందుతాము. వారు కూడా అభ్యాసీ యొక్క దగ్గరతనాన్ని అనుభూతి పొందుతారు. కాని మనం అభ్యాసీగా ఉండాలి. అభ్యాసీ అంటే మనం మిషన్‌లో చేరినరోజు నుండి ఒకే సంకల్పం, ఒకే ఆలోచన ఉండాలి. అది ఏమిటంటే, మన బాబూజీ సంకల్పం పూర్తి చేయాలన్న తపన, భావం ఉండాలి. వారి దివ్యత్వపు సౌందర్యాన్ని, సాక్షాత్కారాన్ని పొందాలి. ఈ లోకంలో మనం చూసేది మానవ ప్రేమనే. కాని మనం శ్రీ బాబూజీగారి దివ్యసామీప్యాన్ని పొందితే ‘వారి’ దివ్యప్రేమను అనుభూతి పొందవచ్చు. అప్పుడు దివ్యప్రేమ అంటే ఏమిటో తెలుస్తుంది. మనం శ్రీ బాబూజీకి శ్రీరామచంద్ర మిషన్‌కు సేవచేయడం లేదన్న తలంపు రాకూడదు. మన మిషన్ బాబూజీకి సంబంధించినది. మనం సాధన బాగా చేస్తున్నామన్న విశ్వాసం ఉండాలి. అంటే మనం బాబూజీగారిని సమీపిస్తున్నామన్నమాట. ఇదే అర్పణ. ఫలితం – శరణాగతి!

శరణాగతి కోసం ప్రయత్నిస్తే జరిగేది కాదు. మనకు మనం ఆత్మనివేదన కావించుకొని, అర్పణభావంతో ఉంటే, సహజంగా శరణాగతి పొందడం జరుగుతుంది. ఎలాంటి వారైనా ధ్యానంలో లోతుగా మునిగిపోయి ఉంటే ‘నేను’ అనేది పోతుంది. శ్రీ బాబూజీయే అక్కడ ఉంటారు. అర్పణభావంతో మనల్ని మనం మరచిపోతాం. ఇంకేముంది శరణాగతి పొందినట్లే. అర్పణభావంతో ఉన్నామన్న సంగతి తెలియదు. మనల్ని మనం అర్పించుకున్నట్లే. వినమ్రత, అర్పణ, ఆత్మ నివేదనల ఫలితమే శరణాగతి. ఆత్మ నివేదన, అర్పణ అభ్యాసీ చేస్తాడు. దీనిని దివ్యమూర్తి బాబూజీ స్వీకరించినప్పుడు అది శరణాగతి అవుతుంది. ‘వారు’ మనతో “మీరు నావారు” అంటే అది స్వీకృతి (అరగా స్వీకరించటం). ‘వారి’ కృప, మనల్ని ‘వారి’ వారమని చెప్పినప్పుడు ‘వారు’ మనల్ని స్వీకరించినట్లవుతుంది. శరణాగతి దివ్యత్వం యొక్క కృప. స్వీకారం జరిగితే ‘నేను’ నీవాడినే, అని చెప్పగలిగినప్పుడు నీవు అక్కడ లేనట్లే, అంటే శ్రీ బాబూజీయే ఉన్నట్లు. అనగా శరణాగతి ప్రారంభమైనదన్న మాట. ఎందుకంటే, మన అర్పణను శ్రీ బాబూజీ స్వీకరించారు; శరణాగతిని అంగీకరించారు. మన శరణాగతిలో శ్రీ బాబూజీ మాత్రమే ఉన్నారు. ఇప్పుడు మన అర్పణ, ఆత్మ నివేదన కూడా అక్కడ లేదు. వాటిని బాబూజీ వారి చేతుల్లోకి తీసుకున్నారు. అంటే శరణాగతి యొక్క స్థితి ఆరంభమైనదన్నమాట.

మనం ఎప్పుడూ అంటూ ఉంటాం– “నేను ఇది చేసాను; నేను అది చేసాను” అని. ఈ ‘నేను’ అనేది శ్రీ బాబూజీగా మారిపోవాలి. ‘నేను’ అనే దాని స్థానంలో శ్రీ బాబూజీగారే ఉన్నారన్న భావన రావాలి. ఉదాహరణగా, నేను వంట చేస్తున్నాను అన్నప్పుడు ‘నేను’ అనేది బాబూజీయే. నేను అనే దానిని (మీరు) బాబూజీతో కనెక్ట్ చెయ్యాలి. అప్పుడు సాధన పూర్తవుతుంది. దివ్యకృప ఎల్లప్పుడు సహజంగానే నీలోకి ప్రసరిస్తుంది. ఇది చాలా అవసరం. అప్పుడు మనం దివ్యమూర్తి బాబూజీ మహరాజ్‌కు శరణాగతి అయ్యామని

చెబుతాం. ఈ శరీరం ఒక ఆచ్ఛాదన (మూత) మాత్రమే. 'నేను' అనేది లోపల ఉంది. నేను 'మీ వాడను' అని చెప్పినప్పుడు ఈ హృదయం మీదే అన్నదే, దాని భావం. ఎప్పుడైతే నేను 'మీ వాడను' అని చెబుతామో అప్పుడు అంతరంగం శరణాగతం అయినట్లు అర్థం. ఇంక కృప నీలోనికి నిరంతరం ప్రసారమవుతుంది.

**ప్రశ్న: నేను ఏమీ పొందినట్లుగా అనిపించడంలేదు.**

**జవాబు:** నీవు ఏమీ పొందనట్లయితే సాధన వదిలివేస్తావు. మీ హృదయం గ్రహించిన దానిని మీ నాలుక చెప్పలేకపోవచ్చు. ఎందుకంటే నన్ను –"భగవంతుడు ఎలా ఉంటాడు? భగవత్ సాక్షాత్కారం ఎలా ఉంటుంది?" అని మీరు అడిగితే చెప్పలేను. కాని నాకు తెలుసు. భగవంతుడు నా ముందు ఉన్నాడు. భగవంతుడు ఎలా ఉన్నాడో ఎవరూ చెప్పలేరు. నీవు పొందుతున్నావు కాని నీ నాలుక చెప్పలేకపోతుంది.

మనం 'వారి' సామీప్యపు అనుభూతిని అంటే దివ్యత్వపు అనుభూతిని పొందితే మనకు అదే అంతా ఇస్తుంది. మనలోని ప్రతి అణువు కరిగిపోతోందనే అనుభూతి చెందినట్లుగా చెబుతాను. కాని చూపించలేను. ఎవ్వరైనా అనుభూతి చెందగలరు కాని చూపలేరు. సహజమార్గంలో చేరాలి, తెలుసుకోవాలి.

బాబూజీ దివ్య సౌందర్యం గురించి నేను చెప్పగలను కాని నాకు సంతృప్తిగా లేదు. నేను వ్రాసాను అయినా నాకు తృప్తిగా లేదు. నేను ఎప్పుడు వారిని తలుచుకున్నా షాజహాన్‌పూర్‌లో కుర్చీలో కూర్చుని ఉన్న బాబూజీని మరచిపోతాను. మొదట నా ఆలోచన కుర్చీలో కూర్చుని ఉన్న 'వారి'తోనే కలిసి ఉంది. నేను లఖింపూర్ వెళ్ళగానే నా భావన ఏమిటంటే, 'వారు' లేకుండా నేను జీవించలేనని. అదే వారితో అన్నాను. మూడు నెలల తర్వాత "బాబూజీ! నేను షాజహాన్‌పూర్ నుండి లఖింపూర్‌ఖేరి వచ్చివేసినా మీరు నాతోనే ఉన్నారన్న భావన ఉన్నది. ఇప్పుడు నేను మిమ్మల్ని కోల్పోవడం లేదు. షాజహాన్‌పూర్ ఇక్కడే లఖింపూర్‌లో ఉన్నదని అనిపిస్తోంది" అని వ్రాసాను. అప్పుడు బాబూజీ నవ్వుతూ "లఖింపూర్‌ఖేరిలో షాజహాన్‌పూర్ ఉన్నదని భావించినా నీవు ఇక్కడకు రావడం మానవద్దు" అన్నారు. ఇదే దివ్య సౌందర్యం.

ఒకసారి శ్రీ బాబూజీ అన్నారు– "నా ఫొటోలు అన్నీ తీసుకు వెళ్ళు" అని. అప్పుడు నాకు నా ఫొటోల్ని నేను తీసుకున్నానని అనిపించింది. వారు తీసుకొనమన్నారు కనుక ఒక ఫొటో తీసుకున్నాను. తీరాచూస్తే ఆ ఫొటో నాదే. కాని నా ముందు బాబూజీ ఉపస్థితమై (కూర్చుని) ఉన్నారు. ఫొటోలో ఉన్న బాబూజీ నా ముందు ఉన్న బాబూజీ ఒకటికాదని చెప్పాను. "ఇది నిజం. ఎలా చెప్పగలిగావు" అని అడిగారు.

భగవంతుని రూపం గురించి చెప్పమంటే ఏం చెబుతాను. అది బాబూజీ మహరాజ్‌గారి 'దివ్య సౌందర్యం'. అనుభూతియే భగవంతుని భాష కదా!

'సీనియర్' అంటే ఎవరు అన్న ప్రశ్నకు ఒకసారి బాబూజీ ఇలా అన్నారు: ఏమి గ్రహించారు అన్నది ముఖ్యం. మనలను చూసి ఇతరులు ఏమి భావించాలంటే వీరు దివ్యత్వానికి అతిచేరువలో ఉన్నారు (సీ –నియర్) అని. ఎవరైనా నిన్ను చూసినప్పుడు, నీ హృదయంలో ఆ భగవంతుని దివ్యరూపం ఎంత వెలుగు నిస్తుందో, నీ హృదయం ఎంత స్వచ్ఛతగా మారిందో –అది నీ సీనియారిటి గురించి చెబుతుందిగాని, ఎన్ని రోజుల నుండి నీవు ఈ సాధనా మార్గంలో ఉన్నావో, ఎంత కాలం నుండి ప్రాక్టీస్ (సాధన) చేస్తున్నావో ఆ లెక్కలు కాదు. కాలాన్నిబట్టి ఎవ్వరూ సీనియర్ కాదు. సీనియర్ ఎవరంటే మీరు అందులో ఉన్నారు–

ఇందులో చేరండి అనేవారే. ఎన్ని రోజుల నుండి సాధన చేస్తున్నామన్న సంగతి మరచిపొండి. చాలామంది అంటారు– ఎన్నో రోజుల నుండి సాధన చేస్తున్నాము. మాకు ఏం దక్కలేదు –అని. ఇది తప్పు దోవలో పడేస్తుంది. ప్రయత్నం చేయాలి. మనం 'వారి'కి చెందిన వాళ్ళమని భావించాలి. 'వారి' వెంటే ఉన్నాము. హృదయం 'వారి' వెంటే ఉన్న భావనే ఉండాలి. మనం క్రింద ఉన్నాం; 'వారి' సహాయంతో పైకి వెళుతున్నాం; ప్రోగ్రెస్ పొందుతున్నాం –అనే భావనే మనల్ని ప్రోగ్రెస్‌కి (ముందుకు) తీసుకు వెళ్తుంది.

కొందరు మిషన్‌కు సేవ చేస్తున్నామంటూ ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు. కాని వారి వ్రాతలలో ఎప్పుడూ వారి సమస్యలే ఉంటాయి. అది మిషన్‌కు సేవ ఎలా అవుతుంది అని శ్రీ బాబూజీ అనేవారు. ఇది పరిస్థితులకు సేవ. మిషన్ సేవ అంటే –ఎంతమందితో మిషన్ గురించి మాట్లాడాము, ఎంతమంది ప్రభావితులైయ్యారు –అనేది సేవ. ఇంక అభ్యాసీలకు సేవ చేయవచ్చు. మనకు ఎంతో చక్కని ఆశ్రమం ఉన్నది. శ్రీ బాబూజీ ప్రతి ఒక్క విషయం చూస్తారు. మిషన్‌కు సేవ గురించి వ్రాసేటప్పుడు మిషన్ గురించితప్ప వేరే ఏమీ వ్రాయకూడదు. మన మనస్సు గురించి వ్రాస్తే మిషన్‌కు సేవకాదు. అది సమస్యకు సేవ.

**ప్రశ్న: ఒక పాట చాలాసార్లు పాడటంవలన ధ్యానంలో కూడా ఆ పాటే గుర్తుకు వస్తున్నది.**

**జవాబు:** పాట చాలా ఇష్టం మనకు. అందుకే బాగా గర్తుకు వస్తోంది. పాట భావంలో మునిగిపోయి 'బాబూజీ నావారు' అనుకొని, ధ్యానంలో ఉండి సమర్పణ భావంతో పాట వినాలి. అప్పుడు పాటపై ఆకర్షణ ఉండదు. భావంతో పాట వినాలి. అప్పుడు పాటపై ఆకర్షణ ఉండదు. భావంలో మునిగి ఉండాలి. 'శ్రీ బాబూజీ నావారు' అన్నప్పుడు నోటితో చెప్తాము, అది నిజమైతే హృదయమే చెబుతుందని గ్రహించవచ్చు.

మనం ధ్యానంలో కూర్చునేముందు ప్రార్థన చెప్పుకునేటప్పుడు దాని భావంలో పూర్తిగా మునిగిపోవాలి. "ఓ నాథా! నీవే మానవ జీవితానికి యదార్థం లక్ష్యం" – అన్న వాక్యం చెప్పుకొనేప్పటికే మీరు ఆ ధ్యానంలో, ఆ భావంలో లీనమైపోతే ఇంక మిగతా ప్రార్థన వాక్యాలు చెప్పుకునే అవసరంలేదు. వారు, మన అంతరంగంలో ఉన్నారు. ఆ లోపల ఉన్న 'వారు' నావారు. ఎల్లప్పుడూ నాతోనే ఉంటున్నారు – అన్న భావం పెంపొందుతుంది.

మనం వారితోనే ఉన్నాం. మనం ఎక్కడకు వెళ్ళుతున్నా, పని చేస్తున్నా, ఆ భావనతో ఉండాలి. ఒకవేళ మనం వారిని ఎదురుగా చూసినా, మనలోనే వారు ఉన్నారన్న భావం వస్తుంది. దివ్యత్వం నీలోనే ఉన్నది. దానితో నీవు కలిసి ఉండాలి – ఇది ఈశ్వరుని వరదానం.

బాబూజీ మహరాజ్ మనలోనే ఉన్నారు. 'వారు' మనవారే, వారు మనల్ని తీసికొని వెళ్ళుతున్నారనుకుంటూ ఉంటే ఆ భగవంతుడు మనకు బాహ్యదృష్టి, అంతర్ దృష్టీ రెండూ ఇస్తారు. బాహ్య దృష్టి– ఈ ప్రాపంచిక విషయాలలో నడిపించడానికి, అంతర్ దృష్టి –మనల్ని ఆ భగవంతుని వద్దకు నడిపించడానికి, మనలో 'అతడి'ని చూడటానికి. అలా మన బాబూజీ భౌతికంగానూ, ఆధ్యాత్మికంగానూ మనల్ని పురోభివృద్ధికి నడిపిస్తారు.

మనం సాధనలో, ధ్యానం చేస్తున్నప్పుడుగాని, క్లీనింగ్ చేసుకుంటున్నప్పుడుగాని, నిరంతర స్మరణలో ఉన్నప్పుడుగాని బాబూజీ మనలోనే ఉన్నారు –వారే మనల్ని నడిపిస్తున్నారు –అన్న భావనలో మునిగిపోతే ప్రేయర్‌తోగాని, క్లీనింగ్‌తోగాని దేని అవసరమూ ఉండదు. మనలో దివ్యత్వం ఉన్నది. ఆ దివ్యత్వంలో

మునిగిపోవాలి. పైవాటి అవసరం మనకు ఎప్పటివరకు ఉంటుందంటే, ధ్యానం 'వారి' జ్ఞాపకంలో మునిగిపోయేంతవరకు.

**ప్రశ్న: ఎవరైనా యాక్సిడింట్‌లో చనిపోతే ఆ ఆత్మ అక్కడే ఉంటుందా?**

**జవాబు:** ఎవరైనా చనిపోతే – ఆ ఆత్మ, ఆ వెంటనే – వాటికై ఉన్న ఆవరణలోకి అది వెళ్ళిపోతుంది. అక్కడ నుండి అది నిశ్చయింపబడ్డ చోటికి వెళ్ళుతుంది. ఎవరైనా అభ్యాసీ మరణిస్తే, ఆ అభ్యాసీకి బాబూజీ మీద నిజమైన ప్రేమ ఉంటే, ఆ ఆత్మ చాలా ఫాస్ట్‌గా భగవంతునివైపు దూసుకుపోతుంది. అలాకాక ఆ వ్యక్తి ప్రాపంచిక విషయాలమీద వ్యామోహంలో ఉన్నట్లయితే మళ్ళీ ఈ భూమిమీదే ఇంకో జన్మ ఎత్తుతుంది. అందుచేత ఈ ప్రపంచంలో ఉంటూ ఉన్నా, మన ధ్యాస, మన లక్ష్యంమీద అంతర్గతంగా ఉండి, ఎప్పుడూ మనస్సులో బాబూజీని తలచుకొంటూ 'వారి'తో సంబంధం ఉంచుకుంటే ఈశ్వర ప్రాప్తి లభిస్తుంది.

బాబూజీ అంటారు – ఏమి ఆలోచించాలన్నా ఈశ్వరప్రాప్తి గురించే ఆలోచించాలి అని. బాబూజీ దివ్య సౌందర్యం ఎలా ఉంటుంది, దానిని దర్శించాలన్నదే, ప్రతి ఆలోచన. వారితోనే అంతా ముడిపడి ఉండాలన్న తపన ఉండాలి.

ప్రపంచంలో చెడు తక్కువ. భగవంతుడు చెడుకొరకు తక్కువచోటునే నిర్దేశించాడు. మంచివారికే చోటు ఎక్కువ. చెడ్డవాళ్ళు భగవంతుడు నిర్దేశించిన ప్రదేశంలో ఉండి కర్మ అనుభవించడానికి మరల వస్తారు. వాళ్ళకు శిక్ష చాలా ఎక్కువ ఉంటుంది.

మానవులు యోగులు, మునులు, ఋషులవుతారు. మానవులే వారి ఆలోచనాసరళినిబట్టి ఏదైనా అవుతారు. వారి ఆలోచనలనుబట్టి కర్మ ఏర్పడుతుంది. కర్మనుబట్టి వ్యవహారం ఉంటుంది. కొన్ని మాటలు చెడ్డగా ఉంటాయి. వాటిని మాట్లాడరాదు. కొందరు కోపంతో గట్టిగా మాట్లాడతారు. మనకు కోపం చెడ్డగా అనిపిస్తుంది. మనం కూడా ఎవ్వరితోటి అలా మాట్లాడరాదు. మనం ఆధ్యాత్మికతలో ప్రవేశించినప్పుడు మనం ఆలోచనవైపు, కర్మవైపు జాగ్రత్తగా పరిశీలిస్తాము. దానినిబట్టి వ్యవహారం ఉంటుంది.

బాబూజీ మనకు ఎటువంటి గొప్ప శిక్షణ ఇచ్చారో! 'వారి' మాటలుకాని, వ్యవహారంకాని మనకు ఎంతో నేర్పుతాయి. మనం ఎలా మాట్లాడాలో, వ్యవహరించాలో, ఆలోచించాలో అన్ని నేర్పుతారు వారు. మన సమస్యను వింటారు. దానిని దూరం చెయ్యకపోవచ్చు. అయినా అన్నీ వింటారు, ఏమి అనరు. చెడుగా భావించరు.

పిల్లలు వస్తారు. కళ్ళు మూసుకొని కూర్చుంటారు. ప్రసాదం కోసం ఆశతో వస్తారు. వారికి ప్రసాదమే పూజ. అందుకని శ్రీ బాబూజీ మహరాజ్ వాళ్ళందరికి ప్రసాదం ఇవ్వమంటారు. అందరిపై 'వారి' ధ్యాస ఉంటుంది. ప్రతి వ్యక్తిపట్ల వారి ధ్యాస ఉంటుంది. 'వారి' మనస్సులో ఏమీ ఉండదు. మనం ఏదేదో చేస్తుంటాం. శ్రీ బాబూజీ మహరాజ్ మనల్ని గుర్తుంచుకుంటారో, లేదో అని అనుకుంటూ ఉంటాము. ఒకసారి బాబూజీతో ఒక అభ్యాసీ – "బాబూజీ! మీరు అందరి వంక చూస్తున్నారు కాని మావంక చూడటం లేదే" అని అడిగాడు. అప్పుడు బాబూజీ "నీ భావనలో ఆ వ్యతిరేక శబ్దాలు –'లేదు', 'కాదు' అనేవి తొలగించు. అప్పుడు అంతా నీముందు ఉంటుంది" అని అన్నారు. మనం మనఃస్ఫూర్తిగా తదేక ధ్యానంతో వారివంక ప్రేమతో చూస్తే, వారు మనవంక అదే విధంగా చూస్తారు. కనుక 'లేదు', 'కాదు' అనే శబ్దాలను

గ్రహించవద్దు. వారి కృపాధార మనపైనే వర్షిస్తుంది. వారి ప్రేమ, ధ్యాస మనపైనే ఉంటుంది. ప్రతి పనిలో, వ్యవహారంలో 'వారి' భావనలోనే ఉంటే, అంతరంగంలో శక్తి లభిస్తుంది. దీని అర్థం వారు మనతో ఉన్నట్లే కదా! (మనల్ని చూస్తూ ఉన్నట్లే కదా!)

శ్రీ బాబూజీ మహరాజ్ అందరిపట్ల ఎంతటి ధ్యాసతో ఉంటారో ఒక ఉదాహరణ చెప్తాను, వినండి. ఒకరోజు ధ్యానం అయిపోయాక మధ్యాహ్నం 'వారి' గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అందరు 'వారి' పాదాలను తాకి నమస్కరిస్తున్నారు. కాని ఆడపిల్లలు 'వారి'ని తాకి నమస్కరించరాదనే నియమం ఉంది. అది పాటించాలి కదా! కాని అప్పుడు నా మనస్సులో ఒక ఆలోచన మెదిలింది. అది ఏమిటంటే, భౌతికంగా తాకి నమస్కరించరాదని కదా నియమం. మనస్సులోనే మనస్సుతో తాకి నమస్కరించితే! అనిపించింది. అలా భావించగానే వెంటనే కొన్ని క్షణాల్లో 'వారు' గది బయటకు వచ్చి, "బిటియా! నీవు పాద స్పర్శ చేయకుండానే అంతా ఇస్తున్నాను కదా! ఇంక దాని అవసరం ఏముంది" అన్నారు. అందరిమీద వారికి ఎంత ధ్యాస, ఎలా ఉంటుందో తెలుస్తుంది కదా! 'వారి' ధ్యాస మనపై ఎలా ఉంటుందంటే, మన ధ్యాస 'వారి'పై ఉన్నట్లే. అప్పుడప్పుడు 'వారి'ని ధ్యానంలో ఉంచుకొనడం మనం మరచిపోతాం. కాని వారి ధ్యాస మాత్రం మనందరిపై సమానంగా ఎల్లప్పుడు ఉంటుంది. మనం 'వారి' కొరకు పైకి చూస్తాం. 'వారు' మనందరికోసం క్రిందకు చూస్తారు. వారి కృప మనందరిపై సమంగా వర్షిస్తుంది. ప్రేమ ఫలితాన్ని అందరం పొందుతాం.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! మేము ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం –ఎప్పుడుపడితే అప్పుడు ధ్యానంలో కూర్చుంటాం కదా! మాపై మీకు ధ్యాస ఎలా ఉంటుంది" అని అడిగాడు. అప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్, "నీ ప్రశ్నలోనే సమాధానం ఉన్నది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎప్పుడు కూర్చున్నా, అన్ని సమయాల్లో ప్రాణాహుతిని పొందుతూనే ఉన్నావు. నేను ఇస్తూనే ఉన్నాను. ఇంక మరచిపోవటమన్న ప్రసక్తి ఏది? గుర్తు, ధ్యాస ఉన్నాయి కదా!

అభ్యాసీకి ఎలాంటి ప్రేమ ఉండాలో బాబూజీ గురునానక్ కథ ఒకటి చెప్పారు.

శ్రీ గురునానక్‌కు ఐదారేండ్ల వయస్సు ఉన్నప్పుడు తల్లి దండ్రులు మరణించారు. అతని అక్క, బావ అతన్ని చేరదీసారు. కొన్నేళ్ళు పెంచిన తర్వాత ధాన్యం తూచే దుకాణంలో అతడిని ఉద్యోగానికి ఉంచారు. అక్కడ తూచి, లెక్కపెట్టవలసి వచ్చినప్పుడు ఒకటి, రెండు, మూడు …………ఇలా పన్నెండు దాకా చెప్పి పదమూడు వచ్చేసరికి 'తేరా' 'తేరా' అంటూ ఆ తర్వాత ఎన్నిసార్లు అయినా ఆ పదమే పలికేవాడట. ఆ యజమాని ఇతనికి తరువాతి సంఖ్యలు రావేమోనని భావించి, అదే గురునానక్ బావగారితో చెప్పాడు. అతడి ఇంటిలోని వారందరూ గురునానక్‌కు అన్ని సంఖ్యలు వచ్చు అనే చెప్పారు. లోపల నిద్రిస్తున్న గురునానక్‌ను లేపి అడగ్గా, గురునానక్ సమాధానంగా నాకు వచ్చు. 'తేరా' తర్వాత చాలా సంఖ్యలు ఉన్నాయి. కాని 'తేరా' (నీవాడిని) అని అనగానే 'వారి' అంటే ఆ భగవంతుని ధ్యాసలో పడిపోతున్నాను. 'వారి' వాడిని అయిపోతాను. ఇంక ఏమీ గుర్తు ఉండదు" అని చెప్పాడు. 'ప్రేమ అంటే ఇదే' అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు. తేరా! అంటే నీవాడను అనే భావం. అంటే 'మనం బాబూజీ వారము. బాబూజీ 'మనవారు' అనుకోవాలి, ఇంక వేరయ్యే అవకాశమే లేదు. మనం 'వారి' శరణాగతి పొంది

నప్పుడు, 'వారి' చరణాలపై ఉన్నప్పుడు, మనం 'వారి' వారమైనప్పుడు, ఈ శరీరంమీద ఉన్న ఆలోచన బయటకుపోతుంది. ఈ విధంగా అందరూ 'వారి'కి అర్పణ చేసుకుంటే అంతా యోగ్యమవుతుంది. అందరం ఒకటైపోతాం.

భక్తి ఎక్కడ నుండో రాదు. అది మన అంతరంగంలోనే ఉంటుంది. ఎంతగా మనం దాన్ని పైకి తీసుకొనివస్తే అంతగా బయటకు వస్తుంది. ఎవ్వరూ వచ్చి తీయరు. మనమే బయటికి లాక్కోవాలి దాన్ని. అందరిలోను భక్తి సమానంగా ఉంటుంది. హెచ్చు తక్కువలు ఉండవు. శ్రద్ధ సమానమే, కాని ఆ శ్రద్ధ ఎక్కడెక్కడో ఉంటున్నది. కొంత శ్రీ బాబూజీపైన, కొంత ఇక్కడ, కొంత అక్కడ విడిపోయి ఉంటుంది. అటువంటి శ్రద్ధ నిలవదు.

మన శ్రద్ధ దేనిమీదో ఉంటుంది. కొంతసేపు బాబూజీ మీద. మరికాసేపు వేరే విషయాల మీద. అలా దానిమీద, దీనిమీద శ్రద్ధ విడిపోయి ఉంటుంది. బాబూజీ ఏమంటారంటే, మనం ప్రేమతో మన శ్రద్ధను ఒకే దిశలో ఉంచి (ఆ దైవంమీద) ఒకే ద్వారం గుండా (సూటిగా) ఉండాలి. ఆపని, ఈపని చేస్తూనే ఉన్నా, మనస్సు మాత్రం బాబూజీ మీదనే ఉండాలి. ఆలోచనలు ఎన్ని వచ్చినా మనస్సు మాత్రం బాబూజీతోనే ఉండాలి. అప్పుడు మన సాధన నెరవేరుతుంది.

ఒకసారి కాన్పూర్‌లో ఉన్న మా సోదరి ఇంటి నుండి ఒక్కదాన్నే షాజహాన్‌పూర్ బయలుదేరాను. దారిలో తినడానికని మా సోదరి మూడు పూరీలు పొట్లంకట్టి ఇచ్చింది. రిక్షా ఛార్జీలకని రెండు రూపాయలు నా కొంగులో పెట్టి ముడివేసింది. రైలులో బాత్‌రూమ్‌కు వెళ్ళి వచ్చేసరికి పొట్లం విప్పేసి ఉంది. అందులో సగం పూరీ ముక్క మాత్రమే ఉంది. అదే తిన్నాను. షాజహాన్‌పూర్‌లో రైలు దిగి బాబూజీ మహరాజ్ వారింటికి రిక్షాలో వచ్చి దిగాను. బాబూజీ ఎదురుగా వచ్చి "నీ పూరీలు పోతేపోయాయి. అవి అందవలసిన వారికే అందాయి గాని రోటీలు ఉన్నాయి తిందువుగాని రా" అన్నారు. ఆశ్చర్యంగా చూస్తూ రిక్షావానికి డబ్బులు ఇవ్వడానికని కొంగు తీసుకొని ముడివైపు చూస్తే రూపాయలూ లేవు. బాబూజీ ఆ రెండు రూపాయలు కూడా వారే ఇచ్చి, "ఇవీ చేరవలసిన వారికే చేరాయిలే" అన్నారు.

బాబూజీ మహరాజ్‌కు సర్వం తెలుసు. వారి దగ్గర ఏదీ దాచలేం. వారు అందరిపై ఎంతో ప్రేమతో, ధ్యాసతో ఉంటారు.

సత్యాన్ని దాచలేము. కాకపోతే అది బయటపడటానికి కొంతకాలం పడుతుంది. అసత్యాన్ని పొగడదలచుకుంటే ఎంతైనా పొగడవచ్చు. కాని సత్యాన్ని ఎంత గ్రహించితే అంతే చెప్పగలం. పొగడటం కుదరదు. సత్యాన్ని గ్రహించటానికి కొంతకాలం పడుతుంది. చెద్దవాళ్ళు అది ఇలా, ఇది అలా అని ఎన్నో చెప్పవచ్చు. సత్యాన్ని గ్రహించే సమయం వస్తుంది. షాజహాన్‌పూర్‌లో ఒక వేదికపై బాబూజీ దివ్యసముఖంలో అందరూ ఒకటవుతారు. ఆ సమయం దగ్గరకు వచ్చింది.

ఏదైనాగాని ఆధ్యాత్మికతను గురించి బహిరంగ సభలలో ఉపన్యసించవలసివస్తే మనకు ఏది అనుభవంలోకి వస్తే అంతవరకే మాట్లాడాలి. అప్పుడే శిరస్సు ఎత్తుకొని ధైర్యంగా చెప్పవచ్చు. అప్పుడు మనం మాట్లాడినదానికి ఋజువు ఉంటుంది. అనుభవానికి వచ్చినంతవరకే నిరూపణ ఇవ్వగలం.

ఒకసారి బెంగుళూర్‌లో శ్రీ బాబూజీ, డా॥ వరదాచారిగారు, నేను (కస్తూరి) మరికొందరు ఉన్నప్పుడు ఒక పండితుడు శ్రీ బాబూజీని 'సచ్చిదానందం' అంటే ఏమిటని అడిగాడు. అప్పుడు నేను "బాబూజీ! మీరు అంగీకరిస్తే నేను రెండు మాటలలో దాని అర్థం చెబుతాను" అని అనగానే 'వారు' సరే అన్నారు. అపుడు నేను ఇలా చెప్పాను: చిత్ = ధ్యానం – చిత్తం నందు ధ్యానం స్థిరపడితే – సత్ = సత్యం, ఆ ధ్యానం నిరంతర స్మరణగా మారుతుంది. ఆనందం = ఆనందం. ఇప్పుడు చిత్తంలో ధ్యానం స్థిరపడి 'సత్' = నిరంతర స్మరణగా మారి, పరమానందాన్ని కలగచేస్తుంది" అని చప్పగానే డా॥ వరదాచారిగారు చాలా సంతోషించి, "ఈ వాక్యార్థం వివరించాలంటే రెండు, మూడు పుస్తకాలైనా చదవాల్సిందే. మీరు చాలా చక్కగా చెప్పారు" అని ప్రశంసించారు. అప్పుడు "బాబూజీ వివరణలు ఎక్కువగా వ్రాయబడటం వలన చదివేవారు ఎక్కువ భ్రమల్లో పడిపోయి, సత్యం గ్రహించలేరు" అని అన్నారు. చూశారా! సహజమార్గం ఏమి ఇస్తుందో, సత్యాన్ని ఇస్తుంది. అదే సచ్చిదానందం.

మన అస్థిత్వం – మన ఉనికి బాబూజీలో లయమైపోతే ఆ స్థితిలో మనం దేన్ని చూసినా లేదా మనం పొందినట్టిది ఏదైనా, లేదా మనకు కనిపించినది ఏదైనాసరే అది ఉన్నది ఉన్నట్లుగా, పారదర్శకంగా కనిపిస్తుంది. అదే అనుభూతిలోకి వస్తుంది. అలాకాక 'వారి'లో లయంకాని స్థితిలో చెప్పేది ఎలా ఉంటుందంటే, పుస్తకాలు చదివి తెలిసినదని చెప్పేదానిలా, అనుభవంలో లేనిదాన్ని ఊహించి చెబుతున్న విషయంలాగ ఉంటుంది. కాని సరైన విధంగా ఉండదు. లయమై పొందేది దివ్యత్వం. అది అద్దంలాగ ఉంటుంది, కనుక సర్వం గ్రహించగలుగుతాం. హృదయం వారిలో లయమైపోతే, ఆ హృదయంతో ఎంతోకొంత కాదు అంతా చూడగలం. దీనికి ఉదాహరణగా ఒక సంఘటన వివరిస్తాను. డా॥ వరదాచారిగారు ఒకసారి బాబూజీని ఒక ప్రశ్న ఇలా అడిగారు: "బాబూజీ! మీరు సిస్టర్ పరిశీలనా శక్తిని గూర్చి చాలాసార్లు పొగిడారు. ఆమెను నాకు ఒక సిట్టింగ్ ఇచ్చి నా స్థితిని చెప్పమని కోరుతున్నాను" అని అన్నారు. ఇక్కడ విషయం ఏమిటంటే, అప్పటికే డా॥ వరదాచారిగారిని శ్రీ బాబూజీ కేంద్ర మండలానికి చేర్చారు. కాని నన్ను, బాబూజీ ఇంకా కేంద్ర మండలానికి చేర్చలేదు. అయితే నేను ఎలా వారి స్థితి కనుకొనగలను? అని వారి సందేహం. బాబూజీ అనుమతితో నేను వారికి సిట్టింగ్ ఇచ్చి సరిగ్గా వారు ఉన్న స్థితిని వివరించాను. డా॥ వరదాచారిగారు చాలా సంతోషించి, "బాబూజీ! ఆమెకు నా స్థితి గ్రహించటం ఎలా సాధ్యమైంది" అని అడిగారు. అప్పుడు బాబూజీ ఆమెనే అడుగు అని చెప్పారు. అపుడు నేను శ్రీ వరదాచారిగారికి ఇలా చెప్పాను: "భూమిమీద ఉండి దూరంగా ఉన్న ఆకాశాన్ని చూడగలుగుతున్నాం. ఆధ్యాత్మికంగా మన అస్థిత్వాన్ని బాబూజీలో లయం చేసినట్లయితే ఎంత లోతైన స్థితి కూడా హృదయంలో పారదర్శకంగా అద్దంలో కనిపించినట్లు కనిపిస్తుంది, అని వివరించాను. కనుక మన అస్థిత్వాన్ని బాబూజీలో లయం చేసినట్లయితే, సర్వం అద్దంలోలాగా ప్రతిబింబిస్తుంది మన హృదయంలో.

ఒకసారి బాబూజీ విజయవాడ డా॥ పార్థసారథిగారి ఇంటికి వచ్చారు. ఎంతోమంది రోగులు డాక్టర్‌గారి కొరకు రావడం, వైద్యం చేయించుకొనడం చూసారు. ఇలాంటి సమయంలో డాక్టర్ షాజహాన్‌పూర్ వస్తే రోగులు ఎంతో ఇబ్బందిపడతారు. కనుక "నీవు రావద్దు" అని వారే డాక్టర్ పార్థసారథిగారికి చెప్పారు. అప్పుడు మరల బాబూజీ –"నీవు రాకపోతే నేనే ఇక్కడకు రావలసి ఉంటుంది" అని అంటూ సరదాగా

ఇంకో మాట కూడా జోడించారు. "నీవు షాజహాన్‌పూర్ వస్తే నేను నీకు భోజనం వడ్డించాలి. నేను ఇక్కడకు వస్తే నీవు వడ్డిస్తావు కదా!" అని సంతోషంగా పలికారు. వారు అందర్నీ ఎంతో ప్రేమిస్తారు. కనుక డాక్టర్‌గారు అక్కడకు రావలసిన అవసరం లేదు. మాస్టరే ఆయనకు కావలసినది ఇక్కడికే వచ్చి ఇస్తున్నప్పుడు నేనూ (కస్తూరీ) అలానే చేస్తాను అని బాబూజీతో అన్నాను.

ఇక్కడ ఈ వాతావరణాన్ని, ప్రాణాహుతిని, అక్కడ నుండే మీకు ఇవ్వగలరు. మనం నిజాన్ని గ్రహించాలి. ఎవరు, ఎందుకు ఇక్కడకు రాలేకపోయారు, అని తెలుసుకోవాలి. 'వారి'కి అంతా తెలుసు. ఇటువంటి విధానం (సహజమార్గ విధానం) ఇంతకుపూర్వం రాలేదు. ఇంక రాబోదు. మనం 'A' అనే పాయింట్ నుండి 'B' అనే పాయింట్‌కు వెళ్ళే మార్గంలోని స్థితిలో ముంచి ఆ మొదటి పాయింట్ రెండవ పాయింట్‌ల మధ్య ఉన్న వాతావరణ స్థితిలో మనల్ని లయం చేస్తారు బాబూజీ. అలాగే ఆ స్థితిలో ఉన్న శక్తినీ మనకు ఇస్తారు. బాబూజీపట్ల మన ప్రేమ పెరిగేకొద్దీ బాబూజీ ఇచ్చిన ఆ శక్తిని ఆకట్టుకుని, అంటే జీర్ణించకుని దాన్ని మనదిగా చేసుకుని దానిపై ఆధిపత్యం సంపాదించుకున్న రోజున రెండవ పాయింట్ నుండి మూడవ పాయింట్‌కు చేరతాం. ఇలా ఒకటి, రెండు పాయింట్‌ల మధ్య ఉన్న స్థితిలో లయమై అక్కడ ఉన్న శక్తిని ఆధీనం చేసుకొంటూ ఉన్నప్పుడు – ఈ శక్తియే ఆ పాయింట్‌ల మధ్య ఉన్నత స్థితిని క్రమంగా అధిగమించటానికి ఇప్పుడు ఇక్కడ ఉన్న పూర్ణశక్తిని 'పొందటానికి' కారణమవుతుంది. ముందు లభించిన శక్తి వల్లనే ఇది సమకూరుతుంది. ఈ శక్తిలో తక్కువ ఏమీ ఉండదు. నిర్మలీకరణ చేసుకొని ధ్యానంలో కూర్చుంటే మనం ఆ శక్తిని పూర్తిగా ఇముడ్చుకుంటాం. అభ్యాసీకి, ప్రిసెప్టర్‌కు అలాగే తన రిప్రజెంటేటివ్‌కు – అందరికీ శక్తి నిస్తారు. దానిని పూర్తిగా జీర్ణించుకుని అంటే తనలో ఇముడ్చుకున్నప్పుడు దానిపై ఆధిపత్యం వస్తుంది. విశ్వాసంతో, శ్రద్ధతో పనిచేస్తారు. అలా ఆ శక్తిని పూర్తిగా మనం జీర్ణం చేసుకోలేకపోతే మనం చేసిన పని బాగుందో లేదో – అనే సందేహంతో ఉంటాం. ఏదో వెలితిగా ఉంటుంది. ఎలా తయారు కావాలో అలా అవలేము. ప్రిసెప్టర్ బాబూజీలో లయావస్థ పొందినప్పుడే – అభ్యాసులకు ఇచ్చే సిట్టింగ్స్‌లో ఆ అభ్యాసుల కండిషన్‌గాని, వారు పొందే ఆనందానుభూతులనుగాని తెలుసుకోవడానికి వీలవుతుంది. అభ్యాసులు చాలామంది ఉంటారు. ఈరోజుగాని, రేపుగాని సిట్టింగ్స్ తీసుకుంటారు. ఉదయం, సాయంత్రం కూడా సిట్టింగ్స్ తీసుకుంటారు. వీరిలో తపన ఉంటే ఈ రోజు సిట్టింగ్‌లో పొందినది రేపు, లేదా ఎల్లుండిలోగా జీర్ణించుకుంటారు –తమలో ఇముడ్చుకుంటారు. బాబూజీ మహరాజ్‌పట్ల ప్రేమ ఉండి, 'వారి' దివ్య సౌందర్య దర్శనానికై అభ్యాసీలలో తపించే తపన ఉంటే –ఉదయం పొందినటువంటిది సాయంత్రానికి, సాయంత్రం పొందినది – ఉదయానికి ఇముడ్చుకుని – జీర్ణింప చేసుకుని – ఎదురు చూస్తారు. వీరిలో తపన మరింతగా పెరిగి – బాబూజీ మహరాజ్ ప్రసాదించే శక్తిని ఇముడ్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. అలాకాక అభ్యాసీ సిట్టింగ్‌కోసమే ధ్యాస ఉంచుకుంటే – ఆ సిట్టింగ్‌మీదనే తపన ఉంటే ఇముడ్చుకునేది తక్కువే.

**ప్రశ్న: జీవితం చాలా చిన్నది కదా! సాక్షాత్కారం పొందటానికి చాలాకాలం పడుతుంది. మరి ఎలా దీనికి పరిష్కారం.**

**జవాబు:** ఒక ఇల్లు కట్టడానికి చాలాకాలం పడుతుంది. కాని గృహప్రవేశం ఒక నిమిషంలో జరిగిపోతుంది. అలాగే సాక్షాత్కారం పొందటానికి కొంత సమయం పడుతుంది. మనం ధ్యానంలో కూర్చుని బాబూజీని

ఆహ్వానించి 'వారు' ఇస్తూ ఉన్న ఆ దివ్యత్వంలో మనల్ని మనం మరచిపోయి సాధన చేస్తే తప్పక సాక్షాత్కారం పొందుతాము.

సాక్షాత్కారం పొందాలనే తపనతో ఉన్న వ్యక్తి సాక్షాత్కారం లభించకుండానే మరణించినప్పుడు – అతడు పూర్తిగా బాబూజీని విశ్వసించి, 'వారి'పై ఆధారపడి మనస్సును 'వారి'పైననే లగ్నం చేసి సాధన చేస్తూ ఉంటే – ఇంక అతనికి వెనకచూపే ఉండదు. కన్నులు మూస్తే ఇక్కడ ఏమీ కనిపించదు. అంతా ఆ వైపే ధ్యాస ఉంటుంది. కన్నులు తెరిచి ఇటు ఇక్కడ చూస్తే అంతా కనిపిస్తుంది –ధ్యాస ఇటువైపే అవుతుంది. మంచిగా సాధన చేస్తూ చనిపోయిన అభ్యాసీకి ఈ ప్రపంచంవైపు దృష్టి ఉండదు. ముందుకు సాగడమే. వేగంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటమే! ఒకవేళ పుట్టాలని, ప్రపంచాన్ని చూడాలని ఉంటే మరల జన్మిస్తారు. ఎవరైతే సహజమార్గం ఇష్టంగా ఉండి, బాబూజీని ప్రేమిస్తూ, సాధన చేస్తూ, మరణిస్తే, వారు వెనుకకు వచ్చే ప్రసక్తే లేదు. దివ్యత్వాన్ని ప్రేమించి ఇష్టపడితే పైకి వెళ్ళతావు. బాబూజీకి ఆత్మను పైకి తీసుకు వెళ్ళడం తేలిక. ప్రపంచాన్ని ప్రేమిస్తే ఇక్కడకు వస్తావు. బాబూజీ ఏమన్నారంటే, "దివ్యత్వానికి అంతా సమర్పణ చేసుకొని సాధన చేస్తుంటే, అంతా మరచిపోతావు. మనం ఎంత అభివృద్ధి చెందాము, ఎక్కడదాకా వెళ్ళాము అనేవి ఏవీ పట్టించుకోవు" అని.

కొందరికి చాలా బాగుంటుంది, దివ్యత్వంతో ఉంటారు. కొందరికి బాబూజీగారు అంటే ఇష్టం. బాబూజీగారి దివ్య సౌందర్యం చూడాలని మాత్రమే ఉంటుంది. ఇంకేమి దృష్టికి రావు. భక్తిలో ఉంటారు. ఇది రెండు రకాలు. ఒకటి సమర్పణ –పిల్లిపిల్లను తల్లి ఎక్కడకు తీసుకొని వెళ్ళుతుందో తెలియదు. అది వెళ్ళిపోతుంది. ఇక రెండవది కోతిపిల్ల. దానంతట అదే తల్లిని పట్టుకుంటుంది. మెలకువగా ఉంటుంది. ఆనందం పొందుతుంది. రెండూ లక్ష్యం చేరతాయి.

సాధనలో మనం, నేను ఇది చేస్తున్నాను, అది చేస్తున్నాను అనేది కాకుండా వారిని గట్టిగా పట్టుకొని సాధన చేయటమే కావలసింది. వారు మనకు నచ్చారు. వారే కావాలనుకున్నాం. వారినే పొందాలనుకున్నాం. వారికోసం సాధన చేస్తున్నాం. ముందుకే వెళ్ళుతున్నాం. ముందుకు వెళ్ళుతున్నాం –అన్నభావనే ఉండాలి. వ్యతిరేక భావం ఉండరాదు. మన ఈ మార్గంలో – 'లేదు' అన్న పదమేలేదు. సమర్పణ చేసుకోకుండా ఉంటే వెళ్ళటం చాలా కష్టం.

ప్రార్థన చెప్పుకునేప్పుడు ఎంతో సౌమ్యంతో చెప్పుకుంటే హృదయంలో చాలా మృదుత్వం ఏర్పడుతుంది. ఆ మృదుత్వంతోటి, అంతా సౌమ్యంగానే కనిపిస్తుంది. చుట్టూ అదే భావన ఏర్పడుతుంది. బాబూజీ ఏం చెబుతారంటే, మనం ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు –వాళ్ళు మన వాళ్ళే –అనే భావనతో మాస్టర్ మనతోనే ఉన్నారనే భావంతో మాట్లాడితే, మాస్టరే చూస్తున్నారనే భావనతో ఉంటే – వారి మాటలు మధురంగా ఉండి ఎదుటివారిపై ఎంతో ఆత్మీయత ఏర్పడుతుంది. అసలు ప్రార్థన ఎందుకు? అది హృదయాన్ని సౌమ్యంగా, మృదువుగా తయారుచేస్తుంది. దానిలో "మీ సహాయం లేనిదే ఈ జీవితం ముందుకు సాగదు" అన్న భావంతో మృదువుగా, ముందుకు వెళ్ళుతుంది. దీనిని గ్రహిస్తే మనం ఆ సౌమ్యతను పరమ శాంతిని పొందితే మనల్ని ఎవరైనా ఎంత చెడ్డగా విమర్శించినా మన అంతరంగం సౌమ్యంగానే సమాధానం చెబుతుంది. ఇంక ఏ శక్తి ఉండదు. అలాకాకపోతే 'నేను' అనేది ఉంటుంది. నేను బ్రహ్మాండ మండలంలో ఉన్నాను.

అక్కడ, ఇక్కడ, ఆ స్థితిలో ఉన్నాను, అని ఆలోచిస్తూ ఉంటారు. వారు లక్ష్యం దాకా చేరలేరు. లక్ష్యందాకా ఎవరు వెళ్ళతారంటే బాబూజీ మహరాజ్‌పై వినమ్ర భావంతో, వినయంతో ఉన్నవారు వెళ్ళతారు. ఆ వినమ్ర భావమే సౌమ్యం, మృదుత్వం. శ్రీ బాబూజీగారిని గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటే ఆ భావం ఎంతో మధురంగా ఉంటుంది. ఎవరిని చూసినా 'వారి'ని చూసినట్లుగానే ఉంటుంది. ఇది మనం తయారుకావలసిన పద్ధతి. 'వారి' ఎదురుగా 'వారి'కి సమర్పితం కావలసిన రీతి ఇదే. ఈ విధంగా వారి ముందు యోగ్యంగా తయారుకావటమే సాధన.

ఒకసారి శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు శ్రీ బాబూజీగారిని "బాబూజీ! మాలో మీకు చెడు కనిపించదా? మీకు ఎవరూ చెడ్డవారుగా అనిపించరా?" అని అడిగారు. దానికి శ్రీ బాబూజీ, "ఒకవేళ చెడ్డవాటిని పట్టించుకోవటం ప్రారంభిస్తే, మంచి వాటిని కూడా చెడుగా భావించవలసి వస్తుంది. అందరూ నావారే కనుక ఇంక మంచి, చెడు అనే ప్రశ్న ఏముంది! మనం పరమశాంతివైపు వెళ్ళాలనుకుంటున్నాం. ముందుకు వెళ్ళాలి. అక్కడ అశాంతియే ఉండదు" అని అన్నారు. వారి ప్రతి మాటలో మనకు శిక్షణ లభిస్తుంది. మనం ఎలా ఉండాలి, ఎలా తయారుకావాలి, ఎంత శ్రేష్ఠంగా జీవించాలో అన్ని తెలుస్తాయి. ఈ విధంగా 'వారు' చెప్పిన విధంగా ఎక్కడ నివసిస్తామో అక్కడ ప్రశాంతత వెల్లివిరుస్తుంది. అది శాంతికి నిలయమవుతుంది. కనుక శాంతికి భంగం కలిగించరాదు. అలాచేస్తే శాంతి, ఆ పరమశాంతి ఎక్కడ నుండి వస్తుంది. శ్రీ బాబూజీ ఇలా ఎంతో చక్కగా వివరిస్తారు. 'వారు' మనకు ప్రతిరోజు నేర్పిస్తారు. ఇప్పటికీ నేర్పిస్తూనే ఉన్నారు.

ఒకరోజు ఈశ్వర్ సహాయ్‌గారు శ్రీ బాబూజీ మహరాజ్‌తో "బాబూజీ! మీరు మమ్మల్ని అంతిమానికి చేర్చటానికి ఎంతో శ్రమ తీసుకుంటున్నారు. మాలోని లోపాల్ని మీరు చెబితే మేము అధిగమించే ప్రయత్నం చేస్తాం కదా!" అని అడిగారు. దానికి సమాధానంగా శ్రీ బాబూజీ, "మీ లోపాలు మీకు తెలిసి మీరు ఆ చెడును దూరం చేసుకోగలిగితే నారాకకు అర్థం ఏం ఉంది" అని అన్నారు.

**ప్రశ్న: అభ్యాసీ కానివారు, పెద్దవయస్సువారు శ్రీ బాబూజీని తలచుకొని కూర్చోవచ్చా?**

**జవాబు:** తప్పకుండా కూర్చోవచ్చు. ఎవరైనా కూర్చోవచ్చు. కాకపోతే అభ్యాసీ కానివారు, పెద్దవయస్సువారు కేవలం తలచుకోవటమే కాకుండా వారిపై ఎక్కువగా అనుబంధం పెంచుకొని కూర్చుంటే చాలా ఉపయోగం ఉంటుంది.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీతో, "బాబూజీ! మిమ్మల్ని ఎంతో ఎక్కువగా గుర్తుచేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాను" అని అన్నాడు. అప్పుడు శ్రీ బాబూజీ, "మంచిది. కాని ఒక్క విషయం. ఒక కుక్క తన యజమానిపై ఎంత విశ్వాసంతో ప్రేమ చూపుతూ ఉంటుందో, కనీసం మనం అంతైనా విశ్వాసంతో దివ్యత్వంపైన అనుబంధాన్ని పెంచుకొని గుర్తు చేసుకుంటే, మంచి ఫలితం ఉంటుంది" అని అన్నారు.

ప్రకృతిలో చూడండి –మనం మన పిల్లల్ని తలచుకొన్నప్పుడు, చూసినప్పుడు, మాట్లాడినప్పుడు ఉన్న ఆప్యాయత, అనురాగం, దగ్గరితనం ఇతరుల పిల్లల్ని చూసినప్పుడు ఉండదు. దూరంగా భావిస్తాం. కాని మనం, భగవంతుడు అందరిలో ఉన్నాడు. అందరూ వారి పిల్లలే అనే భావంతో సాధనచేస్తే మనకు

తప్పకుండా మన పిల్లలతో వ్యవహరించేటప్పుడు ఉన్న దగ్గరితనం ఇతరుల పిల్లలతో వ్యవహరించేటప్పుడు కూడా ఉంటుంది. ఏ భేదం ఉండదు. ఇది సాధనా ఫలితం. అందరిలో దైవం ఉన్నాడన్న భావనా ఫలితం.

**ప్రశ్న: జీవితం చాలా తక్కువగా ఉన్నది. మరి ఆధ్యాత్మికతలో అభివృద్ధి చెందాలంటే ఎలా?**

**జవాబు:** ముందు జీవితం చాలా తక్కువ అన్న భావం, ఆలోచన పూర్తిగా వదిలెయ్యండి. మన పిల్లలు కోరుకున్నా, కోరుకోకపోయినా పిల్లలతో ఎంత ప్రేమగా ఉంటామో అలాగే శ్రీ బాబూజీయే సర్వస్వం; ప్రతిక్షణమూ 'వారి'ని పొందాలనే తపనతో, కోరికతో, ప్రేమతో ఉండటమేకాక వారు మన అంతరంగంలోనే ఉన్నారన్న భావంతో ఉండాలి. మనపై ప్రేమతో 'వారు' మన ఎదురుగా ఉన్నారని, మనలను చూస్తున్నారని తలచుకోవాలి. వారికి సమర్పితం కావాలి. ప్రతి అణువు వారివే అయిపోవాలి, కరిగిపోవాలి. ప్రతిక్షణం వారికై నిరీక్షణలో, వారిపట్ల ప్రేమతో జీవిస్తే, ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతాం అని శ్రీ బాబూజీ చెప్పారు.

**ప్రశ్న: రాత్రిపూట 9.00 గంటలకు ప్రపంచంలో అందరికొరకు, అందరి ఆధ్యాత్మిక ఉన్నతికొరకు ప్రార్థన చెయ్యమన్నారు కదా!**

**జవాబు:** ఇప్పుడు అది అవసరంలేదు. మన ప్రార్థన, క్షాళన ఇవి అన్నీ మనందరినీ ఒకటిగా చేసేందుకు, మన అంతరంగం ధ్యానంపై లగ్నం చేసి శ్రీబాబూజీని పొందుటకు, నిరంతరం స్మరించుకునే అవకాశం కల్పించటానికి; 'వారి'ని హృదయంలో నిలుపుకొని, 'వారి'లో లయం కావటానికి. క్షాళన ఎందుకు? ఎక్కువగా జీర్ణించుకోవటానికి సిద్ధం కావటానికి. ప్రార్థన అర్పణను నేర్పుతుంది. సమర్పించుకొనే అవకాశం కల్పిస్తుంది. ధ్యానం తెగిపోకుండా పట్టుకొని ఉండటానికి ఉపకరిస్తుంది.

క్లీనింగ్ (నిర్మలీకరణ) ఎంతవరకు అవసరం అంటే అపరిశుభ్రంగా ఉన్నంతవరకు నిర్మలీకరణ అవసరమే. ఇల్లు పరిశుభ్రంగా ఉంటే మరల శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రార్థన ఎందుకు అంటే దివ్యమూర్తి బాబూజీతో మనం కనెక్ట్ అవటానికి, అంటే కలపబడటానికి.

సమర్పణ భావనతో మనల్ని బాబూజీతో కనెక్ట్ చేసుకుని వారిచ్చే శక్తిని గ్రహించి నిరంతర స్మరణలో ఉన్నప్పుడు మాలిన్యాలన్నీ తొలగించబడి పవిత్రత చేకూరుతుంది. అప్పుడు ప్రత్యేకంగా నిర్మలీకరణ చేసుకోవాల్సిన అవసరంలేదు. ఆ దివ్యశక్తి మనలోకి రాగానే మన హృదయం దానంతట అదే శుభ్రపడుతుంది. నిరంతరం అలా ఆ ధ్యానంలో ఉంటే క్షాళన (క్లీనింగ్) అవసరం లేదు. ధ్యానంలో ఎంత లోతుగా మునిగిపోతే బాబూజీతో అనుబంధం అంత దృఢంగా ఉంటుంది.

మనది క్రొత్త విధానం. కనుక అందరిని ఒకటి చేయాలన్నది వారి భావన. అలా అయితే, వారి పని పూర్తి అయినట్లే.

మనం ఎంత అర్పణ భావంతో 'వారి'ని ప్రార్థిస్తామో అంత ప్రేమ, కృప 'వారి' నుండి లభిస్తాయి.

**ప్రశ్న: ఉదయం ధ్యానానికి ముందు 5 నిమిషాలు క్షాళన అవసరమా?**

**జవాబు:** రాత్రి అంతా 'వారి' భావనతో 'వారి' పాదాల చెంతనే ఉన్నామన్న భావన ఉన్నప్పుడు ఇంకా క్షాళన అవసరం ఏముంది.

**ప్రశ్న: అయితే క్షాళన అవసరం లేదా?**

**జవాబు:** ఇల్లు అపరిశుభ్రంగా ఉంటే రోజుకు ఒకసారైనా శుభ్రపరచుకుంటాం. మరల మరల శుభ్రపరచుకుంటామా?

ధ్యానంతో వారితో యోగం లభిస్తుంది. లగ్నమైన మనస్సుతో, ఎంత ధ్యాసతో 'వారి'కి సమర్పితమైతే 'వారి'కి అంత దగ్గర అవుతాం.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! రోజుకు రెండు, మూడుసార్లు క్షాళన చేసుకోవచ్చా?" అని అడిగాడు. సమాధానంగా శ్రీ బాబూజీ, "నీ ఇష్టం; ఎన్నిసార్లు అయినా చేసుకో! కాని అవసరం లేనప్పుడు ఎందుకు ఇన్నిసార్లు క్షాళన చేసుకోవాలనిపిస్తుందంటే, పోయిన జన్మలో ఊడ్చే పనివారై ఉండాలి" అన్నారు నవ్వుతూ.

ఒకసారి నాదగ్గర నలుగురు, ఐదుగురు అభ్యాసీలు కూర్చు నప్పుడు – "మీకు క్షాళన అవసరమైతే మేమే చెబుతాం, క్లీనింగ్ మేము చేస్తాం కదా! దాన్ని గురించి ధ్యాస అనవసరం" అని అన్నాను. ఆ అభ్యాసీలు వెంటనే అక్కడే ఉన్న బాబూజీని అదే అడిగారు. 'వారు' వెంటనే, "ఆమె అవసరం లేదంటే అవసరం లేదు. మళ్ళీ నన్ను ఎందుకు అడుగుతున్నారు? ఆమెను అడగండి" అన్నారు నవ్వుతూ. చూసారా! శ్రీ బాబూజీ ఎలా చమత్కారంగా మాట్లాడతారో!

**ప్రశ్న: శ్రీ బాబూజీ గారి పుస్తకాలు అన్నింటిలో శ్రీకృష్ణుని గురించి, వారి సందేశాలను గురించి ఉంటుంది కాని, శ్రీరాముని గూర్చి ఏ రకమైన ప్రస్తావన లేదు; ఎందుకని?**

**జవాబు:** ఒక అవతారం అవతరించి దాని కార్యక్రమం పూర్తయి పోయిన తర్వాత ఎక్కడ నుండి అనగా ఏ స్థితి నుండి ఆ అవతారం దిగివచ్చినదో ఆ స్థితిశక్తిలో లయమైపోతుంది. ఆ తరువాతి అవతారం వచ్చేసరికి మొదటి అవతారపు ప్రసక్తి ఉండదు. అందువల్లనే శ్రీరాముని అవతార ప్రభావం శ్రీకృష్ణుని రాకతో సమాప్తమైపోయింది. వారు ఏ సంకల్పంతో వచ్చారో ఆ సంకల్పం నెరవేరగానే వెళ్ళిపోయారు. రావణ సంహారం, దుష్టశిక్షణ –అటువంటి కార్యక్రమం అయి పోయింది. వారు, వారు వచ్చిన స్థితిలోనే తిరిగి లయమైపోయారు. కృష్ణుడు కూడా అంతే. కృష్ణుడు ధర్మ సంస్థాపనార్థమై ఇంకొంచెం ఎక్కువ శక్తితో వచ్చారు. కాని శ్రీ బాబూజీ అనంతం యొక్క సంపూర్ణ శక్తితో – మానవళినంతటిని అంతిమం వద్దకు చేర్చాలనే సంకల్పంతో వచ్చారు. ఎప్పుడైతే ఆ అనంతం నుండి అనంతపు శక్తితో ఆ శక్తి ఒక వ్యక్తిగా అవతరించాల్సిన అవసరం కలిగినప్పుడు –లాలాజీ గురుదేవులు మౌల్వీసాహెబ్ అది నా పనికాదు, మీ పనే అని లాలాజీగారితో అన్నారు. అనంతంలో సకల విశ్వావిర్భావం (సృష్టి) చేసిన దాని యొక్క పరిపూర్ణ శక్తితో అవతారం రావటానికి దానిలో స్పందన కల్పించమని లాలాజీని మౌల్వీసాహెబ్ కోరారు. లాలాజీ ప్రార్థనవలన ఆ అనంతంలో స్పందన కలిగి వారి సంకల్ప ఫలితంగా ఆ అనంతం తన సంపూర్ణ శక్తితో ఈ భూమిపై బాబూజీ రూపంగా అవతరించింది. అలా అనంత శక్తితో శ్రీ బాబూజీగారు అవతరించారు. కనుక అప్పటివరకు ఉన్న అవతారాలు, బ్రైటర్‌వరల్డ్‌లో ఉన్న మహనీయులు, వీరంతా ఈ అనంత శక్తిమంతులైన శ్రీ బాబూజీలో లయమైపోయారు.

**ప్రశ్న: శ్రీకృష్ణుడి గురించి అప్పుడప్పుడు కలలు వస్తుంటాయి. ఎందుకని?**

**జవాబు:** మన ఆలోచనల్లో వారున్నారు కాబట్టి, అలా కలలు వస్తూ ఉంటాయి.

**ప్రశ్న: తెల్లవారుజామున మూడు గంటలకు నిద్రలో మెలకువ వచ్చినప్పుడు ధ్యానంలో కూర్చోవచ్చా?**

**జవాబు:** సహజమార్గం ఎంతో స్వేచ్ఛను ఇస్తోంది. దానికి ఎలాంటి హద్దులు లేవు. స్వేచ్ఛ నుండి స్వేచ్ఛ ఇవ్వటానికే ఈ సంస్థ ఏర్పడినది. చాలాచోట్ల బాబూజీ చెప్పారు– ఎప్పుడైనా కూర్చోవచ్చు, ఎక్కడైనా కూర్చోవచ్చు, ఆ శక్తి లభిస్తుంది అని. ఎప్పుడూ 'వారి' నుండి అనంత ధార లభిస్తూనే ఉంటుంది. తీసుకోవటమే మన వంతు.

విద్యార్థులు పది నిముషాలు కూర్చుంటే చాలు. వారిని బలవంతం చేయకూడదు. వారికి చదువే ధ్యానం. జీవితంలో చదువుకొని ఎంతో పైకి రావాలి. ఎంతో ప్రేమతో వారికి విషయాలు నచ్చచెప్పాలి. కొట్టకూడదు, తిట్టకూడదు, సతాయించకూడదు.

ఒక అభ్యాసీ బాబూజీ దగ్గరకు వచ్చి, "మా అబ్బాయిని ఫస్ట్‌క్లాస్‌లో పాస్ చేయించండి" అని అడిగాడు. అప్పుడు బాబూజీ ఆ అభ్యాసీని "మీ అబ్బాయి ఎన్ని గంటలు రోజుకు చదువుతాడు?" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా రోజుకు 2 గంటలు అని చెప్పాడు ఆ అభ్యాసీ. అప్పుడు శ్రీ బాబూజీ, "రోజుకు 24 గంటలు ఉంటే కేవలం 2 గంటలే చదివితే ఎలా? నేను ముసలి వాడినై పోయాను. ఆ మిగిలిన సమయం మీవానికోసం నేను చదవలేను" అన్నారు చమత్కారంగా. మళ్ళీ "నేను చదివితే వాడు పాస్ అవుతాడా? అతడే చదవాలి. ధైర్యంగా నిలబడాలి. ఎవరు చేసేపని వారే విశ్వాసంతో చెయ్యాలి" అని అన్నారు.

మన ప్రార్థన ఏపని అయినా చేస్తుంది. శ్రమపడాలి. విద్యార్థుల్ని చదివించే బాధ్యత తల్లిదండ్రులదే. అవకాశాలు కల్పించాలి. వారు సాధన చేయాలి. వారికి ధ్యానం అవసరంలేదు. చదువే ధ్యానం. వారిని కోపగిస్తే వారి రక్తం వేగవంతమై మొండికేస్తారు.

శ్రీ డా॥ పార్థసారధిగారికి చెప్పండి– వారు రానవసరంలేదు; నేనే స్వయంగా వచ్చి వారికి కావలసినది ఇస్తాను. వారికి వరదానం లభిస్తుంది అని, ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని చెప్పండి.

**ప్రశ్న: బాబూజీ 'ఈశ్వరీయత' అని చాలాచోట్ల పుస్తకాల్లో ప్రస్తావించారు. 'ఈశ్వర్' అంటే శివుడు అని అంటారు కదా! మరి మనం శివుడి గుడిలోకి వెళ్ళి పూజ చేయవచ్చునా?**

**జవాబు:** చేయకూడదు. 'ఈశ్వర్' అంటే రాముడు, శివుడు అని కాదు. 'ఈశ్వర్' అంటే భగవంతుడు. "ఈశ్వర్ –ఆ డివైన్ పవర్ (దివ్యశక్తి) యొక్క ముఖ్య కేంద్రం. ఈశ్వరీయ క్షేత్రం నందలి ఈశ్వరీయ శక్తితో అవతారాలు భూమి మీదకు వస్తాయి. ఈశ్వరీయ శక్తి, అవతారాలలో నిండిపోయి, ఇమిడిపోయి ఉంటుంది. కాని ఈశ్వరుడు ఈశ్వరుడే! అంతేకాని ఈశ్వరుడు (అంటే భగవంతుడు) ఎప్పుడూ ఈ భూమి మీదకు రాడు. రాముడు, కృష్ణుడు, శివుడు, విష్ణువు ఎవరైనా సరే, ఆ సమయం యొక్క అవసరాన్నిబట్టి, ఈశ్వరీయ శక్తిని తీసుకొని ఈ భూమి మీదకు వస్తారు" అని బాబూజీ వ్రాశారు.

**ప్రశ్న: మాకు చాలా పవర్‌ఫుల్ ట్రాన్స్‌మిషన్ (శక్తివంతమైన ప్రాణాహుతి) వచ్చిందని లక్నోకు వెళ్ళివచ్చిన అభ్యాసీలు తెలిపారు. మరి లక్నోకు రానివాళ్ళకు కూడా అదే విధమైన పవర్‌ఫుల్ ట్రాన్స్‌మిషన్ లభిస్తుందా?**

**జవాబు:** ప్రాణాహుతి అనేది ఎక్కడైనా ఒక్కటే కాని, ఫీలింగ్ (అనుభూతి) అనేది వేరు వేరుగా ఉంటుంది. లక్నోకు వచ్చిన అభ్యాసులు నా సమీపంగా ఉండటంవలన వారి ఫీలింగ్ అలా ఉంటుంది.

**ప్రశ్న: అభ్యాసీ ధ్యానంలో కూర్చున్నప్పుడుగాని, ప్రిసెప్టర్ ఇండి విద్యువల్ సిట్టింగ్ ఇచ్చినప్పుడుగాని లేదా సత్సంగ్ నిర్వహించి నప్పుడుగాని ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ఎక్కడ నుండి వస్తుంది? ఎక్కడ నుండి వెలువడుతుంది?**

**జవాబు:** "బాబూజీ మహరాజ్ నా ఎదుటనే కూర్చొని ఉన్నారు" అని భావించి, 'వారి'ని తలచుకొని – ఎప్పుడైనా సరే, ఎక్కడైనా సరే, ధ్యానంలో కూర్చుంటే మనకు ప్రాణాహుతి వస్తుంది. ఎందుకంటే, బాబూజీ మహరాజ్ ఆ డివైన్ పవర్ (దివ్యశక్తి) యొక్క ఒక ముఖ్య కేంద్రం. మీరు ఆ శక్తి కేంద్రం (బాబూజీని) స్మరించగానే మీకు ఆ శక్తి (ట్రాన్స్‌మిషన్) లభిస్తుంది. ప్రిసెప్టర్ దగ్గర కూర్చున్నా, లేదా మరెక్కడ కూర్చున్నా సరే! ప్రిసెప్టర్ ఒక చిన్న శక్తి కేంద్రంతో కనెక్ట్ చేయబడి ఉంటాడు. ప్రిసెప్టర్‌కు కూడా ప్రాణాహుతి శక్తి, ఆ శక్తి కేంద్రం నుండే వస్తుంది. అభ్యాసులకు తెలియచేయటానికి, సాధన గురించి వివరించి చెప్పటానికి ప్రిసెప్టర్లు తయారు చేయబడతారు.

**ప్రశ్న: ఆ ప్రాణాహుతి శక్తి యొక్క సోర్స్ (మూలం) ఎక్కడ ఉంది?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ ఏమని అన్నారంటే, "ఎందుకు నీవు భిక్షగానిలాగా మారి ప్రశ్నలు అడుగుతావు? ప్రాణాహుతి ఎక్కడ నుండి వస్తుంది – అనేది ప్రయత్నించి చూడు; ట్రాన్స్‌మిషన్‌ను నీవు ఫీల్ అయినపుడు– దాని సోర్స్ (మూలం) ఎక్కడ ఉంది? అని నీవు చూడటానికి ప్రయత్నించు" అని అన్నారు.

ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు, అని మనం అడుగుతాం. డివైన్ (ఈశ్వరుడు) నీలోనే ఉన్నాడు. కాబట్టి నీవు ప్రాణాహుతి శక్తి యొక్క సోర్స్ (మూలం) గురించి తెలుసుకునేముందు, నీలో ఉన్న ఈశ్వరుని అన్వేషించు. అప్పుడు ఆ సోర్స్ (మూలం) దానంతట అదే తెలిసిపోతుంది.

సరే! ఈ ప్రశ్నకు (సోర్స్ గురించి) జవాబు నేను చెప్తాను. సాక్షాత్కారం అంటే ఏమిటి? అనగా డివైన్ (దైవం)ను వెదకడం, అన్వేషించడం. సోర్స్ (మూలం) అనేది కేవలం అల్టిమేట్ (అంతిమం) మాత్రమే, కాని మనం ముందుగా చేరేది ఈశ్వరుని (భగవంతుని) కంటే దిగువన అయి ఉన్నప్పుడు మనకు ఈశ్వరుని నుండి మాత్రమే శక్తి లభిస్తుంది; అంటే అప్పుడు ఈశ్వరుడు కూడా ఒక సోర్స్ అవుతుంది. కాని బాబూజీ, ఎప్పుడైతే మనం సెంట్రల్ రీజియన్‌ను చేరుకున్నామని చెప్తారో, అప్పుడు అల్టిమేట్ (అంతిమం) మాత్రమే మన సోర్స్ (మూలం) అవుతుంది; మన పురోభివృద్ధి (ప్రోగ్రెస్) ఏఏ రకంగా ఉంటుందో అదే విధంగా ఈ సోర్స్ (మూలం) అనేది ఆపైగా ఉంటుంది.

ఎప్పుడైతే మీకు ఈశ్వరీయ సాక్షాత్కారం కలుగుతుందో అప్పుడు మీకు ప్రాణాహుతి శక్తి ఈశ్వరుని నుండి రాదు. బాబూజీ మహరాజ్ నుండియే వస్తుంది. మనలను పైకి తీసుకొని వెళ్ళేది బాబూజీ మహరాజ్ మాత్రమే. ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనకు కేవలం బాబూజీ మహరాజ్ ద్వారానే అన్ని స్థితులూ, సర్వమూ లభిస్తాయి. నేడు మన అందరికి ఉపయోగకరమైన ఒక గొప్ప విషయం ఏమిటంటే, బాబూజీ మహరాజ్, మనకోసం, మన అందరి పురోభివృద్ధి కొరకు, ఒక సంకల్పంతో ఈ భూమిమీద అవతరించారు.

సోర్స్ అనగా 'అంతిమం' –శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలో ఈ భూమి మీదకు దిగి వచ్చింది. 'వారి' శక్తి అంతటా ఉన్నది.

ధ్యానం, క్లీనింగ్, ప్రార్థన –ఇవన్నీ కూడా మనకు ఉపయోగపడతాయి అని, బాబూజీ అనేవారు. ఏ విధంగా మనకు కండిషన్స్ (స్థితులు) కలుగుతాయో, సబ్‌మిషన్ (అర్పణ) భావం ఏర్పడుతుందో, ఏ విధంగా అయితే ఐనెస్ (నేను, నాది) అనేది కరిగిపోతూ, బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ అవుతామో, అప్పుడు మనకు ప్రతిక్షణమూ ప్రాణాహుతి లభిస్తూ ఉంటుంది. మనం బాబూజీతో ఎడతెగని అనుబంధం కలిగి ఉంటే, నిరంతరం ప్రాణాహుతి లభిస్తూనే ఉంటుంది.

బాబూజీ మహరాజ్ అన్ని విషయాలూ చాలా చక్కగా చెప్పేవారు. 'వారు' చెప్పిన విషయాలను మనం ఆచరిస్తే అన్ని ప్రశ్నలకు కూడా సులభంగా జవాబు దొరుకుతుంది. ఒకసారి బాబూజీ ఇలా అన్నారు: "ఈశ్వరుడు సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడై ఉన్నాడు. ఎప్పుడైతే మనమూ సాధనవలన అదే విధంగా (సర్వవ్యాపకంగా) తయారు అవుతామో, అప్పుడే మనకు ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు, ఏమిటి? అనే విషయం తెలుస్తుంది. కానీ నాకు మాత్రం మానవ మాత్రులను ఉద్ధరించటానికి అవతరించిన శ్రీ లాలాజీ సాహెబ్‌యే నాకు ఈశ్వరుడు, భగవంతుడు" అని.

"మావన మాత్రులందరిలోను మరల ఈశ్వరప్రాప్తి యొక్క కోరికను మేల్కొలపాలి" అనే సంకల్పంతో బాబూజీని లాలాజీ సాహెబ్ ఈ భూమి మీదకు తీసుకొని వచ్చారు. మానవుడు మరలా నిజమైన మానవునివలె మారి, తిరిగి భక్తుడై ఈశ్వరుని పొందాలి అనే సంకల్పంతో మానవాళి కొరకు బాబూజీ అవతరించారు. అయినా బాబూజీ ఏమని అన్నారంటే, "ఈశ్వరుడు ఎవరో, భగవంతుడు ఎవరో నాకు తెలియదు. నాకు కేవలం లాలాజీ సాహెబ్ మాత్రమే తెలుసు. లాలాజీయే నా ధ్యానం, నా ఈశ్వరుడు, నా సర్వస్వం" అని.

**ప్రశ్న: ఎవరైనా అభ్యాసీ మరణించినపుడు లేదా మరణానికి దగ్గరలో ఉన్నప్పుడు ఇతర అభ్యాసీల యొక్క పాత్ర ఏమిటి?**

**జవాబు:** ప్రార్థన చేయటం మాత్రమే మనం చేయవలసినది. కాని ఏ అభ్యాసీలో బాబూజీని చేరుకోవాలనే తపన ఉంటుందో, వాళ్ళ కొరకు మనం ప్రార్థన చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, ఆ అభ్యాసీ ప్రాణం పోగానే, అతని ఆత్మ మరల ఎప్పుడూ కూడా వెనుకకు మరలి చూడకుండా, అనగా ఈ భూమివైపుకు చూడకుండానే పురోగమిస్తూ లక్ష్యాన్ని చేరుకుంటుంది. తపన ఉన్నటువంటి ఆ ఆత్మ కొరకు మనం ప్రార్థన చేయవలసిన అవసరం లేదు. అంటే మన ప్రార్థన యొక్క అవసరం లేకుండానే ఆ అభ్యాసీ పని పూర్తవుతుంది.

కానీ ఏ అభ్యాసీలో నయితే తపన ఉండదో అతని కొరకు మాత్రం మనం ప్రార్థన చేయాలి. ఆ అభ్యాసీ (ఆత్మ) మరల జన్మించకూడదని, ఈ భూమివైపు చూడకూడదని బాబూజీని ప్రార్థించాలి.

"ఎవరిలోనైతే సాక్షాత్కారాన్ని పొందాలి అనే నిజమైన తపన ఉంటుందో, అతడు ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోయిన తరువాత, మరల ఈ భూమి మీదకు ఎప్పుడూ రాడు, అని నేను గ్యారెంటీ (హామి) ఇస్తున్నాను" అని బాబూజీ అన్నారు.

"మరణించిన ఆ అభ్యాసీలో నిజమైన తపన, ఆవేదన అనేది ఉంటే, అతని ఆత్మ చాలా వేగంగా పురోగమిస్తుంది. ఆ అభ్యాసీకి తాను జీవించి ఉన్నానా లేక మరణించానా అనే ఎరుక కూడా ఉండదు. అతని ఆత్మ ఎప్పుడూ కూడా లక్ష్యాన్నే అంటిపెట్టుకుని ఉంటుంది" అని, బాబూజీ తెలిపారు.

**ప్రశ్న: ఎవరైనా అభ్యాసీ అంతిమ సమయంలో ఒకవేళ బాబూజీని జ్ఞాపకం చేసుకొనకపోతే?**

**జవాబు:** నీవు నన్ను జ్ఞాపకం చేసుకొనకపోయినా నేను నా బిడ్డను గుర్తుంచుకుంటాను, అని బాబూజీ అన్నారు.

చనిపోయిన తరువాత శవాన్ని తీసుకొని పోతున్నప్పుడు 'రామ్‌నామ్ సత్యహై' (రామ నామమే సత్యం) అని దారి పొడవునా అంటూ ఉంటారు, ఇది ఆ శవం కొరకు కాదు. ఆ శవం ఆ మాటలు వినలేదు కదా! ఇది ఆ శవం వెంట వచ్చే ప్రజల కోసం ఒక హెచ్చరిక. కేవలం రాముడే సత్యం. ఏదో ఒక రోజున మీరు కూడా మరణించవలసే ఉంటుంది. అందువలన మీరూ త్వరగా రాముని (భగవంతుని) పొందండి. పొందితే ఇంక ఈ భూమి మీదకురారు, అని అర్థం.

ఈరోజు ఉదయం ఒక సోదరుడు విజయవాడకు తిరిగి వెళ్తున్నాం డాక్టర్‌గారికి మీ సందేశం ఏమని చెప్పాలి అని అనగానే, ఒక్కసారిగా నా అటెన్షన్ (దృష్టి) విజయవాడవైపు మరలినది. అప్పుడు నేను గమనించినది ఏమిటంటే, "ఏ రోజు నయితే మీరందరు ఇక్కడకు రావటానికి ఈ ప్రోగ్రాం తయారుచేసారో అనాటి నుండే మొత్తం విజయవాడ వాతావరణమే మారిపోయింది. నగరం (సిటీ) అంతా పూర్తిగా ప్రాణాహుతితో నిండి ప్రశాంతమైపోయింది. డాక్టర్ సాహెబ్‌కు అభ్యాసీలపట్ల కల శ్రద్ధ, ప్రేమ, అంకితభావం, సేవానిరతి వలన బాబూజీ ఆశీస్సులూ, ఇంత గొప్ప వరదానమూ లభించాయి. సెంటర్ ఇన్‌చార్జ్‌కు అభ్యాసీలపట్ల ఎటువంటి ప్రేమ ఉండాలంటే, తాను ఏ విధంగానైతే ప్రోగ్రెస్ అవుతున్నారో అదే విధంగా సెంటర్‌లోని అభ్యాసీ లందరూ ప్రోగ్రెస్ కావాలనే కోరికతో పనిచేయాలి. డాక్టర్‌గారిలో అంతమంచి కోరిక, తపన ఉన్నాయి. తాను ఏ విధంగానైతే ప్రోగ్రెస్ అవుతున్నారో, అదే విధంగా అందరూ అలా ప్రోగ్రెస్ కావాలని వారు కోరుకుంటున్నారు. అందువలన విజయవాడ సిటీ అంతా లాభాన్ని పొందుతుంది" అని.

**ప్రశ్న: ఎవరైనా అభ్యాసీ విగ్రహారాధన చేస్తుంటే, వాళ్ళకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?**

**జవాబు:** బాబూజీ ఏమన్నారంటే, "నీవు పది రకాల పూజలు చేస్తూ ఉంటే ఈ పూజ చేయాలి, ఆ పూజ చేయాలి అనీ, కేవలం అదే చేయాలి, ఇదే చేయాలి అనే దానిలోనే ఉంటావు కాని, ఈ పూజలు చేయటం వలన నాకు ఏమైనా ప్రోగ్రెస్ కలిగిందా అని చూసు కోవటానికి సమయం కూడా ఉండదు. మొదట రాముని పూజించావు. తరువాత అతడిని తొలగించి శివుని పూజించావు; ఆ తరువాత మరొకరిని – ఇంకొకరిని, ఈ విధంగా నీవు ఒకరిని మార్చి ఇంకొకరిని పూజిస్తూ, పరుగులు తీస్తూనే ఉంటావు. అందువలన మొదట నీవు చేయవలసింది ఏమిటంటే, ఏదైనా ఒక సాధననే పూర్తిగా ఆచరించు, ఇంతగా సాధన చేసిన తరువాత కూడా 'నాలో ఎటువంటి మార్పు రాలేదు. నాకు ఎటువంటి ప్రోగ్రెస్ రాలేదు' అని అనిపించగానే, వెంటనే ఆ సాధన విడిచిపెట్టి, ఇంకొకదాన్ని ప్రయత్నించు. దానివలన కూడా లాభం కనిపించకపోతే, మరోదాన్ని ప్రయత్నించు" అని అన్నారు.

ఇప్పుడు మనం సహజమార్గ సాధనలోకి వచ్చాం. అందు వలన సహజమార్గ సాధనవైపే దృష్టిని ఉంచాలి కాని, అటూ ఇటూ చూస్తే సాధన వికలం అవుతుంది. ఒక సాధన స్థౌల్యాన్ని తొలగిస్తుంది. ఇంకొక సాధన స్థౌల్యాన్ని పెంచుతుంది. నేను కూడా బాబూజీ వద్దకు రావటానికిముందు రకరకాల సాధనలు, పూజలు చేశాను. ఒక సాధన చేసి, దానివలన ఏ ఫలితమూ లేదనిపించగానే దాన్ని మార్చి,

ఇంకోకటి చేసేదాన్ని. మన బాబూజీ మహరాజ్ ఈ ప్రశ్నకు విగ్రహారాధన గురించి చాలా చక్కని జవాబు చెప్పారు. ఏమన్నారంటే, "విగ్రహారాధన చేస్తున్నానని నీవు అంటున్నావు కాని, నిజానికి నీవు విగ్రహారాధన చేయలేవు. ఎందుకంటే, ఏదైనా విగ్రహాన్ని ప్రతిష్ఠించి నపుడు, ఆ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయాల్సి ఉంటుంది. అనగా ఆ విగ్రహాన్ని ఈశ్వరీయ శక్తితో ఛార్జ్ చేయవలసి ఉంటుంది. ఆ విగ్రహానికి నీవే ప్రాణప్రతిష్ఠ చేసి, మరలా ఆ విగ్రహాన్నే పూజిస్తున్నావు. నీలో ఆ విగ్రహాన్ని ఈశ్వరీయ శక్తితో నింపగల శక్తి ఉన్నప్పుడు నీలో ఉన్న ఆ ఈశ్వరుడినే ఎందుకు పూజించవు" అని అన్నారు.

ఇంకొక విషయమై బాబూజీ ఏమని చెప్పారంటే, "నీవు నీ మనస్సుతో విగ్రహాన్ని తయారుచేసి రకరకాలుగా అలంకరించి దానిని పూజిస్తున్నావు. మానవుడు తాను తయారుచేసిన ఆ విగ్రహాన్ని (మానవ మూర్తిని) 'ఈశ్వరుడు' అని ఎలా అంటున్నావు? ఈశ్వరుడు (దైవం) అందరి హృదయాల్లో ఉన్నాడు. నీలో ఉన్న ఆ ఈశ్వరుని ఎందుకు పూజించలేవు?" అని అన్నారు.

దీనికి ఒక నిరూపణ కూడా ఉంది. అది ఏమిటంటే, భగవంతుని దర్శనాన్ని పొందినవాళ్ళు దేవుని స్వరూపాన్ని తయారు చేయలేకపోయారు. భక్త కబీర్, మీరాబాయి, తులసీదాస్ ఎవ్వరూ కూడా భగవంతుని రూపాన్ని తయారుచేయలేదు. వాళ్ళందరూ "భగవంతుడు ఈ విశ్వానికే సౌందర్యాన్ని ప్రసాదిస్తాడు. భగవంతునిది దివ్య సౌందర్యం" అని ఆ సౌందర్యాన్ని వర్ణించారు. కాని ఎవ్వరూ భగవంతుడు ఈ విధంగా ఉంటాడు అని చెప్పలేకపోయారు. ఈశ్వరుని దర్శించగానే, మీరు ఏమీ మాట్లాడలేరు. ఎందుకంటే, ఆ ఈశ్వరీయ సౌందర్యం అనేది మీలో ప్రవేశిస్తుంది కాబట్టి.

ఎందుకని మాట్లాడలేము? అని ఒక సోదరడు అడిగినదానికి నేను ఇలా జవాబు చెప్పాను: ఈ గదిలోని వస్తువులను మీరు చూస్తున్నారు. వాటిని గురించి మీరు చెప్పగలరు. కాని ఈశ్వరుని దృష్టితో (దివ్య దృష్టితో) చూసినప్పుడు మీరు ఏ విధంగా మాట్లాడ గలరు? ఈశ్వరుని అంతర్ నేత్రాలతోనే దర్శించగలం. మన భౌతిక నేత్రాలతో చూడలేము. అందువల్లనే బాబూజీ దివ్య నేత్రాలు (దివ్య చక్షువులు) అనే పదాల్ని ఉపయోగించారు.

**ప్రశ్న: ప్రిసెప్టర్లు అభ్యాసీ యొక్క కండిషన్ (స్థితి) గురించి చెప్పరు. అభ్యాసీ పొందిన స్థితి గురించి వెల్లడి చేయకూడదని లేదా అభ్యాసీ యొక్క ప్రోగ్రెస్‌కు సంబంధించినది ఏది సూచించరాదని ఏదైనా నియమం ఉన్నదా?**

**జవాబు:** ఈశ్వరుని సామీప్యత ఫీల్ కావటమే ప్రోగ్రెస్‌కు గుర్తు, అని బాబూజీ ఒక సూచన ఇచ్చారు. ఇప్పుడు మిమ్మల్ని మీరు చూసుకోండి ఎంతగా ప్రోగ్రెస్ అయ్యారో! డివైన్ (దైవం) నాలో ఉన్నది అని అనుకొని, మీరు ధ్యానంలో కూర్చుంటారు. అప్పుడు మీకు బాబూజీ యొక్క సామీప్యతానుభూతి కలుగుతుంది. నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగవచ్చునా? మీ ప్రోగ్రెస్‌ను రివీల్ (వెల్లడి) చేయటానికి తగినంత యోగ్యతను మీరు మీలో అభివృద్ధి చేసుకున్నారా? కాని మేము అంటే ప్రిసెప్టర్లు మీ మీద చేసేపని మాత్రం నిజమైనది. మీలో ప్రేమ, భక్తి మరియు ఆ దివ్య సౌందర్యం పెంపొందాలని, సాక్షాత్కారాన్ని పొందటానికి మీరు యోగ్యులుగా కావాలని మేము అభ్యాసీలమీద పని చేస్తాము. ఈశ్వరుని ఎవ్వరూ రివీల్ (వెల్లడి) చేయరు.

ఈశ్వరుడు స్వయంగా తనంతట తానే రివీల్ (వ్యక్తం) అవుతాడు. అప్పుడు మనం ఈశ్వరుని దర్శనాన్ని పొందుతాము.

మనలో మొదటగా మన సెల్ఫ్ (స్వయం) అనేది రివీల్ (బహిర్గతం) అవుతుంది. ఇదివరకు నేను ఎలా ఉన్నాను, ఇప్పుడు ఏ విధంగా మార్పు చెందాను అని. కాబట్టి రివీల్ (వెల్లడి) చేయటం అనే పదానికి ఇక్కడ స్థానంలేదు. బాబూజీని ఎవరు రివీల్ (బహిర్గతం) చేసారు? బాబూజీని మొదటగా చూసినప్పుడు, ఇప్పుడు చూస్తున్నప్పుడూ ఏ ఏ విధంగా 'వారి' నియర్‌నెస్ (సామీప్యత)ను అనుభూతి చెందకయే, బాబూజీ ఈ విధంగా ఉన్నారు, ఇదిగో ఈ విధంగా ఉన్నారు –అని నేను 'వారి'ని గురించి వ్రాయగలుగుతున్నాను. మీలో తగినంత అర్హత ఉన్నప్పుడు, స్వయంగా 'వారే' మీకు రివీల్ (దర్శనీయం) అవుతారు.

'వారి' సామీప్యతను పొందినకొద్దీ, 'వారి' దివ్య ప్రేమ యొక్క ప్రేమభావం వలన మీలో ప్రేమ, ఆత్మ నివేదన– ఇవన్నీ పెంపొందుతాయి. మీరు అలాంటి యోగ్యతను పొందే విధంగా, మిమ్మల్ని మీరు తెలుసుకోవటానికిగాను మేము మీకు సహాయం చేస్తాం. మీరు చేసే ధ్యానం, ప్రార్థన, నిరంతర స్మరణ –ఇవన్నీ అందుకుగాను ఉపయోగపడతాయి. కానీ ప్రిసెప్టర్ చేసే పనివలన వీటి అన్నింటికంటే ఎక్కువగా ఉపయోగం ఉంటుంది.

అందువలన బాబూజీ మహరాజ్ ఏమన్నారంటే, నిరంతర స్మరణలో మునిగి ఉండటంవలన అహం యొక్క పొరలన్నీ కరిగిపోయి అసలు తాను ఏమిటి అనేది మొదట బహిర్గతం అవుతుంది. తరువాత భగవంతుడు తన దర్శనాన్ని తనంతట తానే మనకు ప్రసాదిస్తాడు. అందువలన అహం యొక్క పొరలన్నీ కరిగిపోవటానికిగాను మనం నిరంతర స్మరణను, ఎడతెగని అనుబంధాన్ని (కనెక్షన్‌ను) ఏర్పరచు కోవటానికి ప్రయత్నించాలి. ఈ పనిని ప్రిసెప్టర్లు చేస్తారు. మేము మీ మీద పని చేయటానికి కూడా మీరు మాకు అవకాశాన్ని కల్పించాలి. అది ఎలా అంటే, అభ్యాసీగా భక్తిలో మునిగిపోయినప్పుడే, మేము మీపై బాగా పనిచేయటానికి వీలవుతుంది.

**ప్రశ్న: లేటెస్ట్ క్లీనింగ్ పద్ధతిని గురించి తెలపండి?**

**జవాబు:** "లేటెస్ట్ క్లీనింగ్ సిస్టమ్" అనేది నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. లేటెస్ట్ క్లీనింగ్ అనేది ఏదీలేదు. ఉన్నది ఒక్కటే. మొదట క్లీనింగ్ యొక్క ఉద్దేశ్యం ఏమిటి అని తెలుసుకోవాలి. బాబూజీ మహరాజ్ మనకు అంతిమ సాక్షాత్కారం అనే ఒక లక్ష్యాన్ని ఇచ్చారు. అంతిమ సాక్షాత్కారానికి ఏవైతే అడ్డంకులు, అనవసరమైన విషయాలు మన మొత్తం సిస్టమ్‌లో (మన బుద్ధి, ఆత్మపరమైన సూక్ష్మదశలలో) ఉన్నాయో అవన్నీ తొలగిపోతున్నాయని భావించాలి. కాని అవి అన్నీ దేనివలన తొలగిపోతున్నాయి? బాబూజీ మహరాజ్ నా ఎదుటనే కూర్చొని ఉన్నారు. 'వారి' హృదయం నుండి నాలోనికి ఈశ్వరీయ ధార ప్రవహిస్తూ నాలోని అనవసరమైన విషయాలన్నింటినీ తుడిచివేస్తున్నది, అని భావించాలి.

మీ ఇచ్ఛాశక్తితో మిమ్మల్ని మీరు క్లీన్ చేసుకోలేరు. ఎందుకంటే, గ్రాస్‌నెస్ (స్థూల్యం) అనేది మీ మూలంగానే మీ భౌతికపరమైన సంకల్పాల వల్లనే మీలో ఏర్పడింది. దానిని క్లీన్ చేసే శక్తి మీకు ఉన్నదా? ఎప్పుడూ లేదు. మీరు చీపురు లేకుండా మీ ఇచ్ఛాశక్తితో ఈ గదిని శుభ్రం చేయగలరా? లేదు.

అందువల్లనే ఇప్పుడు మనకు సహాయం చేయటానికిగాను బాబూజీ మహరాజ్ యొక్క దివ్యశక్తి ఉంది. 'వారి' శక్తి అనవసరమైన వాటినన్నింటిని తొలగించి వేస్తుంది.

**ప్రశ్న: నేను ఉదయం, సాయంత్రం ధ్యానం చేసుకుంటాను. ఇది సరైనదేనా?**

**జవాబు:** ఉదయం ఒక గంట ధ్యానం చేసుకోవాలి. సాయంత్రం తప్పక పది నిమిషాలైనా క్లీనింగ్ (నిర్మలీకరణ) చేసుకోవాలి. ఉదయం ధ్యానంలో కూడా నిర్మలీకరణ దానంతట అదే జరిగి పోతుంది. కాని సాయంత్రం తప్పక నిర్మలీకరణ చేసుకోవాలి. కాని 30, 35 ని॥లు అనే నిర్బంధం లేదు. అంతిమ సాక్షాత్కారానికి అవరోధంగా ఉన్నటువంటి అనవసరమైన విషయాలన్నీ బాబూజీ మహరాజ్ యొక్క దివ్యశక్తితో తొలగిపోతున్నాయని భావించాలి. ఏది అనవసరమైన విషయమో మనకు తెలియదు. క్లీనింగ్ అయిపోయిన తర్వాత, నా హృదయం పరిశుద్ధమైపోయింది, హృదయం అంతా బాబూజీ మహరాజ్ యొక్క దివ్య సౌందర్యంతో వ్యాపించింది, 'వారి' కృపతో నిండిపోయింది అని భావించి, ఆ ఆనందాన్ని పొందాలి.

**ప్రశ్న: ఇండివిడ్యువల్ సిట్టింగ్స్ తీసుకుంటాను కాని, ఇంటి దగ్గర సాధన చేయటం లేదు.**

**జవాబు:** ప్రిసెప్టర్ దగ్గరకు వెళ్ళితే ఇండివిడ్యువల్ సిట్టింగ్ దొరుకు తుంది. క్లీనింగ్ కూడా జరుగుతుందని కొంతమంది అభ్యాసీలు భావిస్తారు. వాళ్ళను బాబూజీ బద్ధకస్తులు అని అన్నారు. అభ్యాసులు ఇంటి దగ్గర రెగ్యులర్గా ధ్యానం చేసుకొనకపోతే ప్రిసెప్టర్ వాళ్ళకు ఇండివిడ్యువల్ సిట్టింగ్స్ ఇవ్వకూడదు. ఎప్పుడైతే నీవు ఇంటివద్ద రెగ్యులర్గా ధ్యానం చేస్తావో, అప్పుడే సిట్టింగ్స్కు రావాలి, అని ప్రిసెప్టర్ అభ్యాసీలకు చెప్పాలి.

ఇండివిడ్యువల్ సిట్టింగ్కు ఒక ఉద్దేశ్యం అనేది ఉంది. ఒకసారి బాబూజీ మహరాజ్ షాజహాన్పూర్లో శ్రీ రాఘవేంద్రరావు, చారీజీ, డా॥ వరదాచారిగారు, వీళ్ళందరికి ఇండివిడ్యువల్ సిట్టింగ్స్ ఇచ్చారు. అప్పుడు నేను "బాబూజీ! మీరు నన్ను ఎప్పుడు కూడా ఇండివిడ్యువల్ సిట్టింగ్కు పిలువలేదు, ఎందుకని?" అని అనగానే వారు నవ్వుతూ, "బిటియా! నేను వాళ్ళకు భయపడి ఇండివిడ్యువల్ సిట్టింగ్స్ ఇస్తాను. వాళ్ళంతా గొప్పవాళ్ళు కదా!" అని, మరల "బిటియా! ఏ రోజునైతే నీవు ప్రకృతి కార్యం చేయవలసిన అవసరం ఏర్పడుతుందో ఆ రోజు కొరకు నేను ఎదురుచూస్తున్నాను. ఆ రోజున నేనే స్వయంగా నిన్ను పిలుస్తాను. నిన్ను ఇక్కడకు పిలువ వలసిన అవసరం కూడా లేదు. నిన్ను పిలిచి, నా ఎదుట నీవు కూర్చోవలసిన కష్టాన్ని కూడా నేను నీకు ఎందుకు కలిగించాలి? నేను ఇక్కడ నుండే అక్కడ నీ మీద పనిచేస్తాను" అని అన్నారు. 'వారి'కి నా మీద అంతటి ప్రేమ ఉంది. ఇది నా ఒక్కరి మీదనే కాదు, ప్రతి అభ్యాసీ మీద కూడా వారికి అంతటి ప్రేమ ఉంది. (ఈశ్వర ప్రాప్తికై తపన, ఆర్తి ఉన్న అభ్యాసులపట్ల బాబూజీ ఇలాంటి ఉదార ప్రేమను వర్షిస్తారు.)

బసంత్ పంచమి ఉత్సవ సమయంలో అభ్యాసీలు ఈశ్వరీయ ధారలో మగ్నమై ఉండటానికిగాను బాబూజీ ప్రిసెప్టర్లను అభ్యాసులకు ఇండివిడ్యువల్ సిట్టింగ్స్ ఇవ్వమని చెప్పేవారు. ఎక్కువ సిట్టింగ్స్ కావాలని అత్యాశపడటం వలన బాబూజీని పొందాలనే తపన, ఆవేదన అనేది మనలో ఎక్కువ ఏమీ ఉండదు; తగ్గిపోతుంది కూడా.

బాబూజీ మహరాజ్ ఒకసారి, సాధన యొక్క అవసరం ఏమిటి? అని ప్రశ్నించి, మరల వారే –"ఈశ్వరుడు మనలోపల ఉన్నాడు, అని అందరికి తెలుసు. కాని మనం ఈశ్వరుని లోపల లేము. అందువల్లనే సాధన చేయాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. దీని అర్థం ఏమిటంటే, మనం బాబూజీ మహరాజ్ యొక్క నిరంతర స్మరణలో ఎంతగా లీనమైపోవాలంటే, ఎంతగా మునిగి పోవాలంటే మన శరీరం యొక్క స్పృహ, ఎరుకను కూడా కోల్పోవాలి, మరచిపోవాలి.

సహజమార్గ పద్ధతిని గురించిగాని, తనను గురించి కాని ఎవ్వరు కూడా కామెంట్స్ (వ్యాఖ్యలు) చేయరాదని బాబూజీ మహరాజ్ చెప్పారు.

ఏదైతే అనుభూతిని నీవు పొందుతావో దానిని గురించి వ్రాయవచ్చు. (పుస్తకాల్లో చదివి తెలిశాయి అనుకొని వ్రాయకూడదు.)

**ప్రశ్న: ధ్యానానికి నేను ఎప్పుడు కూర్చున్నా కూడా బాబూజీ నా ఎదుటనే కూర్చొని ఉన్నారు, అని అనుకుంటాను, మరి నా ప్రోగ్రెస్ ఏమిటి?**

**జవాబు:** ప్రోగ్రెస్ తప్పకుండా ఉంటుంది. మీరు ప్రతిచోట బాబూజీతోనే ఉంటున్నారు. మీరు ఇంకొక చిన్న పని చేయాలి. మీరు ధ్యానంలో కూర్చొన్నప్పుడే కాకుండా, మిగిలిన సమయంలో ప్రతిక్షణం కూడా, "బాబూజీ! మీరు నా ఎదుటనే ఉన్నారు. బాబూజీ! మీరు ఎల్లప్పుడు నాతోనే ఉన్నారు" అని భావించాలి.

**ప్రశ్న: దయచేసి ఇంటర్ కమ్యూనికేషన్ గురించి చెప్పండి.**

**జవాబు:** ఇది ప్రశ్న కాదు. బాబూజీ ఎప్పుడూ అనేవారు ఇటువంటి విషయాలను గురించి ఎప్పుడూ ఆలోచించనే వద్దు. వీటిని గురించి ఏ ప్రయత్నం కూడా చేయవద్దు. ఇది సాధన వలన లభించేది కాదు. ఇది స్థితి కాదు.

ఎప్పుడైతే మనకు కనెక్షన్ అత్యున్నతమైన దానితో ఏర్పడు తుందో, అప్పుడు మనకు ఏ విషయమైతే తెలియాల్సిన అవసరం కలుగుతుందో, అప్పుడు అది దానంతట అదే మన ఎదుట ప్రత్యక్ష మవుతుంది. నేను పుస్తకాలను వ్రాస్తూ ఉన్నప్పుడు, ఏ విషయం గురించి అయితే వ్రాస్తున్నానో దానిని గురించిన నక్షా (చిత్రం) దానంతట అదే నా ఎదుట కనపడుతుంది.

ఉన్నత స్థాయికి చేరిన తరువాత, ఒక స్థితిలో లయమైనప్పుడు, ఎవరైనా ప్రశ్న అడిగితే, జవాబు దానంతట అదే వెలువడుతుంది.

బాబూజీ నన్ను ఈ పని చేయమన్నారు, బాబూజీ నాకు ఈ విషయం చెప్పారు, అని ఈ మధ్యన ఈ ఇంటర్ కమ్యూనికేషన్ గురించి చాలా వినపడుతున్నాయి. ఇది చాలా తప్పు.

అన్నింటికంటే ముఖ్యమైన విషయం "నిన్ను నీవు మరచి పోవటం." అప్పుడు మనకు ఏదైతే అవసరమో అది దానంతట అదే వస్తుంది. ఈ విషయాన్ని మీరు ఎల్లపుడు గుర్తుపెట్టుకోవాలి.

బాబూజీ మహరాజ్ యొక్క ఇంటర్ కమ్యూనికేషన్ గురించి చెప్పాలంటే –ఎప్పుడైతే ఇలాంటి డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) దివ్య కార్యం కొరకు భూమిమీద అవతరిస్తారో అప్పుడు అత్యున్నత స్థాయికి చెందిన లిబరేటెడ్ సోల్స్ (మహోన్నత స్థితికి చేరిన మహాత్ములు) అన్ని అలాంటి దివ్య పురుషుడైన బాబూజీ

మహరాజ్‌కు సహాయం చేయటానికిగాను ఆ మహనీయులే స్వయంగా 'వారి'ని తమకు వర్క్ (పని)ని ఇవ్వమని కోరుతారు.

బాబూజీ మహరాజ్ తెలిపినట్లుగా –లాలాజీ సాహెబ్ ఇలా చెప్పారు: కృష్ణుడు ఇది చెప్పారు; స్వామీ వివేకానంద ఇది తెలిపారు, అనేటటువంటి –వీని యొక్క అర్థం ఏమిటంటే, ఎప్పుడైనా డివైన్ పర్సనాలిటీ భూమి మీదకు వచ్చినప్పుడు లిబరేటడ్ సోల్స్, దివ్య పురుషులు బాబూజీ మహరాజ్‌తో ఇంటర్ కమ్యూనికేషన్ చేసి, మేము ఏ పనిని చేయాలి, అని 'వారి'వద్ద నుండి అనుజ్ఞను కోరతాయి. దివ్య పురుషుడైన బాబూజీ మహరాజ్ ఒక గొప్ప సంకల్పంతో ఈ భూమిమీద అవతరించారని ఆ లిబరేటెడ్ సోల్స్‌కు తెలుసు. అందువల్లనే వారు స్వయంగా బాబూజీతో సంభాషిస్తారు. ఇంటర్ కమ్యూనికేషన్ అనేది కేవలం దివ్య పురుషుడు బాబూజీ మహరాజ్ కొరకు మాత్రమే! మన కొరకు కాదు.

మనలో ప్రగాఢమైన లయావస్థ ఏర్పడినప్పుడు ఇతరలు ఎవరైనా, ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు, నోరు మాట్లాడుతుంది. ఆ జవాబును చెవులు వింటాయి. కాని అందులో మనస్సు అనేది కనెక్ట్ కాదు. మరి జవాబు ఎక్కడి నుండి వస్తుంది, అనేది నాకు తెలియదు.

అవతార పురుషులైన రాముడు, కృష్ణుడు ఈ భూమిపై అవతరించారు. రామునికి మరియు కృష్ణునికి ఇంటర్ కమ్యూనికేషన్ ఉన్నట్లుగా ఎక్కడా మనం వినలేదు. వారు అవతారపురుషులైనా ఇంటర్ కమ్యూనికేషన్ అనేది లేదు. దీని వలన శ్రీ బాబూజీయే డివైన్ పర్సనాలిటీ, అనంతం నుండి దిగివచ్చారు అని నిరూపించబడినది. ఎందుకంటే, ఈ సృష్టి ప్రారంభం నుండి కేవలం ఒక్క బాబూజీ మహరాజ్‌కు మాత్రమే ఇంటర్ కమ్యూనికేషన్ అనేది ఉంది. తాము కూడా ఆ దివ్య పురుషుని సేవ చేయాలని, బాబూజీ నుండి ఆజ్ఞలు పొందటానికిగాను ఆ లిబరేటడ్ సోల్స్ 'వారి'తో సంభాషిస్తాయి.

**ప్రశ్న: బాబూజీకి లాలాజీతో ఇంటర్ కమ్యూనికేషన్ ఉంది. అదే విధంగా ఇప్పుడు కస్తూరీ బెహెన్‌కు బాబూజీతో ఇంటర్ కమ్యూనికేషన్ ఉంది, అంతే కదా!**

**జవాబు:** అస్సలు లేదు; నేను నా స్థితిని గురించి మీకు ఇదివరకే తెలిపాను. నేను పుస్తకాలు వ్రాసేటప్పుడు, నాకు ఏ విధంగా అనిపిస్తుందంటే, ఎవరో నా చేతిని పట్టుకొని వ్రాయిస్తున్నట్లుగా అనిపిస్తుంది. అంతేకాని ఇంటర్ కమ్యూనికేషన్ అనేది ఎప్పుడూ లేదు.

ఇంటర్ కమ్యూనికేషన్ అనేది డివైన్ పర్సనాలిటికి సంబంధించిన విషయం. ఇది ఆ దివ్య పురుషుని యొక్క ఒక ప్రత్యేక శక్తి; ఆ ఇంటర్ కమ్యూనికేషన్‌తో దివ్యపురుషుడైన బాబూజీ, లిబరేటెడ్ సోల్స్‌కు ఆజ్ఞలను జారీ చేస్తారు. అంతేకాని మానవులమైన మన నుండి ఎవరు ఆజ్ఞలు తీసుకొంటారు? ఈ విషయాన్ని ఎప్పుడూ పట్టించుకోవద్దు (ఆలోచనలు వద్దు). బాబూజీ మహరాజ్ విషయంలో ఏదైతే ఇంటర్ కమ్యూనికేషన్ జరిగిందో అది ఇప్పటివరకు అలా ఎవరికి జరుగలేదు. భవిష్యత్తులో ఎవరికీ జరుగబోదు. బాబూజీ డివైన్ పర్సనాలిటీ; దివ్య సంకల్పంతో, దివ్యకార్యం కొరకు వచ్చారు కాబట్టి, ఆ విధంగా జరిగింది. ఈ గొప్ప గొప్ప పదాలు అన్నీ కేవలం శ్రీ బాబూజీ మహరాజ్ కొరకు మాత్రమే! ఇతరుల కోసం కాదు. స్వామి వివేకానందజీ ఇంటర్ కమ్యూనికేషన్ అనే మాటను ఒకే ఒకచోట వాడారు– ఇంటర్ కమ్యూనికేషన్ అనేది రాబోయే డివైన్ పర్సనాలిటీకి మాత్రమే ప్రత్యేకించబడింది –అని.

ఇంకొక విషయం ఏమిటంటే, డివైన్ పర్సనాలిటీని మరొకరు ఎవరితో కూడా పోల్చటానికి ప్రయత్నించరాదు. రాముడు, భరతుణ్ని ఎప్పుడూ జ్ఞపకం పెట్టుకుంటాడు. భరతుణ్ణి ఎంతగానో ప్రేమిస్తాడు. భరతుడు, ఒక విధంగా ఎప్పుడూ రాముని ధ్యానంలోనే లీనమై ఉంటాడు. కాని భరతుడు రామునిగా అయ్యాడా? ఎప్పుడూ కూడా భరతుడు రామునిలాగా కాలేదు. లవ-కుశులు రాముని పుత్రులు, భక్తులు. కాని లవ-కుశులు రామునిగా మారారని ఎవ్వరూ అనలేదు. డివైన్ పర్సనాలిటీ యొక్క వర్క్ (పని) అనేది చాలా ప్రత్యేకంగా ఉంటుంది. అందువలన డివైన్ పర్సనాలిటీని ఎవ్వరితోనూ కూడా పోల్చటానికి ప్రయత్నం చేయవద్దు. ఎవరితోనైనా పోల్చితే, దివ్య పురుషులు, బాబూజీ యొక్క దివ్య సౌందర్యం అనేది అర్థం కాకుండా పోతుంది.

రామాయణంలో, సుదీక్షణునితో అతని గురువు "రాముడు ఈ ఆశ్రమానికి వస్తాడు. అతని రాకకోసం ఎదురుచూస్తూ రాముడు రాగానే అన్ని విధాలా వారికి సేవచేయి" అని చెస్తాడు. అప్పుడు సుదీక్షణుడు రామునిరాక కొరకై ఎదురుచూస్తూ చూస్తూ రాముని ధ్యానంలో ఎంతగా లయలీనమైపోతాడంటే, తన్ను తాను ఎంతగా మరచిపోతాడంటే- రాముడు ఆశ్రమంలోనికి వస్తూన్నదీ, తనకు చాలా సమీపంగా వచ్చిన విషయం కూడా ఆ సుదీక్షణునికి తెలియనంతగా! నేను ఎవరిని? ఎక్కడ నుండి వచ్చాను? ఎక్కడకు వెళ్ళాలి? ఏం చేయాలి? అనేది అంతా మరచిపోయాడు. అప్పుడు శ్రీరాముడు - నేను వచ్చి చాలా సమయం అయింది. సుదీక్షణుని ఎదుటనే నిలబడి ఉన్నాను. ఇతడు నన్ను చూడటంలేదు, అని గమనించి, రాముడు ఏమి చేశాడంటే చతుర్భుజుడైన విష్ణుదేవుని రూపాన్ని సుదీక్షణుని హృదయంలో ప్రత్యక్షం చేశాడు. అప్పుడు శ్రీరామ ధ్యానంలో మునిగిపోయిన సుదీక్షణుడు విష్ణు రూపాన్ని చూడగానే ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరుస్తాడు. ఎదురుగా శ్రీరాముడు కనపడతాడు.

శ్రీరాముడు, విష్ణువు ఒక్కడే - అని మనం అంటాం. పోల్చటంలో ఏమీ ఉపయోగం లేదు. రాముడు రాముడే! విష్ణువు విష్ణువే! సుదీక్షణుడు శ్రీరాముని ధ్యానంలో ఎంతగా లయ లీనమైయ్యాడో అది అతని ప్రేమ పరాకాష్టను తెలుపుతుంది.

రాముడు 12 కళల శక్తతో అవతరించాడు. కృష్ణుడు 16 కళల శక్తితో అవతరించాడు. ఆ కార్యం (పని) యొక్క ఆవశ్యకతను బట్టి ఆయా అవతారాలకు దానికి అనుగుణంగా శక్తి ఇవ్వబడుతుంది. అందువలన ఒకరికిగల శక్తిని ఇంకొకరికిగల శక్తితో పోల్చరాదు. అవతారాలకు వాటి పని, వాటి శక్తి అన్ని వేరు వేరుగా ఉంటాయి. బ్రహ్మ విష్ణువు కాలేదు, విష్ణువు బ్రహ్మ కాలేదు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నేను ఇలా ఉన్నాను; నేను ఈ విధంగా ఉన్నాను; నాలో చాలా బలహీనతలు ఉన్నాయి" అని చెప్పుకుంటూనే ఉన్నాడు. బాబూజీ వింటున్నారు కాని ఏమీ మాట్లాడటం లేదు. కాసేపు అయిన తరువాత "బాబూజీ! మీరు ఏమి మాట్లాడటం లేదు" అని ఆ అభ్యాసీ తిరిగి అన్నాడు. అప్పుడు బాబూజీ, "నీవు ఆ చివరి వాక్యాన్ని విడిచిపెట్టేశావు. నేను ఇలా ఉన్నాను, ఈ విధంగా ఉన్నాను, అని నీవు నీ గురించే అంటున్నావు కాని, 'ఎలా ఉన్నా నేను మీవాడినే' అనే ఈ ఒక్క వాక్యాన్ని నీవు నాకు చెప్పితే చాలు" అని అన్నారు.

"నేను పాపిని, నేను చెడ్డవాడిని" అని బాబూజీకి మాటి మాటికి చెప్పుకునే బదులుగా "ఏ విధంగా ఉన్నా, నేను మీ వాడినే" అని ఒక్కసారి అంటే చాలు. కాని ఈ విధంగా అనడంలో సమర్పణ భావం అనేది ఉండాలి. ఏ రోజునైతే హృదయం –నేను మీవాడినే అని అంగీకరిస్తుందో, అప్పుడు 'నా తప్పులు', 'నా దోషాలు' అనే భావానికి చోటు అసలు ఉండదు. ఎప్పుడైతే – నీవు 'అతని' వానిగా అవుతావో అప్పుడే నీవు 'వారి' శరణులో ఉన్న భావనలో మునిగిపోయి నిన్ను నీవు మరచిపోతావు.

ఒకసారి బాబూజీ, అలహాబాద్‌లో ఒక అభ్యాసీ ఇంటి వరండాలో కొంతమంది అభ్యాసులతో కూర్చొని ఉండగా, ఆ ఇంటికి కొద్ది దూరంలో ఎవరో మైక్‌లో ఉపన్యాసం ఇస్తున్నారు. నారదానందజీ అనే గురువు తన భక్తులకు "ప్రతిరోజూ ప్రొద్దున్నే నీవు భగవంతునికి ఇలా మొరపెట్టుకోవాలి –నేను చాలా పాపిని, నేను దోషిని, నాలో చాలా దోషాలు, అవగుణాలు ఉన్నాయి. ఓ భగవంతుడా! నీవే ఈ అవగుణాలను అన్నింటిని దూరం చేయాలి" అని ఉపన్యాసంలో చెబుతున్నాడు. ఈ మాటలు అన్నీ మైక్ ద్వారా విన్న బాబూజీ వెంటనే "ఈశ్వర్ సహాయ్‌జీ! ఒకవేళ ఎవరైనా కోర్టులో నిలబడి, నేను ఈ తప్పు చేశాను. నేను ఆ తప్పు చేశాను – అని చెప్పుకుంటే, కోర్టు అతనికి శిక్ష వేయకుండా విడిచిపెడుతుందా? కోర్టు అతనిని తప్పకుండా శిక్షిస్తుంది. వీటన్నింటికి బదులుగా ఒక్క మాట చాలు – 'ఎలా ఉన్నా నేను నీవాడినే. నేను ఎలా ఉన్నానో, ఏమిటో నాకు తెలియదు. నేను నీవాడినే' అని అనుకోవాలి" అని అన్నారు.

"నేను మీవాడినే" అనేది ఎప్పుడు గుర్తుకు వచ్చినా "బాబూజీ! నేను మీవాడిని; నాలోని అణువణువూ మీ ప్రాణాహుతి శక్తితో నిండిపోయి ఉంది" అని భావించాలి.

కబీర్ ఎల్లవేళలా ఈశ్వర ప్రేమలోనే పూర్తిగా మునిగిపోయి ఉండేవాడు. అతనికి ఈ భౌతిక ప్రపంచంతో కనెక్షన్ లేదు; భౌతికత అతడిని అంటదు. "నాకు ఎప్పుడైనా హోష్ (బాహ్య స్మృతి) కలిగితే అందులో సర్వేశ్వరుడు అయిన నీవే ఉంటావు, నేను ఉండను. నేను బేహోష్‌లో (బాహ్యస్మృతి లేకుండా) ఉంటే నేను ఏమిటో ఏమో నాకే తెలియదు" అని కబీర్ అనేవాడు. "నాకు బాహ్య స్మృతి కలిగితే దానిలో 'నీవే' ఉంటావు" అనగా "నేను నీవానిగా అయిపోయాను" అనే స్థితిని తెలుపుతుంది.

ప్రార్థనను ఒకసారి మనస్సులో చదువుకొని, ఆ ప్రార్థన యొక్క మూడ్ (ధ్యాస)లోనే ఉండాలని బాబూజీ చెప్పారు. ప్రార్థన యొక్క మూడ్ (భావనా స్థితి) అంటే సబ్‌మిసివ్ మూడ్ (సమర్పణా భావం) – మీ సహాయం లేనిదే మిమ్మల్ని పొందలేము – హృదయాన్ని ఆ విధంగా, ఆ వినమ్రభావంతో, అర్పణ భావంతో ఉండేట్లుగా మలచుకోవాలి. అప్పుడు మనం ప్రార్థన చేయగానే, మన హృదయం ప్రార్థనా స్థితిలోనే, ఆ సమర్పణా భావంలోనే ఉన్నట్లుగా మనకు అనుభూతి కలుగుతుంది. ఆ విధంగా ఫీలింగ్ కలిగినప్పుడే మనం ప్రార్థనను సరిగ్గా (కరెక్టగా) చేస్తున్నట్లు అర్థం చేసుకోవాలి. మనం చేసే ప్రార్థనకు, చిన్న పిల్లలు చేసే ప్రార్థనకు ఎంతో తేడా ఉంటుంది.

పిల్లలు ప్రార్థనలోని పదాల యొక్క నిజమైన అర్థాన్ని గ్రహింపు చేసుకోలేరు. కాని మనం ప్రార్థన యొక్క భావాన్ని అర్థం చేసుకుంటాం. ప్రార్థన చదువుకునేప్పుడు, ఆ పదాల ఎరుక లేకుండా, హృదయం సమర్పణాభావంతో ఉండిపోవటమే నిజమైన ప్రార్థన. "హృదయం ఆ విధంగా సమర్పణ భావంతో, ప్రార్థన స్థితిలో ఉన్నప్పుడు, నీవు ఇంకా ప్రార్థన చేయవలసిన అవసరం ఏమీలేదు" అని బాబూజీ అన్నారు.

వచ్చే సంవత్సరం తిరిగి మీరు ఇక్కడకు వచ్చేసరికి ఇప్పటికన్నా ఇంకా మంచి ప్రోగ్రెస్‌తో ఉండే విధంగా మీరు కృషి చేయాలని నేను ఆశిస్తున్నాను. మీరందరు కూడా డా. పార్ధసారధిగారు, డా. పాండురంగారావుగారికి ఎన్నో కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే మీకోసం వాళ్ళు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు.

ఏ సెంటర్ యొక్క సెంటర్ ఇన్‌చార్జ్‌లోనైతే తాను ప్రోగ్రెస్ కావాలనే తపన ఏ విధంగా ఉంటుందో, అదే విధంగా సెంటర్‌లోని అభ్యాసులందరు కూడా తనలాగానే ప్రోగ్రెస్ కావాలనే ఆర్తి, ఆరాటం, తపన ఆ సెంటర్ ఇన్‌చార్జ్‌లో ఉన్నట్లయితే, ఆ సెంటర్ తప్పక ప్రోగ్రెస్ అవుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! నేను ప్రోగ్రెస్ కావటం లేదు" అని అనగానే బాబూజీ అతనితో "సెంటర్‌లో ఎవ్వరూ కూడా పురోభివృద్ధి (ప్రోగ్రెస్) కాకపోతే, అది నా తప్పు అని ఒప్పుకుంటాను. కాని సెంటర్‌లో అందరూ ప్రోగ్రెస్ అవుతూ ఉన్నప్పటికీ నీవు మాత్రం ప్రోగ్రెస్ కావటం లేదంటే నీలోనే ఏదో పొరపాటు ఉంది" అని అన్నారు.

తప్పు ఏమై ఉంటుంది? "బాబూజీ మీద విశ్వాసం ఉంది – ఆధ్యాత్మిక జీవితాన్ని ఎన్నుకున్నాం" అని మనం నోటితో అంటాము. కాని వాస్తవానికి బాబూజీ మీద ఆ అభ్యాసీకి విశ్వాసం లేదు. అతని మీదనే అతనికి నమ్మకం ఉంది. కాని బాబూజీ మీద మాత్రం కాదు. చూడండి! మనం మిషన్‌లో చేరాము. ఎప్పుడో మనలను వారికి అర్పించాము. ఇంక మన ప్రోగ్రెస్ అనేది 'వారి' బాధ్యత.

సహజమార్గ విధానం అనేది ఒక సూటియైన మార్గం. ఈ మార్గంలో వెళ్ళే వారంతా ప్రోగ్రెస్ అవుతున్నారు. అందరూ కూడా ముందుకు వెళ్ళుతున్నారు. కాని ఎవరైనా అభ్యాసీ అటూ, ఇటూ (భౌతికలో మునిగి) చూస్తూ ఉంటే అక్కడే ఆగిపోతాడు. ఇంకా పురోగమించాలి, అందరితో కలిసి ముందుకు వెళ్ళాలి –అని అనుకోడు. ఎవరైతే 'లక్ష్యాన్ని' చూడకుండా అటూ, ఇటూ చూస్తారో అతనికి తన మీదనే విశ్వాసం ఉంటుంది. బాబూజీ మీద మాత్రం కాదు. సహజమార్గ సిస్టమ్ అనేది అందరికీ ఒకే విధంగా ఉంటుంది. ఎవరైతే బాబూజీ మహరాజ్ యొక్క శరణులోకి వస్తారో, అంటే ఎవరైతే 'వారి' పాదాల వద్దకు చేరతారో, వాళ్ళందరికీ కూడా ప్రోగ్రెస్ లభిస్తుంది. ప్రోగ్రెస్ లేకపోవటమనే ప్రశ్నేలేదు.

"మా సెంటర్ అభివృద్ధి చెందాలి" అనే భావన ప్రతి ప్రిసెప్టర్‌లోను ఉండాలి. మా సెంటర్ మీద బాబూజీ చూపుపడగానే బాబూజీ సంతోషించాలి – అనే ఈ భావన ప్రతి ప్రిసెప్టర్‌లోను ఉన్నట్లయితే ఆ సెంటర్ తప్పకుండా ప్రోగ్రెస్ అవుతుంది.

ఎవరైనా అభ్యాసీ ప్రిసెప్టర్‌వద్దకు సిట్టింగ్‌కొరకు వెళ్ళినప్పుడు, ఇతడు నా అభ్యాసీ, ఇతనిమీద వర్క్ (పని) చేయాలి, అని అనుకుంటే అది చాలా పొరపాటు. ప్రిసెప్టర్ దగ్గరకి ఏ అభ్యాసీ వచ్చినా సరే, ఇతడు సహజమార్గ సిస్టమ్‌లో చేరాడు; ఇతడు మన సోదరుడు, అనే భావనే ప్రిసెప్టర్‌లో ఉండాలి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నేను రామచంద్రారెడ్డి ప్రిసెప్టర్ వద్ద ఇనీషియేషన్ తీసుకున్నాను అని అనగానే మరో అభ్యాసీ "బాబూజీ! నేను రాఘవేంద్రరావు ప్రిసెప్టర్ దగ్గర ఇనీషియేషన్ తీసుకున్నాను" అని అన్నప్పుడు, "వీళ్ళందరు ఇన్ని రకాల మిషన్ (సంస్థ)లను అభివృద్ధి చేస్తున్నారా?" అని బాబూజీ అన్నారు.

మిషన్ ఒక్కటే, లక్ష్యమూ ఒక్కటే, సహజమార్గ్ సిస్టమ్ ఒక్కటే, అని ఒక సోదరుడు అనగా, మాస్టర్ కూడా ఒక్కరే అని ఇంకొక సోదరుడు అనగానే నేను ఈ విధంగా అన్నాను:

బాబూజీ మహరాజ్ ఈ భూమి మీద భౌతిక శరీరంతో ఉన్నప్పుడు వారిని మనం మన మాస్టర్ అని అనుకున్నాము. కాని ఇప్పుడు నాకు అర్థమైనది ఏమిటంటే, 'వారు' కేవలం మనకు మాత్రమే మాస్టర్ కాదు. బాబూజీ మహరాజ్ సమస్త విశ్వానికే మాస్టర్. అల్టిమేట్ పవర్ అనగా ఆ అంతిమ శక్తి యొక్క మాస్టర్ కూడా బాబూజీయే! నేడు సమస్తమైన ఈ విశ్వమూ 'వారి' నుండే ట్రాన్స్‌మిషన్‌ను పొందుతూ ఉన్నది. విశ్వంలోని వాతావరణం అంతా కూడా 'వారి' శక్తి వల్లనే పవిత్రమవుతున్నది. నాకు ఏ విధంగా అనిపిస్తుంది అంటే – అల్టిమేట్ పవర్ (అంతిమ శక్తి) 'వారి' ముందు శిరస్సు వంచి నిలబడి ఉంది. 'వారి' నుండి ఆజ్ఞను పొందాలని, ఆజ్ఞను తీసుకోవాలని కోరుతున్నది.

ఇప్పుడు మీరే ఆలోచించండి, మన స్థాయి ఎంత ఉన్నతంగా ఉన్నదో! 'వారు' మనలను తమ బిడ్డలుగా స్వీకరించారు. మనం కూడా అదే విధంగా, మన జీవన విధానాన్ని ఎంతో శ్రేష్ఠంగా తయారు చేసుకోవాలి. మనం ఎప్పుడు కూడా డివైన్ పర్సనాలిటీ బాబూజీ మహరాజ్ యొక్క సేవకులం మాత్రమే అని అనుకోకూడదు. 'వారి' బిడ్డలమూ అని భావించాలి.

ooOOOoo

# ప్రార్థన

ఓ నాథా!

నీవే మానవ జీవనమునకు యదార్థ లక్ష్యము,

మా కోరికలు ఆత్మోన్నతికి ప్రతిబంధకములై ఉన్నవి,

నీవే మా ఏకైక స్వామివి – ఇష్టదైవమవు,

నీ సహాయము లేనిదే నిన్ను పొందుట అసంభవము.

## ప్రార్థన అంటే....

మన అంతర్గత అవసరాన్ని నెరవేర్చమని ఎవరిని సంబోధిస్తున్నామో కూడా తెలియకుండా చేసే ఆర్తనాదమే ప్రార్థన.

ఒక పసిపాప ఆకలి వేసినప్పుడు పాప ఏడుస్తుంది. అప్పుడు పాలు ఇవ్వటానికి పాప తల్లి పరుగున వస్తుంది. కానీ, తనకు ఆకలి వేస్తోందన్న సంగతి ఆ పసిపాపకు తెలుసా? ఎంత మాత్రమూ తెలియదు.

తనకు తెలియని అవసరం నెరవేరటం కోసం –ఆ పసిపాప అంతరంగం నుండి ప్రకృతి చేసే ఆర్తనాదం అది!

ఆ విధంగా ఆ పసిపాప అస్పష్టంగా వెల్లడించిన అవసరాన్ని తీర్చేందుకు ప్రకృతి, తల్లి రూపంలో వెలుపలి నుండి ప్రతిస్పందిస్తుంది. కనుక ఆత్మకు కూడా ఎరుకలేని అవసరాన్ని నెరవేర్చటానికి అంతరంగంలో కల ప్రకృతి, బాహ్యంగా ఉన్న ప్రకృతికి ఇచ్చే పిలుపే ప్రార్థన.

## బాబూజీ ఏమంటారంటే....

ఆధ్యాత్మికత అనే ఆలయాన్ని ప్రేమ అనే పునాదిపై నిర్మించడానికి అవసరమైన పరికరాలు – సేవ, త్యాగం. నిస్వార్థంగా చేసే ఏ విధమైన సేవ అయినా మంచిదే. కాని నేను చెప్పే ఈ 'సేవ' అనే పదంలో ఆరాధనా భావం ఇమిడి ఉంది.

మనకు నిజమైన గురువు ఆ భగవంతుడే. మనందరకు దివ్యత్వం 'అతని' నుండే సిద్ధిస్తుంది. సామాన్యులు భగవంతునివద్ద నుండి నేరుగా అనుగ్రహాన్ని పొందలేరు. అందుకే భగవంతునితో నేరుగా సంబంధం కలిగి ఉన్న తోటి మానవుని సహాయం అర్థిస్తాం.


మనిషిని, దైవాన్ని అనుసంధానం చేసేది గురువు. మన మార్గంలో ఉండే జటిల చిక్కుల నుండి విముక్తులను చేసేది గురువు. మనం ఉన్నత స్థితులకు ఎదుగుతున్నకొద్దీ గురువు అవసరం మరింత పెరుగుతూ ఉంటుంది. చాలా సాధనా పద్ధతుల్లో శిష్యుడు మాస్టర్‌కు సమర్పించుకుంటాడు, కాని సహజమార్గంలో మాస్టరే శిష్యునికి సమర్పించుకుంటారు.

నమ్మకం తన పరిధిని దాటితే విశ్వాసం, విశ్వాసం తన పరిధిని దాటితే ప్రేమ, ప్రేమ కూడా తన పరిధిని దాటితే శరణాగతి స్థితే!

ఆనందం ఎక్కువ చేసుకోవాలంటే చాలా తేలిక. అవసరాలు తగ్గించుకోండి – అంతే. అన్ని పరిస్థితుల్లోనూ సంతోషంగా ఉన్నవాడే నిజంగా సంతోషంగా ఉన్నట్లు!

సుఖం బయటి నుంచి వచ్చేది. శాంతి లోపలి నుండి వచ్చేది. అన్ని పరిస్థితుల్లోనూ సంతోషంగా ఉండటానికే ప్రయత్నించండి.

-------


ప్రతి అభ్యాసీ హృదయం నా ఇల్లు, ఆ ప్రతి ఇల్లు నా ఆశ్రమం
ప్రేమతో ప్రతి దానిని సాధించవచ్చు. ధ్యానం తదితర సాధనలు
దీనితో పోల్చి చూస్తే ప్రాముఖ్యం లేనివే అవుతాయి.
- బాబూజీ